

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 173

మంగళవారం 12-9-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



● భాషారత్న జ్ఞాపికతో...

అక్షర కుసుమం

వాచస్పతి కుసుమారెడ్డి

కొండూరు కుసుమారెడ్డి... ఏడున్నర దశాబ్దాల జీవనయానంలో ఆమె కలం నుంచి ఇరవై రచనలు జాలువారాయి. ఓనమాలు దిద్దిన నాటి నుంచి నేటి వరకు అక్షరంతో మమేకమై సాగుతున్న సాహిత్యసేవకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'అధికార భాషా దినోత్సవం' సందర్భంగా (ఆగస్టు 29) ఆమెను 'భాషారత్న' పురస్కారంతో గౌరవించింది. ఆ విశేషాలను, తన సాహిత్య ప్రస్థానాన్ని సాక్షితో పంచుకున్నారామె.

''మాది నెల్లూరు జిల్లా, కావలి పట్టణం. మా నాన్న జయరామిరెడ్డి హైస్కూల్ హెడ్‌మాస్టర్, అమ్మ శంకరమ్మ గృహిణి. ప్రాథమిక విద్య నుంచి డిగ్రీ వరకు కావలిలో చదివాను. గుంటూరు, నల్లపాడు (ఆంధ్ర విశ్వవిద్యాలయం)లో పీజీ చేసిన తర్వాత ఎంఫిల్‌కి హైదరాబాద్‌లో ఉస్మానియా యూనివర్సిటీకి వచ్చాను. లింగ్విస్టిక్స్‌లో పీజీ డిప్లమో, రెండు పీహెచ్‌డీలు ఉస్మానియాలోనే చేశాను. వారణాసి, సంపూర్ణానంద సంస్కృత యూనివర్సిటీ నుంచి డీలిట్ చేసి 'వాచస్పతి' బిరుదు పొందాను. ఉస్మానియాలో 1974లో విద్యార్థిగా అడుగు పెట్టిన నేను 1979లో లెక్చరర్‌నయ్యాను. పదోన్నతులతో ప్రొఫెసర్ హోదాలో తెలుగు శాఖాధిపతిగా విధులు నిర్వర్తించి 2008లో రిటైరయ్యాను. ఆ రిటైర్‌మెంట్ ఉస్మానియా నుంచి మాత్రమే. ఆ మరునాటి నుంచి ట్రిపుల్ ఐటీ (రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్) బాధ్యతలు స్వీకరించాను. ట్రిపుల్ ఐటీ రూపకల్పన నుంచి ఆరేళ్లపాటు ఆ విధుల్లో ఉన్నాను. ఇప్పుడు కూడా ఉద్యోగపరంగా విశ్రాంత జీవితమే కానీ, చదవడానికి రాయడానికి విశ్రాంతి తీసుకోలేదు. విషయశోధన చేస్తూనే ఉన్నాను, రాస్తూనే ఉన్నాను. పంతొమ్మిది గ్రంథాలు ప్రచురితమయ్యాయి. ఐసీహెచ్‌ఆర్ నుంచి 'సీనియర్ అకడమిక్ ఫెలో' అందుకున్న రచన (కల్చరల్ లైఫ్ ఆఫ్ తెలంగాణ ట్రైబ్స్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు డాన్స్, మ్యూజిక్ అండ్ మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్) తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ప్రచురణ దశలో ఉంది.

అన్నీ అధ్యయన భరితాలే!

నేను కాలక్షేపం కోసం ఏదీ రాయలేదు. కాలక్షేపంగా చదువుకోవడానికీ రాయలేదు. ప్రతిదీ సమగ్రమైన పరిశోధన, శాస్త్ర పూర్వక అధ్యయనంతో రాసినవే. నా రచనలన్నీ జీవితగమనానికి సూచికలవంటివే. నా పర్యవేక్షణలో 30 మందికి పైగా విద్యార్థులు పీహెచ్‌డీలు చేశారు. నేను పీహెచ్‌డీ చేస్తున్నప్పుడు ఎదురైన అనుభవాలతోపాటు, నా విద్యార్థులకు గైడ్ చేస్తున్న క్రమంలో నాకు ఓ విషయం స్పష్టంగా తెలిసి వచ్చింది. అప్పటి వరకు పరిశోధన చేసే వాళ్లకు ఒక మెథడాలజీ లేదు. ఆ లోటును భర్తీ చేయడానికి ఆచార్య ఎం. కులశేఖరరావుతో కలిసి 'సాహిత్య పరిశోధన పద్ధతులు' రాశాను. ఇలాగే నా ప్రతి రచన వెనుక బలమైన కారణం, ఉపయుక్తత ఉన్నాయి. తంజావూరులోని సరస్వతి మహల్ గ్రంథాలయం ప్రభావం నా రచనల మీద ఎక్కువగా ఉంది. నెల రోజుల పాటు అక్కడే ఉండి తాళపత్ర గ్రంథాలను అధ్యయనం చేసి నోట్స్ రాసుకున్నాను.

రంగాజమ్మ స్ఫూర్తి!

ఎంఫిల్ అంశంగా రంగాజమ్మను తీసుకోవడానికి బలమైన కారణమే ఉంది. ఆమె ఎనిమిది భాషల్లో ప్రావీణ్యం ఉన్న తెలుగు కవయిత్రి. కనకాభిషేక గౌరవం అందుకున్న ఏకైక మహిళ. తంజావూరు నాయక రాజుల ఆస్థానంలో ఆమెకి గొప్ప స్థానం ఉండేది. నా మీద ఆమె ప్రభావం కూడా ఉందనే చెప్పాలి. ఆమెలాగే నేను కూడా నా రంగంలో విశేషంగా కృషి చేయాలని, అత్యున్నత స్థాయికి చేరాలనే ఆకాంక్ష నాకు తెలియకుండానే కలిగింది. సంస్కృతంలో డీలిట్ చేయడం ద్వారా వాచస్పతి బిరుదు పొందిన తొలి తెలుగు వ్యక్తినయ్యాను. ఇప్పటికీ ఆ బిరుదు సాధించిన ఏకైక తెలుగు మహిళను నేనే.

జ్ఞానం భావితరాలకు అందాలి!

వార్తా పత్రికల్లో వ్యాసాలు రాశాను. వ్యక్తిత్వ వికాసం క్లాసులకు మూలం మన భగవద్గీత. ఒక్కో శ్లోకాన్ని నేటి కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ఉదాహరణలతో రాసిన గీతాయోగం నన్ను యూనివర్సిటీ పరిధి నుంచి బయటకు తెచ్చింది. గీతాయోగం ద్వారా సాధారణ పాఠకులకు కూడా పరిచయమయ్యాను. మొత్తంగా నేను రాసిన పుస్తకాల లెక్క చెప్పగలను, కానీ ఎన్ని గ్రంథాలను చదివాననే ప్రశ్నకు సమాధానం నా దగ్గర ఉండదు. మన ప్రాచీన గ్రంథాల్లో గణితం, రాజనీతి, ధర్మ అర్థశాస్త్రాలు, వైద్యం, ధనుర్విద్య, ఖడ్గలక్షణ శాస్త్రాది యుద్ధ నైపుణ్యాలన్నీ సమగ్రంగా ఉన్నాయి. నృత్యకళ అత్యున్నత స్థాయిలో ఉండేది. చాలా నాట్యరీతులు అంతరించిపోయాయి. వాటిని వివరించే సాహిత్యం కూడా చేజారిపోతోంది. వాటి పునరుద్ధరణకు మార్గదర్శనం చేయగలిగిన రచనలు చేశాను. నాకు నేనుగా నిర్దేశించుకున్న లక్ష్యాలన్నింటినీ సాధించాను. భావితరాల కోసం ఓ బృహత్తర ప్రణాళిక నా మదిలో ఉంది. అది... మన ప్రాచీన గ్రంథాల్లో ఉన్న జ్ఞానాన్ని డిజిటలైజ్ చేసి ప్రాచీన సాహిత్య శాస్త్ర గ్రంథాలన్నింటితో ఒక డిజిటల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఉంది. మన ప్రాచీన గ్రంథాల పట్ల చాలామందికి ఆసక్తి ఉన్నప్పటికీ వృత్తి, ఉద్యోగాల కారణంగా తంజావూరు, ఇతర గ్రంథాలయాలకు వెళ్లి తాళపత్ర గ్రంథాలను, ప్రాచీన రచనలను అధ్యయనం చేయగలిగిన సమయం ఉండదు. అలాంటి వారికి ఈ ప్రయత్నం మేలు చేస్తుంది. అరచేతిలోని స్మార్ట్ ఫోన్‌లోనే చదువుకోవచ్చు. అమెరికా నుంచి సాఫ్ట్‌వేర్ నిపుణులు ఒకరు ఫోన్ చేసి 'భీమఖండంలో ఒక శాస్త్రీయ విషయముందని, పరిశోధన కోసం ఆ పుస్తకం ఒక కాపీ కావాల'ని అడిగారు. డిజిటలైజ్ చేస్తే మన దేశం నుంచి అమెరికాకు పుస్తకాన్ని పంపించాల్సిన ప్రయాస అక్కరలేదు. వందేళ్లు దాటిన పుస్తకాలు కూడా ఆదరణకు నోచుకోకుండా పడి ఉన్నాయి. వాటన్నింటినీ భావితరాలకు అందించడానికి ఏమి చేయాలి, ఎలా చేయాలనే ప్రణాళిక సిద్ధం చేస్తున్నాను. ఇటీవల విక్రమ సింహపురి యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలిగా నియమించినట్లు అధికారులు ఫోన్ చేసి చెప్పినప్పుడు కూడా నా ఆలోచనలకు ఒక రూపం తీసుకురావచ్చనే ఉత్సాహం కలిగింది'' అన్నారు వాచస్పతి కొండూరి కుసుమారెడ్డి.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఫొటోలు : సీహెచ్ మోహనాచారి

> ### రోజుకు పదిగంటలు!
> బోధన వృత్తిలో ఉన్నంత కాలం నా దిన చర్య ఒకే క్రమంలో సాగింది. నాలుగు గంటలు పాఠాలు చెప్పడానికి, రెండు గంటలు ప్రిపరేషన్‌కి. ప్రయాణం ఒక గంట. ఈ ఏడు గంటలు ఉద్యోగం కోసం. ఇవన్నీ పూర్తయిన తర్వాత మూడు గంటల సేపు పుస్తకాలు చదవడానికి, రాసుకోవడానికి పట్టేది. రోజుకు దాదాపు పది గంటలు అక్షరాల మధ్యనే గడిచేది. మా తమ్ముడి భార్య వాణి నాకు ఇంటి బాధ్యతలేవీ లేకుండా చూసుకునేది. నాకు సన్మానాలు జరుగుతుంటే తనకే జరిగినంత సంతోషపడేది. నా కోసం అతిథులు వస్తే తన పుట్టింటి వాళ్లు వచ్చినంత సంబరపడుతూ వాళ్లకు అన్నీ అమర్చి పెట్టేది. మా నాన్న కవి అనే విషయం ఆయన పోయిన తర్వాత కానీ మాకు తెలియలేదు. ఆయన పుస్తకాలన్నీ తీసి సర్దుతుంటే 'రుద్రీయము' చేతిరాత ప్రతి దొరికింది. కాకతీయ రాజు రుద్రదేవుడి చరిత్రను ఆయన పద్యకావ్యంగా రాశారు. ఆ పుస్తకాన్ని పరిష్కరించి ప్రచురించడం, ఆయన కవి అనే విషయాన్ని ప్రపంచానికి తెలియచేయడం నాకు అత్యంత సంతోషకరమైన జ్ఞాపకం.



● విజయవాడ, తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పురస్కార ప్రదానం సందర్భంగా...

సాఫ్ట్‌వేర్ చిన్నారి





● సీమర్ ఖురానా

చిచ్చర పిడుగుల్లాంటి పిల్లలు వయసు కంటే పెద్ద చదువులు చకచకా చదివేసి, డిగ్రీ పట్టాలు పొందేస్తుంటారు. అయితే అంతకన్నా చకచకా అడుగులు వేసింది సీమర్. డిగ్రీలు చదవడం కాదు... ఏకంగా వీడియో గేమ్‌నే రూపొందించింది ఈ ఆరేళ్ల సిసింద్రీ సీమర్ ఖురానా.

ప్రపంచమంతా టెక్నాలజీతోపాటు పరుగులు పెడుతోంది. అందుకే చిన్నా..పెద్దా తేడా లేకుండా అంతా స్మార్ట్ ఫోన్ల నుంచి కంప్యూటర్ల దాకా అన్నీ అవలీలగా వాడేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కోడింగ్ ద్వారా వివిధ రకాల అప్లికేషన్లు, గేమ్‌లు తయారు చేస్తుంటారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లలో కొంత మంది మాత్రమే వీటిని తయారు చేయగలరు. మిగతావారికి కోడింగ్ అంటే అర్థం కాని పెద్ద సబ్జెక్ట్‌గా చూస్తారు. అటువంటిది భారత సంతతికి చెందిన సీమర్ ఖురానా కోడింగ్‌ను మునివేళ్లతో పట్టి చకచక వీడియోగేమ్‌ను రూపొందించింది. అతిపిన్నవయసులో వీడియో గేమ్ రూపొందించి ప్రపంచంలోనే అతిపిన్న వయస్కురాలైన వీడియోగేమ్ డెవలపర్‌గా గిన్నిస్ రికార్డుల్లో నిలిచింది.

కెనడాలోని ఆంటారియోలో నివసిస్తోన్న భారత సంతతికి చెందిన పరాస్ ఖురానా కూతురే సీమర్. చిన్నప్పటి నుంచి చాలా చురుకుగా ఉండే సీమర్ తన వయసు పిల్లలంతా వీడియోగేమ్‌లు ఆడుకుంటుంటే సీమర్ మాత్రం... తన సీనియర్లు చదివే పాఠాలు నేర్చుకోవడానికి ఆరాటపడేది. మ్యాథ్స్ అంటే మక్కువ ఎక్కువ ఉన్న సీమర్.. తన తరగతి కాకుండా పైతరగతి విద్యార్థులు చదివే లెక్కల పాఠాలు నేర్చుకోవాలనుకునేది. కానీ ఎవరూ నేర్పించేవాళ్లు కాదు. దీంతో యూట్యూబ్‌లో చూసి లెక్కలు నేర్చుకునేది. కిండర్ గార్డెన్ చదివే సీమర్ మూడోతరగతి లెక్కలు సులభంగా చేసేది. ఒకపక్క లెక్కలు చెబుతూనే కాగితాలతో క్రాఫ్ట్ తయారు చేసి ఆడుకుంటూ ఉండేది. ఇది గమనించిన సీమర్ తండ్రి కోడింగ్ క్లాసులను చూపించారు. కోడింగ్ నచ్చడంతో సీమర్ కోడింగ్ కూడా నేర్చుకోవడం మొదలుపెట్టింది. క్రమంగా కోడింగ్‌పై పట్టు సాధించేందుకు ప్రయత్నం మొదలు పెట్టింది.

డాక్టర్ మాటలు విని...

సీమర్ అక్క ఆరోగ్యం పాడవడంతో ఫ్యామిలీ డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లారు. అక్కను పరీక్షించిన డాక్టర్ జంక్‌ఫుడ్‌ని మానేయాలని చెప్పడంతో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూనే హెల్దీ, జంక్ ఫుడ్‌ల గురించి వీడియో గేమ్ తయారు చేయాలనుకుంది. దీనికోసం వారానికి మూడు క్లాసులకు హాజరవుతూ ఏడాదిలోపే కోడింగ్‌ను క్షుణ్ణంగా తెలుసుకుంది. ఆ తరువాత 'హెల్దీఫుడ్ ఛాలెంజ్' పేరిట వీడియో గేమ్‌ను తయారు చేసింది. జంక్ ఫుడ్ వల్ల ఏర్పడే ముప్పు, ఆరోగ్యకరమైన, సమతుల ఆహారం ఎలా తీసుకోవాలో ఈ వీడియోగేమ్ వివరంగా చెబుతుంది. ఈ యాప్‌ను తయారు చేయడానికి స్కూలు అయిపోయిన తరువాత రోజుకి రెండు గంటలపాటు సమయాన్ని కేటాయించేది సీమర్. ఇలా తన పేరుని గిన్నిస్‌బుక్‌లో ఎక్కించుకుంది.

వీడియో గేమ్‌లే కాదు...

లెక్కలు, కోడింగ్‌తోపాటు డ్యాన్స్, జిమ్నాస్టిక్స్, కరాటేలు కూడా నేర్చుకుంటోంది. 'సీమర్స్ వరల్డ్' పేరుమీద యూ ట్యూబ్ ఛానల్ నడుపుతూ తన కొచ్చే వివిధ రకాల ఆటల ఐడియాలను షేర్ చేస్తోంది. టాలెంట్‌కు వయసుతో సంబంధంలేదనడానికి సిసలైన ఉదాహరణగా నిలుస్తోంది సీమర్.

ప్రకృతి సేద్యంతో రైతే రాజు!

సాగుబడి

పుబ్బ కార్తె: సెప్టెంబర్ 13 వరకు
ఉత్తర కార్తె: సెప్టెంబర్ 14 నుంచి

'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం నిజంగానే 'రైతును రాజు' గా మార్చుతుందంటున్నారు ఏపీ రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్-చైర్మన్, ఎక్స్‌అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ టి. విజయకుమార్. ప్రపంచవ్యాప్తంగా రసాయనాల్లేకుండా జరుగుతున్న సాగు 1% కాగా, ఏపీలో 14% కావటం విశేషం. ఏటీఎం మోడల్‌లో 20 సెంట్లలో అనేక రకాల కూరగాయలు, పండ్లు సాగు చేస్తూ ప్రతి నెలా కనీసం రూ. 10-25 వేలు ఆదాయం పొందే మార్గం ఉంది. చిన్న, సన్నకారు రైతులకే కాదు, భూమిలేని వ్యవసాయ కార్మికులకూ ఇది వరం లాంటిదని ఆయన అంటున్నారు.. ప్రత్యేక ఇంటర్వ్యూలో ముఖ్యాంశాలు..

ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్-చైర్మన్ టి. విజయకుమార్‌తో 'సాక్షి సాగుబడి' ప్రతినిధి పంతంగి రాంబాబు ముఖాముఖి



ఏపీ రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్-చైర్మన్ టి. విజయకుమార్

సాక్షి సాగుబడి: ఆంధ్రప్రదేశ్‌లో తామర తంపరగా విస్తరిస్తున్న ప్రకృతి వ్యవసాయం విశేషాలు..?

విజయకుమార్: ఏపీలో ప్రకృతి వ్యవసాయం ప్రభుత్వ సహకారం, మహిళా సంఘాల తోడ్పాటుతో విస్తృతంగా అమలవుతోంది. 2023 మార్చి నాటికి 3,800 గ్రామ పంచాయతీలు, 3 వేల రైతు భరోసా కేంద్రాల్లో విస్తరించింది. 8.5 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయంలో పాల్గొంటున్నారు. అంటే, ఎన్‌రోల్ అయ్యారు. వీరిలో 2,70,000 మంది రైతులు పూర్తిగా రసాయనాలు వాడటం మానుకున్నారు. రైతుల ఎన్‌రోల్‌మెంట్ దృష్ట్యా మన దేశంలోనే ఇది అతిపెద్ద కార్యక్రమం. దేశంలోనే కాదు ప్రపంచంలోనే ఇంత మంది రైతులు ప్రకృతి వ్యవసాయంలో పాల్గొనటం మరే దేశంలోనూ జరగటం లేదు.

ప్రకృతి వ్యవసాయ వ్యాప్తి క్రమంగా జరిగే పని. ఒక రైతుకు రెండెకరాలు ఉంటే.. ముందు అరెకరంలో ప్రయత్నిస్తారు. ఏ రైతూ రిస్క్ తీసుకోరు. అరెకరాలో సక్సెస్ సాధిస్తే.. తర్వాత సంవత్సరం విస్తీర్ణం పెంచుతారు. ఎంత ఖర్చయ్యింది, ఎంత దిగుబడి వచ్చింది, నికరాదాయం ఎంత వచ్చింది, భూమిలో మార్పేమి వచ్చింది.. ఇవీన్న చూసుకొని విస్తీర్ణాన్ని పెంచుకుంటారు. సగటున మా అనుభవంలో రైతులు ప్రకృతి వ్యవసాయంలో అన్ని విషయాలు అనుభవపూర్వకంగా అలవాటు చేసుకోవడానికి 4 ఏళ్లు పడుతుంది. అందుకని ఆ నాలుగేళ్లు ప్రభుత్వం తరపున మేం వారికి మద్దతుగా నిలుస్తున్నాం. ఈ విధంగా 2,70,000 మంది రైతులు దాదాపు 1,40,000 హెక్టార్లలో పూర్తిగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు.

■ **ఆంధ్రప్రదేశ్‌కు ఈ ఏడాది 3 జైవిక్ ఇండియా పురస్కారాలు వచ్చాయి. వీటితో పాటు.. వ్యక్తిగతంగా మీకు 'డా. ఎమ్మెస్ స్వామినాథన్ ప్రకృతి పరిరక్షణ పురస్కారం' లభించిన శుభ సందర్భంగా హృదయపూర్వక అభినందనలు... జైవిక్ ఇండియా పురస్కారాల ప్రాధాన్యం ఏమిటి?**

అంతర్జాతీయంగా ఆర్గానిక్ ఫార్మింగ్‌ను ప్రోత్సహించే సంస్థ 'ఐఫోమ్' ఈ జైవిక్ ఇండియా పురస్కారాలు ఇస్తుంటుంది. ఐఫోమ్‌కు ఐక్యరాజ్యసమితికి చెందిన ఎఫ్.ఎ.ఓ., తదితర సంస్థలతో సన్నిహిత సంబంధాలుంటాయి. ప్రతి సంవత్సరం అవార్డులు ఇస్తుంటారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి ఇస్తున్న ప్రోత్సాహం, సాధించిన ప్రగతిని దృష్టిలో పెట్టుకొని ఏపీ ప్రభుత్వానికి 2023లో ఉత్తమ రాష్ట్ర పురస్కారం ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మహిళా రైతుకు, ఎఫ్‌పిఓకు కూడా ఇచ్చారు.

■ **ప్రభుత్వ ప్రోత్సాహం ఎలా ఉంది..?**

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించటంలో ఏపీ ప్రభుత్వానికి చాలా ప్రత్యేకతలున్నాయి. రైతు భరోసా కేంద్రాలన్నిటి పరిధిలోనూ ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింపజేయాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి లక్ష్యం. ఈ లక్ష్యసాధన కోసం ప్రత్యేక ప్రణాళికలు తయారు చేస్తున్నాం. ఇప్పుడు 28% రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని జిల్లాల్లో, అన్ని మండలాల్లోనూ ఈ కార్యక్రమం అమల్లో ఉంది. ముమ్ముందు గ్రామాలన్నిటికీ విస్తరించాలన్నది లక్ష్యం. ఏపీలో ప్రకృతి వ్యవసాయానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖనే సీఎం ఏర్పాటు చేయటం విశేషం. దీంతో మంచి ఊపొచ్చింది. ప్రకృతి వ్యవసాయ విస్తరణలో మహిళా స్వయం సహాయక సంఘాలు కూడా కీలకపాత్ర పోషిస్తున్నాయి.

■ **ప్రపంచవ్యాప్తంగా పరిస్థితి ఏమిటి..?**

రీజనరేటివ్ అగ్రికల్చర్ అనండి, ఆర్గానిక్ అగ్రికల్చర్ అనండి.. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 4 దశాబ్దాలుగా ప్రయత్నాలు జరుగుతున్నా ఇప్పటికీ చేస్తున్నది 1% మంది రైతులు మాత్రమే. అయితే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 14% మంది రైతులు ఎంతో కొంత విస్తీర్ణంలో ప్రకృతి సేద్యం చేస్తున్నారు. తమకున్న పొలం మొత్తంలో పూర్తిగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు 5% ఉన్నారు. అందుకే ప్రపంచంలో ఏపీ అనుభవం ఎంతో విశిష్టమైనది. రైతులతో రసాయనాలు వాడే అలవాటు మాన్పించడం చాలా కష్టం. బలంగా ఉన్న మహిళా సంఘాల వ్యవస్థ ఇందులో పాల్గొనటం వల్ల రైతులకు క్షేత్రస్థాయిలో నైతిక మద్దతు ఇవ్వటం సాధ్యమైంది. ఈ సామాజిక తోడ్పాటు ఎంతో ఉపయోగపడుతోంది. సేద్యంలోనే కాదు, వైవిధ్యపూరితమైన ప్రకృతి పంటల దిగుబడులు కుటుంబాల ఆరోగ్యానికి చాలా అవసరమని మహిళలు గుర్తించటం కూడా ఇది వ్యాప్తి చెందడానికి ఉపయోగకరంగా ఉంది.

■ **ఏయే పంటల్లో అధిక దిగుబడి..?**

మా అనుభవంలో అన్ని పంటల్లోనూ ఫలితాలు బాగా వస్తున్నాయి. ఖర్చు తగ్గించడం, దిగుబడి పెంచటం, ఎక్కువ వర్షాలు పడినా/ వర్షాభావ పరిస్థితులొచ్చినా పంట తట్టుకునే శక్తి, చీడపీడలను తట్టుకునే శక్తి.. చాలా పంటల్లో అనుకున్న దానికన్నా దిగుబడులు రాబట్టిన సంఘటనలు చాలా ఉన్నాయి. గిరిజన ప్రాంతాల్లో రాగి పంట దిగుబడి ఎకరానికి వచ్చే దిగుబడి 400-600 కిలోల నుంచి 1200-1800 కేజీలకు పెరిగింది. ఖర్చు సగానికి సగం తగ్గింది. వరిలోనూ అంతర పంటలపై ప్రయోగాలు చేస్తున్నాం. గట్ల వెడల్పును పెంచి కూరగాయలు, పండ్ల మొక్కలు సాగు చేయమని.. పంటల వైవిధ్యం పెంచడానికి.. రైతులకు సలహా ఇచ్చాం.

■ **పవన్ సుఖదేవ్ అధ్యయనం గురించి..?**

పవన్ సుఖదేవ్ అంతర్జాతీయంగా పేరున్న పర్యావరణవేత్త. పర్యావరణంలో నోబెల్ వంటి టేలర్ అవార్డు గ్రహీత. వీరి జిస్ట్ సంస్థ స్వతంత్రంగా జరిపిన అధ్యయనంలో 11% అధిక దిగుబడి, 54% అధిక నికరాదాయం, పంటల వైవిధ్యం రెండింతలు పెరిగిందని వెల్లడైంది.

■ **మార్కెటింగ్‌లోకి అమూల్ ప్రవేశిస్తోందట..?**

అవును. ఏపీలో 80% విస్తీర్ణంలో పత్తి సహా 8 రకాల ఆహార పంటలు ప్రధానంగా సాగవుతున్నాయి. ఇప్పటికే టీటీడీ 12 రకాల ఆహారోత్పత్తుల్ని కొనుగోలు చేస్తోంది. బియ్యం, పప్పులు, వేరుశనగలు తదితరాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించడానికి అమూల్‌తో ఒప్పందం చేసుకోబోతున్నాం. మండల స్థాయిలో ప్రాసెసింగ్ సదుపాయాలు కూడా వస్తాయి. ఇది మార్కెటింగ్‌లో పెద్ద ముందడుగు అవుతుంది.



■ **ఏటీఎం మోడల్‌లో ఆశ్చర్యకరమైన ఫలితాలు ఎలా..?**

అవునండి.. నిజం. ప్రకృతి వ్యవసాయ విధానాలను సక్రమంగా అమలు చేస్తే రైతే రాజని రుజువు చేయొచ్చు. అది నిజంగా జరుగుతుంది. రైతులకు సంవత్సరానికి ఆదాయం ఒక్కసారే ఎందుకు రావాలి? ప్రతి రోజూ రావాలి.. ప్రతి వారం రావాలి.. అందుకు ఏటీఎం మోడల్ ఉపయోగపడుతుంది. అనంతపురం జిల్లాలో ఈ నమూనా తొలుత ప్రయత్నించి సత్ఫలితాలు సాధించాం. ఇప్పుడు రాష్ట్రంలో అన్ని జిల్లాలకూ విస్తరింపజేస్తున్నాం. 85%గా ఉన్న చిన్న, సన్నకారు రైతులకు, భూమి లేని వ్యవసాయ కార్మికులకు పెరటి తోటలు/ఇంటి పంటలుగా సాగుకు కూడా ఏటీఎం మోడల్ ఒక వరం లాంటిది. 20 సెంట్లను కౌలుకు తీసుకొనైనా సాగు చేస్తే.. ప్రతినెలా ప్రతి రైతూ రూ.10,000 నుంచి 25,000 సంపాయించే అవకాశం ఉందని మా అంచనా.

'సాక్షి టీవీ'లో ఇటీవల ప్రసారమైన ఈ ఇంటర్వ్యూ పూర్తి వీడియోను యూట్యూబ్‌లో చూడటానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చెయ్యండి.

మొక్క పైనే పిచికారీ చేసే రోబో!

- పొలం మొత్తంలో కాకుండా మొక్కలు ఎక్కడ ఉన్నాయో గుర్తించి అక్కడ మాత్రమే పురుగుమందు చల్లే రోబోలు వచ్చాయి
- కృత్రిమ మేధతో నడిచే అత్యాధునిక 'స్పాట్ స్ప్రే రోబో'ను రూపొందించిన బెంగళూరు స్టార్టప్ నైకో రోబోటిక్స్
- మహారాష్ట్ర, కర్ణాటక రైతుల పొలాల్లో ఎకరానికి రూ.350 అద్దెతోనే పిచికారీ
- 60% పురుగుమందు ఆదా కావటంతో పాటు.. భూ/వాయు కాలుష్యం కూడా ఆ మేరకు తగ్గుతుంది.





పంటలపై చీడపీడలను అదుపు చేయడానికి పొలాల్లో విష రసాయనిక పురుగుమందులను పిచికారీ చేస్తుంటాం. అయితే, డ్రోన్ల ద్వారా చల్లినా, స్ప్రేయర్లతో చల్లినా.. పంట మొక్కలపైనే కాకుండా పొలం అంతటా నేలపైన కూడా పురుగుమందు పడుతూ ఉంటుంది. దీని వల్ల పురుగుమందు వృథా అవ్వటమే కాకుండా, భూసారం కూడా నాశనమవుతుంది. ఈ సమస్యలకు బెంగళూరుకు చెందిన స్టార్టప్ కంపెనీ నైకో రోబోటిక్స్ చక్కటి పరిష్కారం కనుగొంది. మొక్కలు ఎక్కడ ఉన్నాయో గుర్తించి, వాటిపైన మాత్రమే పురుగుమందును పిచికారీ చేసే అధునాతన రోబోను రూపొందించింది. కృత్రిమ మేధతో నడిచే ఈ స్పాట్ స్ప్రేయర్ రోబోలపై ఆ సంస్థ పేటెంట్ కూడా పొందింది. తమిళనాడులో పుట్టిన జైసింహ అమెరికాలో బీటెక్ ఈసీఈ చదివి కువైట్‌లో ఏడేళ్లు పనిచేసి, స్వదేశానికి వచ్చేశారు. పిచికారీ పద్ధతులను ఆధునీకరిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని భావించి బెంగళూరు కేంద్రంగా 2015లో నైకో రోబోటిక్స్‌ను నెలకొల్పారు.

■ **ఈ రోబో ఎలా పనిచేస్తుందంటే..?**

ఈ రోబో ప్రత్యేకతలు ఏమిటంటే.. దీనికి 5 మీటర్ల పొడవైన రెక్కలు రెండు వైపులా ఉంటాయి. ఏకకాలంలో పది మీటర్ల వెడల్పున ఇది పిచికారీ చేయగలదు. ఈ రెక్కలకు కృత్రిమ మేధతో కూడిన కళ్లను అమర్చారు. ఈ కళ్లు మొక్కలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తిస్తాయి. మొక్కలు ఉన్న చోట రోబో రెక్కకు ఉన్న నాజిల్లు తెరచుకొని పురుగుమందును పిచికారీ చేస్తాయి. మొక్క లేకుండా ఖాళీ నేల ఉన్న చోట రోబో రెక్కలకు ఉన్న నాజిల్లు తెరచుకోవు. కాబట్టి అక్కడ పురుగుమందు పడదు.

■ **60% పురుగుమందు ఆదా**

ఈ రోబోతో పిచాకారీ చేస్తే.. 60% పురుగుమందు ఆదా కావటంతో పాటు.. భూ/వాయు కాలుష్యం కూడా ఆ మేరకు తగ్గుతుందని సంస్థ చెబుతోంది. గత ఏడాది నుంచి మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో పత్తి, సోయాబీన్స్, మిర్చి వంటి పంట పొలాల్లో పురుగుమందులు చల్లుతున్న ఈ ఏఐ రోబోలు అక్కడి రైతుల మనసులు చూరగొన్నాయని చెబుతున్నారు. ఎకరానికి రూ.350ల చొప్పున అద్దె చెల్లించి రైతులు తమ పొలాల్లో పురుగుమందులు పిచికారీ చేయించుకుంటున్నారు. అకోలాకు చెందిన పత్తి, సోయా రైతు యోగేశ్ రౌత్ తన 30 ఎకరాల్లో ఈ రోబో ద్వారా పురుగుమందులు పిచికారీ చేయించుకున్నారు. కూలీలతో పిచికారీ చేయిస్తే ఎకరానికి రూ.1200 ఖర్చయ్యేదని, ఈ రోబో ఉపయోగకరంగా ఉందని చెబుతున్నారు. ఇప్పటికే 500 మంది రైతులు లక్ష ఎకరాల్లో అద్దె రోబోలు పిచికారీ చేశాయట. పురుగుమందులనే కాదు ద్రవరూప ఎరువులు, సేంద్రియ ద్రావణాల పిచికారీకి కూడా ఈ రోబోలు ఉపయోగకరమే.


'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 173

మంగళవారం 12-9-2023



24.. తగ్గేదేలే
యూఎస్ ఓపెన్ గెలుపుతో జొకోవిచ్ ఖాతాలో 24వ టైటిల్ - 12లో



పరుగుల వాన
కోహ్లి, రాహుల్ సెంచరీలు.. పాక్‌పై భారత్ ఘనవిజయం - 12లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కీలక వ్యూహాత్మక భాగస్వామి
జీ20 సదస్సులో భాగంగా ఢిల్లీకి విచ్చేసిన సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు.
వివరాలు 6లో ▸



ఉత్తరప్రదేశ్‌లో కుంభవృష్టి
భారీ వర్షాలకు ఉత్తరప్రదేశ్‌లో జన జీవనం స్తంభించింది. వర్షసంబంధిత ఘటనల్లో 19 మంది ప్రాణాలు కోల్పోయారు.
వివరాలు 6లో ▸



దేవెగౌడ మనవడికి చుక్కెదురు
జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ ఎన్నిక చెల్లదంటూ కింది కోర్టు ఇచ్చిన తీర్పు అమలును నిలిపి వేయాలన్న పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది.
వివరాలు 6లో ▸



రష్యాకు రైల్లో కిమ్
ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ రష్యాకు తన సొంత బుల్లెట్ ప్రూఫ్ రైల్లో పయనమైనట్లు దక్షిణ కొరియా వర్గాలు తెలిపాయి.
వివరాలు 6లో ▸

జైల్లో ఉండను మా ఇంట్లో ఉంటా

హౌస్ రిమాండ్‌కు ఏసీబీ ప్రత్యేక కోర్టులో చంద్రబాబు పిటిషన్

సాక్ష్యాలను తారుమారు చేయడం, సాక్షులను ప్రభావితం చేయడం జరగవన్న బాబు న్యాయవాది లూథ్రా.. వెంటనే తీర్పు వెలువరించాలని పట్టు

బయటకన్నా జైల్లోనే చంద్రబాబుకు భద్రత ఎక్కువ

ఆయన భద్రతకు జైలులో అన్ని చర్యలు తీసుకున్నాం

అసలు హౌస్ రిమాండ్ పిటిషన్‌కు విచారణార్హతే లేదు.. ఈ పిటిషన్ గురించి ఏ చట్టంలోనూ ప్రస్తావన లేదు

ఏసీబీ కోర్టుకు నివేదించిన అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి

ముగిసిన వాదనలు.. నేటి మధ్యాహ్నానికి తీర్పు వాయిదా



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్కామ్ కేసులో అరెస్టై రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు తనను జైలులో కాకుండా హౌస్ రిమాండ్ (ఇంటి వద్ద)లో ఉంచేలా ఆదేశాలు ఇవ్వాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు సోమవారం ముగిశాయి. వాదనలు విన్న ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం తీర్పును వాయిదా వేసింది. దీనిపై మంగళవారం మధ్యాహ్నం తీర్పు వెలువరిస్తామని ప్రకటించింది. అయి తే ఉదయమే తీర్పు వెలువరించాలన్న చంద్రబాబు తరఫు సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా అభ్యర్థనను ఏసీబీ కోర్టు తిరస్కరించింది. ఆ సమయంలో తమకు విచారించా ల్సిన కేసులు చాలానే ఉన్నాయని కోర్టు పేర్కొంది. మరోవైపు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబును విచారించేందుకు కస్టడీకి అప్పగించేలా ఆదేశాలు జారీ చేయాలంటూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని

మిగతా 2వ పేజీలో ▶

పీటీ వారంట్!

'ఇన్నర్ రింగ్ రోడ్డు' అక్రమాల కేసులో చంద్రబాబు విచారణకు 'సిట్' పిటిషన్

చంద్రబాబు, చినబాబు సూత్రధారులుగా భూ కుంభకోణం.. నారాయణ, లింగమనేని ప్రధాన పాత్రధారులు

5 రోజులు కస్టడీకి అప్పగించండి

ఏసీబీ కోర్టును అభ్యర్థించిన సీఐడీ

స్కిల్ స్కామ్‌లో అంతిమ లబ్ధిదారులు చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు, టీడీపీ

షెల్ కంపెనీల ద్వారా డబ్బు మొత్తం చంద్రబాబుకే చేరింది

దారి మళ్లించేందుకే అవాస్తవాలు ప్రచారం

పక్కా ఆధారాలతోనే కేసు దర్యాప్తు: స్పష్టం చేసిన సీఐడీ వర్గాలు

- వివరాలు 2లో



చోరీచేసి యుగపురుషుడిలా ఫోజులా?
- తప్పులకు బహిరంగ క్షమాపణ చెప్పి రాజకీయాల నుంచి నిష్క్రమించు
- చంద్రబాబుపై మంత్రి బొత్స సత్యనారాయణ ఫైర్

3లో



బాబు పతనం మొదలైంది
- ఆయన ఆరోగ్యంగా ఉండాలి.. ఇలాంటి కేసులెన్నో ఎదుర్కోవాలి
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

3లో



అవినీతి కేసులో జైలుకెళ్తే బందా?
- టీడీపీ తీరుపై మంత్రి అంబటి రాంబాబు మండిపాటు
- చంద్రబాబు అవినీతిలో పవన్‌కళ్యాణ్‌కూ వాటా

3లో



ఇన్నాళ్లకు న్యాయం, ధర్మం గెలిచాయి
- చంద్రబాబును జైలుకు పంపడంపై ప్రజల్లో హర్షం
- వాటా కోసం రోడ్ల మీద పోరాటమా పవన్?
- మాజీ మంత్రి పేర్ని నాని

10లో



దేశంలోనే అతిపెద్ద ఆర్థిక ఉగ్రవాది
- న్యాయదేవత, చట్టాలపై ప్రజలకు నమ్మకం పెరిగింది: మంత్రి రోజా
- జనసేన కాదు... అది చంద్రసేన

3లో



అంతిమ విజయం న్యాయానిదే
- చంద్రబాబు తప్పు చేశారు కాబట్టే బంద్ విఫలం
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

3లో

తొలి రోజు గడిచిందిలా..
- పొద్దున్నే యోగా చేసిన చంద్రబాబు.. పత్రికల పఠనం
- ఫ్రూట్ సలాడ్‌తో అల్పాహారం
- లంచ్‌లో బ్రౌన్ రైస్, బెండకాయ ఫ్రై, పన్నీర్, పెరుగు
- రాత్రి భోజనానికి పుల్కాలు, పెరుగు
- ఆహారమంతా కాన్వాయ్‌లోని ప్యాంట్రీ కార్ నుంచే..
- ప్రత్యేక గది.. ఓ సహాయకుడు.. గది వద్దే 1+4 భద్రత
- ఇదీ జైలులో రిమాండ్ ఖైదీ 7691 చంద్రబాబు తొలి రోజు
- నేడు ములాఖత్‌లో కలవనున్న కుటుంబ సభ్యులు

- వివరాలు 2లో

టమాటా రైతుకు బాసట..

నిలకడగా ధరలు ఉండేలా చర్యలు

- కిలో రూ.7 కంటే తక్కువగా ఉంటే మార్కెట్‌లో జోక్యం
- ఇప్పటి వరకు ప్యాపిలి మార్కెట్‌లో 16 టన్నుల సేకరణ
- ప్రధాన మార్కెట్లలో కిలో రూ. 8 నుంచి రూ. 16 పలుకుతున్న ధర
- సీఎం యాప్ ద్వారా ధరల హెచ్చుతగ్గులపై నిరంతర పరిశీలన
- ధర తగ్గితే వ్యాపారులకు పోటీగా వేలంలో పాల్గొంటున్న మార్కెటింగ్ శాఖ



నంద్యాల జిల్లా ప్యాపిలిలో రైతుల నుంచి వేలంలో టమాటాలు కొంటున్న అధికారులు

సాక్షి, అమరావతి: ధరలేక సతమతమవుతున్న టమాటా రైతులకు బాసటగా నిలిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం డిమాండ్‌కు మించి టమాటా పంట మార్కెట్లకు వస్తుండటంతో గత కొద్దిరోజులుగా ధరలు తగ్గుముఖం పట్టాయి. దీంతో ప్రభుత్వం రైతులకు మేలు చేసేందుకు సీఎం యాప్ ద్వారా ధరల హెచ్చుతగ్గులను నిరంతరం పరిశీలిస్తూ కిలో రూ. 7 కంటే తక్కువ ధర పలుకుతున్న మార్కెట్లలో జోక్యం చేసుకుంటూ ధరలు నిలకడగా ఉండేలా చూస్తోంది. ఇటీవల టమాటా ధరలు చుక్కలనంటి.. కిలో రూ. 250కు పైగా పలికిన దశలో వినియోగదారులకు రాష్ట్ర ప్రభుత్వం బాసటగా నిలిచింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 28 నుంచి మార్కెట్‌లో జోక్యం చేసుకొని రైతుల నుంచి పెద్ద ఎత్తున టమాటాలను సేకరించి

మిగతా 5వ పేజీలో ▶

టీడీపీ బంద్ పూర్తి విఫలం

రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా కనిపించని బంద్ ప్రభావం

- యథావిధిగా కొనసాగిన ప్రజా జీవనం.. ఆందోళనలకు ఇష్టపడని టీడీపీ శ్రేణులు
- నిరసనలకు దూరంగా ముఖ్య నాయకులు
- చంద్రబాబు సొంత సంస్థ హెరిటేజ్ కూడా మూతపడలేదు
- యథావిధిగా పనిచేసిన ప్రియా పచ్చళ్ల కంపెనీ
- ఇలాంటి పరిస్థితుల్లోనూ నేతలు బయటకు రాకపోవడంపై పార్టీలో ఆందోళన



జనంతో కిటకిటలాడుతున్న విజయవాడలోని బీసెంట్ రోడ్డు

సాక్షి, అమరావతి/సాక్షి, నెట్‌వర్క్: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ ఇచ్చిన బంద్ పిలుపునకు ప్రజలెవరూ స్పందించలేదు. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ఎక్కడా బంద్ ప్రభావం కనిపించలేదు. ప్రజాజీవనం యథావిధిగా కొనసాగింది. చంద్రబాబు సొంత కంపెనీ హెరిటేజ్ కూడా మూతపడలేదు. కృష్ణాజిల్లా పెనమలూరులో

మిగతా 11వ పేజీలో ▶

బయటకు రాని టీడీపీ నేతలు, క్యాడర్

తెలుగుదేశం పార్టీలోనూ దీనిపై పెద్దగా స్పందన లేదు. ఏ జిల్లాలోనూ బంద్ చేయడానికి టీడీపీ నేతలు ముందుకు రాలేదు. అనేక నియోజకవర్గాల్లో టీడీపీ అసెంబ్లీ ఇన్‌చార్జిలు సైతం అసలు బయటకే రాలేదు. అక్కడక్కడా నేతలు సోషల్ మీడియాలో ఫొటోల కోసమే పది నుంచి 20 మందితో కలిసి కొంత హడావుడి చేయడానికే పరిమితమయ్యారు. విజయవాడలోనూ బంద్ అసలు జరక్కపోవడం ఆపార్టీ దీనావస్థను చూపుతోంది. ఉమ్మడి, కృష్ణా గుంటూరు జిల్లాల్లో ముఖ్య నాయకులు ఎవరూ బయటకు వచ్చిన దాఖలాలు లేవు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోనూ అదే పరిస్థితి. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లోనూ పార్టీ నేతలు బంద్ గురించి పట్టించుకోలేదు.

ఇదండీ సంగతి



మేమూ అంతే సార్! దొరకనన్ని రోజులూ దొరలాగే బతికాం!

పక్కాగా.. పారదర్శకంగా ఈ-క్రాప్

రాష్ట్రమంతటా జోరందుకున్న పంటల నమోదు

- జియో ఫెన్సింగ్ ఆధారంగా నమోదు చేస్తున్న ఆర్బీకేల సిబ్బంది.. క్షేత్రస్థాయి పరిశీలనతో ఈ-కేవైసీ నమోదు
- ప్రతి రైతుకు భౌతిక, డిజిటల్ రసీదులు
- ఈ నెల 25 నాటికి పూర్తిచేసి.. 30న తుది జాబితాల ప్రదర్శన
- ఈ-క్రాప్ ప్రామాణికంగానే సంక్షేమ ఫలాలు అందజేత



సాక్షి, అమరావతి: ఖరీఫ్ సీజన్‌లో ఈ-పంట (ఎలక్ట్రానిక్ క్రాప్) నమోదును వ్యవసాయ శాఖ వేగవంతం చేసింది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఒడిదుడుకుల మధ్య ఖరీఫ్ సాగవుతుండగా.. సాగైన ప్రతి పంటను నమోదు చేసేలా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. సంక్షేమ ఫలాలు ఈ-క్రాప్ నమోదే ప్రామాణికం కావడంతో పకడ్బందీగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గత సీజన్ మాదిరిగానే పంటల నమోదుతోపాటు నూరు శాతం ఈకేవైసీ నమోదే లక్ష్యంగా ముందుకెళ్తోంది.

78 లక్షల ఎకరాల్లో ఖరీఫ్

ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటల సాగు లక్ష్యం 1.10 కోట్ల ఎకరాలు కాగా.. ఇప్పటివరకు 78 లక్షల ఎకరాల్లో

మిగతా 14వ పేజీలో ▶

డూప్లికేషన్‌కు తావులేకుండా..

డూప్లికేషన్‌కు తావు లేకుండా ఈ-ఫిష్ డేటాతో జోడించారు. ఈ-క్రాప్‌తో పాటు ఈ-కేవైసీ (వేలి ముద్రల) నమోదు ప్రక్రియ పూర్తి కాగానే ప్రతీ రైతుకు భౌతికంగా రసీదు అందజేస్తున్నారు. ఈ క్రాప్ ప్రక్రియ పూర్తయిన తర్వాత 10 శాతం ఎంపీవోలు-తహసీల్దార్లు, 5 శాతం జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు, 3 శాతం సబ్ కలెక్టర్లు, 2 శాతం జాయింట్ కలెక్టర్లు, 1 శాతం చొప్పున కలెక్టర్ ర్యాండమ్ చెక్ చేస్తున్నారు.



నిఫ్టీ @ 20,000

సరికొత్త శిఖరాలపైకి సూచీలు

ఇంట్రాడే ముగింపులో కొత్త రికార్డులు

సూచీలకు ఏడోరోజూ లాభాలే

ఆల్‌టైం హైకి ఇన్వెస్టర్ల సంపద

- వివరాలు 13లో



దారి మళ్లించేందుకే అవాస్తవాలు ప్రచారం

- పక్కా ఆధారాలతోనే కేసు దర్యాప్తు
- స్పష్టం చేసిన సీఐడీ వర్గాలు

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణంలో పూర్తి ఆధారాలతోనే కేసు నమోదు చేసి మాజీ సీఎం చంద్రబాబును అరెస్టు చేశామని సీఐడీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ కేసు దర్యాప్తు ప్రక్రియలో అప్పటి ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీవీ రమేశ్ వాంగ్మూలం కేవలం ఒక భాగం మాత్రమేనని స్పష్టం చేశాయి. అన్ని కోణాల్లో పరిశోధించి పూర్తి ఆధారాలతోనే చంద్రబాబును అరెస్ట్ చేసినట్లు వెల్లడించాయి. తన వాంగ్మూలంతోనే చంద్రబాబును సిట్ అరెస్టు చేశారని చెప్పడం హాస్యాస్పదమని, పూర్తిగా ఫైళ్లు చూడకుండా ఆయన్ని ఎలా అరెస్ట్ చేస్తారని, తాను అప్రూవర్‌గా మారలేదని పీవీ రమేశ్ మీడియాలో చేసిన వ్యాఖ్యలను సీఐడీ వర్గాలు ఖండించాయి. సిట్ విచారణను ప్రభావితం చేసే ఉద్దేశంతో ఆయన అవాస్తవాలను ప్రచారంలోకి తెస్తున్నారని పేర్కొంది. నిబంధనలకు విరుద్ధంగా డిజైన్ టెక్ కంపెనీకి ప్రభుత్వ నిధులు మంజూరు చేయడాన్ని అప్పటి ఆర్థిక శాఖ కార్యదర్శి సునీత అభ్యంతరం తెలిపారని సిట్ వర్గాలు వెల్లడించాయి. ఆమె అభ్యంతరాలను బేఖాతర్ చేస్తూ చంద్రబాబు ఆదేశాలతో నిధులు విడుదల చేస్తున్నట్లు పేర్కొంటూ పీవీ రమేశ్ డిజైన్ టెక్ కంపెనీకి రూ.371 కోట్లు చెల్లించేందుకు ఉత్తర్వులు జారీ చేశారని సిట్ తెలిపింది. అధికార దుర్వినియోగానికి పాల్పడి రూ.371 కోట్ల ప్రజాధనాన్ని నిబంధనలకు విరుద్ధంగా షెల్ కంపెనీల ద్వారా మళ్లించినట్లు దర్యాప్తులో ఆధారాలతో సహా నిర్ధారణ అయ్యిందని పేర్కొంది. దర్యాప్తు కీలక దశలో ఉన్న తరుణంలో పీవీ రమేశ్ ఉద్దేశపూర్వకంగానే మీడియా ద్వారా అవాస్తవాలను ప్రచారంలోకి తెస్తున్నారని సిట్ స్పష్టం చేసింది. ప్రజల్ని అయోమయానికి గురి చేయడంతో పాటు దర్యాప్తును తప్పుదారి పట్టించాలన్నదే ఆయన ఉద్దేశంగా కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. పీవీ రమేశ్ చెబుతున్నట్లుగా హాస్యాస్పదంగానో పేలవంగానో ఈ కేసును దర్యాప్తు చేయడం లేదని సిట్ పేర్కొంది. పక్కా ఆధారాలతో నిబంధనలకు అనుగుణంగా దర్యాప్తు చేస్తున్నందునే చంద్రబాబు అరెస్టును న్యాయస్థానం సమర్థించి ఆయనకు రిమాండ్ కూడా విధించిందని సీఐడీ వర్గాలు తెలిపాయి.

పీటీ వారంట్!



- 'ఇన్నర్ రింగ్ రోడ్డు' అక్రమాల కేసులో చంద్రబాబు విచారణకు 'సిట్' పిటిషన్
- చంద్రబాబు, చినబాబు సూత్రధారులుగా భూ కుంభకోణం
- నారాయణ, లింగమనేని ప్రధాన పాత్రధారులు
- ఇప్పటికే 'స్కిల్' స్కామ్‌లో రిమాండ్ ఖైదీగా చంద్రబాబు
- ఆసక్తికరంగా మారిన సిట్ తాజా నిర్ణయం

సాక్షి, అమరావతి: టీడీపీ హయాంలో యథేచ్ఛగా సాగిన కుంభకోణాలపై దృష్టి సారించిన సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. అమరావతిలో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ అక్రమాల కేసులో మాజీ సీఎం చంద్రబాబును విచారించేందుకు పీటీ వారంట్ కోరుతూ విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానంలో సోమవారం పిటిషన్ దాఖలు చేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో అరెస్ట్ అయిన ప్రధాన నిందితుడు చంద్రబాబు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే. ఆయన్ను ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ అక్రమాల కేసులో కూడా అరెస్ట్ చేయాల్సిన అవసరం ఉందని సీఐడీ భావిస్తోంది. ఈ కేసులో పూర్తి ఆధారాలతో చంద్రబాబు, నారాయణ, లోకేశ్‌తోపాటు వారి బినామీలైన లింగమనేని రమేశ్, లింగమనేని రాజశేఖర్, ఆర్కే హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ అంజినీ కుమార్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో ఇంతవరకు వారిని అరెస్ట్ చేయలేదు. తాజా పరిణామాల నేపథ్యంలో చంద్రబాబును ఇందులోనూ అరెస్ట్ చేయాల్సిన అవసరం ఉందని సీఐడీ నిర్ణయించింది. ఇప్పటికే రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబును ఇన్నర్ రింగ్ రోడ్డు కుంభకోణం కేసులో కూడా రిమాండ్ ఖైదీగా పరిగణించాలని న్యాయస్థానాన్ని కోరాలని నిర్ణయించి పీటీ వారంట్ దాఖలు చేసింది. అందుకు న్యాయస్థానం అనుమతిస్తే ఇన్నర్ రింగ్ రోడ్ అక్రమాల కేసులో కూడా చంద్రబాబు అరెస్టై జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నట్లుగా పరిగణిస్తారు. ఆ కేసులో కూడా ఆయన్ని విచారించేందుకు తమ కస్టడీకి కోరనుంది. దీంతో కేసు దర్యాప్తులో మరింత పురోగతి సాధించవచ్చని సీఐడీ భావిస్తోంది.

అటాచ్ చేయనున్న ఆస్తుల వివరాలు..

- ఏ-1 చంద్రబాబు కరకట్ట నివాసం (లింగమనేని రమేశ్ కుటుంబం పేరిట ఉన్న ఈ నివాసాన్ని చంద్రబాబు క్విడ్ ప్రో కో కింద పొందారు)
- ఏ-2 పొంగూరు నారాయణ కుటుంబ సభ్యులు, బంధువులు, బినామీల పేరిట అమరావతిలో ఉన్న 75,888 చదరపు గజాల ఇళ్ల స్థలాలు.
- ఏ-2 నారాయణ భార్య పొత్తూరి ప్రమీల, కుటుంబ సభ్యులు, బంధువులు రాపూరి సాంబశివరావు, ఆవుల మునిశంకర్, వరుణ్ కుమార్ ఇప్పటివరకు పొందిన కౌలు మొత్తం రూ.1,92,11,482.

చంద్రబాబు, చినబాబు భూ దోపిడీ

టీడీపీ హయాంలో జరిగిన భారీ కుంభకోణాలకు మరో ఉదాహరణ అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాజెక్టు. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో ఇష్టానుసారంగా మార్పులు చేసి అక్రమాలకు పాల్పడ్డారు. మాజీ సీఎం చంద్రబాబు, మాజీ మంత్రులు లోకేశ్, పొంగూరు నారాయణ కలసి అసైన్డ్ భూములను కొల్లగొట్టారు. వారి బినామీ లింగమనేని రమేశ్ క్విడ్ ప్రోకోకు పాల్పడ్డారు. ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను ఇష్టానుసారంగా మెలికలు తిప్పి సింగపూర్ కన్సల్టెన్సీ రూపొందించినట్లు మభ్యపుచ్చారు. అప్పటివరకు రూ.177.50 కోట్లుగా ఉన్న తమ 148 ఎకరాల మార్కెట్ విలువను అమాంతం రూ.877.50 కోట్లకు పెంచుకున్నారు. అమరావతి రాజధాని నిర్మాణం పూర్తయితే ఆ భూముల మార్కెట్ విలువ ఏకంగా రూ.2,130 కోట్లకు పెరిగేలా పథకం వేశారు. ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను ఆనుకుని హెరిటేజ్ ఫుడ్స్ కొనుగోలు చేసిన భూములు వీటికి అదనం. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పు కుంభకోణంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కూడా చంద్రబాబు వాటా కల్పించారు. ఆ రోడ్డు అలైన్‌మెంట్‌కు సమీపంలోనే ఆయనకు 2.4 ఎకరాల భూమి ఉండటం గమనార్హం. లింగమనేని కుటుంబం నుంచి ఆ భూములను కొనుగోలు చేసినట్లు చూపించి ల్యాండ్ పూలింగ్ నుంచి మినహాయింపు కల్పించారు.

ఏ-1 చంద్రబాబు, ఏ-2 నారాయణ, ఏ-6 లోకేశ్

ఇన్నర్ రింగ్ రోడ్డు భూ కుంభకోణాన్ని సిట్ పూర్తి ఆధారాలతో బట్టబయలు చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడి (ఏ-1)గా చంద్రబాబు, ఏ-2గా నారాయణ, ఏ-6గా లోకేశ్‌పై కేసు నమోదు చేసింది. చంద్రబాబు, నారాయణ బినామీలు లింగమనేని రమేశ్‌ను ఏ-3గా, లింగమనేని రాజశేఖర్ ఏ-4గా, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్ డైరెక్టర్ అంజని కుమార్‌ను ఏ-5గా పేర్కొంది.

చంద్రబాబు, నారాయణ ఆస్తుల అటాచ్

ఈ కేసులో చంద్రబాబు, నారాయణ బినామీల ద్వారా పొందిన ఆస్తులు, బ్యాంకు ఖాతాలను అటాచ్ చేయాలని సీఐడీ నిర్ణయించింది. ఆ మేరకు సీఐడీ ప్రతిపాదనను ఆమోదిస్తూ హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. క్విడ్ ప్రోకో కింద లింగమనేని రమేశ్ నుంచి చంద్రబాబు పొందిన కరకట్ట నివాసంతోపాటు నారాయణ కుటుంబ సభ్యుల స్థిర, చరాస్తులను అటాచ్ చేయనుంది.

5 రోజులు కస్టడీకి అప్పగించండి

- ఏసీబీ కోర్టును అభ్యర్థించిన సీఐడీ
- స్కిల్ స్కామ్‌లో అంతిమ లబ్ధిదారులు చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు, టీడీపీ

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అరెస్టై రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడును తదుపరి విచారణ నిమిత్తం తమ కస్టడీకి అప్పగించాలంటూ సీఐడీ సోమవారం ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. ఈ స్కామ్ గురించి, మిగిలిన నిందితుల పాత్ర గురించి చంద్రబాబుకు చాలా విషయాలు తెలుసని, అందువల్ల ఆయన్ను కస్టడీలోకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఉందంటూ సీఐడీ డీఎస్పీ ఎం.ధనుంజయుడు ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోర్టును అభ్యర్థించారు. కస్టడీకి ఇచ్చే సమయంలో ఎలాంటి షరతులు విధించినా తమకు అభ్యంతరం లేదన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ నిధుల మళ్లింపు, లబ్ధిదారులు ఎవరన్న విషయాలు చంద్రబాబుకు బాగా తెలుసన్నారు. నిధుల దుర్వినియోగంలో చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు, తెలుగుదేశం పార్టీనే అంతిమ లబ్ధిదారులని తెలిపారు. స్కామ్ జరిగిన తీరును ఈ పిటిషన్‌లో వివరించారు. 'ఈ స్కామ్ వెనుక కొందరి ఆర్థిక పరమైన దుష్ప్రవర్తన, లోతైన కుట్ర దాగి ఉంది. వీటి వెనుకు అసలు కారణాలన్నింటినీ చంద్రబాబు నుంచి తెలుసుకోవాల్సిన అవసరం దర్యాప్తు సంస్థకుంది. అధికార బాధ్యతలను పక్కన పెట్టి వ్యక్తుల లబ్ధి కోసం భారీ, లోతైన కుట్రకు పాల్పడ్డారు. మాకు కావాల్సిన సమాచారాన్ని చంద్రబాబు నుంచి రాబట్టినప్పుడే ఈ ఆర్థిక మోసం పూర్తిగా బయటపడుతుంది. ఈ స్కామ్‌కు సంబంధించిన కీలక డాక్యుమెంట్లను మాయం చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో ప్రధాన లబ్ధిదారులు చంద్రబాబు నాయుడు, అచ్చెన్నాయుడు, గంటా సుబ్బారావు, డాక్టర్ లక్ష్మీనారాయణ. మాయం చేసిన ఫైళ్లు ఎక్కడ ఉన్నాయన్న విషయాలను చంద్రబాబును విచారించి రాబట్టాల్సి ఉంది. షెల్ కంపెనీల ద్వారా, పలువురు వ్యక్తుల సాయంతో మొత్తం డబ్బు తిరిగి చంద్రబాబుకే చేరింది. ఇందుకు సంబంధించిన మరిన్ని వివరాలను చంద్రబాబు నుంచి రాబట్టాల్సి ఉంది. చంద్రబాబును అరెస్ట్ తరువాత విచారించాం. అయితే ఆయన విచారణకు సహకరించలేదు. అందువల్ల 5 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని అభ్యర్థిస్తున్నాం' అని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం కౌంటర్ దాఖలు చేయాలని చంద్రబాబు తరపు న్యాయవాదిని ఆదేశించింది. కౌంటర్ దాఖలు తరువాత ఈ వ్యాజ్యంపై విచారణ జరుపుతామని తెలిపింది.

జైల్లో ఉండను.. మా ఇంట్లో ఉంటా

▶ మొదటి పేజీ తరువాయి

చంద్రబాబు తరఫు న్యాయవాదులకు ఏసీబీ కోర్టు సూచించింది. కౌంటర్లు దాఖలైన తరువాత కస్టడీ పిటిషన్‌పై విచారణ జరుపుతామని తెలిపింది.

బీపీ, షుగర్ ఉంది..

అంతకు ముందు హౌస్ రిమాండ్ పిటిషన్‌పై సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. చంద్రబాబుకున్న ప్రాణహాని రీత్యా ఆయనకు కేంద్రం జెడ్‌ప్లస్ కేటగిరి భద్రత కల్పించిందన్నారు. జైలులో చంద్రబాబు భద్రతపై ఆయన సందేహం వ్యక్తం చేశారు. అంతేకాక చంద్రబాబు వయస్సు 73 ఏళ్లని, షుగర్, బీపీలతో పాటు ఇతర వ్యాధులతో బాధపడుతున్నారని కోర్టుకు నివేదించారు. ఒకవేళ బెయిల్ ఇవ్వకపోతే ఆయనను జైలులో కాకుండా హౌస్ రిమాండ్‌లో ఉంచాలని అభ్యర్థించారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌కు సంబంధించి దర్యాప్తు అధికారులు ఎన్నడూ చంద్రబాబు ఇంట్లో సోదాలు నిర్వహించలేదని, ఎలాంటి డాక్యుమెంట్లను జప్తు చేయలేదని తెలిపారు. అలాంటప్పుడు చంద్రబాబుకు వ్యతిరేకంగా ఈ స్కామ్‌లో ఎలాంటి ఆధారాలు ఉండే అవకాశం లేదన్నారు. హౌస్ రిమాండ్‌లో ఉంచితే సాక్ష్యాలను తారుమారు చేయడం, సాక్షులను ప్రభావితం చేయడం జరగదన్నారు. వాదనల సందర్భంగా సుప్రీం కోర్టు, హైకోర్టు తీర్పులను ఆయన ఉదహరించారు.

జైలులోనే భద్రత ఎక్కువ...

అనంతరం సీఐడీ తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ హౌస్ రిమాండ్ కోరుతూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌కు విచారణార్హతే లేదన్నారు. చంద్రబాబు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నేపథ్యంలో హౌస్ రిమాండ్ పిటిషన్ నిరర్థకమైందన్నారు. చంద్రబాబు కోరుతున్న హౌస్ రిమాండ్ అభ్యర్థన అసాధారణమన్నారు. వాస్తవానికి హౌస్ రిమాండ్ ప్రస్తావన ఏ చట్టంలో కూడా లేదన్నారు. అందువల్ల హౌస్ రిమాండ్ మంజూరు చేయడానికి వీల్లేదని వాదించారు. చంద్రబాబుకు ప్రస్తుతం ఉన్న భద్రత కంటే జైలులో ఇంకా ఎక్కువ భద్రత ఉందని వివరించారు. జైలులో ఆయన భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు. జైలులో చంద్రబాబు భద్రతకు వచ్చిన ముప్పేమీ లేదన్నారు. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితి బాగోలేదనేందుకు ఎలాంటి వైద్య రికార్డులను కోర్టు ముందు ఉంచలేదన్నారు. అరెస్ట్, రిమాండ్ సమయంలో ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించగా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు డాక్టర్లు తేల్చారన్నారు. జీవన శైలి సంబంధ వ్యాధులకు సాధారణ మందులు తీసుకుంటే సరిపోతుందన్నారు. చంద్రబాబు ఆరోగ్యంగా ఉన్నారు కాబట్టే అరెస్ట్‌కు ముందు ఆయన చాలా క్రియాశీలకంగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేస్తూ బహిరంగ సభల్లో పాల్గొంటున్నట్లు కోర్టు దృష్టికి తెచ్చారు. హౌస్ రిమాండ్‌కు పంపితే సాక్షులను ప్రభావితం చేయడం, సాక్ష్యాలను తారుమారు చేయడం ఉందని చంద్రబాబు చెబుతున్నారని, అయితే వాస్తవానికి ఆయన ప్రోద్బలంతోనే ఇద్దరు కీలక వ్యక్తులు విదేశాలకు పరారయ్యారని తెలిపారు. దర్యాప్తులో జోక్యం చేసుకోకుండా, సాక్షులను ప్రభావితం చేయకుండా, సాక్ష్యాలను తారుమారు చేయకుండా ఉండేందుకే జ్యుడీషియల్ కస్టడీ విధిస్తారని, ఇప్పుడు చంద్రబాబుకు హౌస్ రిమాండ్ ఇస్తే ఆ సదుపాయాన్ని దుర్వినియోగం చేసే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే ఈ కోర్టు చంద్రబాబుకు ప్రత్యేక గది, ఇంటి భోజనం, మందులు, తగిన భద్రత కూడా కల్పించాలని జైలు అధికారులను ఆదేశించిందని తెలిపారు. చంద్రబాబుకు ఎలాంటి ప్రాణహాని లేదని సుధాకర్‌రెడ్డి చెప్పారు. బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేయకుండా హౌస్ రిమాండ్ కోసం పట్టుబడుతున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన పలు తీర్పులను ఉదహరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం మంగళవారం మధ్యాహ్నం తీర్పు వెలువరిస్తామని ప్రకటించింది. ఈ సమయంలో చంద్రబాబు న్యాయవాది లూథ్రా జోక్యం చేసుకుని ఉదయమే తీర్పు వెలువరించాలని పట్టుబట్టారు. అయితే ఉదయం అనేక కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా విచారించాల్సిన బాధ్యత తమపై ఉందని కోర్టు గుర్తు చేసింది.

తొలి రోజు గడిచిందిలా..

- పొద్దున్నే యోగా... పత్రికల పఠనం
- ఫ్రూట్ సలాడ్‌తో అల్పాహారం
- లంచ్‌లో బ్రౌన్ రైస్, బెండకాయ ఫ్రై, పన్నీర్, పెరుగు
- ఆహారమంతా కాన్వాయ్‌లోని ప్యాంట్రీ కార్ నుంచే..
- ప్రత్యేక గది.. ఓ సహాయకుడు .. గది వద్దే 1+4 భద్రత
- ఇదీ జైలులో రిమాండ్ ఖైదీ 7691 చంద్రబాబు తొలి రోజు
- నేడు ములాఖత్‌లో కలవనున్న కుటుంబ సభ్యులు

సాక్షి, అమరావతి, సాక్షి, రాజమహేంద్రవరం: పొద్దున్నే యోగా.. కాసేపు పత్రికల పఠనం... ప్రత్యేకంగా తెప్పించిన ఆహారం... రెండు సార్లు వైద్య పరీక్షలు.. మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు పూర్తి స్థాయి భద్రత నడుమ రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా తొలిరోజు గడిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో అరెస్టై రిమాండ్ ఖైదీ 7691గా ఉన్న ఆయన సంపూర్ణ ఆరోగ్యంగా, పూర్తి భద్రతతో కూడిన ప్రత్యేక గదిలో ఉంటున్నారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు నిద్ర లేచారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

ప్రత్యేకంగా సహాయకుడు.. వంటకు ప్యాంట్రీ కార్

న్యాయస్థానం ఆదేశాలతో జైలు అధికారులు చంద్రబాబుకు స్నేహ బ్యారక్‌లో ప్రత్యేక గదిని ఆదివారం రాత్రే కేటాయించారు. అందులో వెస్ట్రన్ మోడల్ టాయిలెట్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. చంద్రబాబుకు ప్రత్యేకంగా ఓ సహాయకుడిని అందుబాటులో ఉంచారు. చంద్రబాబు జిల్లాల పర్యటనల్లో ఆయన కాన్వాయ్‌లో ఉండే ప్రత్యేక ప్యాంట్రీ కార్‌ను జైలుకు సమీపంలో ఉంచారు. నారా లోకేష్ రాజమహేంద్రవరంలోనే ఓ టీడీపీ నేత ఇంటి వద్ద మకాం వేసి చంద్రబాబుకు అవసరమైనవన్నీ సమకూరుస్తున్నారు. ఉదయం అల్పాహారంగా ఫ్రూట్ సలాడ్‌తో పాటు వేడినీళ్లు, బ్లాక్ కాఫీని పంపారు. మధ్యాహ్న భోజనంలో 100 గ్రాముల బ్రౌన్ రైస్, బెండకాయ వేపుడు, పన్నీర్ కూర, పెరుగు పంపించారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో టీ తాగేందుకు వేడినీళ్లు అందజేసినట్లు తెలిసింది. ఉదయం అల్పాహారం తీసుకున్న అనంతరం, మధ్యాహ్న భోజనం అనంతరం చంద్రబాబుకు రెండు సార్లు వైద్య పరీక్షలు చేశారు. ఆయన ఉంటున్న స్నేహ బ్యారక్‌కు ఎదురుగానే జైలుకు సంబంధించిన ఆస్పత్రి ఉండటంతో అక్కడ వైద్య పరీక్షలు చేపట్టారు. రాత్రి కూడా ప్యాంట్రీ కార్ నుంచే పుల్కాలు, పెరుగు తెప్పించి ఆహారాన్ని అందించారు.

నిరంతరం 1 + 4 భద్రత

జైలు అధికారులు చంద్రబాబు భద్రత కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆయన ఉన్న జైలు గది వద్ద 24 గంటలపాటు విధులు నిర్వహించేలా 1 + 4 భద్రతను వినియోగించారు. జైలు లోపల, చుట్టుపక్కల పూర్తి స్థాయిలో పటిష్ట బందోబస్తు కల్పించారు. కట్టుదిట్టమైన భద్రతతోపాటు జైలులో ఉన్న సీసీ కెమెరాల ద్వారా భద్రతను నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో చంద్రబాబు సంపూర్ణ ఆరోగ్యంతో పూర్తిస్థాయి భద్రత నడుమ ఉన్నారు.



తొలిరోజు ములాఖత్‌లు లేవు

సెంట్రల్ జైలులో ఉన్న చంద్రబాబును తొలిరోజు ఎవరూ కలవలేదు. జైలు నిబంధనల ప్రకారం వారానికి రెండు ములాఖత్‌లను అనుమతిస్తారు. సోమవారం ములాఖత్ కోసం ఎవరూ దరఖాస్తు చేయలేదు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి, కుమారుడు లోకేష్ మంగళవారం ఆయన్ను ములాఖత్‌లో కలిసేందుకు జైలు అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు.

దొరికిపోయినా బుకాయింపేనా?

- చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల ఫైర్
- పీవీ రమేష్ స్టేట్‌మెంట్ ఆధారంగా స్కిల్ కేసు పెట్టారనడం అవాస్తవం
- ప్రతిపక్షంలో ఉన్నప్పుడే బాబు స్కాములను ప్రస్తావించాం
- అధికారంలోకి వచ్చాక వాటిపై విచారణ చేయిస్తున్నాం
- ఇందులో ఎలాంటి కక్ష సాధింపులేదు
- ఇన్నర్ రింగ్ రోడ్డు స్కాంలోనూ చంద్రబాబు పాత్ర



సాక్షి, అమరావతి: స్కిల్ స్కాంలో ప్రభుత్వ ఖజానా నుంచి రూ.371 కోట్లు దోచేసి, ఆధారాలతో సహా పట్టుబడినా.. ఇప్పటికీ తాను తప్పేమీ చేయలేదని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బుకాయిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. ఆర్థిక శాఖ అప్పటి ముఖ్య కార్యదర్శి పీవీ రమేష్ స్టేట్‌మెంట్ ఆధారంగా చంద్రబాబుపై కేసు పెట్టారనడం అవాస్తవమంటూ కొట్టిపారేశారు. కేసు కోర్టు పరిధిలో ఉండగా ఆయన మాట్లాడటం సరికాదన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో సజ్జల మాట్లాడుతూ.. స్కిల్ స్కాంపై సీఐడీ దర్యాప్తులో భాగంగా చంద్రబాబును అరెస్టు చేశారన్నారు. రాజకీయంగా కక్ష సాధింపులో భాగంగానే ఈ కేసులో తనను అరెస్టు చేశారంటూ చంద్రబాబు తప్పించుకోవాలని చూస్తున్నారని చెప్పారు. అమరావతి భూకుంభకోణం, అసైన్డ్ భూకుంభకోణం, టిడ్కో ఇళ్ల స్కాం, ఇన్నర్ రింగ్ రోడ్డు, స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్‌నెట్ స్కాం కేసులు రాత్రికి రాత్రే పుట్టుకొచ్చినవి కావని.. రెండేళ్లుగా వాటిపై విచారణ సాగుతోందని స్పష్టం చేశారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ఈ కుంభకోణాలను ప్రస్తావించామని.. అధికారంలోకి వచ్చాక వాటిపై విచారణ చేస్తున్నామని, ఇందులో ఎలాంటి కక్ష సాధింపు లేదంటూ సజ్జల స్పష్టం చేశారు. ఈ కేసులకు సంబంధించి బలమైన ఆధారాలు ఉన్నప్పుడు చట్టప్రకారం దర్యాప్తు సంస్థలు తమ పనిచేసుకుంటూ ముందుకెళ్తున్నాయని వివరించారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే..

- కేసుల దర్యాప్తులో సీఐడీకి సరైన ఆధారాలు లభిస్తే.. చంద్రబాబునైనా, లోకేశ్‌నైనా, అచ్చెన్నాయుడునైనా విచారణకు పిలుస్తారు. కాంగ్రెస్ పార్టీ చెప్పినట్లు విని ఉంటే జగన్‌పై కేసులు ఉండేవే కాదు. కానీ, కాంగ్రెస్ పార్టీతో చంద్రబాబు కుమ్మక్కై కేసులు పెట్టి, కక్ష సాధింపులకు గురిచేసిందనే విషయం రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ భావించబట్టే జగన్‌ను ప్రజలు అక్కున చేర్చుకున్నారు.
- ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో కూడా చంద్రబాబు పాత్ర ఉంది. ఇప్పటికే చంద్రబాబు రిమాండ్‌లో ఉన్నారు కాబట్టి ఆ కేసులో విచారణకు పీటీ వారెంట్ వేసి ఉంటారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో తనపై ఎలాంటి కేసుల్లేవని చంద్రబాబు చెప్పుకోవడం పూర్తి అబద్ధం.
- అనేక కేసుల్లో విచారణను ఎదుర్కోకుండా వ్యవస్థలను మేనేజ్ చేసి స్టేలు తెచ్చుకుంటూ ఇంతకాలం తప్పించుకుంటూ వస్తున్నారు. ఏ కేసులో కూడా క్లీన్‌చిట్ తెచ్చుకోలేదు. గతంలో చంద్రబాబుపై దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి కూడా కేసులు పెట్టారు. కానీ.. రాజకీయంగా తేల్చుకుందామని వాటిని వదిలేశారు.
- ఇక వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని లోకేశ్‌ను చూసి సీఎం జగన్ భయపడాలా? చంద్రబాబు జైలులో ఉంటే తప్పితే ఎన్నికలను ఎదుర్కోలేం అనే భావనలో సీఎం జగన్ లేరు. ఊతకర్రలు లేనిదే ఎన్నికలకు వెళ్లలేని స్థితిలో చంద్రబాబు ఉన్నారు.
- చంద్రబాబుకు ఐటీ శాఖ నోటీసులు ఇచ్చినప్పుడు పవన్ కనబడలేదు. ఆయనకు అవసరమైనప్పుడు రాష్ట్రానికి వచ్చి మాట్లాడి తిరిగి వెళ్తున్నాడు. ఆ క్రమంలోనే ఇప్పుడొచ్చి పవన్ హడావుడి చేశాడు.

నిధులు దుర్వినియోగం కాలేదు

స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుపై టీడీపీ ప్రకటన

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో నిధులు దుర్వినియోగం కాలేదని తెలుగుదేశం పార్టీ తెలిపింది. ఈ ప్రాజెక్టులో భాగంగా 2.13 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చారని, ఇందుకోసం 42 శిక్షణ కేంద్రాలు నెలకొల్పారని పేర్కొంది. ఈ కేసులో చంద్రబాబు అరెస్టయిన నేపథ్యంలో దానిపై వివరణ ఇస్తూ తెలుగుదేశం పార్టీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. రాజకీయ ప్రత్యర్థులపై కక్ష సాధించడానికి ఒక ప్రైవేటు సైన్యంలా సీఐడీని సీఎం జగన్ ఉపయోగించుకుంటున్నారని విమర్శించింది. సీమెన్స్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఆ సంస్థ ప్రాజెక్టు విలువలో 90 శాతానికి సమానంగా తన సాఫ్ట్‌వేర్ ఇస్తుందని, మిగిలిన 10 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుందని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ఇవ్వాల్సిన రూ.330 కోట్లకు జీఎస్టీ కలిపి రూ.370 కోట్లు విడుదల చేసిందని పేర్కొంది. ఆ నిధులతోనే సాఫ్ట్‌వేర్ కొనుగోలు చేశారని, శిక్షణ కేంద్రాలు, అందులో కావాల్సిన కంప్యూటర్లు, పరికరాలు, ట్రెయినర్లను సమకూర్చిందని తెలిపింది.

లోకేశ్ యాత్రకు వస్తున్న ఆదరణ వల్లే బాబు అరెస్టు

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు
- విశాఖలో గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చిన టీడీపీ నాయకులు
- చంద్రబాబు అరెస్ట్‌పై గవర్నర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారన్న అచ్చెన్న
- జనసేనతో కలిస్తే తమదే అధికారమంటూ వ్యాఖ్య



గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): తమ నాయకుడు లోకేశ్ పాదయాత్రకు వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక చంద్రబాబును అరెస్ట్ చేశారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు చెప్పారు. చంద్రబాబు అరెస్ట్‌పై గవర్నర్ ఆశ్చర్యం వ్యక్తం చేసినట్లు తెలిపారు. సోమవారం విశాఖ పోర్టు గెస్ట్‌హౌస్‌లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కలిసిన టీడీపీ నేతలు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'మేము ఏమీ చెప్పకముందే తనకు అన్నీ తెలుసంటూ గవర్నర్ చెప్పారు. ప్రపంచంలో పేరున్న వ్యక్తి చంద్రబాబు అని.. తనకు తెలియకుండా అరెస్ట్ చేశారంటూ గవర్నర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అన్ని విషయాలను గవర్నర్‌కు వివరించాం. ఆయన కూడా సానుకూలంగా స్పందించారు' అని చెప్పారు. అసలు ఈ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌ను మోదీ గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు స్థాపించారని, అక్కడ పనిచేసిన సీమెన్స్ సంస్థకే తాము ప్రాజెక్ట్‌ను అప్పగించామన్నారు. కోర్టులను మేనేజ్ చేసే శక్తి ఉంటే ఈ కేసులో నిబద్ధతగా ఎందుకు ఉంటామన్నారు. తమకు న్యాయస్థానాల మీద నమ్మకం ఉందని చెప్పారు. ప్రతిపక్ష పార్టీకి నిరసన తెలిపే హక్కు లేదా.. చంద్రబాబును ఇబ్బంది పెడితే నిరసన తెలపకూడదా అని ప్రశ్నించారు. తమ పోరాటానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ ప్రభుత్వం మీద నమ్మకం లేదని, చంద్రబాబు రక్షణ మీద తమకు భయం ఉందన్నారు. కాగా, జనసేనతో టీడీపీ జట్టు కడితే తాము అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. 22 ఎంపీ స్థానాలు టీడీపీకి వస్తాయని సర్వేలు చెబుతున్నాయని పేర్కొన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవి, దువ్వారపు రామారావు, నాయకులు గండి బాబ్జీ, రాజబాబు తదితరులున్నారు.

గవర్నర్‌ను కలిసిన జనసేన నేతలు

జనసేన నాయకులు పి.మూర్తియాదవ్, పీవీఎస్ఎన్ రాజు, ఉషాకిరణ్, ప్రశాంతి, శివదత్తా తదితరులు సోమవారం గవర్నర్‌ను కలిసి రాష్ట్రంలోని పరిస్థితులపై వినతిపత్రం సమర్పించారు.

చంద్రబాబూ ఆత్మవిమర్శ చేసుకో

- నీవు చేసిన పాపాలు, తప్పులు ఇప్పటికైనా తెలుసుకో: లక్ష్మీపార్వతి
- ఎన్టీఆర్ సమాధిని సందర్శించి నివాళి..

ఖైరతాబాద్(హైదరాబాద్): ఏపీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇకనైనా ఆత్మవిమర్శ చేసుకోవాలని ఎన్టీఆర్ సతీమణి లక్ష్మీపార్వతి అన్నారు. సోమవారం ఎన్టీఆర్ ఘాట్‌లో నివాళులు అర్పించిన అనంతరం ఆమె మాట్లాడారు. 74 ఏళ్ల వయస్సులో ఎన్టీఆర్‌ను అవమానాలకు గురిచేసి, చివరకు ఆయన చనిపోయేలా చేశావో, అదే 74వ ఏట మీరు చేసిన పాపాలు పండి అరెస్టు అయ్యి జైలుకు వెళ్లిన ఈ ఉద్వేగభరిత క్షణాల్ని నా భర్త సమాధితో పంచుకోవాలని ఇక్కడకు వచ్చి నివాళులు అర్పించినట్లు చెప్పారు. చంద్రబాబు ఎప్పటికీ తప్పించుకోలేడని ఎన్టీఆర్ ఆనాడు చెప్పిన మాటల్ని లక్ష్మీపార్వతి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. నా భర్తకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు చెప్పాలనే ఇంతకాలం బతికున్నానని, నా ఆశయం నా భర్త నిర్దేశించారని తెలిపారు. 40 ఏళ్ల రాజకీయ జీవితం, 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఏం చేశాడు.. ప్రజల సొమ్ము దోచుకొని, అవినీతి కేసుల్లో వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ, అధికారం అడ్డుపెట్టుకొని వ్యవస్థలను కొనుక్కోవడం చేస్తూ వచ్చాడని, చివరికి అదే వ్యవస్థలో చిక్కుకుపోయి జైలు పాలయ్యాడని, ఇప్పుడు నా కోపం అంతా తీరిపోయిందన్నారు. ఎన్టీఆర్ కుటుంబం ఇప్పటికైనా ఆలోచించాలని, చంద్రబాబు అక్రమాలను మీరు సహిస్తారా... ప్రజాధనం లూటీ చేస్తూ దొరికిపోయాడు, ఆలోచించండన్నారు. నిప్పులాగా బతికిన ఎన్టీఆర్ జీవిత చరిత్ర ఎక్కడ, అధికారం కోసం తడిగుడ్డతో గొంతులు కోసే మనస్తత్వం ఉన్న చంద్రబాబు గురించి తెలుసుకోవాలన్నారు.



హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న లక్ష్మీపార్వతి



అన్ని సాక్ష్యాధారాలతోనే అరెస్ట్



ఆర్థిక నేరగాడైన చంద్రబాబును అన్ని సాక్ష్యాలు సేకరించిన తరువాతే సీఐడీ అరెస్ట్ చేసింది. పాకిస్తాన్ టెర్రరిస్టుల్లాగా లోకేశ్, చంద్రబాబు ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం సబబు కాదు. చంద్రబాబు, సోనియా గాంధీ కుమ్మక్కై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నిష్కారణంగా జైలులో పెట్టినప్పుడు పార్టీ గాని, కార్యకర్తలు గాని ఎటువంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయలేదు. రాముడు వనవాసం చేసిన తరహాలో జగన్ వ్యవహరించారు. ఇన్నాళ్లకు ఆర్థిక నేరస్తుడు చంద్రబాబు జైలుకెళ్లడం అందరూ ఆహ్వానిస్తున్నారు.

– కె.నారాయణస్వామి, డిప్యూటీ సీఎం (విదేశీ పర్యటన నుంచి వర్చువల్‌గా..)

చట్టాలపై గౌరవం పెరిగింది



చంద్రబాబు అరెస్ట్‌తో ప్రజలకు చట్టాలపట్ల గౌరవం మరింత పెరిగింది. ప్రజాధనాన్ని దోచుకున్న దోపిడీ దారులను చట్టం శిక్షిస్తుందనే నమ్మకం కలిగింది. స్కిల్ స్కామ్‌లో ముద్దాయి చంద్రబాబుకు పోలీసులు సరైన గుణపాఠం చెప్పారు. అందుకే.. ఎన్ని అల్లర్లు సృష్టించాలని చూసినా, బంద్‌కు పిలుపునిచ్చినా ప్రజలు సహకరించటం లేదు. ప్రభుత్వం సామాన్యుల రక్షణ కోసమే ఉందని, అవినీతికి పాల్పడితే ఎంతటి వారైన ఉపేక్షించేది లేదనేది తేటతెల్లమైంది.

– చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, బీసీ సంక్షేమం, సమాచార శాఖ మంత్రి

దొంగలను జైలుకు పంపడం సక్రమమే



దొంగలను జైలుకు పంపించడం సక్రమమే. చంద్రబాబు పాలన అంతా అవినీతిమయం. ఆయన అరెస్ట్ న్యాయసమ్మతమే. రెండు ఎకరాల స్థాయి నుంచి రూ.లక్షల కోట్ల సంపాదన సాధ్యమేనా. చంద్రబాబు బాగోతం సీఐడీ విచారణతో బయట పడింది. ఎన్నో కుంభకోణాలు చేసిన ఆలీబాబా 40 దొంగలు జైలుకెళ్లడం ఖాయం. చంద్రబాబు పట్ల ప్రేమ చూపుతున్న దత్తపుత్రుడికి ప్రజలు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారు.

– కరణం ధర్మశ్రీ, ప్రభుత్వ విప్

ప్రతిపక్షాలు బాధపడటం ఆశ్చర్యం



చంద్రబాబు అరెస్ట్‌తో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉంటే.. ప్రతిపక్ష పార్టీలుగా చెప్పుకునే జనసేన, బీజేపీ, వామపక్షాలు బాధపడటం ఆశ్చర్యంగా ఉంది. రాష్ట్రానికి సంపదను సృష్టిస్తున్నానని చెబుతూ తన కుటుంబ సంపదను పెంచుకున్న ఘనుడు చంద్రబాబు. రాష్ట్ర ప్రజల భవిష్యత్‌ను తాకట్టు పెడుతూ పోలవరం, పట్టిసీమ ప్రాజెక్టులను బంగారు బాతుగుడ్లుగా మలుచుకుని చంద్రబాబు తన ఆదాయాన్ని పెంచుకున్నాడు.

– మోపిదేవి వెంకట రమణారావు, రాజ్యసభ సభ్యుడు

బాబుకు అవినీతి 'స్కిల్స్' పుష్కలం



చంద్రబాబు వద్ద అవినీతి 'స్కిల్స్' పుష్కలంగా ఉన్నాయి. అందుకే.. ఇంతకాలం వ్యవస్థలను మేనేజ్ చేస్తూ తప్పులను కప్పిపుచ్చుకున్న చంద్రబాబు చివరకు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అడ్డంగా దొరికిపోయారు. తప్పు చేసిన వారెవరూ శిక్ష నుంచి తప్పించుకోలేరు. ఇందుకు చంద్రబాబే నిదర్శనం. ఆదాయ పన్ను శాఖ నోటీసులపై నోరుమెదపని పవన్‌కళ్యాణ్, పురందేశ్వరి... చంద్రబాబు అరెస్ట్ కాగానే గగ్గోలు పెడుతున్న తీరును ప్రజలు గమనిస్తూనే ఉన్నారు.

– ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్యే, కాకినాడ సిటీ


నారాసురుడి పీడ విరగడైంది



నారాసురుడనే అవినీతి రాక్షసుడు రిమాండ్‌కు వెళ్లాక రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. సీఐడీ అధికారులు పక్కా ఆధారాలతో చంద్రబాబును అరెస్ట్ చేసి, న్యాయాన్ని కాపాడటాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారు. చంద్రబాబు అంత అవినీతి పరుడు దేశంలోనే లేరు. అవినీతి చక్రవర్తి చంద్రబాబును సమర్థిస్తున్న వారందరికీ ఆయన చేసిన కుంభకోణాల్లో ఎంత భాగముందో చెప్పాలి.

– హరీష్‌కుమార్ యాదవ్, చైర్మన్, యాదవ కార్పొరేషన్

అన్నగారి ఆత్మకు శాంతి



చంద్రబాబుకు కాళ్లు కడిగిన రోజే అన్నగారి (ఎన్టీఆర్) ఆత్మకు శాంతి చేకూరింది. ప్రజాస్వామ్యంలో అత్యంత దారుణంగా ఒక ముఖ్యమంత్రికి వెన్నుపోటు పొడిచి.. పదవి లాక్కుని ఇన్నేళ్లు దర్జాగా కాలం గడిపేశారు. ఎన్టీఆర్‌ను విలువలు లేని వ్యక్తి అంటూ ప్రచారం చేసిన చంద్రబాబు.. ఓట్లు కోసం ఆయన బొమ్మపెట్టుకున్న నీచుడు. అందుకే చంద్రబాబు జైలుకు వెళ్లడం చూసి సమాజం మొత్తం హర్షం వ్యక్తం చేస్తోంది.

– తుమ్మల చంద్రశేఖర్ (బుద్ది), ఆంధ్రప్రదేశ్ కమ్మ సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్

బాబు కుంభకోణాలన్నీ బయటకొస్తాయి

రాజకీయాలను వ్యాపారంగా మార్చుకున్న చంద్రబాబు.. రూ.వేలకోట్ల అవినీతికి పాల్పడ్డారు

టీడీపీ బంద్‌కు ప్రజల స్పందన లేదు

రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత



కొవ్వూరు/ఆరిలోవ (విశాఖ తూర్పు): చంద్రబాబు అవినీతి కుంభకోణాలన్నీ బయటకొస్తాయని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత చెప్పారు. నేరం చేసి జైలుకు వెళ్లిన చంద్రబాబునాయుడుకి విధేయులుగా ఉన్న కొందరు చట్టాన్ని తప్పుపట్టటం సరికాదని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబు అవినీతికి పాల్పడినట్లు స్పష్టమైన సాక్ష్యాధారాలున్నందునే న్యాయస్థానం ఆయనకు రిమాండ్ విధించిందని చెప్పారు. చంద్రబాబు జైలుకెళ్లడం పట్ల ప్రజలు సంతోషంతో ఉన్నారని, అందుకే టీడీపీ చేపట్టిన బంద్‌లో ప్రజలు పాల్గొనలేదని తెలిపారు. విశాఖపట్నంలో సోమవారం ప్రారంభమైన జైళ్లశాఖ జాతీయ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతోను, తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో 'సాక్షి'తోను మాట్లాడారు. నేరం చేసినవారు ఎంతటివారైనా చట్టం దృష్టిలో సమానులేనని చెప్పారు. టీడీపీ నాయకులు, కొన్ని చానళ్లు, పత్రికలు చట్టాన్ని, న్యాయవ్యవస్థను తప్పుపట్టడం మంచిది కాదన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.371 కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేస్తే, దాన్ని రాజకీయ వైరంగా చిత్రీకరించేందుకు టీడీపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు. రాజధానికి వేలాది ఎకరాల భూముల సేకరణ విషయంలో బినామీల పేరుతో చంద్రబాబు రూ.వేలకోట్ల అవినీతికి పాల్పడ్డారని చెప్పారు. తెలంగాణలో ఓటుకి కోట్లు కేసులో సాక్ష్యాధారాలతో అడ్డంగా దొరికిపోయాడన్నారు. రాజధానిలో అసైన్డ్ భూముల కుంభకోణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గాల వారి భూములను చంద్రబాబు, ఆయన మనుషులు దోచుకున్నారని చెప్పారు. ఏపీ ఫైబర్‌నెట్ కుంభకోణంపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. చంద్రబాబుతో పాటు రామోజీ కొడుకు వియ్యంకుడు ఆర్.వి.ఆర్.రఘు కేంద్ర ఐటీశాఖ అధికారులకు దొరికిపోవడం వలన రాజధాని కుంభకోణాలు విచారించడానికి వీల్లేదని వాదిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ ఐటీశాఖ చంద్రబాబుకి అవినీతిపై నోటీసులిస్తే పచ్చమీడియా నోరు మెదపడం లేదన్నారు. రూ.2 వేలకోట్ల లావాదేవీలు చేశారని, చంద్రబాబు పీఏ శ్రీనివాస్ ప్రధాన నిందితుడని ఐటీశాఖ సాక్ష్యాధారాలతో నోటీసులిచ్చినా విచారణగానీ, అరెస్ట్‌గానీ చేయకూడదా.. అని ప్రశ్నించారు. ఇంతకాలం చంద్రబాబు దేశంలో వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ, స్టేలు తెచ్చుకుంటూ కాలం గడిపారని చెప్పారు. చంద్రబాబు వేలకోట్ల అవినీతికి పాల్పడుతూ దుష్టచతుష్టయానికి వాటాలు పంచుతున్నారని ఆరోపించారు. ఇప్పుడు చంద్రబాబు అరెస్ట్‌తో అవినీతి భాగస్వాముల వెన్నులో వణుకు పుడుతోందన్నారు. అవినీతికి పాల్పడిన కేసులో చంద్రబాబుని అరెస్ట్ చేస్తే ప్రతీకారంతో చేశారంటూ టీడీపీ, జనసేన, పచ్చమీడియా ప్రజలను నమ్మించేందుకు అష్టకష్టాలు పడుతున్నట్లు ఎద్దేవా చేశారు.

అవినీతి డొంక కదిలింది

ఇంతకాలం చంద్రబాబు రాజకీయాలను వ్యాపారంగా మార్చుకుని అవినీతి సామ్రాజ్యాన్ని నడిపారని హోంమంత్రి వనిత అన్నారు. ఇప్పుడు చంద్రబాబు అవినీతి డొంక కదిలిందని, ఒక్కో కుంభకోణం బయటపడుతుందని చెప్పారు. ఈ వ్యవహారంలో లోకేశ్‌పైన కూడా అనుమానాలున్నాయని, సీఐడీ దర్యాప్తు చేస్తోందని తెలిపారు. చంద్రబాబు అరెస్టు తర్వాత ప్రజాజీవనానికి ఇబ్బంది కలగకుండా జాగ్రత్త చర్యల్లో భాగంగా రాష్ట్రంలో 144 సెక్షన్ విధించినట్లు చెప్పారు. దీనిపై పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించారని ఆమె పేర్కొన్నారు.

అంతిమ విజయం న్యాయానిదే..

- చంద్రబాబు తప్పు చేశారు.. కాబట్టే బంద్ విఫలం
- 'స్కిల్' కుంభకోణం అంతా ప్రజలకు తెలిసిపోయింది
- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: వ్యవస్థలను అడ్డుపెట్టుకుని ఎన్నిసార్లు తప్పించుకున్నా... అంతిమ విజయం ధర్మం, న్యాయానిదేనని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో టీడీపీ అధినేత చంద్రబాబు పక్కాగా దర్యాప్తు సంస్థకు చిక్కడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని తన కార్యాలయంలో మంత్రి రజిని సోమవారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు చేసిన స్కామ్ గురించి అన్ని వాస్తవాలు రాష్ట్ర ప్రజలకు తెలిసిపోయాయని పేర్కొన్నారు. ప్రజల సొమ్మును దోచుకునేందుకే సీమెన్స్ అనే ప్రైవేటు సంస్థతో రూ.3,700 కోట్లతో అవగాహన ఒప్పందం అనే ఒక కుట్ర చేశారని వివరించారు. పది శాతం మాత్రమే రాష్ట్రం వాటా అని చెప్పి, కేవలం రాష్ట్రం వాటాను మాత్రమే విడదల చేసి, ఆ డబ్బును కూడా తిరిగి చంద్రబాబు జేబులోకి వచ్చేలా చేశారని మండిపడ్డారు. ఈ కుట్ర ద్వారా ఏకంగా రూ.371 కోట్లు దోచుకున్నారని విమర్శించారు. చంద్రబాబు రాష్ట్రంలో ఎన్నో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. అయితే, వ్యవస్థలను తనకు అనుకూలంగా ఉపయోగించుకుంటూ ఇన్నాళ్లు తప్పించుకున్నారని చెప్పారు. చివరికి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో పక్కాగా దొరికిపోయారని వివరించారు. ఈ స్కామ్‌లో అరెస్ట్ కావడంతో 40 ఏళ్ల రాజకీయ జీవితంలో తాను నిప్పు అని చెప్పుకుంటున్న చంద్రబాబు మాటలన్నీ అబద్ధాలేనని తేలిపోయిందన్నారు. అందువల్లే టీడీపీ బంద్ పిలుపును ప్రజలు పట్టించుకోలేదని, రాష్ట్రవ్యాప్తంగా బంద్ విఫలమైందని పేర్కొన్నారు. త్వరలోనే చంద్రబాబు చేసిన అక్రమాలన్నీ బయటకు వస్తాయని, చట్టం ముందు అందరూ సమానులేనని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెప్పారు.

ప్రజలకు మంచి చేయడం ద్వారానే గెలవాలనేది సీఎం జగన్ సిద్ధాంతం

చంద్రబాబు అరెస్ట్‌తో తమ ప్రభుత్వానికి, సీఎం వైఎస్ జగన్‌కు ఎటువంటి సంబంధం లేదని మంత్రి రజిని స్పష్టం చేశారు. ప్రజలకు మంచి చేయడం ద్వారా మళ్లీ గెలవాలనే సిద్ధాంతంతో తమ నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. కక్ష సాధించి గెలుపొందాలనే సంకుచిత స్వభావం తమ నాయకుడిది కాదని స్పష్టం చేశారు. మోసపూరిత రాజకీయాలు చంద్రబాబుకు తెలిసినట్లుగా తమ నాయకుడు జగనన్నకు తెలియవని పేర్కొన్నారు.

చోరీచేసి యుగపురుషుడిలా ఫోజులా?

- తప్పులకు బహిరంగ క్షమాపణ చెప్పి రాజకీయాల నుంచి నిష్క్రమించు
- అవినీతికి పాల్పడ్డారని ప్రజలు నమ్మడం వల్లే మీ బంద్‌కు స్పందన లేదు
- ఈ కుంభకోణంపై ఒక్క వార్త కూడా రాయని ఎల్లో మీడియా
- బాబు అవినీతిలో వాటా ఉండడం వల్లే ఆయనకు పవన్ మద్దతు
- చంద్రబాబుపై మంత్రి బొత్స ఫైర్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఖజానా నుంచి రూ.371 కోట్లు దొంగలించి, సాక్ష్యాధారాలతో పట్టుబడినందుకు సిగ్గుతో తలదించుకోవాల్సిందిపోయి.. యుగపురుషుడిలా ఫోజులు కొడతావా? అంటూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుపై విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తక్షణమే ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పి.. రాజకీయాల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజలు నిన్నూ.. టీడీపీని ఎప్పటికీ క్షమించరన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు అవినీతిపరుడని ప్రజలు సంపూర్ణంగా విశ్వసిస్తుండటంవల్లే ఆయన్ను అరెస్టుచేసినా జనం స్పందించలేదన్నారు. అలాగే, సోమవారం ఆ పార్టీ పిలుపునిచ్చిన బంద్ పూర్తిగా విఫలమైందన్నారు. బొత్స ఇంకా ఏమన్నారంటే..

- ఐదేళ్లలో చంద్రబాబు పాల్పడిన అక్రమాలపై దర్యాప్తు చివరి దశకు చేరుకుంది. ఆ కేసులన్నింటిలోనూ చంద్రబాబే దోషి. అత్యంత అవినీతిపరుడైన ఆయన్ను వచ్చే ఎన్నికల్లో ప్రజలు రాష్ట్రం నుంచి తరిమికొట్టడం.. ఉగాది తర్వాత టీడీపీకి నూకలు చెల్లడం ఖాయం. మాకు ఎవరిపైనా కక్ష సాధించాలనే భావంలేదు.
- ఐటీ నోటీసులతో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు.. స్కిల్ స్కాంలో గజదొంగలా పట్టుబడ్డారు.
- గతంలో ఫోక్స్ వ్యాగన్ కార్ల పరిశ్రమ విషయంలో నేను అవినీతిపరుడంటూ 'ఈనాడు', ఆంధ్రజ్యోతిల్లో లేనిపోని వార్తలు రాశారు. అప్పట్లో దీనిపై మేమే సీబీఐతో దర్యాప్తు చేయించి.. కాజేసిన రూ.11 కోట్లను రికవరీ చేసి, ఖజానాలో జమచేశాం. కానీ.. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంపై జీఎస్టీ ఇంటెలిజెన్స్ హెచ్చరించినా చంద్రబాబు ఎందుకు విచారణ చేయించలేదు? దీనిపై 'ఈనాడు', ఆంధ్రజ్యోతిలు ఎందుకు వార్తలు రాయవు.
- చంద్రబాబు మేనేజ్‌మెంట్‌కు కాలం చెల్లింది. కుంభకోణాలకు పాల్పడ్డ చంద్రబాబుకు ఇక శిక్ష తప్పదన్నది స్కిల్ స్కాంతో నిరూపితమైంది. స్కిల్ స్కాంకు సూత్రధారి, పాత్రధారి, లబ్ధిదారుడు చంద్రబాబే. ఈ కుంభకోణంలో చంద్రబాబును కోర్టు దోషిగా తేల్చడం ఖాయం. ఈ ఒక్క కేసులోనే కాదు.. గత ఐదేళ్లలో చంద్రబాబు పాల్పడిన అన్ని కుంభకోణాల్లోనూ ఆయనకు శిక్షపడటం ఖాయం.
- అవినీతిపరుడైన చంద్రబాబుకు మద్దతు తెలుపుతున్న పవన్‌కళ్యాణ్ రాజకీయ పార్టీని నడుపుతున్నారా? లేక డ్రామా కంపెనీని నడుపుతున్నారా? చంద్రబాబు అవినీతిలో వాటా ఉండటంవల్లే పవన్ ఆయకు మద్దతు తెలుపుతున్నారు.
- చంద్రబాబు, దుష్టచతుష్టయం, పవన్‌లు కలిసొచ్చినా అంతిమంగా గెలిచేది న్యాయం, ధర్మమే. మళ్లీ వైఎస్ జగన్ అఖండ మెజార్టీతో సీఎం కావడం తథ్యం.

బాబుకు భయం, పతనం మొదలైంది

- ఆయన ఆరోగ్యంగా ఉండాలి.. ఇలాంటి కేసులు మరెన్నో ఎదుర్కోవాలి
- త్వరలో అతని స్కాంలన్నీ బయటకొస్తాయి: మంత్రి పెద్దిరెడ్డి

సాక్షి, తిరుపతి: చంద్రబాబుకు భయం.. పతనం మొదలైందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన తప్పుచేయలేదని లాయర్లు, టీడీపీ నేతలు ఎవరూ మాట్లాడడం లేదన్నారు. సాంకేతిక అంశాలను మాత్రమే వారి న్యాయవాదులు మాట్లాడారని గుర్తుచేశారు. పైనున్న భగవంతుడు వీరి పాపాలు పండేలా చేశాడన్నారు. చంద్రబాబు ఆరోగ్యంగా ఉండాలని.. ఇలాంటి అవినీతి కేసులు మరెన్నో ఎదుర్కోవాలని పెద్దిరెడ్డి చెప్పారు. తిరుపతిలో సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

ప్రభుత్వంలో ఉండి, అధికారాన్ని అడ్డం పెట్టుకుని చంద్రబాబు అవినీతి చేస్తే.. వాటిపై కోర్టులో స్టే తెస్తే అది సక్రమమని, ఆ స్కాములకు సంబంధించి చంద్రబాబును అరెస్టుచేస్తే మాత్రం అది అక్రమమని అంటున్నారు. తనపై వైఎస్ రాజశేఖరరెడ్డి 26 ఎంక్వైరీలు వేశారని, అయినా ఏమీ చేయలేకపోయారని చంద్రబాబు అనేక సందర్భాల్లో అన్నాడు. కానీ, ఇప్పుడు ఆయన అవినీతి బయటపడింది. చంద్రబాబుని అరెస్టుచేస్తే.. భూమి ఆకాశం ఏకమైనట్లుగా గగ్గోలు పెడుతున్నారు. కానీ, ప్రజలు రోడ్లమీదకు రావట్లేదని అచ్చెన్నాయుడు టెలికాన్ఫరెన్స్ పెట్టి బాధపడుతున్నాడు.

టీడీపీ బంద్‌కు హెరిటేజ్ కూడా మూయలేదు

చంద్రబాబు అరెస్టుని నిరసిస్తూ టీడీపీ బంద్‌కు పిలుపునిస్తే సొంత హెరిటేజ్ సంస్థ కూడా మూతపడలేదు. అలాగే, ఆయన సొంత గ్రామంలో కూడా షాపులు తెరిచే ఉన్నాయి. జగన్‌ను అన్యాయంగా 16 నెలలు జైలులో పెట్టారు.

రెచ్చగొట్టే ప్రక్రియ మొదలైంది

రాష్ట్రంలో ప్రజలను రెచ్చగొట్టే ప్రక్రియ ప్రారంభమైంది. ఎవరిపై ఎక్కువ కేసులు ఉంటే వారికే పెద్దపెద్ద పదవులు అన్న లోకేశ్ వ్యాఖ్యలే దీనికి ఉదాహరణ. చంద్రబాబు అనే అక్రమ వ్యవస్థ రామ్‌లీల మైదానంలో రావణుడిలా కూలిపోయింది. పవన్ చేస్తున్న వ్యాఖ్యలపై విచారణ చేయాల్సిందిగా పోలీసులను కోరుతాం. అబద్ధాలని తేలితే పరువు నష్టం దావా వేస్తాం. చంద్రబాబు అరెస్టుకు.. పారిశ్రామిక పెట్టుబడులకు సంబంధమేలేదు. చంద్రబాబు అరెస్టుతో మేం సంతోషపడట్లేదు. ఎవరైనా సంతోషించారు అంటే అది ఎన్టీఆర్ ఆత్మ, ఆయన అభిమానులే.

చంద్రబాబు ఒక్కరోజు జైలులో ఉంటే ఎల్లో బ్యాచ్ అంతా విలవిల్లాడిపోతోంది. కేబినెట్ సబ్ కమిటీలో గత ప్రభుత్వ అవినీతిపై రిపోర్ట్ ఇచ్చాం.. త్వరలో అవన్నీ బయటకొస్తాయి.

దేశంలోనే అతిపెద్ద ఆర్థిక ఉగ్రవాది చంద్రబాబు

- న్యాయదేవత, చట్టాలపై ప్రజలకు నమ్మకం పెరిగింది: మంత్రి రోజా
- ప్రజాధనాన్ని దోచుకున్న వ్యక్తి జైలుకెళ్తే బంద్‌కు పిలుపా?
- జనసేన కాదు.. అది చంద్రసేన

చంద్రగిరి (తిరుపతి జిల్లా): అవినీతికి పాల్పడి సాక్ష్యాధారాలతో దొరికిపోయిన మాజీ సీఎం చంద్రబాబును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపటాన్ని రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా స్వాగతిస్తున్నారని మంత్రి ఆర్‌కే రోజా చెప్పారు. న్యాయదేవతతో పాటు చట్టాలపై ప్రజలకు నమ్మకాన్ని పెంచేలా కోర్టు తీర్పు వెలువడిందన్నారు. ప్రజల సొమ్మును దోచుకున్న వ్యక్తి జైలుకు వెళ్తే బంద్‌కి పిలుపునిస్తారా? అని టీడీపీపై మండిపడ్డారు. మంత్రి రోజా సోమవారం తిరుపతిలో విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్ర చరిత్రలో అతి పెద్ద కుంభకోణం స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్. తరచూ తనను నిప్పుగా అభివర్ణించుకునే చంద్రబాబు రూ.241 కోట్లు కొల్లగొట్టి పక్కా ఆధారాలతో జైలు పాలయ్యారు. ఇన్నాళ్లూ చీకట్లో కొందరి కాళ్లు పట్టుకుని స్టేలు తెచ్చుకుని తప్పించుకుని తిరిగారు. ఖైదీ నంబర్ 7691 చంద్రబాబుని జైలుకు పంపించడం ద్వారా కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు ఎంత నిష్పక్షపాతంగా పని చేస్తున్నాయో రుజువవుతోంది. ఈ కేసులో ప్రధాన సూత్రధారి చంద్రబాబే. ఆయన దేశంలోనే అతిపెద్ద ఆర్థిక ఉగ్రవాది, కరప్షన్ కింగ్, బోగస్ కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్. నాటి సీఎస్, ఫైనాన్స్ సెక్రటరీలపై ఒత్తిడి తెచ్చి ప్రజాధనాన్ని కాజేశారు. మేం ఆయనపై కక్ష సాధించాలనుకుంటే 2020లోనే అరెస్టు చేసేవాళ్లం. సీఎం జగన్‌కు అలాంటి ఉద్దేశం లేదు. ఆయన దృష్టంతా రాష్ట్రాభివృద్ధిపైనే సారించారు.

సీబీఐ, ఈడీ విచారణ కోరే ధైర్యముందా?

చంద్రబాబు నిజంగానే నిజాయితీపరుడైతే ఆయనపై ఉన్న కేసులపై సీబీఐ, ఈడీతో విచారణ జరపాలని రాతపూర్వకంగా కోరే ధైర్యముందా? రూ.241 కోట్ల కుంభకోణం జరగలేదని చంద్రబాబు గానీ, ఆయన న్యాయవాది గానీ చెప్పగలరా? చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలోనే స్కిల్ డెవలప్‌మెంట్‌లో అక్రమాలు జరిగాయని కేంద్ర జీఎస్టీ అధికారులు లేఖ రాయలేదా? దీనిపై విచారణ జరపకుండా నాడు అడ్డుకోవడం నిజం కాదా? అసలు ఈ ఒప్పందంతో తమకు సంబంధం లేదని సీమెన్స్ సంస్థ కోర్టులోనే చెప్పింది.

నాడు పవన్ రోడ్డుపై ఎందుకు దొర్లలేదు?

చంద్రబాబు అవినీతి అంకం వెలికితీతలో ఇది ఆరంభం మాత్రమే. ఫైబర్ గ్రిడ్, పట్టిసీమ, అమరావతి భూములు, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ అక్రమాలలో కూడా శిక్ష పడడం ఖాయం. చంద్రబాబుతోపాటు అచ్చెన్నాయుడు, లోకేశ్ దోచుకున్నట్లు ఆధారాలున్నాయి. త్వరలోనే వారు కూడా అరెస్టు కావడం ఖాయం. చంద్రబాబును అరెస్టు చేయడంతో దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ విలవిల్లాడుతూ రోడ్లపై దొర్లాడుతున్నారు. జనసేనను చంద్రసేనగా మార్చేశారు. కాపులకు జరిగిన అన్యాయంపై ప్రశ్నించేందుకు వచ్చిన చిరంజీవిని నాడు చంద్రబాబు అరెస్టు చేయించినప్పుడు పవన్ రోడ్డుపై ఎందుకు దొర్లలేదు?' అని రోజా అన్నారు.

అవినీతి కేసులో జైలుకెళ్తే బందా?

- టీడీపీ తీరుపై మంత్రి అంబటి మండిపాటు
- చంద్రబాబు అవినీతిలో పవన్ కళ్యాణ్‌కూ వాటా

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఖజానా నుంచి రూ.371 కోట్లు దోచేసిన కేసులో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించి జైలుకు పంపితే టీడీపీ, జనసేన, సీపీఐ, ఎల్లో మీడియా రాజకీయ కక్ష సాధింపు చర్యగా దుష్ప్రచారం చేస్తున్నాయని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. అవినీతి కేసులో కోర్టు రిమాండ్ విధిస్తే టీడీపీ బంద్‌కు పిలుపునివ్వడమేంటి? దానికి పవన్ కళ్యాణ్, సీపీఐ మద్దతు ఇవ్వడమేంటి? అని విస్మయం వ్యక్తంచేశారు. చంద్రబాబు ఆర్థిక నేరగాడు కాబట్టే ఆందోళన చేసేందుకు ప్రజలు ముందుకు రావడం లేదన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఆధారాలు లేకుండా కోర్టులు ఎలాంటి నిర్ణయాలూ తీసుకోవన్నది టీడీపీ నేతలు, ఎల్లో మీడియాకు తెలియదా? అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో సానుభూతి ద్వారా రాజకీయ లబ్ధి కోసం టీడీపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఎన్నికల ముందు చంద్రబాబును అరెస్టు చేయాల్సిన అవసరం మాకేంటి? అని ప్రశ్నించారు. అక్రమంగా ప్రజాధనాన్ని చంద్రబాబు దోచుకున్నారు కాబట్టి చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. మంత్రి అంబటి సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే... ఎన్నికలు ఇంత ఖరీదు కావటానికి కారణం చంద్రబాబే. స్కామ్‌లలో కాజేసిన డబ్బును ఎన్నికల్లో వెదజల్లి గెలుపొందడంపైనే చంద్రబాబుకు విశ్వాసం ఉంది. ప్రజలకు మేలు చేసి ఓట్లు పొందాలనే ఆలోచన ఆయనకు లేదు. ఉమ్మడి రాష్ట్రంలో, ఇప్పుడూ అనేక స్కాంలు చేశాడు. రాష్ట్రాన్ని లూటీ చేశాడు. సాక్ష్యాధారాలు చూశాక చంద్రబాబును కోర్టు రిమాండ్‌కు పంపింది. 2014–19 మధ్య చంద్రబాబు అమరావతి భూకుంభకోణం, అసైన్డు భూకుంభకోణం, ఫైబర్ నెట్ స్కాం, ఈఎస్ఐ స్కాం లాంటి అనేక కుంభకోణాలకు పాల్పడ్డాడు. వాటన్నింటిపై విచారణ చేయాల్సిన బాధ్యత చట్టంపై ఉంది. కలకాలం అందరినీ మోసం చేయలేరు. ఎక్కడో ఒకచోట మోసగాడు, నేరగాడు దొరికిపోవాల్సిందే. అలానే చంద్రబాబు దొరికిపోయాడు.

నాడు ఆరోపణలు చేసి నేడు మద్దతా?

తిక్కలోడు తిరునాళ్లకి వెళ్తే ఎక్కాదిగా సరిపోయిందనట్లుగా పవన్ కల్యాణ్ వ్యవహారం ఉంది. 2018లో ఆయన చంద్రబాబును వ్యతిరేకించారు. అవినీతిపరుడైన చంద్రబాబుపై చర్యలు తీసుకోవాలని గత ఎన్నికల్లో డిమాండ్ చేసిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఆయనకు మద్దతు తెలుపుతున్నారు. దీన్ని బట్టి చంద్రబాబు అవినీతిలో పవన్‌కూ భాగముందన్నది ప్రజలకు అర్థమవుతోంది.



మీ జీవితంలోని సంతోషం...
మీ ఆలోచనల నాణ్యత మీద ఆధారపడి ఉంటుంది.
– మార్కస్ అరీలియస్

సాక్షి

మంగళవారం, 12 సెప్టెంబర్ 2023

మనం సక్సెసే కానీ...

రష్యా అధ్యక్షుడు లేడు. చైనా అధినేత రాలేదు. ఉక్రెయిన్‌పై సాగుతున్న రష్యా యుద్ధంపై సభ్య దేశాల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. ఒక్కముక్కలో జీ20లో దేశాలు ఏకాభిప్రాయంతో కానీ, ఏక లక్ష్యంతో కానీ ఉన్నట్టు కనిపించదు. అయినా సరే, ఆదివారం ఢిల్లీలో ముగిసిన జీ20 దేశాల శిఖరాగ్ర సదస్సును ఘనంగా నిర్వహించి, అన్ని దేశాల తరఫునా ఎవరినీ నొప్పించని 83 పేరాల ఏకాభిప్రాయ ప్రకటన, అదీ ఒకరోజు ముందరే చేయించడమనేది అధ్యక్ష స్థానంలో ఉన్న భారత్‌కు అసాధారణ విజయమే! దక్షిణార్ధగోళంలోని వర్ధమాన, పేదదేశాల పక్షాన నిలబడి, వాటి ప్రయోజనాల్ని సదస్సు అజెండాలో మేళవింపజేయడమూ సామాన్యం కాదు. అలాగే బాలీలో నిరుడు అంగీకరించినదే అయినా, ఆఫ్రికన్ యూనియన్ (ఏయూ)కు జీ20లో శాశ్వత సభ్యత్వం ఇవ్వడం ద్వారా దక్షిణార్ధగోళానికి తాను సరైన ప్రతినిధినని భారత్ చాటుకున్నట్టయింది. అందుకే, వంతుల వారీగా ఏడాదికొకరికి వచ్చే అధ్యక్షహోదాయే అయినా... జీ20 సారథిగా భారత్ సక్సెస్ కావడం, ప్రపంచ వేదికలో మరో మెట్టు పైకి ఎక్కడం కచ్చితంగా సంతోషించదగ్గ సమయం, సందర్భం.

జీ20 సదస్సు ముగింపు వేళ చేసిన ఏకాభిప్రాయ ప్రకటనపై కొన్ని అసంతృప్తులూ లేకపోలేదు. ఉక్రెయిన్‌పై జరుగుతున్న యుద్ధంపై పాశ్చాత్య ప్రపంచం భావిస్తున్న రీతిలో రష్యాను నిలదీయ లేదనీ, నిరుటి బాలీ డిక్లరేషన్ నుంచి పక్కకు జరిగారనీ ఒక వర్గపు అసంతృప్తి. శిలాజ ఇంధనాల వినియోగాన్ని దశల వారీగా మానుకోవడంపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం స్థిరసంకల్పం, చిత్త శుద్ధి లేమిని తెలియజేస్తోందన్నది మరో ప్రధానమైన అసంతృప్తి. జీ20 సదస్సులు ఆ యా ఆతిథ్య దేశాల ఘనత చాటుకోవడానికే తప్ప, అసలు పనిలో తూతూమంత్రంగా మారాయనే నింద కొంత కాలంగా ఉన్నదే. అది నిజం కాదని నిరూపించుకోవాల్సిన బాధ్యత జీ20 వేదికదే! తాజా జీ20 లోనూ ప్రకటించిన లక్ష్యాలు బలహీనంగా ఉన్నాయనీ, ఇప్పటికే తాము కట్టుబడిన లక్ష్యాలనే దేశాధినేతలు వల్లెవేశారని విశ్లేషకుల మాట. వెరసి, నిర్వహణలో పేరుప్రఖ్యాతులతో ఇండియా హిట్టే కానీ, కీలక ప్రపంచ సమస్యలపై నిర్ణయంలోనే సదస్సు విఫలమైందనే మాట మిగిలిపోయింది.

చర్చించడానికి ఆహారభద్రత, ఋణాల ఉపశమనం, పర్యావరణ సంక్షోభం, వ్యాధులు, బ్యాంకింగ్ సంస్కరణలు, డిజిటల్ ప్రాథమిక వసతుల లాంటి అనేక ప్రపంచ సమస్యలున్నాయి. కానీ, వాటి పరిష్కారానికి అందరికీ అంగీకారయోగ్యమైన, విశ్వసనీయ కార్యాచరణ జీ20లో లోపించింది. పరస్పర భిన్నమైన 20 దేశాలు సమష్టి ఆశయాలు, ఆలోచనలు, అనుభవాల పునాదిపై కాక ఆర్థిక బలిమి ప్రాతిపదికన ఇలా ఒక వేదికపై చేరడమే అసలు చిక్కు. అందుకే, రానురానూ జీ20 వార్షిక సదస్సు ఫలితాలు ప్రశ్నార్థకమవుతున్నాయి. నిరుటి బాలీ సదస్సుతో పోలిస్తే తాజా సదస్సులో అగ్ర దేశాల మధ్య చీలికలు పెరిగాయి. దానివల్ల సదస్సు ప్రధాన అజెండా పట్టాలు తప్పకుండా భారత్ సంక్లిష్ట దౌత్యవిన్యాసంతో సమతూకం సాధించడం విశేషం. అలాగే, ఉక్రెయిన్ వ్యవహారంలో రష్యాపై ఆంక్షల లాంటివి సమర్థించడంలో దక్షిణార్ధగోళానికి సమస్యలున్నాయని పాశ్చాత్య ప్రపంచం గుర్తించింది. అందుకే, ఆ అంశంపైనే పట్టుబట్టి కూర్చోలేదు. రష్యా కన్నా చైనాతో పెను ముప్పు అని గ్రహించిన అమెరికా చివరకు దక్షిణార్ధగోళ దేశాల మాట ఆలకించేందుకు భారత్‌తో నడిచింది.

నిజానికి, వరుస ప్రకారమైతే జీ20 సదస్సు మన దేశంలో 2022లో, ఇండొనేషియాలో 2023లో జరగాలి. కానీ, ఇండొనేషియాను మన పాలకులు మెత్తగా ఒప్పించి, ఢిల్లీ స్థానంలో ముందుగా బాలీలో సదస్సు జరిపించారు. సార్వత్రిక ఎన్నికలకు వీలైనంత దగ్గరగా, ఈ ఏడాది మన వద్ద ఈ అంతర్జాతీయ సంబరం జరిగేలా చూడగలిగారు. అదెలా ఉన్నా ఈ సదస్సును దేశానికి గర్వకారణంగా చూపి, సానుకూల ఫలితాల దిశగా మలుచుకోవడంలో మనవాళ్ళు సఫలమయ్యారు. ఏడాది కాలంలో కేంద్ర పాలకులు దేశవ్యాప్తంగా 60కి పైగా పట్నాల్లో, 200కు పైగా సమావేశాలు జరిపారు. సాధారణంగా సామాన్యులకు సంబంధం లేని వ్యవహారంగా అనిపించే సదస్సును సైతం తెలివిగా ప్రజల్లోకి తీసుకువెళ్ళారు. ఈ సదస్సు విజయాన్ని వచ్చే ఎన్నికల్లో సహజంగానే మరింత వాడుకుంటారు. అయితే, సహకార సమాఖ్య విధానాన్నీ, ప్రత్యర్థి పక్షాల మధ్య ద్విపాక్షికతనూ నమ్మడం వల్లే ఈ సదస్సు ఘనత సాధ్యమైందని సర్కారు వారి మాట. దేశంలోని ప్రతిపక్షాలను కలుపుకొనిపోని వారి నోట ఈ మాట రావడం విడ్డూరమే. సహకార సమాఖ్య లాంటివి పెద్దలు నిజంగా నమ్ముతున్నదీ లేనిదీ నవంబర్ చివర 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ నియామకం, సంఘం నియమావళి ఖరారు వేళ తెలుస్తుంది.

ఏమైనా, ఐరాస సర్వప్రతినిధి సభ దాదాపు అచేతనంగా మారిన పరిస్థితుల్లో జీ20 మరింత చొరవ తీసుకోవాలని పరిశీలకుల భావన. అందుకే, ఉక్రెయిన్ యుద్ధ సమస్యలు, పర్యావరణ సంక్షోభానికి కారణమైన శిలాజ ఇంధనాలపై చర్యలు చర్చించకుండానే సదస్సు ముగిసిపోవడంతో నిరుత్సాహపడుతున్నారు. కానీ, సభ్యదేశాల మధ్య సంక్లిష్టతలతో ఆ ఘనత ఒక్క భారత్ చేతుల్లోనూ లేదని గ్రహించాలి. మొత్తం 19 దేశాలు, యూరోపియన్ యూనియన్‌తో కూడిన జీ20 తాజా ఆఫ్రికన్ యూనియన్ చేరికతో వచ్చే 2024లో బ్రెజిల్ సదస్సు నాటికి జీ21గా పలకరించనుంది. ఆ పై ఏడాది దక్షిణాఫ్రికాలో సమావేశం కానుంది. భారత్ అధ్యక్షతన సాధించిన పురోగతిని ముందుకు తీసుకువెళ్ళడానికే కాదు, అంతర్జాతీయంగా జీ20 ప్రాసంగికతను నిలపడానికీ ఆ రెండు సదస్సులూ కీలకం. ఇప్పటికైతే, ఇండొనేసియా, జర్మనీల కన్నా అనేక రెట్ల ఖర్చుతో ఢిల్లీ సదస్సు జరిగిందని ఆరోపణలు వస్తున్నప్పటికీ, 'విశ్వగురువు' ప్రచారం మరింత ఊపందుకున్నందుకు సంబరపడాలి.

నాటకీయత లేని యాక్షన్ సినిమా

కామెంట్



కరణ్ థాపర్


ఒక దౌత్యవేత్త జీవితంలోని ఘటనలు పూర్తిస్థాయి యాక్షన్ సినిమాకేమీ తీసిపోవు. ముఖ్యంగా ఆయన లెబనాన్ అంతర్యుద్ధ కాలంలో చురుగ్గా ఉన్నవాడూ; మాజీ ప్రధానులు బేనజీర్ భుట్టో, రాజీవ్ గాంధీ మధ్య రహస్య సందేశాల వినిమయానికి తోడ్పడ్డవాడూ అయినప్పుడు! అందుకే 'ఎ డిప్లొమాట్స్ గార్డెన్' పుస్తకం ఉత్కంఠభరితంగా ఉంటుందనుకుంటాం. కానీ విషయ తీవ్రత ఎలాంటిదైనా, చలిమంట కాచుకుంటూ, నింపాదిగా మాట్లాడే శైలి అఫ్తాబ్ సేఠ్‌ది. ఢిల్లీలోని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు దశాబ్దాల పాటు నివేదికలను డిక్టేటు చేసిన ప్రభావం ఆయన శైలిలో స్పష్టంగా కనబడుతుంది. దౌత్యవేత్తగా ఆయన మనసు ఎప్పుడూ నాటకీయతను శూన్యం చేయడంపైనే ఉంటుందని ఈ పుస్తకం చెబుతుంది.

ఒక భారతీయ దౌత్యవేత్త జీవితం ఎలా ఉంటుందోనని మీకు ఎప్పుడైనా అనిపించి ఉంటే, ఒక్కసారి అఫ్తాబ్ సేఠ్ జ్ఞాపకాల్లోకి తొంగిచూడండి. లెబనాన్ అంతర్యుద్ధ కాలంలో ఆయన చురుగ్గా ఉన్నారు, పాకిస్తాన్ మాజీ ప్రధాని బేనజీర్ భుట్టో, భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ మధ్య రహస్య సందేశాల వినిమయానికి తోడ్పడ్డారు. అంతేనా? జపాన్ రాజ కుటుంబంతో విందులారగించడం మొదలుకొని, మంచానపడ్డ గ్రీకు ప్రధాన మంత్రులను ఆసుపత్రుల్లో పలకరించడం, మయన్మార్ విప్లవ నేత ఆంగ్‌సాన్ సూకీ దివంగత భర్త మైకేల్ ఆరిస్‌తో కలిసి కుట్రలు పన్నడం వరకూ దౌత్యవేత్తగా అఫ్తాబ్ చేసిన పనులు ఎన్నో!


ఈ ఘటనలన్నీ పూర్తిస్థాయి యాక్షన్ సినిమాకేమీ తీసిపోవు. బహుశా ఇవి ఆయన 'అడ్రినలిన్'ను ఎప్పుడూ పైపైకి ఎగబాకించి ఉంటాయి కూడా. కానీ సుశిక్షితుడైన దౌత్యవేత్తగా అఫ్తాబ్ రాసిన 'ఎ డిప్లొమాట్స్ గార్డెన్' పుస్తకం ఇలాంటి గాథలను పల్లెసీమల రోడ్ల మీద తిరిగే కారు వేగంలా నెమ్మదిగా వివరిస్తుంది. విషయం చాలా గొప్పది కావచ్చు కానీ చెప్పే శైలి మాత్రం ఆచితూచి, ప్రశాంతంగా ఉంటుంది. విషయ తీవ్రత ఎంత ఉన్నా, చలిమంట కాచుకుంటూ, నింపాదిగా నోట్లోని చుట్టతో పొగలు ఊదుకుంటూ, దేనికీ చలించని వ్యక్తిగా అఫ్తాబ్‌ను మనం ఊహించుకోవచ్చు.

పుస్తకంలోని చాలా వాక్యాలు 'ఒకసారి గుర్తు చేసుకుంటే', 'గుర్తుంచుకోవాల్సిన అంశం', 'ఇంతకుముందే చెప్పినట్లు', 'దీని గురించి క్లుప్తంగా చెప్పుకుని' వంటి పదబంధాలతో మొదలవుతాయి. 'దీని వివరాలు మనల్ని నిలిపి ఉంచకూడదు' అన్నదీ తరచుగా కనిపిస్తుంది. కొన్నిసార్లు అధ్యాయాల మధ్యలో 'ఇప్పుడు మనం అసలు కథలోకి వెళితే' అని ఉంటుంది. దశాబ్దాలపాటు ఢిల్లీలోని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు నివేదికలను డిక్టేటు చేసిన ప్రభావం స్పష్టంగా కనబడుతుంది.

కానీ తలుచుకుంటే అఫ్తాబ్ సేఠ్ భాష గాల్లోకి లేస్తుంది, ఆయన విశేషణాలు ఆకాశాన్ని అంటుతాయి. "భయంకరమైన తరుచుదనంతో కాండ్రించి ఉమ్మడం ఆయనకున్న ఒకానొక ఇబ్బందికరమైన అలవాటు. అదృష్టం ఏమిటంటే, ఆ ఉమ్మడమేదో తన కుర్చీ దగ్గరగానే పెట్టుకున్న ఉమ్మితొట్టెలోకి పడేలా చాకచక్యంగా ఊసేవాడు." సేఠ్ భాషకు మచ్చుకు ఒక ఉదాహరణ ఇది. జాగ్రత్తగా తూచినట్టుండే ఆయన శైలి అప్పటికి ఆదరణీయం కాకపోయినా, ఆయన చేసిన పనులు, కలిసిన మనుషుల గురించి తెలిస్తే మాత్రం సంబరపడేన్ని కథలు ఉన్నాయనిపిస్తుంది.



బేనజీర్ భుట్టో, రాజీవ్ గాంధీ



చిన్న ఉదాహరణ చూద్దాం. లెబనాన్ అంతర్యుద్ధం తీవ్రంగా జరుగుతున్న కాలంలో అఫ్తాబ్ బీరూట్‌లో ఉన్నారు. ఒక పక్క బాంబుల వర్షం, ఇంకోపక్క కుప్ప కూలుతున్న భవనాలు... వీటన్నింటి మధ్యలో సేఠ్ తన ఫ్లాట్ ముంగిట్లో నిద్ర పోయారట. పడే బాంబు ఏదో నేరుగా భవనం మీద పడవచ్చునన్న అంచనాతో! వాళ్ల డ్రైవర్ అలీ "కదులుతున్న దేనిమీదికైనా విచ్చలవిడిగా దూసుకొస్తున్న తుపాకీ గుళ్ల నుంచి తప్పించేందుకు కారును వాయువేగంతో ముందుకు ఉరికించాడు."

అఫ్తాబ్ భార్య పోలా అప్పుడు రెండోసారి గర్భవతిగా ఉన్నారు. పురిటినొప్పులు తెల్లవారుఝామున మూడు గంటల సమయంలో మొదలయ్యాయి. ఆ సమయంలో అంబులెన్స్ కూడా అందుబాటులో లేదు. తానే సొంతంగా కాన్పు చేసేందుకు కూడా సేఠ్ సిద్ధమయ్యారు. అయితే, అదృష్టవశాత్తూ ఆ అవసరం రాలేదు.

ఈ పుస్తకం మొత్తం ఉత్కంఠభరితంగా ఉంటుంది కానీ ఈ విషయాలన్నీ చెప్పే విషయంలో అఫ్తాబ్ చాలా డిప్లొమాటిక్‌గా వ్యవహరించారని చెప్పాలి. బేనజీర్ భుట్టో విషయాలు చెప్పేటప్పుడు ఆయనెంత జాగ్రత్తగా వ్యవహరించారన్నది స్పష్టంగా తెలుస్తుంది. బేనజీర్ ఓ అద్భుతమైన వ్యక్తి. ఆమె గురించి అఫ్తాబ్‌కూ బాగా తెలుసు. కరాచీ, లార్కానాల్లోని భుట్టో ఇళ్లకు ఆయన వెళ్లేవారు. అలాగే మలేసియా, న్యూఢిల్లీల్లోని హోటళ్లలోనూ సమావేశాలు, చర్చలు నడిచేవి. రాజీవ్ గాంధీ నుంచి వచ్చే రహస్య సందేశాలు ఇలాంటి సమావేశాల్లోనే చేతులు మారేవి. కానీ ఈ సందేశాల గురించి ఆయన మనోహరమైన మౌనం పాటిస్తారు.

ఈ అధ్యాయం ఎంత అద్భుతంగా మారి ఉండేది! కానీ ఏం చేస్తాం? తన వజ్రాలను సానపెట్టడం కాకుండా, వాటిని ఇలాంటి వాక్యాలతో రాళ్లలా మార్చేశారు. "మాజీ ప్రధాని వ్యక్తిత్వం గురించి తమకు తెలిసిన అరుదైన విషయాలను రోషన్(అఫ్తాబ్ సోదరుడు)తో భుట్టోలు పంచుకున్నారు" అని రాస్తారు. కానీ ఆ విషయాలు ఏమిటో వెల్లడించరు.

బేనజీర్‌తో జరిగిన ఒక సమావేశం గురించి ఆయన రాశారు. ఇందులో బేనజీర్ మిలిటరీ కార్యదర్శి ఆ సమావేశాన్ని అడ్డుకునేందుకు "తప్పుడు అఫ్తాబ్" గురించి చెబుతారు. ప్రతిగా బేనజీర్ "రహస్యంగా వినే మైక్రోఫోన్లను గందరగోళ పరిచేందుకు రేడియో సౌండ్ పెంచారు" అని రాశారు. దౌత్యవేత్తగా ఆయన మనసు నాటకీయతను సున్నా చేయడంపైనే ఉంటుంది. "నింపాదిగా భోంచేస్తూ పాకిస్తాన్ స్థానిక రాజకీయ పరిస్థితిపై కూడా చర్చించాము" అని రాయడం ఇలాంటిదే.

అదృష్టం ఏమిటంటే, కొన్ని సందర్భాల్లో అఫ్తాబ్ విచక్షణకు కాకుండా, ధైర్యానికి ప్రాధాన్యం ఇవ్వడం. ఇలాంటి సందర్భాల్లోనే నియంత్రణలో నడిపే ఆయన వాక్యాలు సంకెళ్ల నుంచి తప్పించుకుంటాయి. కౌలాలంపూర్‌లోని ఓ రెస్టారెంట్‌లో బేనజీర్‌తో ఇద్దరిద్దరుగా భోంచేసిన కథ ఈ కోవకు చెందుతుంది. వారిద్దరూ ఒక టేబుల్ మీద ఉండగా, వారి సంభాషణను చెవులు రిక్కించినా వినలేనంతగా పదిహేను అడుగుల దూరంలో ఉన్న పాకిస్తాన్ విదేశాంగ మంత్రి గుడ్లగూబలా చూస్తూ ఉండటం!

ప్రధానిగా పాక్ అధ్యక్షుడితో తాను ఎదుర్కొంటున్న సమస్యలేమిటో ఆమె వివరంగా అఫ్తాబ్‌కు తెలిపిన సందర్భమిది. దాంతో పాటే "ఆయన రహస్య కార్యకలాపాల జాబితా" గురించి కూడా చర్చకు రావడం ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం. ఆ క్షణంలోనే విదేశాంగ మంత్రి యాకూబ్ ఖాన్‌ను విస్మరించి చాలా సమయమైందని బేనజీర్ అనుకున్నారో ఏమో, తమతో కలవమన్నట్టుగా ఆయన వైపు చూస్తూ సంజ్ఞ చేశారనీ, అలాగే మాట్లాడుతున్న అంశాన్ని కూడా "ఏదేదో ఊహించుకునే యాకూబ్ మనసుకు సాంత్వన ఇచ్చేలా" పాకిస్తాన్‌లో ఎవరికైనా చిర్రెత్తించే 'జిన్నా హౌస్' వైపు మళ్లించారనీ అఫ్తాబ్ రాశారు.

ఇలాంటి పూవులే అఫ్తాబ్ సేఠ్ ఉద్యానవనంలో మనల్ని ఉల్లాసపరుస్తాయి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎవరి విజయం?



కోవిడ్ టీకాలకు పెద్ద వ్యతిరేకి అయిన నొవాక్ జొకోవిచ్ యూఎస్ ఓపెన్ టెన్నిస్ టైటిల్ గెలుచుకున్నారు. టీకా వేసుకోని కారణంగా గతేడాది ఆయన్ని ఇదే యూఎస్ ఓపెన్ ఆడకుండా చేశారు. ఈ యేటి పోటీలకు టీకా కంపెనీ 'మాడెర్నా' స్పాన్సర్‌గా వ్యవహరించడం అసలైన వక్రోక్తి!

– మారియో నాఫాల్, హోస్ట్

ఎలా మారింది?



దేశం పేరు గురించి ప్రతిపక్షాలు, బీజేపీ పోట్లాడుతున్నాయి. ఒకప్పుడు ఇదే బీజేపీ ఈ విషయంలో ఉత్తరప్రదేశ్ శాసనసభ నుంచి వాకౌట్ చేసింది. 2004లో ముఖ్యమంత్రి ములాయం సింగ్ యాదవ్ 'ఇండియా అనే భారత్' కాకుండా, 'భారత్ అనే ఇండియా' అని రాజ్యాంగంలో మార్చాలని అసెంబ్లీలో తీర్మానం తెచ్చారు. అది పాస్ అయింది కూడా!

– సాయంతన్ బిశ్వాస్, కాలమిస్ట్

ఎవరికి పట్టింది?



కొంతకాలంగా హాలీవుడ్ నటులు సమ్మెలో ఉన్నారు. కానీ ఏమీ జరగనట్టే ప్రపంచం ముందుకెళ్లిపోయింది. ఎందుకంటే, ఎవరికీ ఖాతరు లేదు. మీరు ప్రేక్షకుల నుంచి ఎంత దూరం జరిగిపోయారంటే, కాలి బూడిదైనా వాళ్లు పట్టించుకోరు.

– మాథ్యూ మార్స్‌డెన్, హాలీవుడ్ నటుడు

చేజేతులా...



చిత్రాల్ (పాకిస్తాన్)లో పాకిస్తాన్ జెండాల మీదికి రాళ్లు విసిరారు తాలిబన్లు (ఇస్లాం శ్రద్ధాపూరిత విద్యార్థులు). సైతాను, లేదా తిరుగుబోతైన స్త్రీ మీదకు రాళ్లు విసరాలని షరియా చెబుతుంది. ఇప్పుడు పాకిస్తాన్ ఏమిటి? సైతానా, తిరుగుబోతా? రెండూనా?

– దివ్య కుమార్ సోతీ, కాలమిస్ట్

వందనం!



ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ వేతనం నెలకు కేవలం రూ. 2.5 లక్షలు. ఇది సమంజసమేనా? కానీ ఇట్లాంటి మనుషులను డబ్బును మించి పరిశోధన, దేశ ప్రతిష్ఠ లాంటి అంశాలు ప్రేరేపిస్తాయని మనం అర్థం చేసుకోవాలి. ఇలా అంకితమై పనిచేసేవారికి నా శిరస్సు వంచుతాను.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

భాషతో బంధం

జాతి నిర్మాణంలో భాష పాత్ర చాలా గొప్పది. అనేక విషయాలను అధ్యయనం చేయడం, విజ్ఞాన సాంకేతిక తదితర ఉన్నత రంగాల్లో ప్రావీణ్యత పొందడం ఒక భాష ద్వారానే సాధ్యపడుతుంది. ఒక వ్యక్తి సమగ్ర వికాసానికి భాష ఆయువుపట్టు. అదే భాష దేశాన్ని ఒకే తాటిపై నిలబడేలా, జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించినప్పుడు ఆ భాష 'జాతీయ భాష'గా నీరాజనాలు అందుకుంటుంది. ఆ పాత్రను అక్షరాలా 'హిందీ' భాష నిర్వర్తించింది, నిర్వర్తిస్తోంది కూడా.

భారత స్వాతంత్య్ర సమరంలో ప్రజలను జాగృత పరచడంలో క్రియాశీల పాత్ర పోషించి, ప్రపంచంలోనే అత్యధికులు మాట్లాడే రెండవ భాషగా వికసించిన భాష హిందీని కొందరు ఇంకా పరాయి భాషగా భావించడం దురదృష్టకరం. హిందీ ఒక భాష మాత్రమే కాదు, మన దేశ సమైక్యతా చిహ్నం కూడా! దేశంలో హిందీ మాట్లాడేవారు, అర్థం చేసుకునే వారు అధికంగా ఉండడం చేత కేంద్ర ప్రభుత్వము హిందీని అధికార భాషగా ప్రకటించింది.

ప్రస్తుతం పదికి పైగా రాష్ట్రాలలో ప్రథమ భాషగా, మిగతా రాష్ట్రాల్లో ద్వితీయ భాషగా హిందీ ప్రచలనములో ఉన్నప్పటికీ, ఆంగ్ల భాషపై మోజుతో హిందీని నిర్లక్ష్యం చేస్తున్నారు. గాంధీజీ స్వయంగా దక్షిణ భారతదేశంలో ఈ భాష ప్రచార కార్యక్రమానికి 'దక్షిణ భారత హిందీ ప్రచార సభ' స్థాపనతో శ్రీకారం చుట్టారు. ఆ మహాత్ముని ఆశయాలను అనుసరిస్తున్న మనం ఆయన విస్తరింపచేసిన భాషను తగిన విధంగా ఆదరించలేకపోవడం విచారకరం. వివిధ దేశాల్లో ఎన్నో విశ్వవిద్యాలయాల్లో హిందీని పాఠ్యాంశంగా బోధించడం గమనార్హం. కానీ, మన దేశంలో మాత్రం అంతగా హిందీకి ప్రాముఖ్యం ఇవ్వడం లేదు.

'త్రిభాషా సూత్రా'న్ని అనుసరించి మాతృ భాష ప్రథమ భాషగా ద్వితీయ భాషగా హిందీని, తృతీయ భాషగా ఆంగ్లం. పాఠశాల విద్యార్థులకు బోధించాలని కేంద్రం నిర్దేశించింది. కానీ కొన్ని రాష్ట్రాలు ముఖ్యంగా తమిళనాడు లాంటి దక్షిణాది రాష్ట్రాలు ఈ సూత్రాన్ని వ్యతిరేకిస్తున్నాయి. పరాయి భాషలు అవసరానికి ఎన్ని నేర్చుకున్నా, మన మాతృ భాష, అధికార భాషలను నిర్లక్ష్యం చేయరాదు.

– భైతి దుర్గయ్య, హిందీ ఉపాధ్యాయుడు
(సెప్టెంబర్ 14 'హిందీ దినోత్సవం')

ప్రజా పంపిణీ వ్యవస్థలో ఇదో విప్లవం

అభిప్రాయం



కాట్రగడ్డ సురేష్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థలో తెచ్చిన మార్పులు అందరికీ ఆహారం, ఇతర నిత్యావసరాలు అందాలన్న ప్రభుత్వ ఆశయాన్ని మరింత ముందుకు తీసుకుపోతున్నాయి. ఇప్పటికే ఇంటింటికీ నిత్యావసర సరుకుల పంపిణీ విధానం ప్రజా మన్ననలు పొందింది. వలంటీరు వ్యవస్థ పటిష్ఠంగా ఉండటం, సచివాలయాల పాలన ప్రజలకు అతి దగ్గరగా కొనసాగుతుండటం వల్ల ప్రజాపంపిణీ మరింత ప్రయోజకత్వాన్ని సంతరించుకొంది. దీంతో ప్రజల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రతి నెలా మొదటి వారంలోనే చౌక డిపోల నుంచి ఇంటిముందుకు ప్రత్యేక సంచార వాహనాలు సరుకులు తీసుకురావడం దేశంలో ఇదే మొదటిసారి. కుటుంబంలో ఏ ఒక్క లబ్ధిదారుడయినా రేషన్ సరుకులు తీసుకోవచ్చు. పెద్దలు కుటుంబ పోషణ కోసం ఇంటి నుంచి పని చేసే ప్రదేశాలకు వెళ్ళిన సమయాల్లో పిల్లలు సైతం ఈ సంచార వాహనాల నుంచి సరుకులు తీసుకోవచ్చు. చిన్నా చితకా కూలి పనులు చేసుకు బతికే పేదల చెంతకు సత్వర సేవలు అందాలనే ప్రభుత్వ లక్ష్యం కూడా ఇక్కడ నెరవేరుతుంది.

'జాతీయ ఆహార భద్రతా చట్టం 2013' పోషకాహార భద్రతను అందించడం లక్ష్యంగా సాగుతోంది. ప్రజలు ఆరోగ్యంగా జీవించడానికి ఈ చట్టం ఉపకరిస్తుంది. సరసమైన ధరలకు తగిన పరిమాణంలో నాణ్యమైన ఆహారాన్ని అందించలసిన బాధ్యత ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల సంస్థ బియ్యం, గోధుమలను భారత ఆహార సంస్థ నుంచీ, చక్కెరను పరిశ్రమల నుంచీ సేకరించి ప్రజలకు చేరుస్తోంది. చౌక ధరల దుకాణాలు ప్రజాపంపిణీ ప్రక్రియలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. మిల్లుల నుంచి మండల స్థాయి నిల్వ కేంద్రాలకు 'భారత ఆహారసంస్థ' సరకు రవాణా చేస్తుంది. ఆ సరుకు నిల్వ కేంద్రాల నుంచి లబ్ధిదారుల ఇంటి మెట్ల వరకు సరుకులు చేర్చడం ద్వారా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం నూతన అధ్యాయం సృష్టించింది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లోనూ, విపత్తుల లోనూ ఆహారం, వస్తువుల పంపిణీ చౌకధరల దుకాణాల నుంచే జరుగుతోంది. కోవిడ్ మహమ్మారి కాలంలో ఈ దుకాణాలు ప్రజలకు ఆహారాన్ని అందించడంలో అవిశ్రాంతంగా కృషి చేశాయి. కొన్ని జిల్లాల్లో 25 కిలోమీటర్ల పరిధిలోని భారత ఆహార సంస్థ గోడౌన్ల నుంచి చౌకధరల దుకాణాలకు నేరుగా ఆహార ధాన్యాల తరలింపు కూడా జరుగుతోంది. తొలిదశ రవాణా, నిర్వహణ ఛార్జీలను నివారించడం ద్వారా విజయవాడ, విశాఖ పట్నంలలో చౌక ధరల దుకాణాల డీలర్లు నేరుగా మండల స్థాయి సరుకు నిల్వ కేంద్రాల నుంచి సరుకు తీసుకెళ్తున్నారు. ఇలా భారత ఆహారసంస్థ ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ ఒక కారణం. గ్రామ స్థాయి నుంచి ఆంధ్రప్రదేశ్ పాలనా యంత్రాంగంలో చోటు చేసుకున్న మార్పులు ఉద్యోగుల్నీ, అధికారులనూ పజలపక్షం నిలబెట్టాయని చెప్పొచ్చు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజాపంపిణీ వ్యవస్థలో సంచార వాహనాల ద్వారా ఇంటింటికీ సరుకు పంపిణీ మొదలయిన తర్వాత లబ్ధిదారులు పదిశాతం మంది పెరిగారని ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీనిని బట్టి సంచార వాహనాల ద్వారా ప్రజాపంపిణీ జనామోదం పొందిందని అర్థమవుతుంది. ప్రజాపంపిణీ వ్యవస్థను 'సమగ్ర శిశు అభివృద్ధి పథకం', 'మధ్యాహ్న భోజన పథకా'లకు కూడా విస్తరించారు. దీనితో సకాలంలో లబ్ధిదారులకు ఆహారపదార్థాలు అందించ గలుగుతున్నారు. 2023–2024 ఆర్థిక సంవత్సరంలో ఆహార, పౌర సరఫరాల శాఖకు రూ. 3,725 కోట్లు కేటాయించారు. ఇటువంటి పథకాలు, ప్రభుత్వ విధానాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో 'ఆహార భద్రత' స్థాయి పెరిగింది. గతంలో కంటే పేదలకు ప్రభుత్వం పట్ల మనస్సులో విశ్వాసం నిండింది.

భారత ప్రభుత్వ 'వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ' మంత్రిత్వశాఖ ప్రత్యేక ప్రకటన ద్వారా రాష్ట్ర ఆహార కమిషన్ 'జాతీయ ఆహార భద్రతా చట్టం, 2013'లోని సెక్షన్ 16 అమలును సమీక్షిస్తుంది. నేటి 'ఆంధ్రప్రదేశ్ ఆహార కమిషన్' దాని పరిధిలో శక్తిమంతంగా పనిచేస్తోంది. ఆహార భద్రత, హక్కుల పట్ల ప్రజలకు అవగాహన కలిగిస్తోంది. అధికారులు, ఉద్యోగులు సక్రమంగా పనిచేసే విధంగా పర్యవేక్షిస్తోంది. ప్రజా ఫిర్యాదులకు వెంటనే స్పందించి పరిష్కరిస్తోంది. అంగన్ వాడీ కేంద్రాల్నీ, ప్రభుత్వ గురుకులాల్నీ, వసతి గృహాలనూ తనిఖీ చేసి అక్కడ విద్యార్థులకు పెడుతున్న ఆహారం, వసతుల్ని పర్యవేక్షిస్తోంది. ఈ విద్యాలయాలు, హాస్టళ్లకు నాణ్యమైన ఆహార పదార్థాలు సక్రమంగా సరఫరా జరుగుతుందో లేదో తనిఖీ చేస్తోంది. గతంలో కంటే ఆంధ్రప్రదేశ్‌లో భారత ఆహార భద్రతాచట్టం పటిష్ఠంగా అమలు జరుగుతుందని చెప్పొచ్చు. దీని కోసం స్థానిక ఏపీ ఆహార కమిషన్ అన్ని విధాలా సమర్థంగా పనిచేస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వం 'వలంటీర్' వ్యవస్థను ప్రవేశపెట్టి తద్వారా 'ఇంటిదగ్గరకే ప్రభుత్వ పాలన' అనే లక్ష్యాన్ని అక్షరాలా సాధించిందని చెప్పడానికి ప్రజా పంపిణీ వ్యవస్థలో వచ్చిన మార్పులే నిదర్శనం. ప్రభుత్వ సేవలు భౌతిక రూపంలో ఇంటిముందుకు నడిచి రావడం కన్నా ఏ ప్రజా పంపిణీ వ్యవస్థ అయినా సాధించగల విజయం ఏముంది?

వ్యాసకర్త ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ ఏపీ అధ్యక్షులు | 94412 64249

సహజ జీవన గమనం

1. అసలైన మహత్యం

జెన్ గురువు 'బన్‌కెయి' ఓ నాడు బౌద్ధ విహారంలో ప్రవచనం చేస్తుండగా వేరే బౌద్ధ శాఖకు చెందిన ఒకాయన అక్కడకు వచ్చి సభలో పెద్దగా మాట్లాడుతూ అలజడి సృష్టించాడు. బన్‌కెయికి వచ్చిన మంచిపేరంటే అతడికి అసూయ.

బన్‌కెయి మాట్లాడటం ఆపి గొడవకు కారణం ఏమిటని అడిగాడు. వచ్చిన ఆ ఆగంతకుడు అన్నాడు: 'మా శాఖను స్థాపించిన గురువు ఎటువంటి గొప్ప మాహాత్మ్యాలు చెయ్యగలడంటే, నదికి ఇవతల గట్టు మీద కుంచె పుచ్చుకొని ఉండి, అవతల గట్టుమీద ఎవరైనా అట్ట పుచ్చుకొని ఉంటే, దానిమీద ఆ కుంచెతో బొమ్మ గీయగలడు. నీవు అలాంటి మహత్తు చెయ్యగలవా?'



జ్యోతిర్మయం

బన్‌కెయి సమాధానం చెప్పాడు: 'అలాంటి తంత్రం మీ గురువు చెయ్యగలడేమో కాని, అది జెన్ పద్ధతి కాదు. నేను చేసే మహత్తు ఏమిటంటే, నాకు ఆకలైనప్పుడు తింటాను. దాహమైనప్పుడు తాగుతాను.'

2. శుభదాయకం

ఓ ధనవంతుడు, జెన్ గురువు 'సెన్‌గయి'ని అడిగాడు, తన వంశాభివృద్ధికి శుభదాయకమైన వాక్యం ఒకటి వ్రాసివ్వమనీ, దాన్ని తరతరాలుగా దాచి ఉంచుకొంటామనీ!

సెన్‌గయి పెద్ద కాగితం ఒక దాన్ని తెప్పించుకొని, దాని మీద ఇలా రాశాడు: 'తండ్రి చనిపోతాడు, కొడుకు చనిపోతాడు, మనవడు చనిపోతాడు.'

ధనవంతుడికి కోపం వచ్చింది. 'నేను నిన్ను నా కుటుంబం ఆనందంగా ఉండటానికి ఏదైనా రాసివ్వమని అడిగాను. నీవేంటి ఇలా నన్ను ఎగతాళి పట్టిస్తున్నావు?'

'ఇందులో ఎగతాళి ఏం లేదు' వివరించాడు సెన్‌గయి. 'నీవు చనిపోకముందే నీ కొడుకు చనిపోయినాడనుకో. అది నిన్ను ఎంతగానో బాధిస్తుంది. నీకంటే, నీ కొడుకు కంటే ముందే, నీ మనవడు చనిపోయినాడనుకో, మీ ఇద్దరి గుండె పగిలిపోతుంది. అలా కాకుండా, నీ కుటుంబం తరతరాలుగా నేను పేర్కొన్న వరుసలో గతించినారనుకో, అది సహజమైన జీవన గమనం అవుతుంది. దీన్ని నేను శుభదాయకం అంటాను.'

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** బ.త్రయోదశి రా.2.00 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** ఆశ్లేష రా.12.01 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** ఉ.11.38 నుండి 1.23 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.15 నుండి 9.04 వరకు, తదుపరి రా.10.45 నుండి 11.32 వరకు, **అమృతఘడియలు:** రా.10.13 నుండి 12.01 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.50, **సూర్యాస్తమయం:** 6.04.

క్లుప్తంగా...

16 నుంచి కడప పెద్దదర్గాలో ఉరుసు ఉత్సవం

కడప కల్చరల్: వైఎస్సార్ జిల్లా కడప నగరంలోని ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రం, పర్యాటక ప్రాంతమైన పెద్దదర్గాలో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు హజరత్ ఖ్వాజా సయ్యద్ షా అమీనుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిష్టివుల్ ఖాద్రీ సాహెబ్ ఉరుసు ఉత్సవం నిర్వహించనున్నట్లు దర్గా ముజావర్ అమీర్ సోమవారం తెలిపారు. ఇందులో భాగంగా 16న గంధం కార్యక్రమం, 17న ఉరుసు ఉత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దర్గా ఆవరణలో ప్రముఖ గాయకులతో ఖవ్వాలీ కచేరి ఉంటుందని తెలిపారు. 18న తహలీల్ ఫాతెహాతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

వరుణ యాగంతో రాష్ట్రం, దేశం సుభిక్షం

- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి
- ముగిసిన మహాశాంతి వరుణ యాగం



గోపూజలో టీటీడీ చైర్మన్ భూమన

చంద్రగిరి(తిరుపతి జిల్లా): సకాలంలో వర్షాలు కురిసి రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతోనే టీటీడీ వరుణ యాగం నిర్వహించినట్లు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చెప్పారు. శ్రీనివాస మంగాపురం ఆలయంలో అష్టోత్తర శత కుండాత్మక మహా శాంతి వరుణ యాగం సోమవారం ముగిసింది. ఈవో ఏవీ ధర్మారెడ్డితో కలిసి భూమన గోపూజ చేశారు. అనంతరం మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణాకరరెడ్డి మీడియాతో మాట్లాడారు. వరుణుడిని ప్రసన్నం చేసుకునేందుకు మూడు రోజుల పాటు ఈ యాగం నిర్వహించినట్లు తెలిపారు. శ్రీవారి ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు పడుతున్నాయని వివరించారు. మూడు రాష్ట్రాలకు చెందిన 210 మంది రుత్వికులు వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం యాగం నిర్వహించారని చెప్పారు.

మాజీ మావోయిస్టుకు భారీ ఆర్థిక సాయం

- రూ.16.55 లక్షల చెక్కు అందజేత




జలంధరరెడ్డికి రూ.16.55 లక్షల చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: మావోయిస్టు ఉద్యమాన్ని వీడి జనజీవన ప్రవంతిలో కలిసేందుకు 2021లో విశాఖపట్నం పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు కీలకనేత ఎం.జలంధరరెడ్డికి ప్రధానమంత్రి ఉపాధి హామీ కార్యక్రమం కింద భారీ ఆర్థిక సాయం మంజూరైంది. వరంగల్ జిల్లా సిద్దిపేటకు చెందిన జలంధరరెడ్డికి సోమవారం అల్లూరి సీతారామరాజు కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ రూ.16.55 లక్షల ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో జలంధరరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రూ.4.13 లక్షల సబ్సిడీ భరిస్తుందన్నారు. ట్రాక్టర్ కొనుగోలు చేసుకుంటే జీవనోపాధికి పనులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఎల్.భానుచందర్, ఎల్‌డీఎం రవితేజ, ఫీల్డ్ ఆఫీసర్ ఆదినారాయణ పాల్గొన్నారు. జలంధర్‌రెడ్డి అలియాస్ కృష్ణ వరంగల్ జిల్లా సిద్దిపేటకు చెందినవారు. 2021లో విశాఖ డీఐజీ ఎదుట లొంగిపోవడంతో ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోకి వచ్చే ఏజెన్సీ కేంద్రం పాడేరులో పునరావాసం కల్పించి, రూ.16.55 లక్షల ఆర్థిక సాయం అందజేశారు.

తెలంగాణ

సీడీఎఫ్‌డీ శాస్త్రవేత్తకు శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డు!



సాక్షి, హైదరాబాద్: పరిశోధన రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డుకు హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్(సీడీఎఫ్‌డీ) శాస్త్రవేత్త డాక్టర్ మద్దిక సుబ్బారెడ్డి ఎంపికయ్యారు. సీడీఎఫ్‌డీలోని లాబొరేటరీ ఆఫ్ సెల్ డెత్ అండ్ సెల్ సర్వైవల్ అధిపతిగా వ్యవహరిస్తున్న సుబ్బారెడ్డి కణ జీవశాస్త్రవేత్త. శరీర క్రియలకు అత్యంత కీలకమైన ప్రొటీన్ల మధ్య సమాచార వినిమయంపై పరిశోధిస్తున్నామని, సాధారణ స్థితిలో.. లేదా వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు ఈ సమాచార మార్పిడిలో ఏదైనా తేడాలు ఉన్నాయా? అన్నది కూడా తమ అధ్యయనంలో భాగమని ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ తెలిపారు. కణాల లోపల కూడా ప్రొటీన్లు ఎలా మాట్లాడుకుంటాయో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. కేన్సర్ కణాలపై ఎక్కువగా దృష్టి పెట్టామని, ఫలితాల ఆధారంగా భవిష్యత్తులో కేన్సర్‌కు మరింత సమర్థచికిత్స అందించే అవకాశం ఏర్పడుతుందని వివరించారు. డాక్టర్ ఎం.సుబ్బారెడ్డి నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం గతంలోనూ కేన్సర్ కణితులను అణచివేసే ఓ జన్యువును నియంత్రించే ప్రొటీన్‌ను గుర్తించడంలో విజయం సాధించారు.

సహజ ప్రసవాలకు 'సీ-సేఫ్'



సిజేరియన్ ప్రసవాల తగ్గింపే లక్ష్యంగా రాష్ట్ర వైద్యశాఖ ప్రత్యేక చర్యలు

అనవసర సిజేరియన్ ప్రసవాల నియంత్రణకు కార్యాచరణ	యూకేకు చెందిన బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయం, యునిసెఫ్ సహకారంతో రూపకల్పన

త్వరలో ఎంపిక చేసిన 6 ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బందికి శిక్షణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సిజేరియన్ ప్రసవాలను తగ్గించి.. సహజ ప్రసవాలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా వైద్య, ఆరోగ్య శాఖ ఇప్పటికే పలు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇదే క్రమంలో 'సీ-సేఫ్' అనే మరో కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) మార్గదర్శకాల ప్రకారం మొత్తం ప్రసవాల్లో సిజేరియన్‌లు 10 నుంచి 15 శాతానికి మించకూడదు. అయితే, రాష్ట్రంలో మొత్తం ప్రసవాల్లో 45 శాతం సిజేరియన్‌లు ఉంటున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో 50 శాతానికిపైగా, ప్రభుత్వాస్పత్రుల్లో 32 శాతం మేర ఈ తరహా కాన్పులు ఉంటున్నాయి. దీంతో ప్రభుత్వాస్పత్రుల్లో కోత కాన్పుల నియంత్రణకు ఇప్పటికే పలు చర్యలు చేపట్టారు. కాగా, సీ-సేఫ్‌ను త్వరలో ప్రారంభించనున్నారు.

నర్సులకు మిడ్‌వైఫరీ శిక్షణ పూర్తి

సహజ ప్రసవాలను పెంపొందించే చర్యల్లో భాగంగా ప్రభుత్వాస్పత్రుల్లోని నర్సులకు 'నర్స్ ప్రాక్టీషనర్ ఇన్ మిడ్‌వైఫరీ (ఎన్‌పీఎం)' కోర్సును గత ఏడాది ప్రారంభించారు. బ్యాచ్‌కు 30 మంది చొప్పున రెండు బ్యాచ్‌లుగా గుంటూరు, తిరుపతిలలో 18 నెలల శిక్షణ ఇచ్చారు. గర్భధారణ జరిగినప్పటి నుంచి మహిళకు అవసరమైన వైద్య సహాయం, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నవజాత శిశువుకు అందించాల్సిన సేవలు, హైరిస్క్‌లో ఉన్న గర్భిణులను ఏ విధంగా గుర్తించాలి వంటి పలు రకాల అంశాలపై నర్సులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ అనంతరం వీరికి నర్సింగ్ బోర్డ్‌లో పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. త్వరలో వీరిని రాష్ట్రవ్యాప్తంగా అత్యధికంగా ప్రసవాలు జరిగే 10 ఆస్పత్రుల్లో నియమించనున్నారు.

అనవసర కోతల నియంత్రణ

యూకేకు చెందిన బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయం, యునిసెఫ్, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్ర వైద్య శాఖ సీ-సేఫ్‌ను నిర్వహించనుంది. ప్రభుత్వాస్పత్రుల్లో అనవసర కోత కాన్పులను సాధ్యమైనంత వరకూ నియంత్రించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపట్టబోతున్నారు. ప్రస్తుతం ఆస్పత్రుల్లో సిజేరియన్‌లను ఎలాంటి పరిస్థితుల్లో నిర్వహించాలి అనే దానిపై ప్రోటోకాల్స్‌ను రూపొందిస్తున్నారు. ప్రస్తుతం మన ఆస్పత్రుల్లో అసిస్టెడ్ డెలివరీ ప్రక్రియలను అంతగా వినియోగించడం లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలో ఎంపిక చేసిన ఆరు ఆస్పత్రుల్లో గైనిక్ వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. వ్యాక్యూమ్, ఇతర పరికరాలను ఉపయోగించి సాధారణ ప్రసవాల్ని చేసేలా అసిస్టెడ్ డెలివరీ ప్రక్రియలో నైపుణ్యాలు పెంచనున్నారు. సిజేరియన్ తప్పనిసరి అయిన పరిస్థితుల్లో సురక్షితంగా సర్జరీల నిర్వహణపై మరింత అవగాహన పెంచనున్నారు. రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, తెనాలి, అనకాపల్లి, ఆదోని ఆస్పత్రులను సీ-సేఫ్ కోసం ఎంపిక చేసినట్టు యునిసెఫ్ ప్రతినిధి డాక్టర్ నాగేంద్ర తెలిపారు. ప్రోటోకాల్స్ రూపకల్పన త్వరలో పూర్తి అవుతుందన్నారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట

మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే మాతృ మరణాల కట్టడికి అనేక చర్యలు తీసుకుంటున్నాం. ఫలితంగా గతంతో పోలిస్తే మరణాలు తగ్గాయి. అదే విధంగా అనవసర సిజేరియన్ కాన్పుల నియంత్రణపై దృష్టి సారించాం. ఈ క్రమంలోనే సీ-సేఫ్‌కు ప్రణాళిక రచించాం. మరొక వైపు ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్‌లను నియంత్రించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– జె.నివాస్, కమిషనర్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ

దుర్గమ్మ ఆలయ ఘాట్‌రోడ్డు మూసివేత



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధికి వెళ్లే ఘాట్ రోడ్డు మార్గంలో కొండరాళ్లు జారిపడే అవకాశం ఉండటంతో దేవస్థాన అధికారులు సోమవారం ఈ ఘాట్‌రోడ్డును మూసివేశారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు వర్షం కురవడంతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ కారణంగా దేవస్థాన బస్సులు, దుర్గాఘాట్ నుంచి కొండపైకి తిరిగే ఉచిత బస్సులను నిలిపివేశారు. దీంతో భక్తులు ఆటోలు, ప్రైవేటు వాహనాలలో కనకదుర్గనగర్‌కు వెళ్లి అక్కడి నుంచి కొండపైకి మెట్ల మార్గంలో చేరుకున్నారు.

చట్టాల్లో మార్పులు అవసరం

- కేసుల దర్యాప్తు, విచారణ త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు
- పరివర్తన.. పునరావాసానికే జైళ్లు
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా



సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా

దొండపర్తి (విశాఖ దక్షిణ): ఖైదీలను దండించడానికే రూపొందించిన బ్రిటిష్ కాలం నాటి చట్టాల్లో మార్పులు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందని, కేంద్రం ఆ దిశగా అడుగులు వేస్తోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా తెలిపారు. విశాఖలో సాయిప్రియ రిసార్ట్‌లో రెండు రోజుల పాటు జరిగే అన్ని రాష్ట్రాల జైళ్ల అధిపతుల 8వ జాతీయ సదస్సుకు సోమవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్రమంత్రి మాట్లాడుతూ.. దేశంలో జైళ్ల సామర్థ్యం కంటే 25 శాతం అధికంగా ఖైదీలు ఉన్నట్టు చెప్పారు. అందులో 80 శాతం మంది అండర్ ట్రయిల్ ఖైదీలేనని వెల్లడించారు. పూర్వకాలం నాటి చట్టాల కారణంగా ఈ సమస్య తలెత్తుతోందన్నారు. జైళ్లు దండించడానికి కాదని, ఖైదీలలో పరివర్తన తీసుకువచ్చి వారికి పునరావాసం కల్పించడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బ్రిటిషర్ల ఆలోచనా ధోరణితో రూపుదిద్దుకున్న చట్టాల్లో మార్పులు తీసుకువచ్చేందుకు కేంద్రం అవసరమైన చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఇందుకు సంబంధించి పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టినట్టు తెలిపారు. కేసు దర్యాప్తు నుంచి విచారణ వరకు అన్నీ వేగవంతంగా జరిగేలా మార్పులు చేస్తున్నట్టు వివరించారు. కొత్త బిల్లుతో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు సత్వరమే పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో జైళ్ల ఆధునికీకరణకు రూ.950 కోట్లు మంజూరు చేసినట్టు కేంద్రమంత్రి వెల్లడించారు. రూ.100 కోట్లతో చేపట్టిన జైళ్ల కంప్యూటరీకరణ ప్రక్రియ కూడా వేగవంతంగా జరుగుతోందన్నారు. ఇప్పటికే 1,100 జైళ్లలో కంప్యూటరీకరణ పూర్తయిందన్నారు.

కేంద్ర కారాగారాల్లో నైపుణ్య కేంద్రాలు

సదస్సుకు హాజరైన రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జైలు అభివృద్ధి నిధి ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పారిశ్రామిక కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయాలు జైలు అభివృద్ధి నిధి ఖాతాలోకి వెళ్తాయని చెప్పారు. ఆ నిధి ఖైదీల సంక్షేమానికి వినియోగిస్తున్నట్టు చెప్పారు. అన్ని కేంద్ర కారాగారాల్లో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. గర్భిణి ఖైదీలకు, వారి పిల్లలకు, వృద్ధ మహిళా ఖైదీలకు ప్రత్యేక ఆహారాన్ని అందజేస్తున్నామని వెల్లడించారు. సదస్సులో బీపీఆర్ అండ్ డీ డైరెక్టర్ జనరల్ బాలాజీ శ్రీవాస్తవ్, రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్‌కుమార్ గుప్తా పాల్గొన్నారు.

ఉత్తమ సీడ్ కంపెనీగా వేద సీడ్స్



చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కొరిటెపాడు(గుంటూరు): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉత్తమ సీడ్ కంపెనీగా వేద సీడ్స్‌కు సీడ్స్‌మెన్ అసోసియేషన్ అవార్డును అందజేసింది. ఉభయ తెలుగు రాష్ట్రాల సీడ్స్ మెన్ అసోసియేషన్ యాన్యువల్ అవార్డు-2023 ప్రదాన కార్యక్రమం విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగింది. ఉత్తమ సీడ్ కంపెనీ విభాగంలో వేద సీడ్స్ కంపెనీ ఈ అవార్డును కైవసం చేసుకుంది. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి చేతులమీదుగా ఈ అవార్డును వేద సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ పి.చంద్రశేఖర్ అందుకున్నారు. చంద్రశేఖర్ 30 సంవత్సరాలుగా వ్యవసాయ పరిశోధనలో చేసిన కృషిని విష్ణువర్ధన్‌రెడ్డి అభినందించారు. వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్, తులసి విశ్వంభర్, జనరల్ మేనేజర్ గుడి సతీష్‌కుమార్, హెచ్‌ఆర్ మేనేజర్ తోట రంగారావు, జీఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టమాటా రైతుకు బాసట

▶ మొదటి పేజీ తరువాయి


కిలో రూ. 50కే రైతు బజార్లలో విక్రయించింది. ఇలా దాదాపు రెండు నెలల పాటు రైతుల నుంచి సగటున కిలో రూ. 107.50 చొప్పున రూ.14.66 కోట్ల విలువైన 1,364.55 టన్నుల టమాటాలను సేకరించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 105 రైతుబజార్ల ద్వారా సబ్సిడీపై వినియోగదారులకు అందించింది.

నేడు రైతులకు అండగా నిలిచేందుకు..

గత నెల రోజులుగా ఖరీఫ్ పంట పెద్దఎత్తున వస్తుండటంతో మార్కెట్‌లో ధరలు తగ్గుముఖం పట్టాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రభుత్వ, ప్రైవేట్ మార్కెట్లతో సంబంధం లేకుండా కిలో రూ. 7 కంటే తక్కువ ధర పలుకుతున్న మార్కెట్లలో జోక్యం చేసుకొని రైతులకు అండగా నిలవాలని అధికారులను ఆదేశించింది. దీంతో సీఎం యాప్ ద్వారా పర్యవేక్షిస్తూ ధరలు తగ్గిన మార్కెట్లలో జోక్యం చేసుకుంటూ రైతులకు బాసటగా నిలుస్తోంది. నంద్యాల జిల్లా ప్యాపిలి మార్కెట్ పరిధిలో ధరలు తగ్గుదల నమోదవుతుండటంతో మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద వ్యాపారులతో పోటీపడి రైతులవద్ద టమాటాలు కొనుగోలు చేశారు.

లాభం ఆశించకుండా విక్రయం

ఇటీవల ప్యాపిలి మార్కెట్లో కనిష్ట ధర రూ. 6 పలుకగా, అంతకంటే ధర తగ్గకూడదన్న ఆలోచనతో రైతుల వద్ద గడిచిన నాలుగు రోజుల్లో 16 టన్నులు సేకరించి స్థానిక రైతు బజార్లలో నో ప్రాఫిట్-నో లాస్ పద్ధతిన వినియోగదారులకు విక్రయించారు. సీఎం యాప్ ద్వారా ధరల హెచ్చుతగ్గులను పరిశీలిస్తూ ప్రభుత్వం జోక్యం చేసుకుంటుండటంతో సోమవారం ప్రధాన టమాటా మార్కెట్లలో నాణ్యమైన టమాటాకు సైజును బట్టి కిలో కనిష్టంగా రూ. 8, గరిష్టంగా రూ. 16 చొప్పున పలుకుతోంది. మరోవైపు బహిరంగ మార్కెట్లలో కిలో రూ. 11 నుంచి రూ. 24 పలుకుతుండగా, రైతు బజార్లలో కిలో రూ.9 నుంచి రూ. 20 వరకు ధరలు ఉండేలా చూస్తున్నారు.



సోమవారం ప్రధాన టమాటా మార్కెట్లలో క్వింటాలుకు రైతుకు పలికిన ధరలు

	కనిష్టం	గరిష్టం
కలికిరి	800	1,200
పుంగనూరు	1,070	1,270
మదనపల్లె	1,000	1,320
పత్తికొండ	800	1,600
పలమనేరు	800	1,200

ధరల నిలకడే లక్ష్యం

డిమాండ్‌మించి పంట మార్కెట్‌కు వస్తుండటంతో గతకొద్ది రోజులుగా తగ్గుతున్న ధరలను నిలకడగా ఉంచడం ద్వారా రైతులకు బాసటగా నిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతీరోజూ ప్రధాన మార్కెట్లలో టమాటా ధరలను సీఎం యాప్ ద్వారా పర్యవేక్షిస్తున్నాం. కిలో రూ.7 కంటే తక్కువగా పలుకుతున్న మార్కెట్లలో జోక్యం చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశాం. ఇప్పటికే కిలో రూ. 6 చొప్పున 16 టన్నులు రైతుల నుంచి సేకరించి స్థానిక రైతు బజార్లలో అదే ధరకు విక్రయించాం. ధరల విషయంలో రైతులెవ్వరూ ఆందోళన చెందనవసరం లేదు.

– రాహుల్ పాండే, కమిషనర్, మార్కెటింగ్ శాఖ

ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా సత్యనారాయణ



ఖైరతాబాద్(హైదరాబాద్): ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గం ఎన్నికైంది. రెండేళ్లకు ఒకసారి జరిగే కార్యవర్గ ఎన్నికలు ఎన్నికల అధికారి జయంతి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఉత్తరాంధ్రకు చెందిన చిన్ని రామసత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్ చింతలబస్తీలోని ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్య సంఘాన్ని బలోపేతం చేయడంతో పాటు ఎవరికి ఏ అవసరమొచ్చినా ఆదుకునేందుకు అండగా ఉంటామని తెలిపారు. మహాసభ ప్రధాన కార్యదర్శిగా శేగు హన్మంతరావు, కోశాధికారిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా గురుబ్రహ్మం, కార్యదర్శిగా వీరబ్రహ్మం గుప్త, ఈసీ మెంబర్లుగా కొండ ప్రవీణ్, శంకర్ తదితరులు ఎన్నికయ్యారు.

తెలంగాణ | బస్సు చోరీ చేసి.. ప్రయాణికుల్ని ఎక్కించుకుని..

ఆర్టీసీ అద్దె బస్సు చోరీ సిద్దిపేటలో మాయం.. తంగళ్లపల్లిలో ప్రత్యక్షం



తంగళ్లపల్లి(సిరిసిల్ల)/సిద్దిపేటకమాన్: సిద్దిపేటలో చోరీకి గురైన ఆర్టీసీ అద్దె బస్సు రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం సారంపల్లి శివారులో ప్రత్యక్షమైంది. పోలీసులు తెలిపిన వివరాలివి. సిద్దిపేట డిపోకు చెందిన అద్దె బస్సు (టీఎస్ 36 టీఏ 3336)ను ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. అంతటితో ఆగకుండా నేరుగా సిద్దిపేట బస్టాండ్‌కు వెళ్లి ప్రయాణికులను ఎక్కించుకొని వేములవాడకు వచ్చాడు. ఇక్కడి నుంచి హైదరాబాద్ బోర్డుతో ప్రయాణికులను ఎక్కించుకుని బయల్దేరాడు. ప్రయాణికుల నుంచి డబ్బులు వసూలు చేసి, టికెట్ మాత్రం ఇవ్వలేదు. దీంతో అనుమానం వచ్చిన ప్రయాణికులు.. తంగళ్లపల్లి మండలం సారంపల్లి శివారులోని ఎల్లమ్మ గుడి వద్దకు చేరుకోగానే డ్రైవర్‌ను నిలదీశారు. దీంతో సదరు వ్యక్తి బస్సును అక్కడే వదిలేసి పరారయ్యాడు. వెంటనే ప్రయాణికులు డయల్ 100కు కాల్‌చేసి పోలీసులకు సమాచారం అందించారు. ఇక్కడి పోలీసులు సిద్దిపేట పోలీసులకు సమాచారమిచ్చారు. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడిని గంభీరావుపేటకు చెందిన రాజుగా గుర్తించారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

భారీ వర్షంతో పొంగిన వాగులు, వంకలు

కొండవీటి, కోటేళ్ల వాగులు పొంగడంతో రాజధానికి రాకపోకలు బంద్



పెదపరిమి వద్ద రాజధానికి వెళ్లే రోడ్డుపై భారీగా పొంగి పొర్లుతున్న కోటేళ్ల వాగు

తాడికొండ: ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గుంటూరు జిల్లా తుళ్లూరు మండలాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లి పంట పొలాలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో శివారు కాలనీల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తుళ్లూరు ఇమ్మానుయేల్ పేట, పెదపరిమి మిక్సర్ కాలనీ, తాడికొండ బీసీ కాలనీలలోని ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. రాజధానికి వెళ్లే ప్రధాన రహదారిపై పెదపరిమి వద్ద కోటేళ్ల వాగు పొంగి పొర్లడంతో రాజధానికి రాకపోకలు నిలిచిపోయాయి. సచివాలయం, హైకోర్టుకు వెళ్లే న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉద్యోగులు నానా ఇబ్బందులు పడ్డారు. లాం వద్ద కొండవీటి వాగుకు వరద ఉధృతి పెరగడంతో ప్రధాన రహదారిపై నీరుచేరి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

క్లుప్తంగా...

మొరాకో భూకంపం.. 2,500కు చేరిన మృతులు

మర్రకేశ్: మొరాకోలో సంభవించిన తీవ్ర భూకంపంలో మృతుల సంఖ్య పెరుగుతోంది. సుమారు 2,500 మంది చనిపోగా, మరో 2,500 మంది క్షతగాత్రులయ్యారని సోమవారం మొరాకో ప్రభుత్వం ప్రకటించింది. ప్రముఖ పర్యాటక ప్రాంతం, ఆర్థిక కేంద్రం అయిన మర్రకేశ్‌కు 72 కిలోమీటర్ల దూరంలోని అట్లాస్ పర్వత ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఈ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. ఒక్క అల్ హౌజ్ ప్రావిన్స్‌లోనే 1,500 మంది ప్రాణాలు కోల్పోయారు. పర్వత ప్రాంతంలోని కొన్ని పట్టణాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అన్ని గ్రామంలో ఇళ్లన్నీ నేలమట్టమయ్యాయి. సుమారు 3 లక్షల మంది నీడ కోల్పోయినట్లు ఐక్యరాజ్యసమితి అంచనా.

దేవెగౌడ మనవడికి హైకోర్టులో చుక్కెదురు

బెంగళూరు: జేడీ(ఎస్)లో ఏకైక పార్లమెంట్ సభ్యుడు ప్రజ్వల్ రేవణ్ణకు కర్ణాటక హైకోర్టులో చుక్కెదురైంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోని హసన్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఆయన ఎన్నిక చెల్లదంటూ గతంలో కింది కోర్టు తీర్పు వెలువరించింది. ఆ తీర్పు అమలును నిలుపుదల చేయాలంటూ దాఖలుచేసిన పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు సోమవారం తిరస్కరించింది. సెప్టెంబర్ ఒకటి నాటి కింది కోర్టు తీర్పును నిలిపివేస్తే సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు తనకు అవకాశం దక్కుతుందంటూ ఆయన చేసిన విజ్ఞప్తిని హైకోర్టు తోసిపుచ్చింది. ఆనాడు ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారని రుజువు కావడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి కింద ప్రజ్వల్‌పై చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘంను హైకోర్టు ఆదేశించింది. గత సోమవారమే ఈ కేసులో వాదోపవాదనలు ముగిసినా తీర్పును జడ్జి జస్టిస్ కె.నటరాజన్ రిజర్వ్‌చేసి ఈ సోమవారం(11వ తేదీ) తీర్పును వెలువరించారు. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ పెద్ద కుమారుడు రేవణ్ణ కుమారుడే ప్రజ్వల్.

లిఫ్టు కూలి ఏడుగురు మృతి

థాణే(మహారాష్ట్ర): థాణేలోని నిర్మాణంలో ఉన్న ఓ బహుళ అంతస్తుల భవనంలో లిఫ్టు కుప్పకూలిన ఘటనలో మృతుల సంఖ్య ఏడుకు చేరుకుంది. ఘోడ్‌బందర్ రోడ్డులోని బల్కుమ్ ప్రాంతంలో ఆదివారం రాత్రి 7.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసు కుంది. 40వ అంతస్తులో పనులు పూర్తి చేసుకుని కొందరు కార్మికులు లిఫ్టు ఎక్కారు. లిఫ్టు వైర్ ఒకటి తెగిపోవడంతో అది అదుపుతప్పి అండర్‌గ్రౌండ్‌లోని పీ3 పార్కింగ్ ప్రాంతంలో వేగంగా వచ్చి నేలను తాకింది. ఈ ఘటనలో ఆరుగురు చనిపోయారు. గాయపడిన మరో కార్మికుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశాడని సోమవారం అధికారులు తెలిపారు.

9 లక్షల ఏళ్ల క్రితం 99 శాతం మానవాళి మాయమైందట!

వాతావరణ మార్పులే కారణం.. కేవలం 1,300 మంది మాత్రమే మిగిలారట

దాదాపు 9 లక్షల ఏళ్ల క్రితం 99 శాతం మానవాళి ఉన్నపళాన తుడిచిపెట్టుకుపోయిందట. చివరి మంచు యుగం తుదినాళ్లలో చోటు చేసుకున్న విపరీతమైన వాతావరణ మార్పులే ఇందుకు కారణంగా నిలిచాయని అంతర్జాతీయ అధ్యయనం ఒకటి తాజాగా తేల్చింది. అయితే నేటి ఆధునిక మానవుని పూర్వీకులు హోమోసెపియన్ల ఆవిర్భావానికి కూడా ఈ మహా ఉత్పాతం పరోక్షంగా కారణమైందని చెబుతోంది.

చాన్నాళ్ల క్రితం. అంటే దాదాపు 9.3 లక్షల నుంచి 8.13 లక్షల ఏళ్ల క్రితం. పర్యావరణ పరంగా భూమ్మీద కనీవినీ ఎరుగని ఉత్పాతం సంభవించింది. ఈ మహోత్పాతం వల్ల అప్పటి జనాభాలో ఏకంగా 98.9 శాతం తుడిచిపెట్టుకుపోయిందట. దాని బారినుంచి కేవలం 1,300 మంది మాత్రమే బతికి బట్టకట్టారట. మన పూర్వీకులైన హోమోసెపియన్లు వీరినుంచే పుట్టుకొచ్చారట. చివరి మంచు యుగపు తుది నాళ్లలో ఈ పెను ఉత్పాతం జరిగింది.



అధ్యయనం ఇలా...

రోమ్‌లోని సపియెంజా వర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ ఫ్లారెన్స్ నిపుణులు ఈ అధ్యయనంలో పాల్గొన్నారు. ఆ యుగంలో జరిగిన తీవ్ర వాతావరణ మార్పులు మానవ జాతి వినాశనానికి కారణంగా మారినట్టు వారు తేల్చారు.

అధ్యయనం కోసం 50కు పైగా విభిన్న దేశాలకు చెందిన 3,154 మంది సంపూర్ణ జన్యుక్రమాలను లోతుగా విశ్లేషించారు.

ఇందుకోసం ఫిట్ కోల్ అనే సరికొత్త బయో ఇన్ఫర్మాటిక్స్ పద్ధతిని అనుసరించారు.

ఈ డేటాను నాటి వాతావరణ, శిలాజ సమాచారంతో పోల్చి చూశారు.

హోమోసెపియన్ల ఆవిర్భావానికి కాస్త ముందు.. పూర్వ చారిత్రక యుగపు మిస్టరీల్లోకి తొంగిచూసేందుకు ఈ కొత్త వివరాలు ఎంత ఉపయోగపడ్డాయని సైంటిస్టులు చెప్పారు.

- ఈ డేటాను నాటి వాతావరణ, శిలాజ సమాచారంతో పోల్చి చూశారు.
- హోమోసెపియన్ల ఆవిర్భావానికి కాస్త ముందు.. పూర్వ చారిత్రక యుగపు మిస్టరీల్లోకి తొంగిచూసేందుకు ఈ కొత్త వివరాలు ఎంతగానో ఉపయోగపడ్డాయని సైంటిస్టులు చెప్పారు.
- జెనెటిక్ బాటిల్ నెక్‌గా పిలుస్తున్న ఈ మహోత్పాతానికి నాటి మంచు యుగ సంధి సందర్భంగా చోటు చేసుకున్న తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితులే కారణమని తేలింది.
- ఆ దెబ్బకు నేటి ఆఫ్రికా ఖండమంతా ఎండిపోయి మరు భూమిగా మారిందట.
- మానవులతో పాటు ఏనుగుల వంటి భారీ క్షీరదాలన్నీ దాదాపుగా అంతరించాయట.
- ఆ దెబ్బకు దాదాపు 3 లక్షల ఏళ్ల పాటు మానవ ఉనికి ఉందా లేదా అన్నంత తక్కువ స్థాయికి పడిపోయిందట.
- ఆ సమయం నాటి శిలాజాల్లో మానవ అవశేషాలు అసలే దొరక్కపోవడం కూడా దీన్ని ధ్రువీకరిస్తోంది.
- ఈ అధ్యయన వివరాలు జర్నల్ సైన్స్‌లో పబ్లిష్ అయ్యాయి.

- నేషనల్ డెస్క్, సాక్షి



'నాటి మంచు యుగపు మహోత్పాతం మానవ వికాసంలో ఒక రకంగా కీలక పాత్ర పోషించిందనే చెప్పాలి. తదనంతరం పుట్టుకొచ్చిన ఆదిమ మానవ సంతతే ఆఫ్రికా నుంచి యురేషియాకేసి విస్తరించింది. ఈ విస్తరణ ఆఫ్రికాలో హోమోసెపియన్లు, యూరప్‌లో నియాండర్తల్, ఆసియాలో దేనిసోవన్ల ఆవిర్భావానికి కారణమైంది'
- ఫాబియో డీ విన్సెంజో,

బాణసంచా విక్రయంపై ఢిల్లీలో మళ్లీ నిషేధం

న్యూఢిల్లీ: అన్ని రకాల బాణాసంచా తయారీ, నిల్వ, వినియోగం, విక్రయంపై నిషేధం మరోసారి విధించాలని ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయించింది. రానున్న శీతాకాలంలో కాలుష్య తీవ్రతను తగ్గించే కార్యాచరణలో భాగంగానే ఈమేరకు నిర్ణయించి నట్లు పర్యావరణ మంత్రి గోపాల్ రాయ్ సోమవారం తెలిపారు. నగరంలో నిషేధాన్ని కఠినంగా అమలు చేసేందుకు సూచనలను ఢిల్లీ పోలీసులకు జారీ చేసినట్లు మీడియాకు వివరించారు. గత మూ డేళ్లుగా ఢిల్లీ ప్రభుత్వం బాణాసంచాపై నిషేధం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. 'అయిదారేళ్లుగా ఢిల్లీలో వాయు నాణ్యత గణనీయంగా మెరుగుపడుతోంది. అందుకే ఈ ఏడాది కూడా బాణాసంచాపై నిషేధం అమలు చేయనున్నాం'అని రాయ్ చెప్పారు.

ఖలిస్తాన్ రెఫరెండం!

కెనడాలో ఎస్ఎఫ్‌జే నిర్వాకం ● స్పందన కరువు

టొరంటో: భారత వ్యతిరేక శక్తులు కెనడాలో తిష్టవేశాయని స్వయంగా ఆ దేశ ప్రధాని ట్రూడో ఎదుటే ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తంచేసిన వేళ అదే రోజు మరో పరిణామం చోటుచేసుకుంది. భారత్‌ను విడగొట్టి సిక్కుల కోసం ఖలిస్తాన్‌ను ఏర్పాటుచేయడంపై అభిప్రాయం తెలపాలంటూ కెనడాలో సిక్స్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే) వేర్పాటువాద సంస్థ రెఫరెండం నిర్వహించింది. సుర్రే పట్టణంలో ఎస్ఎఫ్‌జే వ్యవస్థాపకుడు గురుపత్వంత్ సింగ్ పన్నూ సారథ్యంలో సిక్కు ప్రజాభిప్రాయ సేకరణ(రెఫరెండం) చేపట్టారు. భారీ వ్యక్తిగత భద్రత నడుమ రెఫరెండం ప్రాంతానికి వచ్చిన గురపత్వంత్ అక్కడే భారత వ్యతిరేక విద్వేష ప్రసంగం చేశారు. గురు నానక్ సింగ్ గురుద్వారా వద్ద జరిగిన ఈ రెఫరెండం తంతులో దాదాపు 7వేల మంది పాల్గొన్నారు. దాదాపు 50 వేలకుపైగా జనం వస్తారని ఆశించిన నిర్వాహకులకు భంగపాటు ఎదురైంది. కెనడా ప్రధాని ట్రూడోతో మోదీ ఖలిస్తాన్ వేర్పాటువాదం సహా పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చించిన ఆదివారం రోజే ఈ రెఫరెండంను ఎస్ఎఫ్‌జే నిర్వాహకులు పనిగట్టుకుని నిర్వహించారు. అంతకుముందు పత్వంత్ సింగ్ ఒక ఆడియో సందేశం విడుదలచేశారు. 'ఢిల్లీలో జీ20 సదస్సు జరుగుతున్న ప్రగతి మైదాన్ ప్రాంగణానికి భారీ సంఖ్యలో వెళ్లి నిరసన గళం వినిపించండి' అని కశ్మీర్ లోయలో నివసించే ముస్లింలకు పిలుపునిస్తున్నట్లు ఆ ఆడియోలో ఉంది. ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఖలిస్తాన్ వేర్పాటువాద జెండా ఎగరేస్తామని పత్వంత్‌సింగ్ సవాల్ చేశారు.

ఉగ్ర గ్రూపులు మళ్లీ యాక్టివ్

- మణిపూర్‌లో ఉద్రిక్తతలకు అవే కారణం
- కేంద్ర అధికారుల వెల్లడి

న్యూఢిల్లీ/ఇంఫాల్: మణిపూర్‌లో కొన్నేళ్లుగా నిద్రాణంగా ఉన్న ఉగ్రవాదుల ముఠాలు ప్రజల నిరసనల నేపథ్యంలో మళ్లీ చురుగ్గా మారాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇటీవల ఓ సైనికాధికారిపై కాల్పులు జరిపి, తీవ్రంగా గాయపరిచిన ఘటనను వారు ఉదహరిస్తున్నారు. నిషేధిత యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్(యూ ఎన్ఎ ల్ఎఫ్), పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీఎల్ఏ) ఉగ్రవాదులు దీని వెనుక ఉన్నారని వారు ఆరోపిస్తున్నారు. మణిపూర్‌లో నిరసనలకు దిగుతున్న పౌరులతో కలిసిపోయి ఉద్రిక్తతలు పెంచుతున్నారని చెబుతున్నారు. గత వారం టెంగ్‌నౌపల్ జిల్లా మొల్‌నోయి గ్రామంలో గిరిజనులపై దాడికి యత్నించిన కొందరు ఆందోళన కారులను అస్సాం రైఫిల్స్, ఆర్మీ బలగాలు అడ్డుకోగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో లెఫ్టినెంట్ కల్నల్ రమణ్ త్యాగి తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన గువాహటిలో చికిత్స పొందుతున్నారు. ఆందోళనకారుల్లో కొందరు నిషేధిత గ్రూపులకు చెందిన ఉగ్రవాదులు కూడా ఉన్నట్లు అనంతరం చేపట్టిన దర్యాప్తులో వెల్లడైందని అధికారులు వివరించారు. యూఎన్ఎల్ఎఫ్, పీఎల్ఏతోపాటు కంగ్లీ యవోల్ కన్‌బా లుప్(కేవైకేఎల్), పీపుల్స్ రివల్యూషనరీ పార్టీ ఆఫ్ కంగ్లీపాక్ (పీఆర్ఈపీఏకే)లు కూడా రాష్ట్రంలో యాక్టివ్‌గా అయ్యాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. యూఎన్ఎల్ఎఫ్‌కు 330, పీఎల్ఏకు 300, కేవైకేఎల్ 25 మంది కేడర్ కలిగి ఉన్నాయన్నారు. కేవైకేఎల్ చీఫ్ టాంబా అలియాస్ ఉత్తమ్ సహా ఆ గ్రూప్‌లోని 12 మంది జూన్‌లో పట్టుబడ్డారన్నారు. ఈ గ్రూపులన్నిటికీ ఆర్మీపై దాడులు, బలవంతపు వసూళ్లు, డ్రగ్స్ రవాణా, స్మగ్లింగ్ వంటి ఘటనలకు పాల్పడిన చరిత్ర ఉందని వివరించారు. మణిపూర్‌లో అల్లర్లు మొదలైనప్పటినుంచి పోలీస్ స్టేషన్ల నుంచి ఎత్తుకెళ్లిన మెషిన్ గన్స్, రైఫిళ్లు వంటి 4,537 ఆయుధాలు, 6.32 లక్షల రౌండ్ల వరకు బుల్లెట్లు వీరి వద్దే ఉండొచ్చని భావిస్తున్నామన్నారు. రాష్ట్రంలో మే నుంచి తెగల మధ్య కొనసాగుతున్న హింసాత్మక ఘటనల్లో 160 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

1,968 అడుగుల ఎత్తు నుంచి పడ్డా ఏమీ కాలేదు

వెల్లింగ్టన్: భూమి మీద నూకలు ఉండాలేగానీ ఆకాశం నుంచి పడ్డా నిక్షేపంగా ఉంటారనడానికి ప్రబల నిదర్శనమీ ఘటన. ఆశ్చర్యపరిచే ఈ ఘటన న్యూజిలాండ్‌లోని పర్వతసానువుల్లో శనివారం జరిగింది. నార్త్ ఐలాండ్‌లోని టరనకీ పర్వతంపైకి అధిరోహించేందుకు శనివారం పర్వతారోహకుల బృందం బయలుదేరింది. మధ్యాహ్నం సమయంలో 1,968 అడుగుల మేర ఎక్కాక ఓ పర్వతారోహకుడు అనూహ్యంగా జారి పడిపోయాడు. అయితే, అతడికి స్వల్పంగానే గాయాలయ్యాయి. అక్కడి వాతావరణ పరిస్థితుల ప్రభావంతో అతడు పడిన చోట మంచు మెత్తగా మారడమే ఇందుకు కారణమని అధికారులు తెలిపారు. అతడు ప్రాణాలతో ఉండటం అద్భుతమైన విషయమని, అతడు చాలా అదృష్టవంతుడని పోలీసులు అంటున్నారు. న్యూజిలాండ్‌లోని అత్యంత ప్రమాదకరమైన పర్వతాల్లో టరనాకీ ఒకటిగా పేర్కొంటారు. ఇదే ప్రాంతం నుంచి 2021లో ఇద్దరు పర్వతారోహకులు జారిపడి మృతి చెందారు. నార్త్ ఐలాండ్‌లోనే నిద్రాణ అగ్నిపర్వతం కూడా ఉంది. ఇతర పర్వతాల నుంచి వేరుపడినట్లుగా దూరంగా ఉండటం, తీరానికి సమీపంలో ఉండటం, వేగంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు సంభవించడం వంటి పరిస్థితులు న్యూజిలాండ్‌లో టరనాకీ వద్దతప్ప మరెక్కడా లేవని మౌంటెన్ సేఫ్టీ కౌన్సిల్ పేర్కొంది.

అత్యంత కీలక వ్యూహాత్మక భాగస్వామి

సౌదీ అరేబియాను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ వ్యాఖ్య ● సౌదీ యువరాజు సల్మాన్ బిన్‌తో ద్వైపాక్షిక చర్చలు



మోదీ, సల్మాన్‌ల ఆలింగనం

న్యూఢిల్లీ: జీ20 శిఖరాగ్ర సదస్సులో భాగంగా దేశ రాజధానికి విచ్చేసిన సౌదీ అరేబియా యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ బిన్ అబ్దుల్‌అజీజ్ అల్–సౌద్‌తో సోమవారం ప్రధాని మోదీ విస్తృతస్థాయి ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అంతకుముందు ఉదయం ఆయనకు రాష్ట్రపతిభవన్‌లో రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సాదర స్వాగతం పలికారు. తర్వాత ఢిల్లీలోని హైదరాబాద్ హౌజ్‌లో సల్మాన్ బిన్, మోదీ ద్వైపాక్షిక చర్చల తర్వాత మోదీ మాట్లాడారు. ' ఈ ప్రాంతంతోపాటు ప్రపంచ సుస్థిరతకు, సంక్షేమానికి భారత్–సౌదీ అరేబియా వ్యూహాత్మక భాగస్వామ్యం ఎంతో కీలకం. భారత్ వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగిస్తున్న దేశాల్లో సౌదీ అరేబియా కూడా ఒకటి. రెండు దేశాలు కాలానుగుణంగా సత్సంబంధాలను సుదృఢం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాయి' అని మోదీ అన్నారు. సోమవారం ఇండియా–సౌదీ వ్యూహాత్మక భాగస్వామ్య మండలి తొలి భేటీలో ద్వైపాక్షిక బంధంపై ఇద్దరు అగ్రనేతలూ సమీక్ష జరిపారు. రక్షణ, ఇంధన భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, ప్రజారోగ్యం, ఆహార భద్రత, సంస్కృతి, సంక్షేమం తదితర అంశాలు మండలి తొలి భేటీలో చర్చకొచ్చాయని విదేశాంగ శాఖ కార్యదర్శి అరీందర్ బాగ్చీ 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు. 'దేశాల దగ్గరి బంధాన్ని మరింత ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు అనువైన కొన్ని మార్గాలను అన్వేషించాం. ఇకపై మా భాగస్వామ్యం నూతనోత్సాహంతో కొత్త మలుపు తీసుకోనుంది. గ్రిడ్‌ల అనుసంధానం, పునరుత్పాదక ఇంధన వనరులు, సెమీ కండక్టర్లు, సరకు రవాణా గొలుసు తదితర కీలక అంశాలపైనా చర్చలు జరిపాం. చర్చలు ఫలప్రదంగా సాగాయి.' అని మోదీ వ్యాఖ్యానించారు.

సంక్లిష్ట అంశాల్లో భాగస్వామ్యం పెంపుకోసం..

ఇరు దేశాల మధ్య సంక్లిష్టంగా మారిన కొన్ని అంశాల్లో సందిగ్ధతను తొలగించుకునేందుకు ఇండియా–సౌదీ వ్యూహాత్మక భాగస్వామ్య మండలిని నెలకొల్పాలని 2019 ఏడాదిలో నిర్ణయించారు. జీ20 సదస్సు తర్వాత భారత్‌లో సల్మాన్ బిన్ అధికారిక పర్యటన కొనసాగిస్తున్నారు. ' భారత్‌కు రావడం ఆనందంగా ఉంది. జీ20 సదస్సుకు విజయవంతంగా నిర్వహించినందుకు భారత్‌కు నా అభినందనలు. విశ్వ శ్రేయస్సు కోసం జీ20 సదస్సులో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. మోదీతో చర్చలు ఫలవంతంగా సాగాయి. మా రెండు దేశాల ఉజ్వల భవిష్యత్తు కోసం ఇకమీదటా కలిసి పనిచేస్తాం' అని సల్మాన్ వ్యాఖ్యానించారు. మధ్యప్రాచ్యంలో భారత్‌కు సౌదీ అరేబియా దేశం అత్యంత కీలకమైంది. గత కొన్నేళ్లలో ఈ రెండు దేశాల మధ్య మరింత మెరుగైన సత్సంబంధాలు ఏర్పడ్డాయి. రక్షణ, భద్రత సంబంధ అంశాలపై ఎక్కువగా దృష్టిపెట్టాయి. ఇరుదేశాల మధ్య వాణిజ్యం జీవితకాల గరిష్టానికి చేరుకున్న వేళ సల్మాన్ బిన్ భారత్‌లో పర్యటించడం గమనార్హం. 2022–23 ఆర్థిక సంవత్సరంలో భారత్–సౌదీ వాణిజ్య వ్యాపారం విలువ ఏకంగా 52.75 బిలియన్ డాలర్లకు చేరుకోవడం విశేషం. భారత్‌కు సౌదీ నాలుగో అతిపెద్ద వాణిజ్యభాగస్వామిగా కొనసాగుతోంది. 13 లక్షల సైన్యానికి సారథి అయిన నాటి చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ ఎంఎం నరవాణె 2020 డిసెంబర్‌లో సౌదీలో పర్యటించారు. భారత సైన్యాధ్యక్షుడు ఒకరు సౌదీలో పర్యటించడం ఇదే తొలిసారి.



ప్రధాని మోదీ, యువరాజు సల్మాన్‌ల సమక్షంలో ఇరు దేశాల ప్రతినిధి బృందాల చర్చలు

ఏమిటీ ఇండియా–సౌదీ వ్యూహాత్మక భాగస్వామ్య మండలి?

2019 అక్టోబర్‌లో మోదీ సౌదీలో పర్యటించినపుడు దీనిని ఏర్పాటుచేశారు. రెండు దేశాల మధ్య సంక్లిష్టంగా మారిన వ్యవహారాలను పరిష్కరించుకుని సంబంధాలు సజావుగా సాగేందుకు కృషిచేయడమే ఈ మండలి ముఖ్యోద్దేశం. రెండు దేశాల మధ్య వివాదంగా మారిన అంశాలను సరిదిద్దుకుంటూ, నూతన వృద్ధి అవకా శాలను సృష్టించుకుంటూ పరస్పరం రెండు దేశాలూ వృద్ధిపథంలో దూసుకుపోయేందుకు ఈ మండలి కృషిచేస్తోంది.

త్వరలో ఎఫ్‌టీఏ ఓ కొలిక్కి

భారత్, బ్రిటన్ ప్రకటన

న్యూఢిల్లీ: ఇరుదేశాల మధ్య గణనీయమైన వాణిజ్యం, వర్తకానికి బాటలు పరిచే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ)ను వీలైనంతగా త్వరగా కొలిక్కి తెస్తామని భారత్, బ్రిటన్ ప్రకటించాయి. జీ20 సదస్సులో భాగంగా భారత్‌కు విచ్చేసిన బ్రిటన్ ఆర్థిక మంత్రి జెరిమి హంట్.. భారత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో విడిగా భేటీ అయ్యారు. 12వ విడత ఇండియా–యూకే ఎకనమిక్, ఫైనాన్షియల్ డైలాగ్ పేరిట జరిగిన ఈ భేటీలో పలు అంశాలపై ఆర్థిక మంత్రులిద్దరూ చర్చలు జరిపారు. ' ప్రధానంగా పెట్టుబడులపై చర్చించాం. చర్చలను వేగవంతం చేసి కొన్ని ఒప్పందాలపై తుది సంతకాలు జరిగేందుకు కృషిచేస్తున్నాం' అని తర్వాత నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి వస్తే భారతీయ ఉత్పత్తులు తక్కువ కస్టమ్స్ సుంకాలతో బ్రిటన్ మార్కెట్లోకి అడుగుపెట్టగలవు. ధర తక్కువ ఉండటంతో వాటికి అక్కడ గిరాకీ ఒక్కసారిగా పెరుగుతుంది. దీంతో భారత్‌లో పారిశ్రామికోత్పత్తి ఎగసి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. బ్రిటన్ వస్తువులు సైతం తక్కువ ధరకే భారత్‌లో లభిస్తాయి. ఉభయ దేశాల ఆర్థిక వ్యవస్థలకు ఎంతో ప్రయోజనకరమైన ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం త్వరగా అమల్లోకి రావాలని మార్కెట్‌వర్గాలు ఆశగా ఎదురుచూస్తున్నాయి.

ఇకనైనా దేశ సమస్యలపై దృష్టి పెట్టండి: ఖర్గే

సాక్షి, న్యూఢిల్లీ: జీ20 సదస్సు ముగిసిన నేపథ్యంలో ఇప్పుడైనా దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలని ప్రధాని నరేంద్ర మోదీకి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. 'ప్రధాని మోదీ నిజాలను దాచిపెట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, మణిపూర్ హింస వంటి దేశీయ సమస్యలపై ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలని అనుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఖర్గే సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వ్యాఖ్యలు చేశారు. ఆగస్టులో సాధారణ భోజనం ధర 24 శాతం పెరిగిందని, దేశంలో నిరుద్యోగ రేటు 8 శాతం పెరగడంతో యువత భవిష్యత్తు అంధకారమైందని అన్నారు. అత్యవసర వస్తువుల ధరలు ఆగకుండా పెరుగుతూనే ఉన్నాయని చెప్పారు.

ఉత్తరప్రదేశ్‌లో కుంభవృష్టి

గత 24 గంటల్లో 19 మంది దుర్మరణం

లక్నో: ఉత్తరప్రదేశ్‌పై వరుణ ప్రకోపం కొనసాగుతోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఉత్తరప్రదేశ్‌లో జన జీవనం స్తంభించింది. గత 24 గంటల్లో వర్షసంబంధ ఘటనల్లో 19 మంది ప్రాణాలు కోల్పోయారు. మధ్య యూపీలో కురుస్తున్న కుండపోత వర్షాలకు సాధారణ ప్రజాజీవితం అతలాకుతలం అవుతోంది. స్కూళ్లు మూతపడ్డాయి. రాష్ట్ర రాజధాని లక్నోలోనూ చాలా ప్రాంతాలు జలమయమయ్యాయి. బారాబంకి ప్రాంతంలో రైలు పట్టాలు నీటమునిగాయి. గత 24 గంటల్లో 22 జిల్లాల్లో 40 మి.మీ.లకు పైగా వర్షపాతం నమోదైంది.

లిబియా వరదల్లో 2 వేల మంది మృతి



కైరో: ఆఫ్రికా దేశం లిబియాలో సంభవించిన తుపాను వరదల్లో సుమారు 2 వేల మంది మృతి చెందారు. తుపాను ప్రభావం తూర్పు ప్రాంతంలోని డెర్నా నగరంపై ఎక్కువగా ఉందని ప్రధాని ఒస్సామా హమద్ చెప్పారు. డెర్నా చుట్టుపక్కల ప్రాంతాల్లో మరో 50 మంది వరకు గల్లంతైనట్లు వెల్లడించారు. డెర్నా నగరానికి బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయన్నారు. అక్కడ విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, సమాచార వ్యవస్థ ధ్వంసమైందని తెలిపారు. డెర్నాను విపత్తు జోన్‌గా ప్రభుత్వం ప్రకటించింది.

క్యాన్సర్ కణాలకు చెక్!

- వాటిని నాశనం చేసే అతిసూక్ష్మ గోల్డ్, కాపర్ సల్ఫైడ్ రేణువుల సృష్టి
- భారతీయ శాస్త్రవేత్తల బృందం ఘనత

న్యూఢిల్లీ: మహమ్మారి క్యాన్సర్ కణాల అంతానికి నడుం బిగించిన భారతీయ శాస్త్రవేత్తల బృందం ఆ క్రతువులో విజయవంతమైంది. అతి సూక్ష్మ బంగారు, రాగి సల్ఫైడ్ రేణువులను శాస్త్రవేత్తలు సృష్టించారు. రోగి శరీరంలో క్యాన్సర్ సోకిన చోట ఈ రేణువులను ప్రవేశపెట్టి వీటిని ఫొటో థర్మల్, ఆక్సీకరణ ఒత్తిడికి గురిచేసినపుడు ఇవి క్యాన్సర్ కణాలను విజయవంతంగా వధించాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్‌సీ)కి చెందిన అధ్యయన బృందం సాధించిన ఈ ఘనత తాలూకు వివరాలు ఏసీఎస్ అప్లయిడ్ నానో మెటీరియల్స్ జర్నల్ తాజా సంచికలో ప్రచురితమయ్యాయి. గోల్డ్, కాపర్ సల్ఫైడ్ రేణువులు క్యాన్సర్ కణాలను అత్యంత సులభంగా గుర్తించగలవు కూడా. రేణువులను రోగమున్న చోట ప్రవేశపెట్టాక అక్కడ కాంతిని ప్రసరింపజేయాలి. కాంతిని శోషించుకున్న రేణువులు ఉష్ణాన్ని జనింపజేస్తాయి. వేడితోపాటే విషపూరిత స్వేచ్ఛాయుత ఆక్సిజన్ అణువులను ఇవి విడుదలచేస్తాయి. ఇవి క్యాన్సర్ కణాలను ఖతంచేస్తాయి. గోల్డ్, కాపర్ సల్ఫైడ్ రేణువులు వ్యాధి నిర్ధారణ కారకాలుగా పనిచేస్తాయి. కాంతిని సంగ్రహించి అల్ట్రాసౌండ్ తరంగాలను విడుదలచేస్తాయి. దీంతో ఏ దిశలో ఎన్ని క్యాన్సర్ కణాలు ఉన్నాయో స్పష్టంగా తెల్సుకోవచ్చు. ఈ విధానం క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ ప్రక్రియను మరింత మెరుగుపరచనుంది. క్యాన్సర్ కణజాలం గుండా ఈ అల్ట్రాసౌండ్ తరంగాలు ప్రసరించినపుడు క్యాన్సర్ కణతులపై ఆక్సిజన్ ఆనవాళ్లు, వాటి ఆకృతులు అత్యంత స్పష్టంగా కనిపించనున్నాయి. గతంలో ఈ రేణవులను పెద్ద పరిమాణంలో తయారు చేయగా ఐఐఎస్‌సీ శాస్త్రవేత్తలు ఈసారి అత్యంత సూక్ష్మ స్థాయిలో అంటే 8 నానోమీటర్ల పరిమాణంలో తయారు చేయగలిగారు. కాపర్ సల్ఫైడ్ ఉపరితలంపై అత్యంత సూక్ష్మమైన పుత్తడి రేణువులను చల్లి ఈ గోల్డ్, కాపర్ మిశ్రమధాతు రేణువులను సృష్టించారు. ఇవి ఇంత చిన్న పరిమాణంలో ఉండటంతో సులువుగా క్యాన్సర్ కణజాలంలోకి చొచ్చుకుపోగలవు. ఊపిరితిత్తులు, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కణాలపై ఈ రేణువులను ప్రయోగించి చక్కని ఫలితాలను సాధించారు.

రష్యాకు రైల్లో కిమ్

- వ్లాడివోస్టోక్‌లో పుతిన్‌ను కలుసుకునే అవకాశం
- ఒకట్రెండు రోజుల్లోనే వీరిద్దరి సమావేశం

సియోల్: ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జొంగ్ ఉన్ రష్యాకు పయన మయ్యారు. ఆయన తన సొంత బుల్లెట్ ప్రూఫ్ రైలులో ఆదివారం సాయంత్రం రాజధాని ప్యాంగాంగ్ వదిలివెళ్లారని దక్షిణ కొరియా వర్గాలు తెలిపాయి. మూడు రోజులపాటు జరిగే ఒక అంతర్జాతీయ సమావేశంలో పాల్గొనేందుకు పుతిన్ సోమవారం వ్లాడివోస్టోక్ వెళ్లారని, అక్కడే ఆయనతో కిమ్ సమావేశమవ్వొచ్చని చెబుతున్నారు. కిమ్ తమ దేశానికి వస్తున్నారంటూ రష్యా కూడా సోమవారం ధ్రువీకరించింది. అధ్యక్షుడు పుతిన్ ఆహ్వానం మేరకు త్వరలో కిమ్ రానున్నారని క్రెమ్లిన్ అధికార వెబ్‌సైట్ పేర్కొంది. పుతిన్, కిమ్‌లు త్వరలో కలుసుకుంటారని ఉత్తరకొరియా అధికార వార్తా సంస్థ కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ కూడా తెలిపింది. 'రష్యా పర్యటనలో కామ్రేడ్ కిమ్ జొంగ్ ఉన్, కామ్రేడ్ పుతిన్‌తో చర్చలు జరుపుతారు'అని పేర్కొంది. అయితే, ఈ భేటీ ఎప్పుడు, ఎక్కడ ఉంటుందనే వివరాలు మాత్రం వెల్లడించలేదు. కిమ్ విదేశీ పర్యటనలకు వినియోగించే ఆకుపచ్చ బోగీలతో కూడిన బుల్లెట్ ప్రూఫ్ రైలును రష్యా సరిహద్దుల్లోని ఉత్తరకొరియా రైల్వే స్టేషన్‌లో ఉండగా గుర్తించినట్లు అసోసియేటెడ్ ప్రెస్ తెలిపింది. ఉక్రెయిన్‌తో ఏడాదిన్నరగా కొనసాగుతున్న యుద్ధానికి అవసరమైన ఆయుధాల కొనుగోలుకు కిమ్‌తో పుతిన్ ఒప్పందం కుదుర్చుకునేందుకు అవకాశాలున్నాయన్నది పశ్చిమదేశాల అంచనా. కోవిడ్ మహమ్మారి ప్రబలిన దాదాపు నాలుగేళ్ల తర్వాత కిమ్ మొట్టమొదటి విదేశీ పర్యటన ఇదే.


రైలులోనే ఎందుకు?

గతంలో 2019లో మొదటిసారిగా వ్లాడివోస్టోక్‌లో పుతిన్‌తో సమావేశమైనప్పుడు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లతో సమావేశాలకు రైలులో వెళ్లినట్లుగానే ఈసారీ కిమ్ రష్యాకు రైలులోనే బయలుదేరారు. సొంత రైలులోనే విదేశీ పర్యటనలు చేసిన దివంగత పాలకుడు, తన తండ్రి పాటించిన సంప్రదాయాన్ని కిమ్ కూడా కొనసాగిస్తున్నారు. ఈ రైలుకు 20 బుల్లెట్ ప్రూఫ్ బోగీలుంటాయి. దీనివల్ల సాధారణ రైళ్ల కంటే ఇది ఎక్కువ బరువుంటుంది. సరాసరిన గంటకు 59 కిలోమీటర్లకు మించి వేగంతో ఇది ప్రయాణించలేదు. ఈ వేగంతో ప్యాంగ్యాంగ్ నుంచి వ్లాడివోస్టోక్‌కు వెళ్లడానికి ఒక రోజంతా పడుతుంది.



ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉండాలి

ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరించేందుకు సిద్ధంగా ఉండాలని కృష్ణా కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. -8లో▸



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 524.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ఘనంగా గంగానమ్మ విగ్రహ ప్రతిష్ట

గూడూరు: పోసినవారిపాలెంలో విజయ గంగానమ్మ ఆలయంలో సోమవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎంపీ బాలశౌరి, మంత్రి జోగి రమేష్ హాజరయ్యారు. -8లో▸

న్యూస్‌రీల్

21న విజయవాడలో 2కే రన్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహాకవి గురజాడ అప్పారావు 161వ జయంతిని పురస్కరించుకొని ఈనెల 21వ తేదీన 2కే రన్ నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు తెలిపారు. జాషువా సాంస్కృతిక వేదిక, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జీఆర్‌కే – పోలవరపు కళాసమితి, అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం సంయుక్త నిర్వహణలో తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రం నుంచి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వరకు 2కే రన్ నిర్వహిస్తారన్నారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో 2కే రన్ అవగాహన పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు కళాసమితి కార్యదర్శి గోళ్ల నారాయణరావు, నిర్వహణ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుమ్మా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 38.48 మి.మీ. సగటు వర్షపాతం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో ఆదివారం నుంచి సోమవారం ఉదయం 8 గంటల మధ్య 38.48 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఇబ్రహీంపట్నంలో 89.4, విజయవాడ రూరల్‌లో 86.4, విజయవాడ ఈస్ట్ 86.2, విజయవాడ సెంట్రల్, నార్త్, వెస్ట్‌లో 85.4 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. జి. కొండూరు మండలంలో 35.8 మిల్లీమీటర్లు, చందర్లపాడు 34.2, నందిగామ 32.6, పెనుగంచిప్రోలు 25.8, కంచికచర్ల 24.0, జగ్గయ్యపేట 18.4, వీరులపాడు 17.2 మిల్లీమీటర్లు, వత్సవాయి 15.2, మైలవరంలో 15.0, గంపలగూడెంలో 14.4, తిరువూరులో 8.6, ఏ కొండూరులో 7.2, రెడ్డిగూడెం 2.0, విస్సన్నపేటలో 1.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అమర వీరులను స్మరించుకుందాం



చిలకలపూడి(మచిలీపట్నం): అటవీ సంపదను కాపాడుతూ విధి నిర్వహణలో అసువులు బాసిన అటవీ అమర వీరులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని కృష్ణా జిల్లా అటవీశాఖ అధికారి కె. రాజశేఖర్ అన్నారు. జాతీయ అటవీ అమర వీరుల దినోత్సవం సందర్భంగా అటవీ సంపదను కాపాడే విధి నిర్వహణలో అసువులు బాసిన సిబ్బందికి ఆయన కార్యాలయంలో సోమవారం నివాళులర్పించారు. రాజశేఖర్ మాట్లాడుతూ 1939 నుంచి 2023 వరకు 23 మంది సిబ్బంది అటవీ సంపదను కాపాడే సమయంలో అసువులు బాసారన్నారు. వారి కుటుంబాలకు అటవీశాఖ ద్వారా ప్రభుత్వం తగిన పరిహారం చెల్లించటమే కాకుండా వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించిందన్నారు.

15న వైద్యకళాశాల ప్రారంభోత్సవం



చిలకలపూడి(మచిలీపట్నం): బందరు వైద్య కళాశాలను ఈ నెల 15వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నట్లు కృష్ణా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎం 15వ తేదీన విజయనగరం నుంచి మచిలీపట్నం, ఏలూరు, రాజమహేంద్రవరం, నంద్యాలలోని వైద్యకళాశాలలను ప్రారంభించనున్నారన్నారు. ఈ క్రమంలో అన్ని వసతులతో నిర్మాణాలు పూర్తి చేసుకున్న వైద్య కళాశాల ప్రాంగణంలో వర్చువల్ విధానానికి అవసరమైన స్క్రీన్లు, సౌండ్ సిస్టమ్, కెమెరాలు, సీటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా మంత్రులు, శాసనసభ్యులు, ఇతర అధికారులు పాల్గొంటారని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. వైద్యకళాశాల ప్రవేశమార్గం వద్ద ఆర్చ్ నిర్మాణం, వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు బుధవారం లోగా పూర్తి కావాలన్నారు. సమావేశంలో వైద్యకళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆశాలత, ఏపీ ఎంఎస్ఐడీసీ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎవరికీ పట్టని బంద్

ఉమ్మడి జిల్లాలో టీడీపీ బంద్‌కు స్పందన నిల్

- పట్టించుకోని జనం.. పార్టీ క్యాడర్ సైతం దూరం
- యథావిధిగా తిరిగిన ఆర్టీసీ బస్సులు
- తెరుచుకున్న దుకాణాలు.. హోటళ్లు
- కొన్ని సెంటర్లలో కాసేపు హడావుడితో మమ అనిపించిన 'తమ్ముళ్లు'



విజయవాడ లెనిన్ సెంటర్‌లో యథావిధిగా సాగుతున్న వ్యాపార దుకాణాలు



బందరులో తెరిచి ఉన్న జనసేన ఇన్‌చార్జికి చెందిన షాపు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఉమ్మడి కృష్ణా జిల్లాలో బంద్ ప్రభావం కనిపించలేదు. టీడీపీ ఇచ్చిన బంద్ పిలుపునకు జనసేన, వామపక్షాలు మద్దతు తెలిపాయి. సామాన్య ప్రజలు బంద్ గురించి పట్టించుకోలేదు. యథావిధిగా తమ కార్యకలాపాల్లో మునిగిపోయారు. జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులు మామూలుగానే తిరిగాయి. వాణిజ్య సముదాయాలు, హోటళ్లు సాధారణంగానే పనిచేశాయి. రెండు జిల్లా కేంద్రాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం జరిగింది. దీంతో పాటు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, అన్ని రెవెన్యూ, మండల కేంద్రాల్లో సైతం స్పందన నిర్వహించారు. ఇందులో ప్రజలు పాల్గొని తమ సమస్యలను విన్నవించుకున్నారు. ప్రధానంగా టీడీపీ అగ్రనేతలు బంద్ సక్సెస్ చేయాలని, రోడ్లపైకి వచ్చి బంద్‌ను పర్యవేక్షించాలని, జిల్లా నాయకత్వానికి సూచించారు. అయినప్పటికీ టీడీపీ నాయకులు, శ్రేణులు పెద్దగా పట్టించుకోలేదు. వీరికి జనసేన మద్దతు ఇచ్చినా ఫలితం మాత్రం శూన్యంగా మారింది. అరకొరగా బయటికి వచ్చిన టీడీపీ నాయకులు బంద్ చేస్తున్నట్లు ఫొటోలకు ఫోజులిచ్చారు. అనంతరం పోలీస్‌లకు సమాచారం ఇచ్చి అరెస్టు చేయించుకున్నారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు విజయవాడ బస్టాండ్ వద్దకు వచ్చి, బంద్‌లో తాము పాల్గొన్నట్లు కనపడి అరెస్ట్ అయ్యారు. కొంత మంది పేపర్ పులులు, పచ్చమీడియాలో తమ ఉపన్యాసాలతో ఊదరగొట్టడం తప్ప ఎక్కడా బంద్‌లో పాల్గొనలేదు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె. రాణా, కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



విజయవాడ బందరు రోడ్డులో కనిపించని బంద్ ప్రభావం

- విజయవాడలో బంద్ ప్రభావం ఎక్కడా కనిపించలేదు. బందరు, ఏలూరు రోడ్లలో యథావిధిగా కార్యకలాపాలు సాగాయి. వస్త్ర వ్యాపార కేంద్రాలైన కృష్ణవేణి, వస్త్రలత ప్రాంగణాలు ఉదయం అరగంటపాటు పనిచేయలేదు. తర్వాత తిరిగి యథావిధిగా తెరచుకున్నాయి. కాళేశ్వరరావు మార్కెట్, మెయిన్ బజార్లలోని వ్యాపార సముదాయాలు, విద్యాసంస్థలు, పోస్టాఫీసు, బ్యాంకు శాఖలు, ప్రభుత్వ కార్యాలయాలు అన్నీ పనిచేశాయి. దీంతో పాటు జగ్గయ్యపేట, తిరువూరు, మైలవరం నందిగామల్లో సైతం బంద్‌కు స్పందన కనిపించలేదు.
- బందరు నియోజకవర్గంలో పాఠశాలలు మినహా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు యథావిధిగా పనిచేశాయి. వ్యాపార సంస్థల యజమానులు తమ వ్యాపారాలను నిర్వహించుకున్నారు. ఆర్టీసీ బస్సులు అన్ని ప్రాంతాలకు నడిచాయి. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావును పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.
- గన్నవరం పరిధిలో కార్యాలయంలోని షాపులు యథావిధిగా పనిచేశాయి. రోడ్డుపైకి వచ్చిన టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. నియోజకవర్గ పరిధిలో బంద్ ప్రభావం అంతగా కనపడలేదు.
- అవనిగడ్డ పరిధిలో జనసేన, టీడీపీ నాయకులు బంద్ చేసేందుకు ప్రయత్నించినప్పటికీ పోలీసులు వారిని నియంత్రించారు. ఆర్టీసీ బస్సులు యథావిధిగా నడిచాయి.
- గుడివాడలో కొన్ని ప్రాంతాల్లో బ్యాంకులు మూసివేశారు. ప్రభుత్వ కార్యాలయాలన్నీ యథావిధిగా పనిచేశాయి. గుడివాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద టీడీపీ నాయకులు కొద్ది సేపు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.
- పెనమలూరు పరిధిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎక్కడా కనపడలేదు. పార్టీ నాయకులకు సంబంధించిన వ్యాపార సంస్థలు తప్ప మిగిలిన అన్ని షాపులు తెరిచే ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాలన్నీ యథావిధిగా కొనసాగాయి.
- పామర్రు ప్రధాన సెంటర్‌లో అన్ని షాపులు ఉదయం నుంచి తెరిచే ఉన్నాయి.
- పెడన పరిధిలో ఉదయం నుంచి వర్ష ప్రభావం ఉండటంతో కొన్ని దుకాణాలు మూసివేశారు. రోడ్లపైకి వచ్చి హంగామా చేసేందుకు ప్రయత్నించిన కొంత మంది టీడీపీ, జనసేన నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పెడన జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఉష తమ పాఠశాలకు టీడీపీ నాయకులు వచ్చి తమను భయభ్రాంతులకు గురిచేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుడివాడ ప్రజల చిరకాల కల నెరవేరుస్తున్నాం

బందరు ఎంపీ బాలశౌరి



గుడివాడ టౌన్: గుడివాడ పట్టణ పరిసర ప్రాంత ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చడానికి పనులు ప్రారంభిస్తున్నామని బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి అన్నారు. సోమవారం స్థానిక పామర్రు రోడ్‌లో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ పనుల ప్రారంభానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ప్రధానంగా రెండు రైల్వే గేట్లు ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్నాయన్నారు. ఇటీవల రైల్వే లైన్ డబ్లింగ్, ఎలక్ట్రిఫికేషన్ పనులు పూర్తికావడంతో రైళ్ల రాకపోకలు విపరీతంగా పెరిగాయన్నారు. దీంతో సగటున రోజుకు 40 నుంచి 50 సార్లు రైల్వేగేట్లు పడటం కారణంగా గుడివాడ నుంచి మచిలీపట్నం, పామర్రు వెళ్లి వచ్చే వారికి వ్యాపారులు, విద్యార్థులు, స్థానిక అవసరాలకు ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీసం 15 నుంచి 20 నిమిషాలు ట్రాఫిక్ నిలిచిపోతుందన్నారు. డబ్లింగ్ కారణంగా మరో రైలు ఇటుగా వస్తుంటే మరో 10 నిమిషాలు ట్రాఫిక్ నిలిచి పోవాల్సిందేనన్నారు. ఈ సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వ నిధులు రూ. 325 కోట్లతో రెండు రైల్వే లైన్లను కలుపుతూ 2.5 కిలోమీటర్లు పొడవుగల ఒకే ఫ్లై ఓవర్ నిర్మాణం జరుగుతోందన్నారు.

కొడాలి నాని చొరవతో..

స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని), తాను ఈ విషయంపై అనేకమార్లు చర్చించి బందరు వైపు ఒకటి, ముదినేపల్లి వైపు మరొకటి సబ్‌వే వచ్చేలా ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ డిజైన్ చేసి ఆమోదం పొందేలా చేశామన్నారు. కొడాలి నాని భూసేకరణ విషయంలో చొరవచూపారన్నారు. ఆర్డీఓ పి. పద్మావతి, మున్సిపల్ కమిషనర్ వి. మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, పట్టణ కార్యదర్శి చింతల భాస్కరరావు, రూరల్ అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్ పాల్గొన్నారు.

విరిగిన కొండ చరియలు

- తృటిలో తప్పిన ప్రమాదం
- నాలుగు ద్విచక్ర వాహనాలు ధ్వంసం
- దుర్గాఘాట్ ఎదురుగా ఘటన
- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన దేవదాయ శాఖ మంత్రి



శిథిలాల తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న డీసీపీ విశాల్ గున్ని

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే దుర్గాఘాట్ ఎదుట సోమవారం కొండ చరియలు జారిపడ్డాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి ఉదయం 10.25 గంటలకు కొండ రాళ్లు, మట్టి దిబ్బలు జారిపడ్డాయి. ప్రమాదంలో నాలుగు ద్విచక్ర వాహనాలు ధ్వంసం కావడంతో పాటు చిరు వ్యాపారుల సామగ్రి కూడా దెబ్బతింది. ప్రమాద స్థలాన్ని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కమిషనర్ సత్యనారాయణ, విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస రావు, డీసీపీ విశాల్ గున్ని సందర్శించారు.

ద్విచక్ర వాహనాలు ధ్వంసం..

రాజమండ్రికి చెందిన ఆదిమూలం సురేష్, విజయవాడకు చెందిన ఆకుల సూర్యనారాయణ అమ్మవారి దర్శనానికి విచ్చేశారు. తలనీలాలు సమర్పించేందుకు తమ వాహనాలను కొండ వైపు నిలిపారు. వారు కేశఖండన శాల లోపలకు వెళ్లిన రెండు నిమిషాలలోనే పెద్ద శబ్దం రావడంతో బయటకు వచ్చి చూసే సరికి తమ వాహనాలు నిలిపిన చోట కొండ రాళ్లు ఉండటంతో వారికి ఏం జరిగిందో అర్థం కాలేదు. ఈ రెండు ద్విచక్ర వాహనాలతో పాటు కేశఖండనశాలకు చెందిన జి. అప్పారావు, కట్టా చింతయ్య అనే వారి ఇద్దరి ద్విచక్ర వాహనాలు సైతం ధ్వంసమయ్యాయి. అలాగే చిరు వ్యాపారుల పూజా సామగ్రి దెబ్బతింది. జారిపడిన కొండ రాళ్లు విజయవాడ హైదరాబాద్ నేషనల్ హైవేపై పడ్డాయి. దీంతో హైవేపై రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. కొండపై నుంచి జారిపడిన రాళ్లు రోడ్డుకు అవతలి వైపున స్నానఘాట్ మెట్ల వరకు దొర్లాయి. రాళ్లు పడిన వేగానికి రోడ్డు మధ్యలో ఉన్న ట్రాఫిక్ ఐల్యాండ్స్ మూడు అడుగుల అవతలకి జరిగిపోయాయి.

తప్పిన ప్రాణాపాయం..

రాత్రి నుంచి ఉదయం 9 గంటలకు వరకు భారీ వర్షం కురియడంతో ప్రాణాపాయం తప్పింది. వర్షం అప్పుడే తెరిపి ఇవ్వడంతో కొద్ది కొద్దిగా భక్తుల రద్దీ పెరుగుతోంది. ఆ సమయంలో రాళ్లు జారిపడటంతో ఘాట్ రోడ్డు వైపు రాకపోకలను నిలిపివేయడంతో పాటు స్నానాలు ఆచరించిన భక్తులను కనకదుర్గనగర్ వైపునకు వెళ్లాల్సిందిగా సెక్యూరిటీ సిబ్బంది సూచించారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో మహిళలు గంపలలో పూజ సామగ్రిని విక్రయిస్తుంటారు. సోమవారం ఉదయం వరకు వర్షం కురుస్తూనే ఉండటంతో వారు పూజా సామగ్రిని విక్రయించేందుకు రాలేదు. దీంతో ప్రమాదం తప్పింది.

యుద్ధ ప్రాతిపదికన శిథిలాల తొలగింపు

ప్రమాదం జరిగిన వెంటనే దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబలతో పాటు వెస్ట్ ఏసీపీ హనుమంతరావు, సీఐ సురేష్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. దేవస్థాన ఇంజినీరింగ్ ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమా పరిస్థితిని సమీక్షించి వెంటనే శిథిలాల తొలగింపునకు చర్యలు చేపట్టారు. రెండు పొక్లెయిన్లను శిథిలాల తొలగింపునకు ఉపయోగించారు. ఆరు ట్రాక్టర్లతో మట్టిని మరో ప్రదేశానికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న వెస్ట్ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, డీసీపీ విశాల్ గున్ని ప్రమాదం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో నష్టపోయిన బాధితులు తమను దేవస్థానం ఆదుకోవాలని కోరారు.

నిపుణుల సలహాలతో భద్రతా చర్యలు

ఘటనా స్థలాన్ని సందర్శించిన మంత్రి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): నిపుణుల సలహాలతో కొండ చరియలు విరిగి పడకుండా అన్ని భద్రతా చర్యలు తీసుకుంటామని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. దుర్గాఘాట్ ఎదుట విరిగి పడిన కొండ చరియలను దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కమిషనర్ సత్యనారాయణ సోమవారం పరిశీలించారు. మంత్రి వెంట దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ, ఈఈలు కోటేశ్వరరావు, ఎల్. రమాలతో పాటు ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు. ప్రమాదం గురించి అధికారులను అడిగి తెలుసుకోవడమే కాకుండా శిథిలాల తొలగింపు పనులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడారు. ప్రమాదం గురించి ఐఐటీ చెన్నై జియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ మాధవ్, మైనింగ్ అధికారులతో చర్చించామన్నారు. మాధవ్ సలహాలతో భద్రతా చర్యలు తీసుకుంటామని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. రాక్ మిటిగేషన్‌తో పాటు నెట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, ఘాట్‌రోడ్డులో పడిన వర్షం నీరు పారేందుకు ప్రత్యేకంగా కాల్వను ఏర్పాటు చేయాలని ఆదేశించామని చెప్పారు.

అర్జీలకు మెరుగైన పరిష్కారం చూపాలి

- అధికారులను ఆదేశించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు
- ప్రజల నుంచి 46 అర్జీలు స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, సబ్ కలెక్టర్ అదితిసింగ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో వచ్చే ప్రతి అర్జీకి మెరుగైన పరిష్కారం చూపాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమం జరిగింది. కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు, విజయవాడ సబ్ కలెక్టర్ అదితి సింగ్ ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ స్పందనలో నమోదవుతున్న అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలన్నారు. ఆ పిటీషన్‌లను సీరియస్‌గా తీసుకొని పరిష్కరించాలన్నారు. వినతులు ఎక్కువగా నమోదవుతున్న శాఖలపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. రీ ఓపెన్ పిటిషన్లను సంబంధిత శాఖల అధికారులు ప్రతి రోజు పరిశీలించాలన్నారు. అర్జీదారుడితో మాట్లాడి అర్థమయ్యేలా వివరించి సంతృప్తి కలిగేలా పరిష్కరించాలన్నారు. నిర్దేశించిన గడువులోనే సమస్యలకు పరిష్కారం చూపడంపై అధికారులు శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంతో పాటు ఆఫ్ లైన్, ఆన్ లైన్‌లోనే అర్జీలు నమోదు అవుతాయని వీటిపై కూడా సంబంధిత శాఖల అధికారులు దృష్టి పెట్టాలన్నారు. 1902 కాల్ సెంటర్, స్పందన మొబైల్ యాప్, వెబ్ అప్లికేషన్, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా కూడా అర్జీలు నమోదవుతాయని, వాటిని పరిశీలించి అర్జీదారులకు చక్కటి పరిష్కారం చూపాలని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. మొత్తం 46 అర్జీలు నమోదయ్యాయని కలెక్టర్ తెలిపారు. ఇన్‌చార్జి డీఆర్వో వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి ప్రోత్సాహం

పెడనలో మహిళా మార్ట్‌ను ప్రారంభించిన మంత్రి జోగి రమేష్



చేయూత మహిళా మార్ట్‌లో డ్వాక్రా సభ్యులతో మంత్రి జోగి రమేష్

పెడన: మహిళలు ఆర్థికంగా ఎదిగితే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంఘాలకు చేయూతనిస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. పెడన మండలం వెలుగు, మెప్మా మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌ను సోమవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రికి మహిళా మార్ట్ గురించి వెలుగు పీడీ పీఎస్ఏ ప్రసాద్ వివరించారు. పెడన మండలంలో 941 స్వయం సహాయక సంఘాల్లో 10,024 మంది సభ్యుల భాగస్వామ్యంతో రూ.25 లక్షల వ్యయంతో మహిళా మార్ట్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య సభ్యులను మంత్రి జోగి రమేష్ అభినందించారు. పెడనలో మంచి సెంటర్లో మార్ట్ ఏర్పాటు కావడం వల్ల వ్యాపారం బాగా సాగుతుందన్నారు. ఈ మార్ట్‌ను చక్కగా నిర్వహించి మంచి లాభాలు గడించి, వివిధ ప్రాంతాల్లో మరిన్ని మహిళా మార్ట్‌ల ఏర్పాటు చేసుకోవాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో పెడన ఎంపీపీ రాజులపాటి వాణి, మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ గరికపాటి చారుమతి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తోట మునెమ్మ, మహిళ మార్ట్ నిర్వహణ కమిటీ అధ్యక్షురాలు చిల్లిమంత వెంకటేశ్వరమ్మ, డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

మీ చిట్టి చేతులతో మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే.. దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

నలంద విద్యా నికేతన్ ప్రైమరీ స్కూల్ బ్లాక్, డోర్ నం.40-9-44, ఆచార్య రంగా నగర్, బెంజ్ సర్కిల్ దగ్గర విజయవాడ-520010

తేది : 16-09-2023 (శనివారం)

సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.

రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 99126 71555

క్లుప్తంగా

ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉండాలి

రైస్ మిల్లర్ల సంఘ ప్రతినిధులకు సూచించిన కలెక్టర్

చిలకలపూడి(మచిలీపట్నం): ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరించేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో సోమవారం ఆయన చాంబర్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో పండించిన ధాన్యం కొనుగోలు ఏ విధంగా నిర్వహించాలో సంఘ ప్రతినిధులతో ఆయన చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరించాల్సి ఉందన్నారు. ఏడు నుంచి 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉన్న నేపథ్యంలో అవసరం మేరకు బ్యాంక్ గ్యారెంటీలు, గోనె సంచులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ధాన్యం నాణ్యత, పరిమాణం, తేమ శాతంలో ఎలాంటి తేడా లేకుండా సజావుగా ఉండేలా పక్కా ప్రణాళిక తయారుచేస్తున్నామని చెప్పారు. ధాన్యంలో 17 శాతంకు మించి తేమ ఉండకూడదని స్పష్టం చేశారు. రైతులకు, మిల్లర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చెల్లింపులు జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.

ధాన్యం రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేసి ట్రాకింగ్ చేస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వి శ్రీధర్, రైస్‌మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పిన్నమనేని వీరయ్య, సోమూరి కృష్ణాజీరావు, సమ్మెట శ్రీహరి పాల్గొన్నారు.

21 నుంచి నున్నలో రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు

నున్న(విజయవాడ రూరల్): విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ ఆధ్వర్యంలో తొలిసారిగా ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు అండర్ -14, 17 బాల బాలికలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎస్‌జీఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఆర్.సీజర్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీలను నున్న వికాస్ కాలేజీలో నిర్వహించేందుకు ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డితో కలిసి సోమవారం ఆయన గ్రౌండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సీజర్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ఐ ఆంధ్రప్రదేశ్ యూనిట్ టోర్నమెంట్‌ను నున్న హైస్కూల్లో నిర్వహించడానికి నిర్ణయించారని చెప్పారు. ఈ టోర్నీలో 13 జిల్లాల నుంచి 650 మంది రెజ్లర్లు పాల్గొంటారని తెలిపారు. ఈ మూడు రోజులు ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. 13వ తేదీన నున్న హైస్కూల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా అండర్ 14, 17 బాలబాలికల జట్ల సెలక్షన్ ట్రయిల్స్ నిర్వహిస్తారని వెల్లడించారు. ఈ ఎంపిక ట్రయిల్స్‌లో రాష్ట్ర చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టును ఎంపిక చేస్తారన్నారు.

షెడ్యూల్ ప్రకారమే బందరు పోర్టు పనులు

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం శరవేగంగా బందరు పోర్టు పనులు జరుగుతున్నాయని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి సోమవారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజాబాబు ఆయన చాంబర్ నుంచి హాజరయ్యారు. పోర్టు అభివృద్ధి పనుల గురించి సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2,075 మీటర్ల సౌత్ బ్రేక్ వాటర్ నిర్మాణం జరగాల్సి ఉండగా ఇప్పటి వరకు 650 మీటర్ల దూరం పూర్తయ్యిందని చెప్పారు. నార్త్ బ్రేక్ వాటర్ నిర్మాణం 250 మీటర్ల దూరం పూర్తయిందని తెలిపారు. రోడ్డు, రైల్ కనెక్టివిటీకి సంబంధించి మూడు దశల్లో చేపట్టే రహదారి అభివృద్ధి పనులకు బీచ్ నుంచి బ్రేక్ వాటర్ నిర్మాణం వరకు రహదారి పనులు జరిగాయని పేర్కొన్నారు. రెండు, మూడో దశల్లో రహదారి పనులకు సంబంధించి భూసేకరణ పనులు వేగవంతం చేశామని వెల్లడించారు. పోర్టు పనుల నిర్మాణ సాంకేతికపరమైన యంత్ర పరికరాలు వచ్చాయని వివరించారు. బెర్త్ నిర్మాణానికి సంబంధించిన పనులను కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్నట్లు స్పష్టం చేశారు. మచిలీపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శివయ్య, మెగా ఇంజినీరింగ్ కంపెనీ ప్రతినిధులు రాఘవేంద్రరావు, కలెక్టరేట్ ఏవో ఏఎస్ఎన్ రాధిక పాల్గొన్నారు.


వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

పటిష్టంగా 144 సెక్షన్ అమలు

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రతిపక్ష నాయకుడికి రిమాండ్ విధించిన నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 144 సెక్షన్‌ను పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. క్షేత్రస్థాయి, జిల్లా అధికారులతో సోమవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. శాంతి భద్రతలు, ఈ-పంట నమోదు, రక్తహీనత నివారణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో ప్రజలు ఎక్కడా గుమిగూడకుండా 144 సెక్షన్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పోలింగ్ నిర్వహణకు వసతులు ఉన్నాయో, లేదో గమనించి నివేదికలు పంపాలని కోరారు. మార్పు చేసే ప్రతిపాదనలు ఉంటే రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగే సమావేశంలో చర్చించి నివేదికలు పంపాలని చెప్పారు. ఓటరు నమోదు, తొలగింపులు, చేర్పులు, మార్పులకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిశీలించాలని తెలిపారు. ఈ విషయాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు కూడా తెలియజేయాలన్నారు. సీసీఆర్‌సీ కలిగిన కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో ఈ-పంట నమోదు, ఈ-కేవైసీ నూరుశాతం పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ మార్కెటింగ్ గోడౌన్ల నిర్మాణం కోసం స్థలాలు ఇప్పించాలన్నారు. బాలికలు, గర్భిణుల్లో రక్తహీనతను గుర్తించి కావాల్సిన మాత్రలను, పోషకాహారాన్ని అందించాలన్నారు. ఈ నెల 13వ తేదీన గన్నవరం నియోజకవర్గ పరిధిలోని ఉంగుటూరు మండలంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

జి.కొండూరు: ద్విచక్రవాహనం అదుపుతప్పి రహదారిపై పడిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఖమ్మం జిల్లా వైరాకు చెందిన సోతకాని రజనీకాంత్ (38) భార్య అరుణ, కుమారుడు, కుమార్తెతో కలిసి ఇబ్రహీంపట్నం మండల పరిధి గుంటుపల్లిలో గత ఐదేళ్లుగా నివాసం ఉంటున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం తన ద్విచక్రవాహనంపై మైలవరం వెళ్లి రాత్రి 12 గంటల సమయంలో ఇంటికి తిరుగు పయనమయ్యాడు. వర్షం కురుస్తున్న క్రమంలో జి.కొండూరు శివారులోకి రాగానే బైపాస్‌రోడ్డుపై వాహనం అదుపుతప్పి రహదారిపై పడిపోయాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలై రజనీకాంత్ మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధర్మరాజు తెలిపారు.


రజనీకాంత్ మృతదేహం

నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం రద్దు

డీపీవో ఆదేశాలతో చర్యలు

సాక్షి ఎఫెక్ట్

పెనమలూరు: రూ.కోట్లాది విలువ చేసే భూమి కోసం ల్యాండ్ మాఫియాతో చేతులు కలిపి పెనమలూరు గ్రామ పంచాయతీలో పూర్వ కార్యదర్శి జారీ చేసిన నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాన్ని సోమవారం రద్దు చేశారు. నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం పై సాక్షిలో గత నెల 27వ తేదీన ప్రచురించిన పేరు మార్చి...ఏమార్చి వార్త పై అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే పెనమలూరు గ్రామ పంచాయతీలో అవినీతి ఆరోపణలపై సస్పెన్షన్‌కు గురైన ఈవో రాధాకృష్ణ జూన్ 13వ తేదీ 2022 సంవత్సరంలో రికార్డు ట్యాంపరింగ్ చేసి వెత్సాగీత అనే మహిళ మృతి చెందిందని మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేశారు. దీనిపై పటమటకు చెందిన సీహెచ్ శివనాగేశ్వరరావు జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేశాడు. డీపీఓ విచారణకు ఆదేశిస్తూ ముగ్గురితో కమిటీ వేశారు.

విచారణలో తేలిన నిజం..

ఈ ఘటన పై విచారణ చేసిన అధికారులు పూర్వ కార్యదర్శి రాధాకృష్ణ రికార్డు ట్యాంపరింగ్ చేసినట్లు గుర్తించారు. వాస్తవానికి నవంబర్ 18వ తేదీ 2021 సంవత్సరంలో పెనమలూరుకు చెందిన షేక్‌ఫాతిమున్నీసా(ఐడీ 2021-28-05460-000157) పేరున పూర్వ ఈవో రాధాకృష్ణ మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేశాడు. అయితే ఆ తరువాత పలు మార్లు షేక్ ఫాతీమున్నీసా పేరున ఉన్న మరణ ధ్రువీకరణ రికార్డు ట్యాంపరింగ్ చేసి పైన పేర్కొన్న ఐడీతోనే వెత్సా గీత పేరున మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేసినట్లు అధికారులు గుర్తించారు. మరణ నమోదు చేసినట్లు చెబుతున్న రెంటచింతల సూర్య కిరణ్ ఆచూకీ కూడా విచారణ అధికారులకు తెలియలేదు. ఈ మేరకు నివేదిక డీపీఓకు పంపారు. విచారణ అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం వెత్సా గీత పేరున ఇచ్చిన నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం రద్దు చేయాలని డీపీఓ పెనమలూరు గ్రామ పంచాయతీ ఈవో పద్మావతిదేవికి ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఆమె వెత్సా గీత పేరున ఉన్న నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం సోమవారం రద్దు చేశారు.

గ్రామ పంచాయతీ రికార్డు ట్యాంపరింగ్ చేసిన పూర్వ కార్యదర్శి రాధాకృష్ణ పై అధికారులు ఏమి చర్యలు తీసుకుంటారనేది చర్చనీయంగా ఉంది. రికార్డు ట్యాంపరింగ్ చేసిన అధికారి పై క్రిమినల్ కేసు నమోదు చేయాల్సి ఉందని చెబుతున్నారు. ఆధారాలతో రుజువు అయినందున ఇప్పుడు అధికారులు తీసుకోబోయే చర్యలపై అందరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.


అధికారులు రద్దు చేసిన పత్రం

కృష్ణా జిల్లాలో ఎక్కడా బంద్ జరగలేదు

పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథి

పామర్రు: కృష్ణా జిల్లాలో ఎక్కడా కూడా బంద్ జరగలేదని పెనమలూరు శాసన సభ్యులు కొలుసు పార్థసారథి తెలిపారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 14 ఏళ్ల సీఎంగా పని చేసిన చంద్రబాబు తన చాకచక్యంతో టెక్నికల్ గ్రౌండ్‌తో గతంలో ఎన్నో కేసుల నుంచి తప్పించుకున్నారని చెప్పారు. ప్రస్తుతం స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అడ్డగోలుగా దొరికాడని పేర్కొన్నారు. సమాజంలో అలజడులు సృష్టించేందుకు ప్రతిపక్షాలు పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ కేసుతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి కానీ వైఎస్సార్ సీపీకి కానీ ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కేసు పూర్వాపరాలు పూర్తి స్థాయిలో పరిశీలించిన తర్వాతే సీఐడీ అధికారులు చంద్రబాబును అరెస్టు చేశారని పేర్కొన్నారు. చంద్రబాబు కేసులో గంటకు రూ.15 లక్షలు చెల్లించి పెద్ద న్యాయవాదిని పిలిపించుకుని వాదన చేయించినా కోర్టు రిమాండ్ విధించిందంటే ఆయన తప్పు ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పార్థసారథి, పక్కనే ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ మొక్కల పెంపకం పర్యావరణానికి ఎంతో దోహదం చేస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో మొక్కలు నాటుకోవాలని సూచించారు. మొక్కల వలన పచ్చటి వాతావరణం, మనసుకు ప్రశాంతత లభిస్తుందన్నారు. రాష్ట్రంలో అటవీ విస్తీర్ణాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా నివాస పరిసరాలు, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలు, రహదారులకు ఇరు పక్కల, కొండ, తీర ప్రాంతాలు, చెరువు గట్ల పైన మొక్కలు విరివిగా నాటాలని కోరారు. దీని వల్ల అటవీ విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు అవకాశం కలుగుతుందన్నారు.

రైవస్ కాలువలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

ఉయ్యూరు: ప్రమాదవశాత్తూ రైవస్ కాలువలో పడి యువకుడు మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పట్టణానికి చెందిన వ్యవసాయ కూలీ జంపాన నాగపోతురాజు (25) రైవస్ కాలువలో పడి మృతి చెందాడు. ఉయ్యూరు శివారు ఎగినపాడు వంతెన సమీపంలో ఆదివారం రైవస్ కాలువలో గల్లంతయ్యాడు. పోలీసుల సాయంతో కుటుంబసభ్యులు గాలింపు చేపట్టగా సోమవారం పమిడిముక్కల మండలం మద్రివాడ లాకుల వద్ద శవమై కనిపించాడు. గల్లంతైన పోతురాజు లాకుల వద్ద చిక్కుకోవటంతో స్థానికులు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు పోతురాజును గుర్తించటంతో పట్టణ ఎస్ఐ వీరప్రసాద్ ఆ ప్రాంతానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


మృతదేహం పరిశీలిస్తున్న ఎస్ఐ వీరప్రసాద్

రూ. 3 లక్షల విలువైన చీరలు అపహరణ

కంచికచర్ల : ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో గుర్తు తెలియని దుండగులు చొరబడి విలువైన చీరలు అపహరించారని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు గొట్టుముక్కల రోడ్డులో కొండూరు శ్రీను, శ్రీలత దంపతులు కొంతకాలం నుంచి చీరల వ్యాపారం చేస్తున్నారు. బుధవారం రాత్రి సమయంలో వర్షం కురవటంతో ఇంటికి తాళాలు వేసి వేరొక ఇంటికి పనిమీద వెళ్లారు. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని దుండగులు తాళాలు పగులకొట్టి రూ. 3 లక్షల విలువుగల చీరలు చోరీ చేశారు. రెండు గంటల తర్వాత వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులకొట్టి ఉన్నాయి. చుట్టుపక్కల వారిని విచారించారు. గుర్తు తెలియని వ్యక్తులు తమ ఇంట్లో చొరబడి చీరలు దొంగిలించారని బాధితులు ఫిర్యాదు చేశారు.

ఎన్టీఆర్ జిల్లాకు ప్రత్యేక పర్యావరణ ప్రణాళిక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈ నెల 16వ తేదీ లోగా జిల్లా పర్యావరణ ప్రణాళిక (డీఈపీ)ను రూపొందించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. జిల్లాకు ప్రత్యేక పర్యావరణ ప్రణాళికను రూపొందించడంపై కాలుష్య నియంత్రణ శాఖ, మున్సిపల్ కమిషనర్లు, వైద్య ఆరోగ్య, గనులు, గ్రౌండ్ వాటర్, జల వనరులు తదితర శాఖ అధికారులతో సోమవారం ఆయన గూగుల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన అనంతరం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాకు ప్రత్యేక పర్యావరణ ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, బయో మెడికల్, ప్లాస్టిక్ వేస్ట్, ఇండస్ట్రియల్ వేస్ట్, ఈ-వేస్ట్, ఎయిర్ క్వాలిటీ వంటి ఏడు అంశాలతో పర్యావరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు తాగునీటి కాలువల్లో కలవకుండా పట్టణ, గ్రామ స్థాయిలో ప్రత్యేక ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఉండాలని చెప్పారు. ఆసుపత్రుల నుంచి వచ్చే బయో మెడికల్ వేస్ట్, మురుగునీటిని శుద్ధి చేసే ట్రీట్‌మెంట్ ప్లాంట్లను, ఆయా ఆసుపత్రులు పర్యావరణానికి హాని కలగకుండా నిర్వహిస్తున్న విధానాన్ని తప్పనిసరిగా తనిఖీలు నిర్వహించాలని పేర్కొన్నారు. రియల్ టైం ఎయిర్ పొల్యూషన్‌లో భాగంగా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్‌లోని కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, ఓజోన్, సల్ఫర్ డయాక్సైడ్ శాతాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా నిరంతరం తెలుసుకొనే విధంగా నగరంలోని పార్కుల వద్ద ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డిస్‌ప్లేను వినియోగంలోకి తేవాలని సూచించారు. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ పి. శ్రీనివాస్, డీఎంహెచ్ఓ డాక్టర్ యం. సుహాసిని, మైనింగ్ డీడీ సుబ్రహ్మణ్యేశ్వరావు ఇరిగేషన్ ఈఈ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉరేసుకొని ఇద్దరు ఆత్మహత్య

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఉరేసుకుని యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... లబ్బీపేటలోని బృందావన్ కాలనీలో నివాసం ఉంటున్న మహ్మద్ బషీర్ అహ్మద్ అలీ ఓ కంపెనీలో సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె మహ్మద్ సిరాజున్ సుఫియా (20) తక్షశిల కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతుంది. ఆమె గత 10 నెలలుగా మానసికంగా ఆరోగ్యం బాగలేకపోవడంతో ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ మందులు వాడుతుంది. ఈ క్రమంలో 8 నెలల క్రితం నిద్ర మాత్రలు మింగి చనిపోయేందుకు యత్నించింది. ఆదివారం పుట్టినరోజు కావడంతో కుటుంబసభ్యులందరూ హోటల్‌కు వెళ్లి భోజనం చేసి సంతోషంగా గడిపారు. రాత్రి అందరూ నిద్రపోయారు. సోమవారం ఉదయం 6 గంటలకు నమాజ్ చదివేందుకు గదిలో నుంచి సుఫియా బయటకు రాలేదు. ఆమె తండ్రికి అనుమానం వచ్చి తలుపు తట్టినా తీయలేదు. వెంటనే తలుపులు పగలగొట్టి లోపలకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు నైలాన్ తాడుతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెంది ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తండ్రి అహ్మద్ అలీ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కడుపునొప్పి తాళలేక...

కంచికచర్ల: కడుపునొప్పి తాళలేక ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గొట్టుముక్కల గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు... యద్దనపూడి డేవిడ్ (19) అనే యువకుడు వ్యవసాయ కూలీ పనులు చేస్తూ తల్లిదండ్రులతో నివాసం ఉంటున్నాడు. నిత్యం కడుపు నొప్పి రావటంతో భరించలేక ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో చీరతో ఉరేసుకున్నాడు. కొంత సేపటి తర్వాత కుటుంబసభ్యులు ఇంట్లోకి వచ్చి చేసే సరికి హుగ్గీకి వేలాడుతున్న డేవిడ్‌ను కిందకు దించారు. అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బందరు కాలువలో వ్యక్తి గల్లంతు

పెనమలూరు: బందరు కాలువలో వ్యక్తి గల్లంతవ్వటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు మసీదు ప్రాంతానికి చెందిన రైతు అప్పారావు, భార్య అలివేలు కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. భర్త అప్పారావు తాపీపని చేస్తాడు. కాగా ఆదివారం భర్త అప్పారావు, కుమారుడు నవీన్ కాలకృత్యాలు తీర్చుకోవటానికి గ్రామంలో బందరు కాలువ వద్దకు వచ్చారు. అయితే అప్పారావు ప్రమాదవశాత్తూ కాలు జారి కాలువలో పడి గల్లంతయ్యాడు. ఈ విషయం కుమారుడు నవీన్ ఇంటికి వచ్చి తల్లి అలివేలుకు చెప్పాడు. దీంతో అందరు బందరు కాలువ వద్దకు వచ్చి గాలించగా అప్పారావు జాడ తెలియలేదు. ఈ ఘటన పై భార్య అలివేలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

పోలవరం కాలువలో....

ఉంగుటూరు: పోలవరం కాలువలో ఓ వ్యక్తి గల్లంతైన ఘటన బల్లిపర్రులో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గన్నవరం మండలం బల్లిపర్రు గ్రామానికి చెందిన నిమ్మకూరి సామేలు (62) కాటికాపరిగా పని చేస్తున్నాడు. అంత్యక్రియలు పూర్తి చేసి సమీపంలోని పోలవరం కాలువలో కాళ్లు శుభ్రం చేసుకుంటున్నాడు. ప్రమాదవశాత్తూ కాలు జారడంతో నీటి ప్రవాహంలో పడిపోయాడు. గల్లంతైన సామేలు కోసం ఆత్కూరు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ నేతృత్వంలో గాలింపు చర్యలు చేపట్టారు.

క్లుప్తంగా

పోలీసు స్పందనకు 38 ఫిర్యాదులు



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సీపీ టీకే రాణా ఆదేశాల మేరకు సోమవారం కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 38 ఫిర్యాదులు అందాయి. అడిషనల్ డెప్యూటీ పోలీస్ కమిషనర్ పి.వెంకటరత్నం వివిధ సమస్యలు, వినతులు, విజ్ఞప్తులకు సంబంధించి బాధితులతో మాట్లాడారు. దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదుల్లో నగదు లావాదేవీలు, భార్యాభర్తలు, కుటుంబ కలహాలు, సివిల్ వివాదాలు, వివిధ మోసాలకు సంబంధించినవి, ఇంటి అద్దె విషయం తదితర ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. అనంతరం జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలతో సమస్యలపై మాట్లాడి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

చిన్నారి వైద్యానికి సాయం



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతూ నగరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి కీర్తనకు వైద్య సాయం నిమిత్తం వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో క్రికెట్ కోచ్‌గా చేస్తున్న బాలు రూ.21,800 నగదును అందజేశారు. స్నేహితుల ద్వారా విషయం తెలుసుకున్న బాలు సోమవారం ఉదయం ఆసుపత్రికెళ్లి కీర్తన తల్లి దండ్రులకు నగదును ఇచ్చారు.

రేపు అన్నాభిషేకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాస శివరాత్రి పురస్కరించుకుని లోక కల్యాణార్థం అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరి పీఠంలో ఈనెల 13వ తేదీ శ్రీధర్మపరిషత్ మహాసంస్థాన్ ఆధ్వర్యాన స్వామివారికి అన్నాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, విశేష అర్చనలు జరుగుతాయని వివరించారు.

నేటి నుంచి ఎస్‌ఎఫ్‌ఓఐ సెలక్షన్స్

పటమట(విజయవాడతూర్పు): స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఓఐ)ఆధ్వర్యాన పటమటలోని కోనేరు బసవయ్య జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల్లో రెండు రోజుల పాటు పాఠశాల విద్యార్థులకు ఆయా క్రీడలకు నియోజక వర్గ టీముల ఎంపిక చేస్తున్నట్లు నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ తూర్పు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ఎం. రాజకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ప్రేమ్‌సాగర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళ, బుధవారాల్లో పోటీలు జరుగుతాయని, ఇందులో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ అంశాల్లో ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. అండర్ 14 బాలికలకు, అండర్ 17 బాల, బాలికలను ఎంపిక చేయనున్నామని తెలిపారు. దీనిలో పాల్గొనే విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధ్రువీకరించిన వయసు ధ్రువీకరణ పత్రాన్ని తీసుకురావాలని, సీబీఎస్ఈ విద్యార్థులకు ప్రవేశం లేదని తెలిపారు. మధ్యాహ్న పథకంలో భోజనం చేసే విద్యార్థుల వివరాలను సంబంధిత ప్రొఫార్మాలో పాఠశాల ప్రధానోపాధ్యాయులతో ధ్రువీకరణ తీసుకురావాలని, ఎంపిక పోటీలు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని వివరించారు.

'ప్రజాకాపునాడు' 20వ డివిజన్ కమిటీ నియామకం

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం 20వ డివిజన్ నూతన కమిటీని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు నియమించారు. కృష్ణలంక 20వ డివిజన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా చల్లా గణేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా శింగంశెట్టి మదన్‌కుమార్, ఉపాధ్యక్షులుగా వెన్నా శివరాం, గుండు బుజ్జిలను నియమించి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ ఐక్యంగా ఉంటూ కాపుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి వేడుకలు

ఇబ్రహీంపట్నం: మహాలక్ష్మి అమ్మవారి వేడుకలు ఇబ్రహీంపట్నంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పరిరక్షణ, అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు ఉప్పతల వెంకటలక్ష్మీ గ్రామదేవతకు పూజాధికార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న, దుర్గాప్రసాద్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.

సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు

- వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్
- స్పందనలో 8 అర్జీలు



స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): సమస్యలు పునరావృతం కాకుండా 'స్పందన' అర్జీలకు సంతృప్తికర పరిష్కారం చూపాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు సూచించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం 'స్పందన' జరిగింది. దీనిలో కమిషనర్ పాల్గొని వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఆయన సంబంధిత విభాగం అధికారులకు గడువు లోపు నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు. స్పందనలో మొత్తం 8 అర్జీలను స్వీకరించారు. అందులో పట్టణ ప్రణాళిక విభాగం–1, ఇంజినీరింగ్ విభాగం–1, రెవెన్యూ–2, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి)–3, పబ్లిక్ హెల్త్ విభాగం–1పై వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలకు నిర్దిష్ట గడువులోపు పరిష్కారం చూపాలని ఆదేశించారు. స్పందన వేదికలో అందించే ఫిర్యాదుల సంఖ్యను తగ్గించడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. విభాగాల ఉన్నతాధికారులు వారంలో తమకు కేటాయించిన సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించాలని, నోటీసు బోర్డుల ద్వారా సమాచారం ప్రజలకు అందేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (జనరల్)కె. శకుంతల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ కె.బి.ఎస్.ఎస్ లత, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎ.డి.హెచ్ శ్రీనివాస్, (డిప్యూటీ సిటీప్లానర్ ప్లానింగ్) జుబిన్ శిరన్ రాయ్, ఈఈ వెంకటేశ్వర రెడ్డి, మేనేజర్ బి.శ్రీనివాస్ రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు హయాం.. అవినీతిమయం

ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): చంద్రబాబునాయుడు 2014–19 మధ్య చేసిన పాలన అంతా అవినీతిమయమని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆరోపించారు. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని తన కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం చేతిలో ఉన్నప్పుడు ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసి టీడీపీ నాయకులు అహంకారంతో ప్రవర్తించారని మండిపడ్డారు. నాడు శాసనసభను కౌరవసభగా మార్చేసి.. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలను అగౌరవపర్చడం, సస్పెండ్ చేయడం, సంతలో పశువుల మాదిరిగా కొనుగోలు చేయడం చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీల దగ్గర నుంచి ఎమ్మెల్యేలు, మంత్రులు మొదలుకొని స్కిల్ డెవలప్‌మెంట్ అంశం వరకూ అంతా కుంభకోణమేనని చెప్పారు. నాటి ముఖ్యమంత్రితో సహా ఆధారాలతో దొరికిపోయారన్నారు. అనేక కుంభకోణాలకు కేంద్రబిందువుగా నాటి టీడీపీ పాలన సాగిందని, చంద్రబాబు అరెస్ట్‌లో ఏ ఒక్కరూ అవినీతి గురించి మాట్లాడకుండా చుట్టుపక్కల అంశాల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. నాటి సీఎం పీఏనే అమెరికాకు, మధ్యవర్తులు విదేశాలకు పారిపోయారన్నారు. స్కిల్‌డెవలప్‌మెంట్ కుంభకోణంలో సమగ్ర విచారణ చేసి, నిధులు ఎలా పక్కదారిపట్టాయనే అన్ని ఆధారాలను సేకరించి సీఐడీ చర్యలు చేపట్టిందన్నారు.

చంద్రబాబు అరెస్ట్‌తో టీడీపీ చేపట్టిన బంద్‌కు రాష్ట్ర ప్రజలనుంచి స్పందన లేకపోవడంతో టీడీపీ పరువు పూర్తిగాపోయిందని ఎమ్మెల్యే విష్ణు ఎద్దేవా చేశారు. టీడీపీ నాయకులు చేసిన అవినీతిని ప్రజలంతా ఛీకొడుతున్నారని, కోర్టు పరిధిలోకి వెళ్లిన అంశాలపై కూడా టీడీపీ బంద్‌కు పిలుపునివ్వడం అంటే రాజ్యాంగంపై, వ్యవస్థపై వారికి ఉన్న గౌరవం ఏపాటిదో అర్థమవుతుందన్నారు.

జగన్‌పై ఆరోపణలు చేయడమే పవన్ అజెండా

పవన్ కల్యాణ్, చంద్రబాబు, సీపీఐ రామకృష్ణల కలయిక సిద్ధాంతాల పరమైనది కాదని కేవలం వారిది ఆర్థిక పరమైన కలయిక అని ఆయన ఆరోపించారు. వారికి రాజకీయ సిద్ధాంతాలు లేవని జగన్‌మోహన్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేయడం, నోటికొచ్చినట్లు మాట్లాడటం మాత్రమే ప్రధాన అజెండా అన్నారు. పవన్‌కల్యాణ్‌కు రాజకీయ పరిజ్ఞానం లేదని పులివెందుల నుంచే రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, అమ్మ ఒడి వంటి గొప్ప గొప్ప సంక్షేమ పథకాలు వచ్చాయనే విషయాలను తెలుసుకోవాలని సూచించారు. మీ అందరికి అమరావతి ఒక్కటే తెలిసిందని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజల ఆర్థిక, ఆకలి బాధలన్నీ తెలుసన్నారు. విప్లవాత్మకమైన పాలన అందిస్తున్న జగన్ మోహన్‌రెడ్డిపై లేనిపోని విమర్శలు చేయడం సిగ్గుచేటని, ఇటువంటి విధానాలను పవన్, రామకృష్ణ మానుకోవాలని హెచ్చరించారు.

టీడీపీ బంద్ ప్రభావం నిల్



ఎంజీ రోడ్డులో తెరిచిన దుకాణాలు

ఆటోనగర్(విజయవాడతూర్పు): స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబును రాజమండ్రి సెంట్రల్ జైల్‌కు రిమాండ్ విధించిన నేపథ్యంలో టీడీపీ సోమవారం రాష్ట్రబంద్‌కు పిలుపునిచ్చింది. అయితే ఆటోనగర్ ప్రాంతంలో యథావిధిగా ఆర్టీసీ బస్సులు, హోటల్స్, కిరాణా షాపులు అన్ని పనిచేశాయి. కార్మికులు జవహర్ ఆటోనగర్ వచ్చారు. వందశాతం బస్సులు తిప్పినట్లు ఆటోనగర్ ఆర్టీసీ డిపో డీఎం ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

గుణదల: మాచవరం, గుణదల, క్రీస్తురాజపురం తదితర ప్రాంతాలలో బంద్ ప్రభావం కనబడలేదు. దుకాణాలు, షోరూమ్‌లు తెరిచే ఉన్నాయి. టీడీపీ కార్యకర్తలు బంద్ నిర్వహించేందుకు కనీసం రోడ్ల పైకి రాలేదు.

కృష్ణలంక: స్థానిక 17, 18, 20, 21, 22 డివిజన్లకు చెందిన టీడీపీ నాయకులెవరూ రోడ్లపైకి రాలేదు. దుకాణాలు, టీ స్టాల్స్, బ్యాంకులు, రైతుబజార్ యథావిధిగా తెరుచుకున్నాయి.

యనమలకుదురు ఆలయంలో ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు రుద్రాభిషేకం, 8 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం, 10 గంటలకు స్వామివారికి విశేష అలంకరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ గర్ స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి స్వామివారికి ప్రత్యేక హారతులు ఇచ్చి భజనలు చేశారు. కాగా 12 వ తేదీన త్రయోదశి సందర్భంగా శ్రీ మహానందీశ్వరుడికి అభిషేకం చేస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరవు తెలిపారు.

బోటింగ్ జాతీయ చాంపియన్ షిప్‌నకు కేబీఎస్ విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వాటర్ స్పోర్ట్స్‌కి సంబంధించిన కానోయింగ్ – కాయకింగ్ (బోటింగ్) విభాగంలో తమ కళాశాల విద్యార్థి ఈ వీర బాబు ఉత్తరఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి సీనియర్ విభాగంలో పోటీ చేసేందుకు ఎంపికయ్యాడని కేబీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. ఇటీవల జరిగిన ఆంధ్ర రాష్ట్ర స్థాయిలో జరిగిన 500 మీటర్ల బోటింగ్‌లో కాంస్య పతకాన్ని సాధించి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని, అతన్ని ప్రోత్సహించిన కళాశాల వ్యాయామ విభాగాధిపతి డి.హేమచంద్రరావును కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ టి.భాగ్యకుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణవేణి అభినందించారు.

ఆలయ అభివృద్ధికి ఎన్‌ఆర్‌ఐలు రూ.లక్ష విరాళం



గన్నవరం: స్థానిక పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయ అభివృద్ధికి అమెరికాకు చెందిన ప్రవాసాంధ్రులు గొట్టిముక్కల భానుదేవువర్మ, సుష్మాచౌదరి రూ.లక్ష విరాళం ఇచ్చారు. శ్రావణ మాసం సందర్భంగా సోమవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌కు విరాళం చెక్కును పాతూరి వెంకట దుర్గారాణి అందజేశారు. ఆలయ కమిటీకి చెందిన జాస్తి ఫణిశేఖర్, కాసన్నేని నాని, పొట్ల శివలీల, గుండపనేని శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో అందుబాటులో పోటీపరీక్షల పుస్తకాలు



గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ

గన్నవరం: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి.జమలపూర్ణమ్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గుడివాడకు చెందిన దాత రామాంజనేయులు అందజేసిన రూ.5 వేల విలువైన పోటీ పరీక్షల పుస్తకాలను, రీడింగ్ ప్యాడ్లను గ్రంథాలయానికి అందజేశారు. అనంతరం మాట్లాడుతూ త్వరలో జరగనున్న పోలీస్, మెయిన్స్, గ్రూపు–2 పరీక్షలను దృష్టిలో పెట్టుకుని అన్ని రకాల బుక్స్‌తో పాటు అభ్యర్థులు చదువుకునేందుకు తగిన సదుపాయాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. పోటీ పరీక్షల అభ్యర్థుల కోసం సెలవు రోజుల్లో కూడా ఒకపూట గ్రంథాలయాలను తెరవాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో రూ.1.50 కోట్లతో గ్రంథాలయాల మరమ్మతులకు నిధులు కేటాయించినట్లు చెప్పారు. పెనమలూరులో రూ.26 లక్షలతో గ్రంథాలయ భవనం నిర్మించడంతో పాటు వణుకూరులో రూ.16 లక్షలతో నూతన భవన నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. అన్ని గ్రంథాలయాల్లో కంప్యూటర్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. ఠాగూర్ గ్రంథాలయం కార్యదర్శి రమాదేవి, స్థానిక గ్రంథాలయం ఇన్‌చార్జ్ డి.బాబురావు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 13 మందికి జైలు, జరిమానా

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సీపీ టీకే రాణా ఆదేశాల మేరకు 3వ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించిన వాహనచోదకులను పోలీసులు అరెస్టు చేసి సోమవారం రైల్వే న్యాయస్థానంలో హాజరుపరిచారు. దీనిపై న్యాయమూర్తి కె.సురేష్‌బాబు 13 మందికి జైలు శిక్ష, జరిమానా విధించారు.

జాతీయ స్థాయి పద్యనాటక పోటీల విజేతలు వీరే

విజయవాడ కల్చరల్: శ్రీదేవి కళానాట్యమండలి, గుమ్మడి జయరాజ్ కళాపీఠం, సాయి హృదయ నాట్యమండలి ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై ఈ నెల 9, 10 తేదీల్లో జరిగిన సత్యహరిశ్చంద్ర నాటక పద్యగాన పోటీల విజేతలను నిర్వాహక సంఘ సభ్యులు గుమ్మడి జయరాజ్, అవినాష్ గుమ్మడి, అరుగు త్రినాథనాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరుకు చెందిన తేళ్ల రామారావు ప్రథమ బహుమతి, ఎన్టీఆర్ జిల్లాలోని చందర్లపాడుకు చెందిన కస్తాలదుర్గారావుకు ద్వితీయ, పల్నాడు జిల్లా అచ్చంపేటకు చెందిన నీలం దుర్గారావు తృతీయ బహుమతి పొందారు. దొడ్డా మిషక్‌రాజు(కృష్ణా), కె.ఇజ్రాల్(బాపట్ల), ముత్యాల నాగేశ్వరరావు (కృష్ణా), మరియదాసు(గుంటూరు), వి.వి.శివారెడ్డి(గుంటూరు)కి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వి.నారాయణ (మహబూబ్‌నగర్), పాణ్యం దత్తాశర్మ(హైదరాబాద్)కు ప్రత్యేక బహుమతులను ప్రకటించి నగదు బహుమతిని అందజేశారు. న్యాయనిర్ణేతలుగా వేమూరి నాగేశ్వరశర్మ, సుబ్బరాజు, పుష్పాల ఆంజనేయులు, నిమ్మగడ్డ ఏసుపాదం వ్యవహరించినట్లు తెలిపారు.

కారు కనిపించడం లేదని ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పార్కింగ్ చేసిన కారు తెల్లవారి చూసేసరికి కనిపించలేదంటూ గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గుణదల రామ్‌గోపాల్ థియేటర్ పక్క వీధిలో లంక రామకృష్ణ నివసిస్తున్నారు. ఆయనకు ఏపీ 30ఏబీ 0009 అనే నంబరు కలిగిన మారుతీ స్విఫ్ట్ కారు ఉంది. ఈ నెల 9వ తేదీ రాత్రి 10 గంటలకు గుణదల స్వీట్ షాప్ పక్కన పార్కింగ్ చేశారు. 10వ తేదీ ఉదయం వచ్చి చూసేసరికి కారు కనిపించలేదు. చుట్టు పక్కల వెదికినా ఫలితం లేకపోవటంతో రామకృష్ణ గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వాహనం ఢీ.. వ్యాపారికి గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అతి వేగంగా వచ్చిన వాహనం ఢీ కొట్టడటంతో వ్యాపారి గాయపడిన ఘటన గుణదల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విద్యాధర పురానికి చెందిన సీహెచ్ నాగరాజు.. కాళేశ్వరరావు మార్కెట్‌లో కూరగాయలు వ్యాపారి. సోమవారం ఉదయం మార్కెట్ నుంచి కూరగాయలు తీసుకొని రామవరప్పాడులో తెలిసిన దుకాణంలో కూరగాయలు వేసేందుకు వెళుతున్నారు. బీఆర్టీఎస్ రోడ్డు క్యాన్సర్ హాస్పిటల్ సమీపంలోకి వచ్చేసరికి వేగంగా వచ్చిన చతుర్ధచక్ర వాహనం ఢీ కొట్టింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన నాగరాజును ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుపై గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా శ్రీరణఅంకమ్మ ఆలయ వార్షికోత్సవం

దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెం నాయీబ్రాహ్మణ వీధిలో ఉన్న శ్రీరణఅంకమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని పునఃప్రతిష్ఠించి 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుక జరిపారు. తొలుత శ్రీరణఅంకమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. పలువురు గ్రామ ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొండప్రాంతవాసులూ..అప్రమత్తం

- వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్
- బ్రహ్మానందరెడ్డినగర్‌లో కొండరాళ్లు పడిన ప్రాంతం పరిశీలన



కొండరాళ్లు పడిన ఇళ్లను పరిశీలిస్తున్న దేవినేని అవినాష్, కార్పొరేటర్ అమర్‌నాథ్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): వానలు కురుస్తుండటంతో కొండప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్ సీపీ 'తూర్పు' ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చెప్పారు. కొండ ప్రాంతాల్లో సమస్యలు ఉంటే వెంటనే స్థానిక కార్పొరేటర్‌కుగానీ, వైఎస్సార్ సీపీ నాయకుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. ఆరో డివిజన్ పరిధిలోని బ్రహ్మానందరెడ్డినగర్ నాలుగో అంతర్గత రోడ్డు చివర ఉన్న నాలుగు ఇళ్లు, ఇజ్జాడ అప్పలనాయుడు వీధి చివరిలో ఉన్న ఒక ఇంటి ఆవరణలో సోమవారం కొండ రాళ్లు విరిగిపడ్డాయి. దీంతో ఇంటి ప్రహరీ ధ్వంసమైంది. ఇంటి ఆవరణలో ఉన్న సామగ్రి దెబ్బతిన్నాయి. ఘటనలో నివాసితులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. కొండ రాళ్లు పడిన ప్రాంతాన్ని అవినాష్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ వానలు పడుతుండటంతో కొండప్రాంతాల్లో ఇటువంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. కొండరాళ్లు పడే ప్రాంతాలను గుర్తించి ఇళ్లలోకి నీరు చేరినా, కొండ పైభాగంలో మురుగునీరు నిల్వ ఉంటున్నా మరే ఇతర సమస్యలున్నా వెంటనే స్థానికులు స్థానిక కార్పొరేటర్ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని అవినాష్ భరోసా ఇచ్చారు. మునిసిపల్ అధికారులతో మాట్లాడి కొండ రాళ్లు, మట్టిని తొలగిస్తామని ఇళ్ల యజమానులకు ఆయన హామీ ఇచ్చారు. స్థానిక కార్పొరేటర్ వియ్యపు అమర్‌నాథ్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఇజ్జాడ తేజ, లంకా అబ్బినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన



ఉపాధ్యాయిని అనసూయను సత్కరిస్తున్న పాలకవర్గ సభ్యులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నిష్ణాతులైన ఉపాధ్యాయులతో కొత్తపేట 'హిందూ హైస్కూల్స్' బోధన చేస్తోందని ఆ కమిటీ అధ్యక్షుడు చిట్టూరి ఆనందరామసుధాకర్ తెలిపారు. హిందూహైస్కూల్లో 30 ఏళ్లుగా నేచురల్ సైన్స్ ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న ఎం.అనసూయ ఎన్టీఆర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా విద్యాశాఖతో అవార్డు పొందిన నేపథ్యంలో సోమవారం పాఠశాల ఆవరణలో పాలకవర్గ సభ్యులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఆనందరామసుధాకర్ మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో అద్భుత ప్రతిభ ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. కమిటీ కోశాధికారి గొళ్ల బాబా విజయకుమార్ మాట్లాడుతూ అవార్డులు, రివార్డులు సాధించే కొద్దీ వృత్తిలో మరింత బాధ్యత పెరగాలన్నారు. పాఠశాల కార్యదర్శి కేఎల్వీ మోహనరావు మాట్లాడుతూ పాఠశాలకు అనసూయ సేవలు అద్భుతమన్నారు. మిగతా ఉపాధ్యాయులు కూడా అవార్డులు సాధించడానికి అడుగులు వేయాలన్నారు. అనంతరం అనసూయని పాలకవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంచర్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయుల ప్రతినిధి చిట్టా రాజశేఖర్, ఎన్‌సీసీ అధికారి బి.బ్రహ్మేశ్వర రావు తదితర సిబ్బంది పాల్గొన్నారు. కె.శ్రీనివాస్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

క్రమశిక్షణతో నాయకులుగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఫాదర్‌బాల

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులు క్రమశిక్షణతో నాయకులుగా ఎదగాలని ఫాదర్ బాలాకుమార్ తెలిపారు. స్టెల్లా కళాశాల ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యాన ఆడిటోరియంలో సోమవారం నాయకత్వ లక్షణాలపై రెండు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పోటీతత్వం ఉండాలని, అంకితభావం, కష్టపడి పనిచేసేతత్వం, సమయ పాలన, సమన్వయకర్తగా బృంద సభ్యులతో నడుచుకోవడం, సహాయ గుణం లక్షణాలు ఉండాలన్నారు.

ముంబయికి చెందిన ఫోరం ఫర్ ఫ్రీ ఎంటర్‌ప్రైజెస్ రిసోర్స్ పర్సన్‌లు రాజీవ్ కుమార్ లవ్, క్లారిస్సా మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, జీవితంలో స్థిరపడటానికి భావవ్యక్తీకరణ ముఖ్యమని చెప్పారు. నైపుణ్యం, లక్ష్య సాధన, సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకోవటం, సమస్యలు పరిష్కరించటం వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇంటర్మీడియట్ కో–ఆర్డినేటర్ వున్నం స్వప్న, అధ్యాపకులు డాక్టర్ సత్యవేదం, అధ్యాపకురాలు డాక్టర్ శ్రీలావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలో భారీ వాన



నిర్మల కాన్వెంట్ రోడ్డుపై నిలిచిన వాన నీరు

పటమట(విజయవాడతూర్పు): నగరంలో సోమవారం ఉదయం కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. ప్రధానంగా మొగల్రాజపురం, క్రీస్తురాజపురం, కృష్ణలంక, పటమట ప్రాంతాలు నీట మునిగాయి. ఆయా ప్రాంతాల్లో వీఎంసీ ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులు, సిబ్బంది ఎయిర్‌టెక్ యంత్రాలను ఏర్పాటు చేసి రోడ్డుపై నిలిచిన నీటిని తోడేశారు.

ఇంజన్లతో వాన నీరు తోడించారు


ఆటోనగర్(విజయవాడతూర్పు): రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఏపీఐఐసీ కాలనీలోని ఇళ్లల్లోకి నీరు చేరింది. దీనిపై వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ వీఎంసీ అధికారులతో మాట్లాడి ఆయిల్ ఇంజన్‌ల ద్వారా బయటకు తోడించారు. సుమారు 40 ఏళ్లుగా ఏపీఐఐసీ కాలనీ పల్లంగా ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రోడ్లతో పాటు డ్రైనేజీలను ఏర్పాటు చేశారు. ఇళ్లు చాలా పల్లంగా ఉండటంతో ఈ పరిస్థితి నెలకొంది. ఆదివారం రాత్రి 10 నుంచి సోమవారం 8 గంటల వరకు వర్షం కురిసింది. వీఎంసీ ఏఈ జాస్మిన్ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి.

నిరంతరం మెరుగైన విద్యుత్ సరఫరా



ఫీడర్‌ను ప్రారంభిస్తున్న కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్

కంకిపాడు: నిరంతర విద్యుత్ సరఫరాతో ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని కోలవెన్ను గ్రామంలో 24 గంటల విద్యుత్ సరఫరా పంపిణీని సోమవారం ఆయన ప్రారంభించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు పీఏసీఎస్ స్థలాన్ని లీజుకు అప్పగించామన్నారు.24 గంటల విద్యుత్ సరఫరాతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. విద్యుత్ శాఖ ఏడీ ఎం.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ కోలవెన్ను సబ్‌స్టేషన్ గతంలో నెప్పల్లి రూరల్ ఫీడర్ కింద ఉండేదని, 24 గంటల పారిశ్రామిక విద్యుత్ సరఫరాకు రూ.6 లక్షలతో గుడివాడ రోడ్ ఫీడర్‌లో అనుసంధానం చేశారన్నారు. దీని ద్వారా కోలవెన్ను పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందుబాటులోకి రానున్నాయని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ సురేష్‌కుమార్, సగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పవన విద్యుత్‌లో అడ్డగోలు ఒప్పందాలు

చంద్రబాబు సర్కారు అవినీతి పవనాలు

- అవసరం లేకపోయినా అప్పట్లో 41 పీపీఏలు
- 25 ఏళ్లకు కుదుర్చుకోవాలని డిస్కంలకు అప్పటి ప్రభుత్వం హుకుం
- రెట్టింపు కంటే అధిక ధరకు విద్యుత్ కొనుగోలు
- ఎలాంటి బిడ్డింగు లేకుండా ప్రైవేటు విద్యుత్ సంస్థలకు రూ.11,375 కోట్లు
- విద్యుత్ సంస్థలపై పెద్దఎత్తున ఆర్థిక భారం



సాక్షి, అమరావతి : పవన విద్యుత్ కొనుగోళ్ల విషయంలో చంద్రబాబు ప్రభుత్వం అడ్డగోలు ఒప్పందాలు చేసుకుంది. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు వద్దని ఆ రంగ నిపుణులు మార్చి 1, 2017న అప్పటి టీడీపీ ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా నివేదించినా పవన విద్యుత్ పీపీఏలకు చంద్రబాబు సర్కారు పచ్చజెండా ఊపేసింది. అది కూడా రెట్టింపు కంటే అధిక ధరకు కొనుగోలు చేసేందుకు. గుజరాత్‌లో తక్కువకే పవన విద్యుత్ దొరుకుతున్నా ఇలా ఎక్కువ ధరకు కొనుగోలు చేయడానికి పీపీఏలు ఎందుకు కుదుర్చుకున్నారు? పోనీ రాష్ట్రంలో ఏమన్నా విద్యుత్ కొరత ఉందా అంటే అప్పటికి ఆ పరిస్థితి కూడా లేదు. కేవలం ముడుపుల కోసమే పవన విద్యుత్ పీపీఏలు కుదుర్చుకున్నారు. అప్పట్లో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఏ మాత్రం పెరగలేదు. పైగా కొరతనేదే లేదు. అయినా అధిక ధర చెల్లించి ప్రైవేట్ పవన విద్యుత్ కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంకావటవల్ల విద్యుత్ సంస్థలపై పెద్దఎత్తున ఆర్థిక భారం పడింది. ఇలాంటి నష్టదాయకమైన పీపీఏల ఫలితంగా థర్మల్ విద్యుత్ యూనిట్ల ఉత్పత్తి వ్యయంతోపాటు అప్పులు కూడా పెరిగాయి. ఇందులో ప్రభుత్వ పెద్దల హస్తం ఉందనే ఆరోపణలు అప్పట్లో బలంగా వినిపించాయి.

తక్కువకే దొరుకుతున్నా..

టీడీపీ హయాంలో పవన విద్యుత్ ఏడాదికి 6 వేల మిలియన్ యూనిట్లకు పైగా రాష్ట్రంలో ఉత్పత్తి అవుతోంది. పోటీ పెరగడంతో అన్ని రాష్ట్రాల్లో ఈ పవన విద్యుత్ ధరలు తగ్గుతున్నాయి. దీంతో పొరుగు రాష్ట్రాలు నష్టదాయకమైన పీపీఏలకు దూరంగా ఉంటున్నాయి. చౌకగా లభించే చోటే విద్యుత్ కొనుగోలు చేస్తున్నాయి. గుజరాత్‌లో సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) ఓపెన్ బిడ్డింగ్‌కి పిలవగా పవన విద్యుత్ యూనిట్ రూ.2.48 చొప్పున 500 మెగావాట్లను సరఫరా చేస్తామని ఉత్పత్తిదారులు ముందుకొచ్చారు. స్ప్రింగ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, కేపీ ఎనర్జీ లిమిటెడ్ రూ.1.43కి సరఫరా చేస్తామన్నాయి. అంటే ఆ రేటుకు కొనుగోలు చేసేందుకు మనకూ అవకాశముంది. కానీ, చంద్రబాబు ప్రభుత్వం మాత్రం యూనిట్ రూ.4.84 చొప్పున కొనుగోలు చేసేందుకు పీపీఏలలో సిద్ధపడింది. అంటే ఒక్కో యూనిట్‌కు రూ.3.41 చొప్పున అదనంగా ఇచ్చేందుకు చంద్రబాబు సర్కార్ తయారైపోయింది.

ప్రైవేటుకు దోచిపెట్టింది రూ.11,375 కోట్లు..

పవన విద్యుత్ పీపీఏలను 25 ఏళ్లకు కుదుర్చుకోవాలని విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లను నాటి టీడీపీ ప్రభుత్వం ఆదేశించింది. 11 పీపీఏల ద్వారా మొత్తం 840 మెగావాట్ల విద్యుత్‌ను కొనుగోలు చేయడానికి రంగం సిద్ధమైంది. ఒక్కో మెగావాట్‌కు 2.3 మిలియన్ యూనిట్ల విద్యుత్ వస్తుంది. 810 మెగావాట్లకు 1,232 మిలియన్ యూనిట్ల విద్యుత్‌కు డిస్కంలకు ప్రైవేట్ సంస్థలు అంటగట్టాయి. ఇలా ఒక్కో యూనిట్‌కు అదనంగా రూ.3.41 చెల్లించటం ద్వారా 1,372 మిలియన్ యూనిట్లకు ఏటా రూ.455 కోట్లు అప్పనంగా ప్రైవేటు సంస్థలకు ఇవ్వాల్సి వస్తోంది. 25 ఏళ్లకు చెల్లించే అదనపు వ్యయం రూ.11,375 కోట్లు. ఎలాంటి బిడ్డింగు లేకుండా ప్రైవేటు విద్యుత్ సంస్థలకు ఇంత భారీ మొత్తాన్ని చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడడానికి కారణం భారీగా ముడుపులు చేతులు మారడమే. పవన విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై తొలుత అభ్యంతరాలు వ్యక్తంచేసిన రాష్ట్ర విద్యుత్ సమన్వయ కమిటీ ఆ తర్వాత ఆమోదం తెలపడం వెనక కూడా రాష్ట్ర ప్రభుత్వ పెద్దల ఒత్తిడి ఉంది. విద్యుత్ ఉత్పత్తిదారులు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసిన తర్వాత ప్రైవేట్ పవన విద్యుత్ కొనుగోలుకు ఆమోదం లభించడం ఈ ఆరోపణలకు ఊతమిస్తోంది.

అసలు అదనపు విద్యుత్ అవసరమేలేదు..

రాష్ట్రంలో 2017–18లో 57 వేల మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉంటుందని అంచనా వేస్తే వాస్తవ వినియోగం 52 వేల మిలియన్ యూనిట్లు దాటలేదు. 2018–19 కూడా డిస్కంలు ఇదే స్థాయిలో 61 వేల మిలియన్ యూనిట్లు అవసరం ఉంటుందని అంచనా చేశాయి. అయినప్పటికీ ఈ డిమాండ్‌ను తట్టుకునేందుకు ఏపీ జెన్‌కో థర్మల్, హైడల్ యూనిట్లు సిద్ధంగా ఉన్నాయి. రాష్ట్రంలో రోజుకు సగటున 156 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉంటే థర్మల్ ద్వారా 98 మిలియన్ యూనిట్ల ఉత్పత్తికి అవకాశం ఉంది. కేంద్రం నుంచి చౌకగా మరో 18 మిలియన్ యూనిట్లు అందుతున్నాయి. జల విద్యుత్ ద్వారా 17 మిలియన్ యూనిట్ల ఉత్పత్తికి అవకాశముంది. వీటి ద్వారా యూనిట్ విద్యుత్ సగటున రూ.3.50లోపే లభిస్తుంది. డిమాండ్ కంటే ఇంకా ఐదు మిలియన్ యూనిట్లు మిగులు ఉండే అవకాశముంది. అలాంటప్పుడు డిమాండ్ లేకుండా పవన విద్యుత్ కొనుగోలు చేయాల్సిన అవసరంలేదు.

ఇదీ రాష్ట్రంలో పవన విద్యుత్ పరిస్థితి..

ప్రస్తుతం పునరుత్పాదక ఇంధన వనరులను ఉపయోగించి 10,785.51 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యం రాష్ట్రానికి ఉంది. ఈ మొత్తంలో పవన విద్యుత్ స్థాపిత సామర్థ్యం 4,096.65 మెగావాట్లు. గతేడాది దేశ వ్యాప్తంగా 8 శాతం పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెరిగితే మన రాష్ట్రంలో 9.8 శాతం పెరిగింది. అంటే.. జాతీయ స్థాయిలో వృద్ధి కంటే 1.8 శాతం ఎక్కువగా ఏపీలో పవన విద్యుత్ ఉత్పత్తి పెరుగుదలను నమోదు చేసుకుంది. ప్రభుత్వ చర్యలకు వాతావరణంలో వస్తున్న మార్పులు తోడవ్వడంతో ఏపీలో పవన విద్యుత్‌కు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని కేంద్ర ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటీయెరాలజీ (పుణె)కి చెందిన పరిశోధకులు వెల్లడించారు. అంతేకాదు.. రాష్ట్రంలోని సముద్రతీర ప్రాంతాలపై గాలి సామర్థ్యం పెరుగుతున్నట్లు 'కపుల్డ్ మోడల్ ఇంటర్–కంపారిజన్ ప్రాజెక్టు (సీఎంఐపీ) ప్రయోగాల్లో తేలింది. ఇలాంటి అనుకూల పరిస్థితులు రాష్ట్రంలో ఉన్నాయని, రానున్నాయని ముందే నిపుణులు చెప్పినా అప్పటి చంద్రబాబు ప్రభుత్వం వినకుండా పాతికేళ్లకు పీపీఏలు కుదుర్చుకుంది.

అవినీతి కేసులో జైలుకెళ్లిన చంద్రబాబుకు మద్దతా?

మంద కృష్ణపై మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకారావు మండిపాటు



సాక్షి, అమరావతి: ప్రజల సొమ్మును లూటీ చేసి అవినీతి కేసులో జైలుకు వెళ్లిన చంద్రబాబుకు మంద కృష్ణ మద్దతు పలకడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు తప్పుబట్టారు. తాడేపల్లిలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ '2014లో మాదిగల ఓట్లు పొంది అధికారం చేపట్టిన చంద్రబాబు ఆ తర్వాత వారిని మోసం చేశాడు. కురుక్షేత్రం పేరుతో 2017లో మంద కృష్ణ తలపెట్టిన సభను అడ్డుకున్నారు. కురుక్షేత్ర సభకు వచ్చిన మాదిగ యువకులపై అక్రమ కేసులు పెట్టి జైలుపాలు చేశాడు. ఇవన్నీ చేసినందుకా మంద కృష్ణ ఇప్పుడు చంద్రబాబుకు సానుభూతి కోసం తలపెట్టిన బంద్‌కు మద్దతు పలుకుతున్నది. లేక మంద కృష్ణ 30 ఏళ్లుగా చంద్రబాబు ఉప్పు, కారం తింటున్నందుకా...?' అని కనకారావు ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ ముసుగులు తొలగించి చంద్రబాబు పాలేరునని చెప్పుకుంటే బాగుంటుందని మంద కృష్ణకు కనకారావు హితవుపలికారు. ఎస్సీ, ఎస్టీల మధ్య చిచ్చు పెట్టిన చంద్రబాబును క్షమించకూడదన్నారు.

బాబుకు మద్దతు రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే

ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి సద్రుద్దీన్ ఖురేషి



సాక్షి, అమరావతి: స్కిల్ స్కామ్‌లో అడ్డంగా దొరికిన చంద్రబాబును విపక్షాలు వెనకేసుకునిరావడం, వత్తాసు పలకడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేనని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎండీ సద్రుద్దీన్ ఖురేషి తప్పుబట్టారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం అని చెప్పుకునే పెద్ద మనిషి అందరికీ ఆదర్శంగా ఉండాలని, కానీ రాజకీయాలకే మచ్చ తెచ్చారని మండిపడ్డారు. సాక్ష్యాధారాలతో దొరికిన చంద్రబాబును కోర్టు రిమాండ్‌కు పంపినా విపక్షాలు నిసిగ్గుగా మద్దతు పలకడం సిగ్గుచేటని తెలిపారు. చంద్రబాబును హౌస్ అరెస్టులో ఉంచాలని అడుగుతున్నారంటే.. దేశంలో జైళ్లలో ఉన్న ముద్దాయిలందరినీ ఇళ్లకు పంపిస్తారా? అని సద్రుద్దీన్ ఖురేషి ప్రశ్నించారు.

బంద్ ఎందుకు.. బాబు దేశం కోసం పోరాడి జైలుకెళ్లారా?

అంబేడ్కర్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోరు సాంబయ్య



బొబ్బిలి: 'టీడీపీ అధినేత చంద్రబాబు జైలుకు వెళితే టీడీపీ, జనసేన నాయకులు ఎందుకు నిరసనలు తెలియజేస్తున్నారు. బంద్ చేస్తున్నారు. చంద్రబాబు ఏమైనా దేశం కోసం పోరాడి జైలుకు వెళ్లారా...' అని అంబేడ్కర్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోరు సాంబయ్య ప్రశ్నించారు. ప్రజాధనాన్ని లూటీ చేయడం వల్లే చంద్రబాబు జైలుకు వెళ్లాడని చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలకు వివరించి చైతన్యవంతం చేయాలని అంబేడ్కర్ పోరాట సమితి సభ్యులకు ఆయన సూచించారు. విజయనగరం జిల్లా బొబ్బిలిలో సాంబయ్య సోమవారం విలేకరులతో రాష్ట్ర వ్యాప్తంగా సెక్షన్ 144 అమలులో ఉన్నప్పటికీ టీడీపీ, జనసేన నాయకులు బలవంతంగా దుకాణాలు మూయిస్తున్నారని, వారిపై పోలీసులు కేసులు పెట్టి అరెస్టు చేయాలని కోరారు.

ఎమ్మెల్యే కోటంరెడ్డిపై నాన్‌బెయిలబుల్ కేసు



ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కోటంరెడ్డి

నెల్లూరు (క్రైమ్): పోలీసు అధికారుల విధులకు ఆటంకం కలిగించడంతోపాటు వారిని దుర్భాషలాడిన ఘటనలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిపై దర్గామిట్ట పోలీసులు నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు. స్కిల్ స్కామ్ కుంభకోణంలో చంద్రబాబును సీఐడీ పోలీసులు అరెస్ట్ చేసిన నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. పలువురు టీడీపీ నేతలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. అందులో భాగంగా దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ బీవీవీ సుబ్బారావు, ఎస్‌ఐ రమేష్ బాబు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి ఇంటికి వెళ్లి హౌస్ అరెస్ట్ చేస్తున్నామని చెప్పారు. కానీ కోటంరెడ్డి పోలీసు అధికారులపై బెదిరింపు చర్యలకు పాల్పడ్డారు. దీంతో ఎమ్మెల్యేపై 353 ఐపీసీ కింద కేసు నమోదు చేశారు.

పవన్‌కు రూ.370 కోట్ల ప్యాకేజీ అందింది

- అందుకే చంద్రబాబు పరిస్థితిపై అతిగా స్పందిస్తున్నారు
- ఎర్ర పుస్తకంలో లోకేశ్ తన తండ్రి పేరు రాసుకోవాలి
- బాబు అవినీతికి పాల్పడ్డారని ప్రజలు విశ్వసిస్తున్నారు
- వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు : మాజీ సీఎం చంద్రబాబునాయుడు నుంచి పవన్‌కళ్యాణ్‌కు 2014 ముందే ఒక విడత కింద రూ.370 కోట్లు ముట్టిందని.. అందుకే ఆయన రుణం తీర్చుకుంటున్నాడని వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. నెల్లూరు నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబును సీఐడీ అరెస్టుచేస్తే సీఎం జగన్ మీద నిందలు వేశారని.. ఏ ప్రభుత్వంలోనైనా అవినీతి అక్రమాలు, దొంగ పనులు చేస్తే చట్టపరిధిలో జరగాల్సింది జరుగుతుందన్నారు. ప్రభుత్వంపైన, న్యాయ వ్యవస్థ మీద దాడి చేయడం శోచనీయమన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

- టీడీపీ బంద్‌కు స్వచ్ఛందంగా ప్రజలు మద్దతు తెలపలేదు. బంద్ చేయాలని దుకాణదారుల మీద దౌర్జన్యాలకు పాల్పడితే తిరగబడ్డారు. బాబు అవినీతిపరుడని ప్రజలు విశ్వసిస్తున్నారు.
- లోకేశ్ తన ఎర్ర పుస్తకంలో తండ్రి చంద్రబాబు పేరు ప్రధానంగా చేర్చుకోవాలి.
- స్కిల్ స్కాంలో బాబు తన తప్పుని కేబినెట్ పైన రుద్దే ప్రయత్నం చేశాడు.
- ఫైబర్‌నెట్ కుంభకోణంలో కూడా బాబు అవినీతికి పాల్పడ్డారు. బాబు దగ్గర పీఏగా పనిచేసిన శ్రీనివాస్ కూడా రూ.2,000 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఐటీ శాఖ చెబుతోంది.
- బాబు అరెస్టుతో ఎవరెవరు ఎంతెంత భాగస్వామ్యం ఉందో బయటపడుతుంది. స్కిల్ స్కాంలో పవన్‌కూ ప్యాకేజీ అందింది. అందుకే టీడీపీ నేతల కంటే ఆయనే ఎక్కువగా రోడ్డుపై బైఠాయించాడు.
- టీడీపీ శ్రేణులకు కూడా ఇది అవాస్తవం అని చెప్పేందుకు నోరు రావడంలేదు. బాబు అంతరాత్మకు కూడా తాను దొంగనని తెలుసు. ఎవరూ కూడా చట్టం నుంచి తప్పించుకోలేరు.
- ఇక చంద్రబాబును అరెస్టుచేస్తే ఒక్కరు కూడా బయటకు రాలేదు. కేవలం ఉనికిని కాపాడుకునేందుకు కొద్దిమంది అక్కడక్కడ మాట్లాడారు. దీంతో చంద్రబాబు బలం, పరపతి ప్రజలకు అర్థమైంది.

ఎన్ని కేసులు పెట్టినా పోరాటం ఆగదు

- రాజమండ్రిలోనే ఉన్నా.. వచ్చి అరెస్టు చేసుకోండి
- అవినీతి మా రక్తంలోనే లేదు
- అన్నలా పవన్, సీఎం మమత మద్దతుగా నిలిచారు
- పరిస్థితులు చక్కబడ్డాక యువగళం తిరిగి ప్రారంభిస్తాం
- విలేకరుల సమావేశంలో నారా లోకేశ్ వ్యాఖ్యలు



సాక్షి, రాజమహేంద్రవరం/కంబాలచెరువు: ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నందుకే దొంగ కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని, ఎన్ని కేసులు పెట్టినా పోరాటం ఆగదని టీడీపీ నేత నారా లోకేశ్ అన్నారు. తన తండ్రి చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న నేపథ్యంలో ఇక్కడికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాజమండ్రిలోనే ఉంటా. ఎక్కడికీ పారిపోను. అరెస్టు చేయాలనుకుంటే వచ్చి చేయండి. ఎన్నిరోజులు జైల్లో పెడతారో పెట్టుకోండి' అని చెప్పారు. అవినీతి చేయడం తమ రక్తంలోనే లేదన్నారు. టీడీపీకి సంక్షోభాలు కొత్తకాదన్నారు. ఇందిరాగాంధీ, వైఎస్ రాజశేఖర్‌రెడ్డిలనే సమర్థంగా ఎదుర్కొన్నామన్నారు. ఇప్పుడు జగన్ ఓ లెక్కా? అంటూ ప్రశ్నించారు. అవినీతి పరులైన వాళ్లే.. చంద్రబాబుపై అవినీతి ముద్ర వేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. జగన్‌పై ఉన్న కేసులు పదేళ్లుగా ట్రయల్‌కు కూడా రావడం లేదని, ఎవరు వ్యవస్థల్ని మేనేజ్ చేస్తున్నారో దీన్ని బట్టి తెలుస్తోందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి ఒక్క కాగితంపైన కూడా బాబు సంతకం లేకపోయినా కేసులో ఇరికించారన్నారు. అప్పటి ఎండీ, ఫైనాన్స్ సెక్రటరీగా ఉన్న వ్యక్తులు ప్రస్తుతం ప్రభుత్వ సలహాదారుగా ఉన్నారని, వారిపై ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నించారు. చంద్రబాబుపై అవినీతి ఆరోపణలను ఎవరూ నమ్మడం లేదన్నారు. అన్నలాంటి పవన్ కళ్యాణ్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, జోహో సంస్థ చైర్మన్ బాబుపై అవినీతి వ్యాఖ్యలను ఖండించారని చెప్పారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడితే దొంగ కేసులు పెడతారని, కుటుంబాలను రోడ్డుపైకి లాగుతారని అన్నారు. సొంత పార్టీ ఎంపీనే కొట్టారని రఘురామను ఉద్దేశించి అన్నారు. సజ్జలను ప్యాలెస్ బ్రోకర్ వంటి వ్యాఖ్యలు చేసినందుకే ఇదంతా చేస్తున్నారని.. బాబును నడిరోడ్డు మీద కాల్చాలని వారు చేసిన వ్యాఖ్యలు మర్చిపోయారా? అని ప్రశ్నించారు. ఎర్రచందనం, గంజాయి స్మగ్లర్లు, ఫ్యాక్షనిస్టులు ఉన్న జైల్లో ఆయన్ను పెట్టడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. అందుకే హౌస్ అరెస్టు ఇవ్వాలని కోర్టులో పిటిషన్ వేసినట్లు చెప్పారు. తీర్పు వచ్చిన అనంతరం భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. యువగళం పాదయాత్రకు ఒక స్పీడ్ బ్రేక్ మాత్రమేనని, పరిస్థితులు చక్కబడిన తర్వాత మళ్లీ ప్రారంభిస్తామన్నారు. చంద్రబాబును కలిసేందుకు ములాఖత్‌కు అభ్యర్థించామని, అనుమతులు వచ్చాక కుటుంబంతో వెళ్లి కలుస్తామన్నారు.

దేశంలోనే బాబు స్కిల్డ్ క్రిమినల్

- స్కిల్ స్కాంను యువత నిశితంగా గమనించాలి
- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



వజ్రపుకొత్తూరు: దేశంలోనే స్కిల్డ్ క్రిమినల్ చంద్రబాబునాయుడని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు విమర్శించారు. యువతకు శిక్షణనిచ్చి, అర్హత ధ్రువీకరణ పత్రాలు అందించి ఉద్యోగానికి సన్నద్ధం చేసేదే స్కిల్ డెవలప్‌మెంట్ అని, ఇలాంటి సంస్థను ఏర్పాటుచేయకుండా చేసినట్లు అబద్ధాలు చెప్పి ప్రజల సొమ్మును సొంత ఖాతాలకు జమచేసుకోవడం ఎన్నడూ చూడలేదన్నారు. అందుకే యువత ఈ కుంభకోణాన్ని నిశితంగా గమనించాలని కోరుతున్నానన్నారు. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం బెండి గ్రామంలో సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడారు. రెండ్రోజులుగా ఎల్లో మీడియా అత్యుత్సాహం ప్రదర్శిస్తోందని, కన్న కొడుకు కంటే దత్తపుత్రుడి హడావుడి ఎక్కువైందని చురకలంటించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

సీమెన్స్ కంపెనీ డబ్బులు చెల్లించకుండానే డిజీటెక్ కంపెనీకు సర్కారు డబ్బులు ఇచ్చేసి విదేశాల్లో ఉన్న షెల్ కంపెనీలకు మళ్లించి ఆ కంపెనీల ద్వారా చంద్రబాబు పీఏ పెండ్యాల శ్రీనివాస్‌కు అందించి చంద్రబాబుకు చేరవేయడం వాస్తవం కాదా? ఇదే విషయాన్ని సీఐడీ కోర్టుకు తెలిపింది. చంద్రబాబు, ఎల్లో మీడియా టైం అయిపోయింది. ఇందులో రాజకీయ కక్ష ఎక్కడుంది? చంద్రబాబు లాయర్ కూడా బాబు తప్పు చేయలేదని కోర్టుకు చెప్పలేదు.

ఇన్నాళ్లకు న్యాయం, ధర్మం గెలిచాయి

- స్కిల్ స్కామ్‌లో బాబుకు రిమాండ్, జైలుకు పంపడంపై రాష్ట్ర ప్రజలు సంతోషం
- దశాబ్దాలుగా స్కాములు చేస్తూ.. చంద్రస్వామీజీలా ఫోజులు కొట్టాడు
- బాబు అరెస్టు నుంచి.. జైలు వరకు ఎక్కడా కక్ష సాధింపుల్లేవు
- పాపాల భైరవుడు బాబు సిగ్గుపడకుండా.. వేళ్లాపుకుంటూ జైలుకు
- అవినీతిపై రాజీలేని పోరాటం అంటే.. వాటా కోసం రోడ్ల మీద పొర్లాడటమా పవన్?
- ఆయన చెప్పే నిఘా వర్గాలు కేంద్రానివి కాదు.. అవి బాబువి
- మాజీమంత్రి పేర్ని నాని మండిపాటు



సాక్షి, అమరావతి :ప్రభుత్వ ఖజానా నుంచి రూ.371 కోట్లు దోచేసిన స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం కుంభకోణంలో ప్రధాన నిందితుడైన చంద్రబాబుకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించి, జైలుకు పంపడంతో ఇన్నాళ్లకు న్యాయం గెలిచింది, ధర్మం గెలిచిందని రాష్ట్ర ప్రజలు సంతోషం వ్యక్తంచేస్తున్నట్లు మాజీమంత్రి, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని చెప్పారు. చంద్రబాబు సిగ్గుపడకుండా.. వేళ్లాపుకుంటూ జైలుకు వెళ్లారంటూ ఎద్దేవా చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 45 ఏళ్లుగా ఎన్నో స్కాములు చేస్తూ.. స్టేల మీద నెట్టుకొస్తూ.. ప్రతి వ్యవస్థలోనూ, తాను ఏర్పాటు చేసుకున్న స్లీపర్ సెల్స్ ద్వారా బయటపడుతూ, సమాజానికి మాత్రం చంద్రస్వామిజీ నీతులు చెబుతూ వచ్చారంటూ విమర్శించారు. 2014–19 మధ్యలో జరిగిన అన్ని కుంభకోణాలపై విచారణ జరుపుతామని స్పష్టంచేశారు. పేర్ని నాని ఇంకా ఏమన్నారంటే..

- అరెస్టు నుంచి జైలుకు పంపే వరకు ఆయన్ను ప్రభుత్వం కక్ష సాధింపుగా కాకుండా మర్యాదగా చూసుకుంది. ఇన్ని వందల, వేల కోట్లు కొట్టేసిన వారిని ఎవరైనా ఇంత మర్యాదగా చూస్తారా?
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి దగ్గర నుంచి, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్, సీపీఐ నాయకులు, ఎల్లో మీడియా బాబును వేధిస్తున్నారని అనడం హేయం.
- చంద్రబాబు సీఐడీ విచారణకు అసలు సహకరించలేదు. ఏమో, తెలియదు, గుర్తులేదు.. ఈ మూడే కదా బాబు చెప్పింది.
- కోర్టులోకి చంద్రబాబు కుటుంబ సభ్యులంతా వస్తుంటే పోలీసులు అనుమతించారా? లేదా? జైల్లో ఆయనకు సకల సౌకర్యాలు ఇవ్వమని ప్రభుత్వం తరఫున, సీఐడీ తరఫున న్యాయవాదులు అభ్యంతరంలేదని చెప్పారా? లేదా?
- చంద్రబాబును ఇంత మర్యాదగా చూస్తే.. వేధించారని మాట్లాడతారా? కోర్టు రిమాండ్ విధిస్తే.. సిగ్గులేకుండా రెండువేళ్లూ ఊపుతూ జైలుకెళ్లాడు.
- ఇక కేంద్ర ప్రభుత్వం ఇంటర్నెట్ కోసం రూ.5 వేల కోట్లు ఇస్తుందని తెలిసి, చంద్రబాబు, ఆయన కొడుకు ఫైబర్‌నెట్ స్కాం చేశారు. అమరావతిలో పేదలకు ఇళ్లు కట్టిస్తామంటూ కాంట్రాక్టుల పేరుతో రూ.119 కోట్లు లూటీ చేసినా ఏమీ పట్టించుకోకూడదా?
- అవినీతిపై రాజీలేని పోరాటమంటే.. రోడ్ల మీద పడి పొర్లాడటమా పవన్?
- వారాహి యాత్రలో గోదావరి జిల్లాల్లో కనీసం 50 మందిని చంపేయడానికి రెండువేలమంది కిరాయి రౌడీలను వైఎస్సార్‌సీపీ నేతలు పంపారని పవన్ చెప్పడం హేయం. సైకలాజికల్ డిజార్డర్‌తో ఉన్న పవన్‌ను సైక్రియాటిస్టు ఇండ్ల రామసుబ్బారెడ్డికి చూపించాలి. పవన్ చెప్పే నిఘా వర్గాలు కేంద్రానివి కాదు.. చంద్రబాబువి.

చట్టాలు చంద్రబాబు చుట్టాలు కాదు

- పోలవరం, పట్టిసీమ, ఏలేరు, ఈఎస్‌ఐ, అమరావతి భూములు వంటి స్కామ్‌లతో బాబు సరిపెట్టలేదు
- చంద్రన్న కానుకలో బెల్లం, హెరిటేజ్ నెయ్యి వంటి కుంభకోణాలూ ఎన్నో ఉన్నాయ్
- మాజీ మంత్రి కురసాల కన్నబాబు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్:'ముఖ్యమంత్రిగా 14 ఏళ్లు పని చేశాను. నేను చాలా నీతిమంతుడిని. నాకన్నా గొప్ప నాయకుడు ఎవరూ లేరని తనకు తానే సర్టిఫికెట్లు ఇచ్చుకుని సొంత మీడియా బలంతో పేట్రేగిపోతున్న చంద్రబాబు పాపం పండింది. ఆయన రాజమండ్రి సెంట్రల్ జైలుకు వెళ్లారు. చట్టాలు చంద్రబాబు చుట్టాలు కాదని చంద్రబాబు అరెస్ట్‌తో రుజువైంది' అని మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. కాకినాడలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం నాటి పరిణామాలను చూసినప్పుడు 2014–19 మధ్య ఎంత దుర్మార్గమైన అవినీతి జరిగిందో, చంద్రబాబు తన సొంత మనుషులకు ఏ విధంగా దోచిపెట్టారో అర్థమైందన్నారు. గాలిలో విభూది సృష్టించినట్టు స్కిల్ స్కామ్‌లో రూ.371 కోట్లు లాగేశారన్నారు. 15 రోజులుగా చంద్రబాబు, లోకేశ్ కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై వాడుతున్న భాషను చూస్తే ఎంతగా ఫ్రస్టేషన్‌లో ఉన్నారో అర్థమయ్యిందన్నారు.

ఢిల్లీ లూథ్రాను రప్పించి.. పవన్ సీన్ క్రియేట్ చేసినా..

'నన్ను ఎవరూ ఏమీ పీకలేరు. మీ నాన్నే ఏమీ చేయలేకపోయాడు. నువ్వేం చేస్తావ్' అని సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డిని ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడారని కన్నబాబు గుర్తు చేశారు. చంద్రబాబును అరెస్ట్ చేస్తే ఢిల్లీ నుంచి సిద్ధార్థ లూథ్రా అనే లాయర్‌ను తీసుకొచ్చి సినిమా తరహాలో సీన్ క్రియేట్ చేశారన్నారు. ఆయన సరిపోలేదని మరో సినీ వకీల్ సాబ్ వచ్చి రోడ్డుపై పడుకున్నారన్నారు. చంద్రబాబు స్కిల్ స్కామ్‌తో పాటు రాజధానిలో భవన నిర్మాణాల పేరిట షెల్ కంపెనీల ద్వారా నిధులు తినేశారన్నారు. చంద్రబాబు పీఏ శ్రీనివాస్ రూ.118 కోట్లు లాగేసిన కేసుతోపాటు ఈఎస్‌ఐ కుంభకోణం ద్వారా రూ.150 కోట్లతో మందుకు బదులుగా కొబ్బరి నూనెలు, ఫేస్ క్రీమ్‌లు కొన్నారన్నారు. ఫైబర్ గ్రిడ్, పండుగలకు చంద్రన్న కానుక పేరిట బెల్లం స్కామ్, హెరిటేజ్ నుంచి నెయ్యి కొనుగోలు పేరిట భారీ స్కామ్‌లు చేశారన్నారు. ఉపాధి హామీ కూలీలకు వేసవిలో మజ్జిగ సరఫరా పేరిట హెరిటేజ్ సంస్థకు నిధులు మళ్లించారన్నారు. చంద్రబాబు ఏది ముట్టుకున్నా అవినీతి పారిందని, అయినా ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5 ఎల్లోమీడియా చంద్రబాబు అన్నాహజారే అన్నట్టుగా.. దేశంలోనే అత్యంత గొప్ప నాయకుల్లో ఒకరిగా రాశాయన్నారు. చంద్రబాబును అరెస్ట్ చేస్తే ఆయనతో ఫెవికాల్ బంధం ఉన్న పవన్ కల్యాణ్ ఎంత బాధపడ్డారో రోడ్డుపై పడుకోవడంతో తెలిసిందన్నారు. చంద్రబాబు వదిన పురందేశ్వరి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు కావడంతో ఆయన అరెస్ట్‌ను ఆక్రమం అంటున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని మోడల్‌గా పాలిస్తుంటే ఇవేవీ ఎల్లో మీడియాకు కనిపించవన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పాల్గొన్నారు.

స్కిల్ స్కామ్‌లో మీకేమర్థమైంది?

- అసలు స్కామ్ జరిగిందా?లేదా?
- పవన్ కళ్యాణ్‌కు ప్రశ్నలు సంధించిన ఆర్జీవీ



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు అరెస్టును తప్పుపట్టిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు ట్విట్టర్ వేదికగా సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ (ఆర్జీవీ) ప్రశ్నల వర్షం కురిపించారు. ''స్కిల్ స్కామ్ కేసులో పవన్‌కు ఏమి అర్థమైందో.. నా ప్రశ్నలకు ఒక్క పదంలో జవాబులు ఇవ్వండి'' అంటూ సోమవారం ట్వీట్ చేశారు. సీఐడీ చంద్రబాబును అరెస్టు చేసిన నేపథ్యంలో అసలు స్కిల్ స్కామ్ జరిగిందా? లేదా?. ఒకవేళ స్కామ్ జరిగితే.. సీబీఎన్ (చంద్రబాబు)కు తెలియకుండా జరిగిందా?. రూ.300 కోట్లకుపైగా ప్రజాధనాన్ని నిబంధనలకు విరుద్ధంగా, అధికారులు చెబుతున్నా వినకుండా విడుదల చేశారా?లేదా?. అప్పటి ప్రభుత్వ అధినేతగా చంద్రబాబుకు స్కామ్ జరిగిన తర్వాత విషయం తెలిసి ఉంటే వెంటనే దానిపై చర్యలు తీసుకోకపోవడం సరైనదేనా?. దర్యాప్తులో సేకరించిన సమాచారాన్ని ఎఫ్‌ఐఆర్‌లో ఎప్పుడైనా ఎవరి పేరైనా చేర్చవచ్చన్న విషయం మీకు తెలీదా?. సీఐడీ కోర్టుకు సమర్పించిన పత్రాల్లో అక్రమాలు జరిగినట్టు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని నమ్మి న్యాయమూర్తి బెయిల్ ఇవ్వకపోవడం తప్పా? సెక్షన్ 409 వర్తిస్తుందని చెప్పి రిమాండ్ విధించిన న్యాయమూర్తి అవినీతిపరురాలా? నాయకులంటే 40 ఏళ్ల బ్యాక్‌గ్రౌండ్‌ను బట్టి కాదు.. వాళ్లు చేసే పనులు బట్టి అనే విషయం మీకు తెలీదా?'' అంటూ ప్రశ్నలను పోస్టు చేశారు. స్కిల్ స్కామ్ కేసులో ఏమి అర్థమైందో, దానిలోని తప్పులేంటో చెబుతూ పవన్ కెమెరావైపు చూస్తూ వీడియోను విడుదల చేయాలన్నారు.



బాబు అరెస్టు.. బహుజనుల విజయం

1,079వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: బాబు అరెస్టుతో బహుజనులకు న్యాయస్థానాలపై నమ్మకం పెరిగిందని, ఇది పేదల విజయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,079వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో సోమవారం పలువురు మాట్లాడారు. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ 27 కేసుల్లో స్టేలు తెచ్చుకుని ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేసిన బాబు ప్రజాక్షేత్రంలో తిరిగేందుకు అనర్హుడన్నారు. వంద గొడ్లను తిన్న రాబందు ఒక్క గాలివానకు కొట్టుకెళ్లిన చందంగా బాబును రాజమండ్రి జైలుకు రిమాండ్‌కు తరలించడం హర్షణీయమన్నారు. ప్రజలు తమను నమ్మడం లేదని గ్రహించిన చంద్రబాబు యువగళం పాదయాత్రను అడ్డుపెట్టుకుని లోకేశ్, ప్రజలను రెచ్చగొట్టి బాబు లబ్ధి పొందాలని చూసి అల్లర్లు సృష్టిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ పిలుపునిచ్చిన బంద్ అట్టర్‌ఫ్లాప్ అయిందన్నారు. చిట్‌ఫండ్ సంస్థను అడ్డుపెట్టుకుని ప్రజలను నిలువునా మోసం చేసిన రామోజీరావును కూడా త్వరలో అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాబు కేసులో వచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ బహుజన పరిరక్షణ సమితి దీక్షా శిబిరంలో న్యాయదేవత చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. నాయకులు పెరికే వరప్రసాద్, పులి దాసు, మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ శవ రాజకీయం

అనారోగ్యం బారినపడి రాష్ట్రవ్యాప్తంగా పలువురి మృతి

చంద్రబాబు అరెస్ట్‌ను తట్టుకోలేక అభిమానులు మరణిస్తున్నారంటూ కలరింగ్ / ఎల్లో మీడియా ద్వారా ప్రచారం చేయిస్తున్న టీడీపీ నేతలు

శ్రీకాళహస్తి/పెద్దపంజాణి/గుడుపల్లె/తాడేపల్లిగూడెం రూరల్: అనారోగ్యం బారిన పడి మృతి చెందిన వ్యక్తుల శవాలనూ టీడీపీ నేతలు వదలడం లేదు. నిత్యం అనారోగ్య కారణాలతో రాష్ట్రంలో మరణాలు సంభవిస్తూ ఉంటాయి. రెండు రోజులుగా అలాంటి మరణాలను చంద్రబాబు అరెస్ట్‌ను తట్టుకోలేక వ్యక్తులు ప్రాణాలు విడుస్తున్నట్టుగా టీడీపీ నేతలతోపాటు ఎల్లో మీడియా ప్రచారం చేస్తోంది. తద్వారా చంద్రబాబు అరెస్ట్‌పై సానుభూతి సంపాదించేందుకు టీడీపీ నేతలు తెగతాపత్రయ పడుతున్నారు. అయితే, వాస్తవాలు తెలిసిన ఆయా ప్రాంతాల వారు టీడీపీ ప్రచారయావను చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. పలుచోట్ల నమోదైన మరణాలు టీడీపీ ఖాతాలోకి చేరిపోయాయి. వాటిలో కొన్ని ఇలా..

గుండెపోటుతో మరణించాడంటూ..

తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం తంగేళ్లపాలెం దళితవాడకు చెందిన వెంకట రమణయ్య(45) ఈ నెల 9న మధ్యాహ్నం రుయాలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అయితే చంద్రబాబు అరెస్ట్ వార్త విని గుండెపోటుతో మరణించాడంటూ తెలుగుదేశం నాయకులు, పచ్చమీడియా శవ రాజకీయం మొదలుపెట్టాయి. నిజానికి వెంకట రమణయ్యకు బీపీ, షుగర్ వంటి ఆనారోగ్య సమస్యలున్నాయి. 9న ఉదయాన్నే ఆయన పొలానికి వెళ్లి కళ్లు తిరిగి పడిపోవడంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అతను బీపీ మాత్రలు సక్రమంగా వేసుకోకపోవంతో బీపీ ఎక్కువై మెదడులో నరాలు దెబ్బతినడంతో కోమాలోకి వెళ్లాడని వైద్యులు తెలిపారు. దీంతో అక్కడినుంచి తిరుపతిలోని మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. దీంతో రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతిచెందాడు. దీనిని చంద్రబాబు అరెస్ట్ వార్త విని గుండెపోటుతో మరణించాడంటూ ఎల్లో మీడియాలో ప్రచారం చేయడమేంటని బంధువులు, తంగేళ్లపాలెం గ్రామస్తులు ప్రశ్నించారు.



చిత్తూరు జిల్లా కొడతనపల్లె చెందిన మృతుడు వెంకటేష్ బంధువులకు ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మరో ఘటనలోనూ..

చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలం కొడతనపల్లెకు చెందిన వెంకటేష్‌కు ఈ నెల 9న ఉదయం గుండెపోటు రావడంతో కుప్పంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆరోగ్యం కుదుటపడటంతో ఇంటికి తీసుకొచ్చారు. మరుసటిరోజు ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో గుండెనొప్పి ఎక్కువ కావడంతో ఇంట్లోనే మృతి చెందాడు. ఈ విషయం తెలిసి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్సీ భరత్‌కు సమాచారం అందించారు. వెంటనే దహన సంస్కారాల కోసం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు అందించారు. ఆ తరువాత టీడీపీ నాయకులు అక్కడికి వెళ్లి చంద్రబాబును అరెస్ట్ చేసిన దాన్ని టీవీలో చూసి గుండెపోటుతో మరణించాడంటూ సోషల్ మీడియాలో హల్‌చల్ చేశారు.

కత్తార్లపల్లిలోనూ ఇదే తీరు



చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలం కత్తార్లపల్లికి చెందిన శంకరప్ప(50) ఆదివారం సాయంత్రం బంధువుల ఇంట్లో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై ఇంటికొచ్చాడు. అరుగుపై విశ్రాంతి తీసుకుంటుండగా.. ఉండగా ఉన్నట్టుండి కుప్పకూలాడు. వెంటనే అతన్ని పుంగనూరు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు గుర్తించారు. దీనిపై స్థానిక టీడీపీ నాయకులు శంకరప్ప టీడీపీ కార్యకర్త అని, చంద్రబాబును అరెస్ట్ చేసి రాజమండ్రి జైలుకు పంపడంతోనే గుండెపోటుతో మృతిచెందాడని ప్రచారం చేశారు. దీనిని గమనించిన గ్రామస్తులు ఇదేం శవరాజకీయాలు నాయనా అంటూ నోరెళ్లబెట్టారు.

20 రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తినీ..



పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లికి చెందిన చిరు వ్యాపారి తాడేపల్లి శేఖర్(40) అనే వికలాంగుడు 20 రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రెండు, మూడు రోజులకు ఒకసారి తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి వెళ్తూ చికిత్స తీసుకుంటున్నాడు. ఆదివారం అర్ధరాత్రి గుండెల్లో మంటగా ఉండటంతో ఆర్ఎంపీ వైద్యుడితో ఇంజెక్షన్ చేయించారు. మెరుగైన వైద్యం కోసం సోమవారం తెల్లవారుజామున అంబులెన్స్‌లో తణుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో శేఖర్ మృతి చెందాడు. కానీ.. ఇతడి మరణాన్ని చంద్రబాబు జైలుకు వెళ్లడాన్ని తట్టుకోలేక మృతి చెందాడంటూ ఎల్లో మీడియా ప్రచారం చేసింది.

చంద్రబాబు సీట్లో బాలయ్య

టీడీపీ ముఖ్య నేతలతో సమావేశం

సాక్షి, అమరావతి: చంద్రబాబు అరెస్టయి జైల్లో ఉండటంతో ఆయన బావమరిది, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పార్టీ కార్యాలయంలో ముఖ్య నేతలతో సోమవారం సమావేశం నిర్వహించడం చర్చనీయాంశమైంది. టీడీపీని ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు లాక్కున్న తర్వాత పార్టీలో నందమూరి కుటుంబం ఎప్పుడూ కీలకపాత్ర పోషించలేదు. తొలిసారి.. చంద్రబాబు తర్వాత పార్టీని ఎవరు నడపాలి? ఎలా నడపాలి? అనే చర్చ మొదలైంది. తన కొడుకు లోకేశ్‌ను చంద్రబాబు ప్రమోట్ చేసినా క్యాడర్, నేతలు అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో తొలిసారి బాలకృష్ణ మంగళగిరి పార్టీ కార్యాలయానికి వచ్చి చంద్రబాబు సీట్లో కూర్చుని పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నేతలు యనమల రామకృష్ణుడు, కంభంపాటి రామ్మోహనరావు, యరపతినేని శ్రీనివాసరావు, నక్కా ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు. చంద్రబాబు ఎన్ని రోజులు జైల్లో ఉండే పరిస్థితి ఉంది, ఈ సమయంలో పార్టీని ఎవరు నడపాలనే దానిపై చర్చ జరిగింది.



మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ నేతలతో సమావేశమైన బాలకృష్ణ

బాబు శేష జీవితం జైలులోనే!

తండ్రి అవినీతికి పాల్పడలేదని లోకేశ్ ఎందుకు చెప్పలేకపోతున్నారు

మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సాక్షి, విశాఖపట్నం: అవినీతి, అక్రమాలకు పాల్పడి.. వ్యవస్థలను అనుకూలంగా మార్చుకుంటూ చేసిన తప్పుల నుంచి తప్పించుకు తిరుగుతున్న నవయుగ వీరప్పన్ చంద్రబాబు శేష జీవితమంతా జైలులోనే అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సోమవారం విశాఖ సర్క్యూట్ హౌస్‌లో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ ఇద్దరూ ఆదాయానికి మించిన ఆస్తుల కేసు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారా అని సవాల్ విసిరారు. తండ్రి అరెస్ట్ అయ్యాడన్న ఫ్రస్టేషన్‌లో లోకేశ్ మీడియా ముందుకు వచ్చి చంద్రబాబును వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వేధిస్తోందంటున్నాడని.. తాము వేధించాల్సి వస్తే అధికారం చేపట్టిన మూడు నెలల్లోనే జైళ్లకు పంపించే వాళ్లమని అన్నారు. ఎంతసేపూ ఈ కేసులో వాళ్లను అరెస్ట్ చేయలేదు.. వీళ్లను అరెస్ట్ చేయలేదని చెప్పడం తప్ప తన తండ్రి తప్పు చేయలేదని లోకేశ్ ఎందుకు ధైర్యంగా చెప్పలేకపోతున్నాడని ప్రశ్నించారు. కార్పొరేషన్లకు సంబంధించిన ఫైల్ మంత్రి వరకు రాదంటూ లోకేశ్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి అమర్‌నాథ్ స్పందిస్తూ.. లోకేష్ మంత్రిగా ఉన్నప్పుడు డబ్బులు వచ్చే ఫైల్స్‌కి మాత్రమే సంతకం పెట్టేవారా? అందుకే మిగిలిన ఫైల్స్ చూడలేదా? అని ప్రశ్నించారు. కార్పొరేషన్లలో విధాన నిర్ణయాలు తీసుకోవలసి వస్తే ఫైల్స్ సంబంధిత మంత్రి వద్దకు వచ్చి తీరుతాయని అమర్‌నాథ్ స్పష్టం చేశారు. అతి త్వరలోనే చిన్నబాబు లోకేశ్ కూడా జైలుకి వెళ్లడం ఖాయమన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర భారతదేశ చరిత్రలో అవినీతికి పాల్పడి ఆంధ్రప్రదేశ్‌లో జైలుకెళ్లిన ఏకైక మాజీ సీఎం చంద్రబాబు అన్నారు. ఏలేరు స్కాం నుంచి భారత్ ఐజీఎం, స్టాంపుల కుంభకోణం, పట్టిసీమ, పోలవరం, ఫైబర్ నెట్ ఇలా 2014 నుంచి 2019 వరకు అనేక కుంభకోణాలకు పాల్పడిన చంద్రబాబు అమరావతి పేరిట కూడా అనేక భూ కుంభకోణాలకు పాల్పడ్డాడన్నారు. చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ సోమవారం బంద్ విజయవంతంగా జరిగిందని లోకేశ్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. హెరిటేజ్ కౌంటర్లు, ప్రియా పచ్చళ్లు అమ్మకాలు యధావిధిగా జరిగిన విషయం లోకేశ్ దృష్టికి రాలేదేమో అని సెటైర్లు విసిరారు. దత్త తండ్రిని అరెస్ట్ చేస్తే తిన్నదానికి విశ్వాసం చూపిస్తూ పవన్ కల్యాణ్ హైడ్రామా నడిపించారన్నారు. చంద్రబాబు జైలుకు వెళితే లోకేశ్ కంటే పవన్‌కే ఎక్కువగా బాధ కలిగిందని విమర్శించారు.

ఆర్థిక నేరగాళ్లకు ‘స్నేహ’హస్తం!

రాజమండ్రి సెంట్రల్ జైల్లో స్నేహ బ్లాక్ ప్రత్యేకం



రాజమండ్రి సెంట్రల్ జైలు

- కారాగారంలో అధునాతన బ్యారక్‌గా పేరు
- అలాంటి బ్లాక్ మొత్తం చంద్రబాబుకు కేటాయింపు
- వీఐపీ ముద్దాయికి కల్పించే వసతులు
- బ్లాక్ వైపు ఇతర ఖైదీలు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు
- జైలు పరిసర ప్రాంతాల్లో 300 మంది పోలీసులతో భద్రత

సాక్షి, రాజమహేంద్రవరం: ‘స్నేహ బ్యారక్’.. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కువగా వినిపిస్తున్న పేరు. రాజమండ్రి సెంట్రల్ జైల్లోని ఈ బ్యారక్‌కు అంత క్రేజ్ ఎందుకంటే.. ఆర్థిక నేరాల్లో రిమాండ్‌కు వచ్చే ఖైదీలకు ఆ బ్యారక్‌ను కేటాయిస్తారు. ప్రస్తుతం స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో జ్యుడీషియల్ రిమాండ్ అనుభవిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబుకు సైతం అదే బ్యారక్ కేటాయించడంతో ఆ బ్లాక్ పేరు మరింతగా ప్రాచుర్యంలోకి వచ్చింది.

జైలుకు 150 ఏళ్ల చరిత్ర

రాజమండ్రి సెంట్రల్ జైలుకు 150 ఏళ్లకుపైగా చరిత్ర ఉంది. అత్యంత భద్రతతో కూడిన జైల్‌గా దీనికి పేరు. జైల్లో చిన్నవి, పెద్దవి కలిపి 11 బ్లాక్‌లు ఉన్నాయి. ఒక్కో బ్లాక్‌కు కనిష్ఠంగా 6 రూములు ఉంటాయి. ఇలా మొత్తం 52 గదులు ఉన్నాయి. 1602లో డచ్ దేశస్తులు కోట నిర్మిస్తే.. దానిని 1864లో బ్రిటిష్ పాలకులు జైలుగా మార్చారు. 1870లో పూర్తి స్థాయి కేంద్ర కారాగారంగా తీర్చిదిద్దారు. 190 ఎకరాల్లో విస్తరించిన జైల్‌లో సుమారు 152.76 ఎకరాలు ఖాళీ స్థలం కాగా, 37.24 ఎకరాల్లో భవనాలు ఉన్నాయి. అప్పట్లో నిర్మించిన భవనాలు నేటికీ చెక్కుచెదరలేదు. ఇటీవల కొన్నింటిని ఆధునీకరించారు.

చంద్రబాబుకు ప్రత్యేక వసతులు

అధునాతన వసతులతో నిర్మించిన స్నేహ బ్లాక్‌లో 13 గదులు ఉంటాయి. చంద్రబాబు రిమాండ్‌కు వచ్చిన సందర్భంగా అప్పటికే ఉన్న ఖైదీలను ఖాళీ చేయించి బ్యారక్ మొత్తం ఆయనకే కేటాయించారు. ఇతర బ్యారక్‌ల నుంచి ఎవరూ అటు వైపు వెళ్లకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. వీఐపీలకు ఉండే సౌకర్యాలన్నీ కల్పించారు. అందులో ఒక గదిని అత్యంత సౌకర్యవంతంగా తయారు చేసి బాబుకు కేటాయించారు. గదిలో ఫ్యాన్, సేదతీరేందుకు సౌకర్యమైన బెడ్, న్యూస్ పేపర్, ఏసీ కూడా ఏర్పాటు చేసినట్లు తెలిసింది. అయితే గదిలో ప్రత్యేకంగా టీవీ ఉండదు. కామన్ ఏరియాలో ఉంటుంది కానీ, బయటకు వెళ్లి ఇతర ఖైదీలతో కలసి టీవీ చూసే వెసులుబాటు చంద్రబాబుకు లేదు. 24 గంటల పాటు వైద్యులను అందుబాటులో ఉంచారు. ఇక చంద్రబాబుకు మందులు, భోజనం లాంటి సేవలు అందించేందుకు ప్రత్యేకంగా ఒక వ్యక్తిని కేటాయించారు. నలుగురు వ్యక్తిగత భద్రత సిబ్బందిని పహారా పెట్టారు. వీరితో పాటు 24 గంటలూ జైలు సిబ్బంది బ్యారక్ చుట్టూ కాపలా ఉంటారు. గతంలో ఈ బ్లాక్‌ను ఎర్రచందనం అక్రమ రావాణా కేసులో రిమాండ్‌కు వచ్చిన వారికి కేటాయించారు.

కట్టుదిట్టమైన భద్రత

రాజమండ్రి జైలు పరిసర ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం చేశారు. జైలు చుట్టూ సుమారు 50 అడుగుల ఎత్తున దృఢమైన గోడ ఉంటుంది. ఇక్కడ భద్రత చర్యల్లో భాగంగా 300 మంది పోలీసులు 24 గంటల పాటు విధులు నిర్వర్తిస్తున్నారు. జైలు బయట సైతం ప్రత్యేకంగా సీసీ కెమెరాలు అమర్చారు. ఎక్కువమంది అక్కడికి చేరితే వారిని అదుపు చేసేందుకు భారీ స్థాయిలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. జైలు ఎదురుగా ఉన్న రోడ్డు మొత్తం బ్లాక్ చేశారు. ఎవరూ అటువైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

నేడు ములాఖత్

రిమాండ్‌లో ఉన్న చంద్రబాబును కలిసేందుకు కుటుంబ సభ్యులు ములాఖత్‌కు దరఖాస్తు చేసుకున్నారు. జైలు అధికారుల నుంచి అనుమతులు వస్తే నేడు లోకేశ్, ఆయన భార్య బ్రాహ్మణి, తల్లి భువనేశ్వరి కలిసే అవకాశం ఉంది.

టీడీపీ బంద్ పూర్తి విఫలం



చిత్తూరులోని హెరిటేజ్ ఔట్‌లెట్ వద్ద విక్రయాలు

▶ మొదటి పేజీ తరువాయి

హెరిటేజ్ పార్లర్‌ను ఉదయం నుంచి తెరిచే ఉంచారు. విజయవాడ సమీపంలోని పోరంకిలో ఉన్న రామోజీరావుకు చెందిన ప్రియా పచ్చళ్ల కంపెనీ కూడా మామూలుగానే పనిచేసింది. బంద్ సందర్భంగా దాన్ని మూయడానికి స్థానిక మేనేజర్లు ఇష్టపడలేదు. టీడీపీకి చెందిన సంస్థలు కూడా మూతపడకుండా పనిచేయడాన్ని బట్టి బంద్ పిలుపునకు అసలు ప్రాధాన్యత లేదని స్పష్టమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్నిచోట్లా వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు మామూలుగానే జరిగాయి. విద్యా సంస్థలు కూడా నడిచాయి. ఆర్టీసీ బస్సులు అన్ని ప్రాంతాల్లోనూ షెడ్యూల్ ప్రకారమే తిరిగాయి. ప్రైవేటు రవాణా వ్యవస్థ కూడా ఎప్పటి మాదిరిగానే నడిచింది.

పార్టీలో ఆందోళన

చంద్రబాబు అరెస్టయినా ప్రజల్లో స్పందన ఏమాత్రం కనిపించకుండా పోవడంతో తెలుగుదేశం పార్టీ అగ్రనేతలు ఆందోళనలో మునిగిపోయారు. సోమవారం చేపట్టిన బంద్‌ను ఎలాగైనా విజయవంతం చేయాలని టీడీపీ ముఖ్య నాయకులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. టీడీపీ కేంద్ర కార్యాలయం నుంచి జిల్లాల్లోని నేతలకు అదే పనిగా ఫోన్లు చేసి నిరసనలు తెలపాలని, ఆందోళనలు నిర్వహించాలని చెప్పినా ఎవరూ వినే పరిస్థితి లేకపోవడంతో పార్టీ నేతల్లో నిరాశా నిస్పృహలు ఆవరించాయి. కనీసం ఏదో ఒకటి చేసి సోషల్ మీడియాలో వైరల్ చేయాలని క్యాడర్‌ను బ్రతిమిలాడుకున్నా ప్రయోజనం లేకుండాపోయింది.

ఏం చేద్దాం.. అగ్రనేతల మల్లగుల్లాలు !!

ప్రజల్లో నిరాదరణ, పార్టీ నేతలు, క్యాడర్ నిస్పృహలో కూరుకుపోవడంతో ఏం చేయాలనే దానిపై నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉండటంతో ఆయన కుమారుడు లోకేశ్ అక్కడే ఉండి పార్టీ నేతలతో మాట్లాడుతున్నారు. జనం టీడీపీకి ఎందుకు సహకరించడంలేదు, పార్టీ క్యాడర్ ఎందుకు జారిపోతోందనే దానిపై నాయకులతో చర్చిస్తున్నారు. ఇప్పటికిప్పుడు ఏదైనా కార్యక్రమం ప్రకటించినా ఇదే పరిస్థితి వస్తుందని ముఖ్యులు సూచించడంతో వెంటనే కార్యాచరణను ప్రకటించలేదని తెలుస్తోంది. ఆందోళనల కార్యాచరణ ప్రకటించాక దాన్ని ఎలా అమలు చేయాలనే దానిపైనా పార్టీలో గందరగోళం నెలకొంది. ఒకవైపు లోకేశ్, మరోవైపు అచ్చెన్నాయుడు, ఇంకోవైపు బాలకృష్ణ కూడా నేతల వద్ద బేలతనాన్ని ప్రదర్శిస్తుండడంతో వారు ఇంకా జావగారిపోతున్నారు. ఎప్పుడూ పార్టీ కార్యాలయానికి రాని బాలకృష్ణ సోమవారం మంగళగిరి టీడీపీ కార్యాలయానికి వచ్చి నేతలతో మాట్లాడి.. చివరికి ఏమీ తేల్చకుండానే వెనుతిరిగారు.

సహనం కోల్పోయిన ఎమ్మెల్యే నిమ్మల

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణ సీఐపై ‘మీరు పోలీసులా గూండాలా’ అంటూ టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు రెచ్చిపోయారు. బంద్ పిలుపునకు వ్యాపారులు స్పందించకపోవడం, షాపులు మూయని వ్యాపారులకు పోలీసులు రక్షణగా నిలవడంతో ఎమ్మెల్యే సహనం కోల్పోయారు. సీఐ దారావత్తు రాంబాబుపై ఆగ్రహంతో ఊగిపోతూ.. షాపులు ఓపెన్ చేయమని చెప్పడానికి మీకు సంబంధమేంటి అంటూ ఆవేశంగా ప్రశ్నించారు. స్వచ్ఛందంగా మూసివేస్తే తమకు ఇబ్బంది లేదని, బలవంతంగా మూయించడానికి ఒప్పుకోబోమని సీఐ చెప్పినా ఆయన వినిపించుకోలేదు.

పాల ట్యాంకర్ ఢీకొని ఇద్దరికి గాయాలు..

బంద్ సందర్భంగా ఓ పాల ట్యాంకర్‌ను అడ్డుకునే ప్రయత్నంలో కుప్పం నియోజకవర్గం టీడీపీ కార్యకర్తల సంక్షేమ కన్వీనర్ త్రిలోక్ నాయుడు, కుప్పం మున్సిపాలిటీలోని లక్ష్మీపురం టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థి లోకేష్‌లకు తీవ్రగాయాలయ్యాయి. శాంతిపురం నుంచి తమిళనాడులోని తిరుపత్తూరుకు వెళుతున్న పాల ట్యాంకర్‌ను వారిద్దరూ గుడుపల్లె మండలంలోని చిన్నశెట్టిపల్లె వద్ద ఆపాలని ప్రయత్నించారు. వేగంగా వస్తున్న ఆ ట్యాంకర్‌కు కంట్రోల్ కాక ద్విచక్ర వాహనంలో వస్తున్న త్రిలోక్, లోకేషలను ఢీ కొట్టింది. వారిద్దని ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, కుప్పంలో బంద్‌కు ప్రయత్నించిన స్థానిక టీడీపీ నేతలు.. తమ పార్టీ నేతలకు చెందిన బార్లు, హెరిటేజ్ అవుట్‌లెట్ల జోలికివెళ్లలేదు.

బడిలోకొచ్చి బెదిరించారు

కొందరు టీడీపీ సానుభూతిపరులు తమ పాఠశాలకు వచ్చి భయభ్రాంతులకు గురిచేశారంటూ కృష్ణాజిల్లా పెడనలోని భట్ల జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ సానుభూతిపరులు బడిలోకి వచ్చి పిల్లలను భయపెట్టి బయటకు పంపించి వేసిన ఘటనపై హెచ్ఎం ఎన్.ఉష సోమవారం పెడన సీఐ మహమ్మద్ అబీబ్‌బాషాకు ఫిర్యాదు అందజేయడంతో ఆయన విచారణ చేపట్టారు.



ఇది కర్నూలు నగర నడిబొడ్డులో జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుటనున్న కేఈ ప్లాజా. మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి కుటుంబ సభ్యులకు చెందిన ఈ వ్యాపార సముదాయంలో సోమవారం యథావిధిగా కార్యకలాపాలు కొనసాగాయి. దీన్ని చూస్తే ఆ పార్టీ నేతలు బంద్‌కు ఎంత ప్రాధాన్యం ఇచ్చారో అర్థమవుతోంది.

రెండురోజుల్లో అల్పపీడనం!

- ప్రభావం చూపనున్న రుతుపవన ద్రోణి
- మూడురోజులు వర్షాలు


సాక్షి, విశాఖపట్నం: మయన్మార్ తీరానికి ఆనుకుని తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో రానున్న రెండురోజుల్లో వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. మరోవైపు వాయవ్య మధ్యప్రదేశ్ పరిసర ప్రాంతాల్లో ఉన్న మరో ఉపరితల ఆవర్తనం నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం, ఉత్తరాంధ్ర సముద్రతీర ప్రాంతాల వరకు, విదర్భ, తూర్పు మధ్యప్రదేశ్, దక్షిణ ఛత్తీస్‌గఢ్ అంతర్భాగంగా తూర్పు-పడమర ద్రోణి సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తువరకు విస్తరించి ఉంది. ఫలితంగా రానున్న మూడురోజులు కోస్తాంధ్రలో అనేకచోట్ల, రాయలసీమలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కోస్తాంధ్రలో మంగళ, బుధవారాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి వరకు విజయనగరం, కోనసీమ, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, పశ్చిమ గోదావరి, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో భారీవర్షాలు కురిశాయి.


అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎంపీ అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. నర్రెడ్డి సునీత దాఖలు చేసిన ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. ఇరు పక్షాలు వాయిదా కోరడంతో విచారణను మూడు వారాలపాటు వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

రామోజీ, శైలజాలతో పాటు మరో 13 మందికి నోటీసులు

- కౌంటర్లు దాఖలుకు హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ ఈ నెల 18కి వాయిదా
- చార్జిషీట్ల రిటర్న్‌పై హైకోర్టులో సీఐడీ అప్పీళ్లు





సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక అవకతవకలు, తప్పుడు రికార్డుల నిర్వహణ, నిధుల మళ్లింపు, ఇతర చట్ట ఉల్లంఘనలపై రామోజీరావు, శైలజా కిరణ్‌లతో పాటు ఆ సంస్థకు చెందిన పలువురు కీలక వ్యక్తులు, ఉద్యోగులకు హైకోర్టు నోటీసులు జారీచేసింది. ఈ కేసులో తాము దాఖలు చేసిన చార్జిషీట్‌లను గుంటూరు, విశాఖపట్నంలలోని డిపాజిటర్ల పరిరక్షణ చట్టం ప్రత్యేక కోర్టులు ‘రిటర్న్’ చేస్తూ గత నెల 28న జారీచేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సీఐడీ దాఖలు చేసిన అప్పీళ్లపై హైకోర్టు విచారణ జరిపింది. ఈ అప్పీళ్లలో ప్రతివాదులుగా ఉన్న మార్గదర్శి చైర్మన్ చెరుకూరు రామోజీరావు, ఎండీ శైలజా కిరణ్, ఆడిటర్ కుదరవల్లి శ్రవణ్‌లతో పాటు వైస్ ప్రెసిడెంట్లు, డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లు, బ్రాంచ్ మేనేజర్లు ఇలా మొత్తం 15 మందికి నోటీసులు జారీచేసింది. కౌంటర్లు దాఖలు చేయాలని వీరందరినీ ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక అవకతవకలు, తప్పుడు రికార్డుల నిర్వహణ, నిధుల మళ్లింపు, ఇతర చట్ట ఉల్లంఘనలపై చిట్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు సీఐడీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా రామోజీరావు, శైలజా కిరణ్‌లతో పాటు మొత్తం 15 మందిపై ఐపీసీ, డిపాజిటర్ల పరిరక్షణ చట్టం, చిట్‌ఫండ్ చట్టాల కింద సీఐడీ కేసులు నమోదు చేసింది. దర్యాప్తు చేసి డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద ఏర్పాటైన ప్రత్యేక కోర్టుల్లో చార్జిషీట్లు దాఖలు చేసింది. వీటిని పరిశీలించిన ప్రత్యేక కోర్టులు వాటిని రిటర్న్ చేశాయి. గుంటూరులో ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఉత్తర్వులు జారీచేయగా, విశాఖపట్నంలో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఉత్తర్వులిచ్చారు. ఈ రెండు కోర్టులు కూడా ఆగస్టు 28వ తేదీనే ఉత్తర్వులు వెలువరించడం విశేషం. రెండు కోర్టులు ఇచ్చిన ఉత్తర్వులు దాదాపుగా ఒకే రకంగా ఉండటం మరో విశేషం. ఈ రెండు కోర్టులిచ్చిన ‘రిటర్న్’ ఉత్తర్వులను సవాలు చేస్తూ సీఐడీ హైకోర్టులో గత వారం క్రిమినల్ అప్పీళ్లు దాఖలు చేసింది. ఈ అప్పీళ్లపై సోమవారం జస్టిస్ శ్రీనివాసరెడ్డి విచారణ జరిపారు.

‘పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలి’

సాక్షి, అమరావతి: చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ల అమలు కోసం పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని డిమాండ్‌చేస్తూ ఈ నెల 21న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా, బీసీ కులగణన నిర్వహించాలని కోరుతూ ఈ నెల 22న ఏపీ భవన్ వద్ద బీసీ మేధావులతో సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఆయా కార్యక్రమాల పోస్టర్లను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. గత 75 ఏళ్లుగా దేశాన్ని పాలించిన కేంద్ర ప్రభుత్వాలు బీసీలకు ఏ రంగంలోనూ జనాభా ప్రకారం వాటా ఇవ్వలేదని కృష్ణయ్య అన్నారు. పన్నులు కట్టి దేశ బడ్జెట్‌కు ఊతమిస్తున్న బీసీలకు బడ్జెట్‌లో మాత్రం వాటా దక్కటం లేదన్నారు. ఓటు వేసే అధికారం కల్పించారని, అయితే రాజ్యాధికారంలో బీసీలకు వాటా ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మొద్దునిద్ర వీడి పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి మిగతా పార్టీలను కూడగట్టి ఆమోదింపజేయాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ వివరాలను ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మారేష్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.


రాహుల్

వాన మధ్యలో మన పరుగుల వాన

వహ్వా... ఇది కదా ఆటంటే... దీని కోసమే కదా మన అభిమానులంతా ఆశలు పెట్టుకుంది... నేనున్నానంటూ వాన మళ్లీ మళ్లీ వచ్చేస్తున్నా ఇలాంటి ఒక్క మ్యాచ్ కోసమే కదా అందరం ఎదురు చూసింది... ఇందుకే కదా నిర్వాహకులు ఈ ఒక్క పోరు కోసం నిబంధనలు మార్చేసింది... రిజర్వ్ డే అంటూ పెట్టుకున్నందుకు తగిన న్యాయం చేస్తున్నట్లుగా భారత బ్యాటర్లు చెలరేగి వినోదం పంచారు. తొలి పోరులో విఫలమై పాక్ బౌలింగ్‌ను ఆడలేరంటూ వచ్చిన విమర్శలను చిత్తు చేస్తూ చెలరేగారు. పేలవ బౌలింగ్ తర్వాత కొండంత లక్ష్యానికి చేరువగా కూడా రాలేక పాక్ కుప్పకూలింది.

ఒక్కసారి లయ అందుకుంటే తాను ఎంత బాగా ఆడగలనో కోహ్లి చూపించాడు... గతంలోలాగా ఒక్క ఇన్నింగ్స్‌లో ఎన్నో రికార్డులు అందుకుంటూ ముందుకు సాగిపోతూ సచిన్ సెంచరీలకు సరిగ్గా రెండడుగుల దూరంలో నిలిచాడు... మరోవైపు ఫామ్, ఫిట్‌నెస్ చూపించుకోవాల్సిన స్థితిలో బరిలోకి దిగిన కేఎల్ రాహుల్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సెంచరీతో చెలరేగాడు. వీరి భాగస్వామ్యాన్ని విడదీయలేక పాక్ బౌలర్లు చేతులెత్తేశారు. గత మ్యాచ్‌లో టాప్-4ను తొందరగా పడగొట్టి ఆధిక్యం చూపించిన పాక్ పని పట్టేందుకు ఇప్పుడు టాప్-4 మాత్రమే సరిపోయారు.


'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కోహ్లి

- కోహ్లి, రాహుల్ సెంచరీలు
- కుల్దీప్ యాదవ్‌కు 5 వికెట్లు
- భారత్ చేతిలో పాకిస్తాన్ చిత్తు
- 228 పరుగులతో టీమిండియా ఘన విజయం
- నేడు శ్రీలంకతో పోరు
- మ.గం. 3 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

కొలంబో: వన్డే క్రికెట్‌లో పాకిస్తాన్‌పై భారత్ తమ ఆధిక్యాన్ని మరింత స్పష్టంగా ప్రదర్శించింది. ఆసియా కప్‌లో ఆసక్తిని రేపిన 'సూపర్-4' పోరులో టీమిండియాదే పైచేయి అయింది. సోమవారం ముగిసిన ఈ మ్యాచ్‌లో భారత్ 228 పరుగుల భారీ తేడాతో పాక్‌ను చిత్తుగా ఓడించింది. ఆదివారం ఓవర్‌నైట్ స్కోరు 147/2తో సోమవారం ఆట కొనసాగించిన భారత్ 50 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 356 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (94 బంతుల్లో 122 నాటౌట్; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), కేఎల్ రాహుల్ (106 బంతుల్లో 111 నాటౌట్; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ శతకాలతో చెలరేగారు. వీరిద్దరు మూడో వికెట్‌కు అభేద్యంగా 233 పరుగులు జోడించారు. ఈ జోడీ 32.1 ఓవర్లలోనే 7.25 రన్‌రేట్‌తో ఈ పరుగులు రాబట్టడం విశేషం. సోమవారం 25.5 ఓవర్ల పాటు బౌలింగ్ చేసినా పాకిస్తాన్ ఒక్క వికెట్ కూడా తీయలేకపోయింది. అనంతరం పాక్ 32 ఓవర్లలో 128 పరుగులకు ఆలౌటైంది. ఫఖర్ జమాన్ (27)దే అత్యధిక స్కోరు. గాయాల కారణంగా రవూఫ్, నసీమ్ షా బ్యాటింగ్‌కు దిగకపోవడంతో 8 వికెట్లకే జట్టు ఇన్నింగ్స్ ముగిసింది. కుల్దీప్‌కు 5 వికెట్లు దక్కాయి.

డబుల్ ధమాకా...

రిజర్వ్ డే రోజున కూడా భారత జట్టు తొలి రోజు తరహాలోనే తమ జోరు కొనసాగించింది. పాకిస్తాన్ బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా కోహ్లి, రాహుల్ చక్కటి షాట్లతో చెలరేగారు. షాహిన్ సహా ఇతర బౌలర్ల పేలవ ప్రదర్శనకు తోడు గాయం కారణంగా రవూఫ్ సోమవారం అసలు బౌలింగ్‌కే దిగకపోవడం కూడా పాక్‌ను దెబ్బ తీసింది. ముందుగా 60 బంతుల్లో రాహుల్, ఆ తర్వాత 55 బంతుల్లో కోహ్లి అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. 40 ఓవర్లు ముగిసేసరికి స్కోరు 251 పరుగులకు చేరింది. తర్వాతి పది ఓవర్లలో భారత జోడీ మరింతగా దూసుకుపోయింది. తర్వాతి 5 ఓవర్లలో జట్టు 49 పరుగులు రాబట్టి 300 పరుగుల మార్క్ అందుకుంది. నాలుగు బంతుల వ్యవధిలో రాహుల్ (100 బంతుల్లో), కోహ్లి (84 బంతుల్లో) ఖాతాలో శతకాలు చేరాయి. ఆఖరి 5 ఓవర్లలో భారత్ 56 పరుగులు రాబట్టడం విశేషం. ఫహీమ్ వేసిన చివరి ఓవర్లో ఆఖరి మూడు బంతులను వరుసగా 4, 4, 6గా మలచి కోహ్లి ఘనంగా ఇన్నింగ్స్ ముగించాడు.


కుల్దీప్ యాదవ్

టపటపా...

ఛేదనలో మొదటి నుంచే తడబడిన పాకిస్తాన్ ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. ఇమామ్ (9)ను అవుట్ చేసి బుమ్రా తొలి వికెట్ అందించగా, పాండ్యా బౌలింగ్‌లో బాబర్ (10) బౌల్డయ్యాడు. వాన విరామం తర్వాత తొలి ఓవర్లోనే రిజ్వాన్ (2)ను శార్దుల్ అవుట్ చేయడంతో పాక్ పరిస్థితి మరింత దిగజారింది. ఆ తర్వాత తక్కువ వ్యవధిలో ఫఖర్, సల్మాన్ (23) వెనుదిరిగారు. అతి కష్టమ్మీద 24.5 ఓవర్లలో 100 పరుగులకే చేరిన జట్టు ఆ తర్వాత వేగంగా ఓటమి దిశగా పయనించింది.

ఆగని వాన...

రిజర్వ్ డే రోజున కూడా వర్షం మ్యాచ్‌ను వెంటాడింది. వాన తెరిపినివ్వకపోవడంతో ఆట ఆరంభానికే చాలా సమయం పట్టింది. చివరకు 1 గంట 40 నిమిషాలు ఆలస్యంగా మ్యాచ్ మొదలైంది. ఆ తర్వాత పాక్ ఇన్నింగ్స్‌లో 11 ఓవర్లు ముగిశాక వర్షం రాకతో ఆట నిలిచిపోయింది. ఈ సమయంలో మరో 1 గంట 12 నిమిషాల విరామం వచ్చింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) ఫహీమ్ (బి) షాదాబ్ 56; గిల్ (సి) సల్మాన్ (బి) షాహిన్ 58; కోహ్లి (నాటౌట్) 122; రాహుల్ (నాటౌట్) 111; ఎక్స్‌ట్రాలు 9; మొత్తం (50 ఓవర్లలో 2 వికెట్లకు) 356. వికెట్ల పతనం: 1–121, 2–123. బౌలింగ్: షాహిన్ అఫ్రిది 10–0–79–1, నసీమ్ షా 9.2–1–53–0, ఫహీమ్ 10–0–74–0, రవూఫ్ 5–0–27–0, షాదాబ్ 10–1–71–1, ఇఫ్తికార్ 5.4–0–52–0.

పాకిస్తాన్ ఇన్నింగ్స్: ఫఖర్ (బి) కుల్దీప్ 27; ఇమామ్ (సి) గిల్ (బి) బుమ్రా 9; బాబర్ (బి) పాండ్యా 10; రిజ్వాన్ (సి) రాహుల్ (బి) శార్దుల్ 2; సల్మాన్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 23; ఇఫ్తికార్ (సి అండ్ బి) కుల్దీప్ 23; షాదాబ్ (సి) శార్దుల్ (బి) కుల్దీప్ 6; ఫహీమ్ (బి) కుల్దీప్ 4; షాహిన్ (నాటౌట్) 7; నసీమ్ (ఆబ్సెంట్ హర్ట్), రవూఫ్ (ఆబ్సెంట్ హర్ట్), ఎక్స్‌ట్రాలు 17; మొత్తం (32 ఓవర్లలో ఆలౌట్) 128.
వికెట్ల పతనం: 1–17, 2–43, 3–47, 4–77, 5–96, 6–110, 7–119, 8–128. బౌలింగ్: బుమ్రా 5–1–18–1, సిరాజ్ 5–0–23–0, పాండ్యా 5–0–17–1, శార్దుల్ 4–0–16–1, కుల్దీప్ 8–0–25–5, జడేజా 5–0–26–0.

47 వన్డేల్లో కోహ్లి సెంచరీల సంఖ్య. అగ్ర స్థానంలో ఉన్న సచిన్ (49) శతకాలను అందుకునేందుకు మరో 2 సెంచరీలు దూరంలో మాత్రమే ఉన్నాడు.

5 వన్డేల్లో కోహ్లి 13 వేల పరుగులు పూర్తి చేసుకొని ఈ ఘనత సాధించిన ఐదో బ్యాటర్‌గా నిలిచాడు. సచిన్‌కంటే 54 ఇన్నింగ్స్‌లు తక్కువగా ఆడి కోహ్లి ఈ మైలురాయిని అందుకోవడం గమనార్హం. ప్రేమదాస స్టేడియంలో అతనికి వరుసగా నాలుగు వన్డేల్లో నాలుగో సెంచరీ కావడం మరో విశేషం.

1 పాకిస్తాన్‌పై భారత్ తమ అత్యధిక స్కోరు (356)ను సమం చేసింది. 2005లోనూ వైజాగ్‌లో పాక్‌పై భారత్ 356 పరుగులు చేసింది.

5 వన్డేల్లో పాకిస్తాన్‌పై ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసిన ఐదో భారతీయ బౌలర్ కుల్దీప్ యాదవ్. గతంలో అర్షద్ అయూబ్ (5/21: 1988లో), సౌరవ్ గంగూలీ (5/16: 1997లో), వెంకటేశ్ ప్రసాద్ (5/27: 1999లో), సచిన్ టెండూల్కర్ (5/50: 2005లో) ఈ ఘనత సాధించారు.

24 తగ్గేదేలే...



జొకోవిచ్ ఖాతాలో 24వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్

- మార్గరెట్ కోర్ట్ 'ఆల్ టైమ్' రికార్డును సమం చేసిన సెర్బియా స్టార్
- నాలుగోసారి యూఎస్ ఓపెన్ టైటిల్ హస్తగతం
- ఫైనల్లో మూడో సీడ్ మెద్వెదెవ్‌పై విజయం
- రూ. 24 కోట్ల 90 లక్షల ప్రైజ్‌మనీ సొంతం
- మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లోకి

న్యూయార్క్: 36 ఏళ్ల వయసు వచ్చినా తన ఆటను మరింత పదునెక్కిస్తూ సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నాడు. ఈ ఏడాది ఆడిన నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లోనూ ఫైనల్ చేరిన జొకోవిచ్ సీజన్‌లో చివరిదైన యూఎస్ ఓపెన్‌లో నాలుగోసారి చాంపియన్‌గా నిలిచాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం ఐదు గంటలకు ముగిసిన పురుషుల సింగిల్స్ విభాగం ఫైనల్లో రెండో సీడ్ జొకోవిచ్ 6–3, 7–6 (7/5), 6–3తో మూడో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా)పై గెలిచాడు. 3 గంటల 16 నిమిషాలపాటు జరిగిన ఈ పోరులో జొకోవిచ్ తన అనుభవాన్నంతా రంగరించి పోరాడి పైచేయి సాధించాడు. విజేత జొకోవిచ్‌కు 30 లక్షల డాలర్లు (రూ. 24 కోట్ల 90 లక్షలు), రన్నరప్ మెద్వెదెవ్‌కు 15 లక్షల డాలర్లు (రూ. 12 కోట్ల 45 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఈ గెలుపుతో జొకోవిచ్ ఖాతాలో 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ చేరింది. అత్యధికంగా 24 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన ప్లేయర్‌గా ఆస్ట్రేలియా క్రీడాకారిణి మార్గరెట్ కోర్ట్ (ఆస్ట్రేలియా) పేరిట ఉన్న రికార్డును జొకోవిచ్ సమం చేశాడు. అంతేకాకుండా ఏటీపీ ర్యాంకింగ్స్‌లో మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు.

కెరీర్‌లో 36వ గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడుతున్న జొకోవిచ్‌కు తుది పోరులో మెద్వెదెవ్ నుంచి గట్టిపోటీనే ఎదురైంది. 30 లేదా 40 షాట్‌లతో కూడిన ర్యాలీలను చాలాసార్లు జొకోవిచ్ పాయింట్‌తో ఫినిష్ చేయగా... కొన్నిసార్లు మెద్వెదెవ్ సఫలమయ్యాడు. తొలి సెట్‌లోని రెండో గేమ్‌లోనే మెద్వెదెవ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన జొకోవిచ్ ఆ తర్వాత తన సర్వీస్‌లను నిలబెట్టుకొని సెట్‌ను దక్కించుకున్నాడు. రెండో సెట్‌లో మాత్రం ఇద్దరూ ప్రతి పాయింట్‌కు నువ్వా నేనా అన్నట్లు పోరాడారు. తమ సర్వీస్‌లను కాపాడుకోవడంతో టైబ్రేక్ అనివార్యమైంది. టైబ్రేక్‌లో జొకోవిచ్ సెట్‌ను సొంతం చేసుకున్నాడు. మూడో సెట్‌లోని నాలుగో గేమ్‌లో మెద్వెదెవ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన జొకోవిచ్ 3–1తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఆ తర్వాత ఈ సెర్బియా స్టార్ తన సర్వీస్‌లను కాపాడుకొని విజయాన్ని ఖాయం చేసుకున్నాడు.


మెద్వెదెవ్

ఫైనల్ గణాంకాలు

జొకోవిచ్		మెద్వెదెవ్
4	ఏస్‌లు	6
6	డబుల్ ఫాల్ట్‌లు	6
3/6	బ్రేక్ పాయింట్లు	1/3
38	విన్నర్స్	32
35	అనవసర తప్పిదాలు	39
37/44	నెట్ పాయింట్లు	16/22
118	మొత్తం పాయింట్లు	97

"మీ అందరి ముందు నిలబడి నేను 24 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గురించి మాట్లాడతానని ఏనాడూ ఊహించలేదు. ఇది నిజమవుతుందని కూడా అనుకోలేదు. కానీ గత రెండేళ్లలో కొత్త చరిత్ర సృష్టించే అవకాశం నా ముందు ఉందనిపించింది. అందివచ్చిన అవకాశాన్ని ఎందుకు వదులుకోవాలని అనుకున్నాను. నా శరీరం సహకరించినంత వరకు, నా శిక్షణ సిబ్బంది, కుటుంబసభ్యుల సహకారం ఉన్నంత వరకు ఈ జైత్రయాత్రను కొనసాగిస్తాను. అత్యున్నతస్థాయిలో ఉన్నప్పటికీ ఈ ఆటకు ఇప్పుడే వీడ్కోలు పలికే ఆలోచన లేదు. ఈ విజయాన్ని నా ఆప్త మిత్రుడు, మూడేళ్ల క్రితం హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయిన అమెరికా బాస్కెట్‌బాల్ దిగ్గజం కోబీ బ్రయాంట్‌కు అంకితం ఇస్తున్నాను. యూఎస్ ఓపెన్ గెలిస్తే కోబీ బ్రయాంట్ ఫొటో ఉన్న టీ షర్ట్‌ను ట్రోఫీ ప్రదానోత్సవంలో ధరించాలని అనుకున్నాను."
–జొకోవిచ్





జొకోవిచ్ 24 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్



ఆస్ట్రేలియన్ ఓపెన్	ఫ్రెంచ్ ఓపెన్	వింబుల్డన్	యూఎస్ ఓపెన్
10	3	7	4

అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ విజేతలు (కనీసం 20)

జొకోవిచ్	(సెర్బియా)	24
మార్గరెట్ కోర్ట్	(ఆస్ట్రేలియా)	24
సెరెనా విలియమ్స్	(అమెరికా)	23
రాఫెల్ నాదల్	(స్పెయిన్)	22
స్టెఫీ గ్రాఫ్	(జర్మనీ)	22
ఫెడరర్	(స్విట్జర్లాండ్)	20

1 ఒకే ఏడాది మూడు గ్రాండ్‌స్లామ్ టోర్నీ టైటిల్స్‌ను నాలుగుసార్లు చొప్పున (2011, 2015, 2021, 2023) సాధించిన తొలి ప్లేయర్‌గా జొకోవిచ్ నిలిచాడు.

96 జొకోవిచ్ కెరీర్‌లో గెలిచిన సింగిల్స్ టైటిల్స్. అత్యధిక సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన క్రీడాకారుల జాబితాలో కానర్స్ (109; అమెరికా), ఫెడరర్ (103; స్విట్జర్లాండ్) తర్వాత జొకోవిచ్ మూడో స్థానంలో ఉన్నాడు.

'మన ఓపెనర్ల బ్యాటింగ్ ప్రశంసనీయం'


సునీల్ గావస్కర్

కొన్నిసార్లు మ్యాచ్‌లో ఓటమికంటే రద్దు కావడమే మంచిది. ఇరు జట్లూ పాయింట్లు పంచుకునే అవకాశం ఉంటుంది. గ్రూప్ దశలో పాకిస్తాన్‌తో భారత్ బ్యాటింగ్ చేసిన తర్వాత వర్షంతో మ్యాచ్ రద్దు కాగానే భారత అభిమానులందరూ కాస్త ఊరట చెందారు. ఒకవేళ నేపాల్‌తో మ్యాచ్ రద్దు అయినా సరే భారత్ సూపర్-4 దశకు అర్హత సాధించేది. అదే జరిగితే నెట్‌రన్‌రేట్ పరిగణనలోకి తీసుకోవాల్సి వచ్చేది. అలా చూసినా సరే 266 పరుగులు చేసిన భారత్ రన్‌రేట్ మెరుగ్గానే ఉండేది. సాధారణంగా ఎప్పుడూ కూడా భారత్, పాకిస్తాన్ జట్లు తర్వాతి దశకు చేరేలాగే గ్రూప్‌లు విభజిస్తున్నారు. ఐసీసీ ఈవెంట్లలో కూడా ఇరు జట్లు ఒకే గ్రూప్‌లో ఉంటే కనీసం ఒక పెద్ద బ్లాక్‌బస్టర్ మ్యాచ్ ఖాయంగా ఉంటోంది. శ్రీలంకపై భారత్ రికార్డు మెరుగ్గానే ఉంది. తర్వాతి మ్యాచ్‌లకు కూడా వాతావరణం కీలకంగా మారనుంది. ఆసియా కప్‌లో భారత్ 7 సార్లు, శ్రీలంక 6 సార్లు, పాకిస్తాన్ 2 సార్లు మాత్రమే విజేతగా నిలిచాయని విషయాన్ని మరచిపోవద్దు. పాక్‌తో మ్యాచ్‌లో రోహిత్, గిల్ ఆకట్టుకునే ప్రదర్శనతో ప్రత్యర్థి బౌలింగ్ బలహీనతలను సమర్థంగా చూపించారు. గిల్ కొన్ని చూడచక్కటి షాట్లు ఆడగా మరో ఎండ్‌లో చెలరేగుతున్న నసీమ్ షా బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొని రోహిత్ తన విలువను చూపించాడు. మ్యాచ్ రిజర్వ్ డేకు సాగడంతో భారత్ వరుసగా రెండు రోజులు మ్యాచ్‌లు ఆడాల్సిన పరిస్థితి వచ్చింది. వర్షం అడ్డుపడి అదృష్టవశాత్తూ అవకాశం దక్కడం కాకుండా... పూర్తి మ్యాచ్‌లో భారత్ విజయం సాధించి ఫైనల్‌కు చేరాలని ప్రతి అభిమాని కోరుకుంటాడు.

సినిమా

స్వాతంత్ర్య దినోత్సవానికి రూల్

తగ్గేదే లే అంటూ వెండితెరపైకి దూసుకొచ్చిన 'పుష్ప' తగ్గేదే లే రేంజ్‌లో వసూళ్లు సాధించాడు. అల్లు అర్జున్ టైటిల్ రోల్‌లో సుకుమార్ దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన 'పుష్ప' చిత్రంలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఇప్పుడు మలి భాగం 'పుష్ప: ద రూల్' నిర్మాణంలో ఉంది. తొలి భాగంలో జంటగా నటించిన అల్లు అర్జున్, రష్మికా మందన్నా, కీలక పాత్రలు చేసిన ఫాహద్ ఫాజిల్, సునీల్, అనసూయ తదితరులు మలి భాగంలోనూ నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2024 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు సోమవారం నిర్మాతలు నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ తెలిపారు. తొలి భాగం అంచనాలు పెంచిన నేపథ్యంలో మలి భాగాన్ని ప్రత్యేక శ్రద్ధతో తెరకెక్కిస్తున్నారు సుకుమార్. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, కెమెరా: మిరోస్లా క్యూబా బ్రోజెక్.


● అల్లు అర్జున్


● రజనీకాంత్

రజనీ 171 షురూ

ఏడు పదుల వయసులో జోరుగా సినిమా తర్వాత సినిమా చేస్తున్నారు రజనీకాంత్. ఇటీవల విడుదలైన రజనీ 169వ చిత్రం 'జైలర్' బ్లాక్ బస్టర్ అయిన విషయం తెలిసిందే. 170వ చిత్రాన్ని 'జై భీమ్' ఫేమ్ దర్శకుడు టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో చేయనున్నారు. సోమవారం రజనీకాంత్ 171వ సినిమా ప్రకటన వెల్లడైంది. రజనీతో 'జైలర్'ని నిర్మించిన సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. గత ఏడాది కమల్ హాసన్‌తో 'విక్రమ్' వంటి బ్లాక్ బస్టర్ ఇచ్చి, ప్రస్తుతం విజయ్ హీరోగా 'లియో'కి దర్శకత్వం వహిస్తున్న లోకేశ్ కనగరాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచంద్రన్, ఫైట్స్: అన్బు–అరివు.

మంచి కథతో పెదకాపు రూపొందింది
- విరాట్


● విరాట్ కర్ణ, ప్రగతి

''పెదకాపు 1' ట్రైలర్ చాలా బాగుంది. రవీందర్ రెడ్డి గారు తన బావమరిదిని, పైగా కొత్త హీరోని పెట్టి కోట్లు ఖర్చు పెట్టి సినిమా తీయడం మామూలు విషయం కాదు. ఎలాంటి లెక్కలు వేసుకోకుండా తీసిన ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు డైరెక్టర్ వీవీ వినాయక్. విరాట్ కర్ణ, ప్రగతి శ్రీవాస్తవ జంటగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పెదకాపు 1'. మిర్యాల సత్యనారాయణ రెడ్డి సమర్పణలో మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను వీవీ వినాయక్, నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ విడుదల చేయగా, నిర్మాత వై. రవిశంకర్, మైత్రీ డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి అతిథులుగా హాజరయ్యారు. శ్రీకాంత్ అడ్డాల మాట్లాడుతూ– ''పెదకాపు' మా యూనిట్‌కి మరపురాని చిత్రంగా నిలిచి, 'పెదకాపు 2'కి ప్రస్థానం కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''సినిమా మాట్లాడిన తర్వాతే నేను మాట్లాడతాను'' అన్నారు మిర్యాల రవీందర్ రెడ్డి. ''నాకింత మంచి కథ ఇచ్చిన శ్రీకాంత్, నిర్మించిన రవీందర్ రెడ్డిగార్లకు రుణపడి ఉంటా'' అన్నారు విరాట్ కర్ణ. కెమెరామేన్ ఛోటా కె. నాయుడు పాల్గొన్నారు.


● సంయుక్తా మీనన్

డెవిల్స్ ఏంజిల్

కల్యాణ్ రామ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'డెవిల్'. దేవాన్ష్ నామా సమర్పణలో అభిషేక్ పిక్చర్స్ బ్యానర్‌పై అభిషేక్ నామా స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో సంయుక్తా మీనన్ హీరోయిన్. సోమవారం (సెప్టెంబర్ 11) ఆమె పుట్టినరోజు. ఈ సందర్భంగా 'డెవిల్' చిత్రంలో సంయుక్త పోషించిన నైషధ పాత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను 'డెవిల్స్ ఏంజిల్' అంటూ మేకర్స్ విడుదల చేశారు. ''తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమాను నవంబర్ 24న విడుదల చేస్తాం'' అన్నారు అభిషేక్ నామా.

మంచి సినిమాలను ప్రోత్సహించాలి
- 'దిల్' రాజు

''తెలుగు ప్రేక్షకులు మంచి చిత్రాలను ఆదరిస్తారని 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'తో మరోసారి నిరూపించారు. ఇలాంటి మంచి సినిమాలను అందరూ ప్రోత్సహించాలి. 'జవాన్' విడుదలైన రోజే వచ్చిన 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' నిలబడి, బలమైన వసూళ్లతో ముందుకెళ్తోంది'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. నవీన్ పొలిశెట్టి, అనుష్క శెట్టి జంటగా పి. మహేశ్‌బాబు దర్శకత్వం వహించిన చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో పి. మహేశ్‌బాబు మాట్లాడుతూ– ''మా చిత్రాన్ని చిరంజీవి, మహేశ్‌బాబు, రవితేజ, రాజమౌళి, వంశీ పైడిపల్లి సమంత అభినందించడం హ్యాపీగా ఉంది'' అన్నారు. ''త్వరలో సక్సెస్ సెలబ్రేషన్స్, సక్సెస్ టూర్ ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు ప్రమోద్.


● ప్రమోద్, 'దిల్' రాజు, మహేశ్‌బాబు .పి

నిజాన్ని నిజాయితీగా చెప్పాం
- స్వాతి



''మంత్ ఆఫ్ మధు'లో మాకు తెలిసిన నిజాన్ని నిజాయితీగా చెప్పాం. శ్రీకాంత్ గారు అద్భుతంగా తీశారు. ఇది ఫీమేల్ సెంట్రిక్ సినిమా కాదు'' అని స్వాతి రెడ్డి అన్నారు. నవీన్ చంద్ర, స్వాతి రెడ్డి జంటగా శ్రీకాంత్ నాగోతి దర్శకత్వం వహించిన చిత్రం 'మంత్ ఆఫ్ మధు'. యశ్వంత్ ములుకుట్ల నిర్మించిన ఈ సినిమా అక్టోబర్ 6న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రెస్‌మీట్‌లో శ్రీకాంత్ నాగోతి మాట్లాడుతూ– ''ఈ చిత్రాన్ని మేమెంత ప్యాషనేట్‌గా తీశామో.. ప్రేక్షకులకు కూడా అంతే చక్కగా చేరువవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''ఈ చిత్రం 90 శాతం షూటింగ్‌ని వైజాగ్‌లో చేశాం'' అన్నారు యశ్వంత్ ములుకుట్ల.


● అభినయ, సునీల్, ఎస్‌జే సూర్య, నితిన్, విశాల్, అధిక్

టీజర్.. ట్రైలర్ క్రేజీగా ఉన్నాయి
- నితిన్

''మార్క్ ఆంటోనీ' సినిమా ఫస్ట్ లుక్, టీజర్, ట్రైలర్ క్రేజీగా ఉన్నాయి. ఈ చిత్రం కచ్చితంగా విజయం సాధిస్తుంది. ఈ చిత్రంతో విశాల్ మరో స్థాయికి వెళ్లాలి'' అని హీరో నితిన్ అన్నారు. విశాల్, రీతూ వర్మ జంటగా నటించిన చిత్రం 'మార్క్ ఆంటోనీ'. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో ఎస్. వినోద్ కుమార్ నిర్మించారు. ఎస్‌జే సూర్య, సునీల్, సెల్వరాఘవన్ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమా ఈ నెల 15న రిలీజవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన 'మార్క్ ఆంటోనీ' ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరయ్యారు హీరో నితిన్. విశాల్ మాట్లాడుతూ– ''నా మొదటి చిత్రం 'చెల్లమే' (ప్రేమ చదరంగం) విడుదలై సెప్టెంబర్ 10కి 19 ఏళ్లు అవుతోంది. ప్రేక్షకులు టికెట్ కొని నా సినిమాలు చూస్తున్నారు. ఆ డబ్బుతో నేను, నా ఫ్యామిలీ మాత్రమే బాగుండాలనుకోను. ఆ డబ్బు అందరికీ ఉపయోగపడాలనుకుంటాను. 'మార్క్ ఆంటోనీ'ని తెలుగులో వేణుగారు రిలీజ్ చేస్తున్నందుకు థ్యాంక్స్'' అన్నారు. ''ఇది తండ్రీ కొడుకుల కథ'' అన్నారు అధిక్. ''నా లైఫ్‌లో తమిళ సినిమా చేస్తాననుకోలేదు. నాకు రెండో అవకాశం ఇచ్చాడు అధిక్'' అన్నారు నటుడు సునీల్.

సాక్షి బిజినెస్
మంగళవారం
12-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
528	176
67,127	19,996

విదేశీ సూచీలు (తొలి రెండు శుక్రవారం ముగింపు)

నాస్‌డాక్	13,901	▲	139
డోజోన్స్	34,659	▲	82
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,497	▲	19
డాక్స్	15,801	▲	56
షాంఘై	3,143	▲	26
నికాయ్	32,468	▼	139

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
59,101	▲	26
బంగారం (99.5 స్వచ్ఛత)		
58,834	▲	27
వెండి (కిలో)		
71,028	▲	166

ఫారెక్స్ రేట్లు (రూ. లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.18	83.85
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	102.10	105.47
€	యూరో	ఎస్‌బీఐ	87.47	90.58
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.83	57.56
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.18	54.52
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.96	61.90
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.19	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.71	23.50
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.26	12.33

విదేశీ విభాగాల విక్రయంలో బైజూస్

1.2 బిలియన్ డాలర్ల రుణ చెల్లింపు ప్రణాళికలు

న్యూఢిల్లీ: ఎడ్‌టెక్ సంస్థ బైజూస్ 1.2 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 9,956 కోట్లు) రుణ మొత్తాన్ని పూర్తిగా చెల్లించేసే ప్రయత్నాల్లో ఉంది. ఇందులో భాగంగా విదేశీ విభాగాలైన ఎపిక్, గ్రేట్ లెర్నింగ్ సంస్థలను విక్రయించాలని యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ రెండింటి విక్రయంతో దాదాపు 800 మిలియన్ డాలర్ల నుంచి 1 బిలియన్ డాలర్ల వరకు సమకూర్చుకోవచ్చని బైజూస్ భావిస్తున్నట్లు వివరించాయి. అలాగే వాటాల విక్రయం ద్వారా తాజాగా మరిన్ని పెట్టుబడులు కూడా సమీకరించడంపైనా కంపెనీ కసరత్తు చేస్తున్నట్లు పేర్కొన్నాయి. 1.2 బిలియన్ డాలర్ల రుణాన్ని (టీఎల్‌బీ) మొత్తం మీద ఆరు నెలల వ్యవధిలో తీర్చేయొచ్చని బైజూస్ ఆశిస్తోంది. 2021 నవంబర్‌లో విదేశీ ఇన్వెస్టర్ల నుంచి బైజూస్ ఈ రుణాన్ని తీసుకుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

12-9-2023	
విశాఖ	510-00
చిత్తూరు	503-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510-00
విజయవాడ	510-00
రిటైల్ ధర (డజను)	72.00
11-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	470-00
వరంగల్	472-00
రిటైల్ ధర	5.30

నిఫ్టీ @ 20000



- సరికొత్త శిఖరాలపైకి సూచీలు
- ఇంట్రాడే, ముగింపులో కొత్త రికార్డులు
- సూచీలకు ఏడోరోజూ లాభాలే
- ఆల్‌టైం హైకి ఇన్వెస్టర్ల సంపద

ముంబై: దలాల్ స్ట్రీట్‌లో మరో అద్భుతం ఆవిష్కృతమైంది. ఇన్వెస్టర్లు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన క్షణం సాక్షాత్కారమైంది. మార్కెట్ విశ్లేషకుల నిరీక్షణకు తెర దించుతూ ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ సూచీ తొలిసారి 20,000 పాయింట్లను ముద్దాడింది. 1996 ఏప్రిల్ 21న 1000 పాయింట్లతో మొదలైన ప్రయాణం సెప్టెంబర్ 11న చరిత్రలో సువర్ణాధ్యాయంగా మారింది. అయితే నిఫ్టీ 20 వేల స్థాయిని నిలుపుకోలేకపోవడం కాస్త నిరాశ పరిచింది.

> జీ–20 శిఖరాగ్ర సదస్సు ముగింపు మరుసటి రోజు నిఫ్టీ 20,000 స్థాయి అందుకోవడం సంతోషకరం. భారతీయుల సామర్థ్యం, ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న నమ్మకానికి నిలువెత్తు నిదర్శనం ఈ శుభపరిణామం.
> – ఎన్‌ఎస్‌ఈ ఎండీ ఆశిష్ చౌహాన్

నిఫ్టీ స్థాయి	అందుకున్న తేదీ
1,000	ఏప్రిల్ 1996
5,000	సెప్టెంబర్ 2007
10,000	జూలై 2017
15,000	ఫిబ్రవరి 2021
20,000	సెప్టెంబర్ 2023

రైల్వే షేర్లు రయ్..

20 శాతం పెరిగిన ఇర్కాన్..

భారత్–మధ్యప్రాచ్యం–యూరప్ ఎకనమిక్ కారిడార్ ఏర్పాటు వార్తలతో దేశీయంగా రైల్వేస్ సంబంధ షేర్లు సోమవారం 20% వరకు ఎగిశాయి. ఇర్కాన్ ఇంటర్నేషనల్ 19.97%, రైల్ వికాస్ నిగమ్ 16.40%, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ 9.98%, ఎన్‌సీసీ లిమిటెడ్ 3.77% పెరిగాయి. రైలు, రోడ్డు వంటి మార్గాల్లో దేశాల మధ్య కనెక్టివిటీని మెరుగుపర్చుకోవడం తదితర లక్ష్యాలతో జీ20 సదస్సు సందర్భంగా భారత్, అమెరికాతో పాటు పలు దేశాలు భారత్–మధ్యప్రాచ్యం–యూరప్ ఎకనమిక్ కారిడార్ ఏర్పాటును ప్రతిపాదించాయి. చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్‌కి దీన్ని ప్రత్యామ్నాయంగా భావిస్తున్నారు. దీని కింద భారత్ నుంచి గల్ఫ్ ప్రాంతానికి తూర్పు కారిడార్, గల్ఫ్ ప్రాంతాన్ని యూరప్‌నకు అనుసంధానం చేస్తూ ఉత్తరాది కారిడార్‌ను అభివృద్ధి చేసే ప్రతిపాదనలు ఉన్నాయి.

లాభాలు ఎందుకంటే...

జీ20 దేశాధినేతల శిఖరాగ్ర సదస్సులో 'ఢిల్లీ డిక్లరేషన్'తో సహా పలు దౌత్య విధానాలు అమలు పరచడంలో భారత్ విజయం సాధించడం దేశీయ మార్కెట్లో సానుకూల సంకేతాలు నింపింది. ఇటీవల 90 డాలర్ల పైకి చేరుకున్న బ్యారెల్ చమురు ధర దిగిరావడం కలిసొచ్చింది. అలాగే అమ్మకాలకు మొగ్గుచూపుతున్న విదేశీ ఇన్వెస్టర్లు రూ.1473 కోట్ల షేర్లను కొని నికర కొనుగోలుదారులుగా నిలిచారు. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(ఒక శాతం)తో పాటు బ్యాంకింగ్ రంగాల షేర్లు రాణించి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ద్రవ్యోల్బణం దిగిరావొచ్చనే అంచనాలు, ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపుపై తగ్గిన ఆందోళనలు, చైనాలో బ్యాంకుల రుణాల వృద్ధి పెరగడం తదితర అంశాలు భారత ఈక్విటీ మార్కెట్‌ను సరికొత్త శిఖరాలపై చేర్చాయి.

20,000 అద్భుతాన్ని అందుకుని.. వెనక్కి

దేశీయంగా నెలకొన్న సానుకూలతలతో ఉదయం సెన్సెక్స్ 209 పాయింట్లు లాభపడి 66,808 వద్ద, నిఫ్టీ 70 పాయింట్లు పెరిగి 19,890 వద్ద ట్రేడింగ్ మొదలయ్యాయి. మీడియా మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ముఖ్యంగా ప్రభుత్వరంగ బ్యాంకులు, మెటల్, ఆటో షేర్లు రాణించడంతో సూచీలు రోజంతా లాభాల్లో ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 573 పాయింట్లు బలపడి 67,172 వద్ద, నిఫ్టీ 188 పాయింట్లు దూసుకెళ్లి 20,008 జీవికాల గరిష్ట స్థాయిలను నమోదు చేశాయి. సరికొత్త శిఖరాలకు చేరుకున్నాక స్వల్ప లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఫలితంగా సెన్సెక్స్ 528 పాయింట్లు లాభపడి 67,127 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 176 పాయింట్లు బలపడి 19,996 వద్ద నిలిచింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- నిఫ్టీ 50 షేర్లకు గానూ కోల్ ఇండియా 1.15%, బజాజ్ ఫైనాన్స్ 0.28%, ఓఎన్‌జీసీ 0.27%, ఎల్‌అండ్‌టీ 0.18% షేర్లు మాత్రమే నష్టపోయాయి. అత్యధికంగా అదానీ పోర్ట్స్ 7% రాణించాయి. ఈ సూచీ ఏడు రోజుల్లో నిఫ్టీ 561 పాయింట్లు పెరిగింది.
- ఈ ఏడాది జూన్ 28న 19,000 పాయింట్లని అందుకున్న నిఫ్టీకి 20 వేల స్థాయిని చేరుకునేందుకు 52 ట్రేడింగ్ సెషన్ల సమయం పట్టింది.
- సెన్సెక్స్ సూచీలో 30 షేర్లకు గానూ ఎల్‌అండ్‌టీ, బజాజ్ ఫైనాన్స్ షేర్లు మాత్రమే 0.25% నష్టపోయాయి. గడిచిన ఏడు రోజుల్లో 2,296 పాయింట్లు ర్యాలీతో బీఎస్‌ఈలో రూ.14.67 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జీవిత కాల గరిష్ట స్థాయి రూ.324.26 లక్షల కోట్లకు చేరింది.
- గత వారాంతంలో ఆర్‌బీఐ అదనపు నగదు నిల్వల నిష్పత్తిని దశలవారీగా రద్దు చేస్తున్నట్లు చేసిన ప్రకటనతో పీయస్‌యూ బ్యాంకుల షేర్లకు భారీ డిమాండ్ లభించింది.
- రత్నవీర్ ప్రెసిషన్ ఇంజనీరింగ్ షేరు లిస్టింగ్ రోజే 37% లాభపడింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.98)తో పోలిస్తే 31% ప్రీమియంతో రూ.128 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో మరింత కొనుగోళ్ల మద్దతు లభించడంతో 37% ర్యాలీ చేసి ఇంట్రాడే గరిష్టం రూ.134 వద్ద స్థిరపడింది. ఎక్స్ఛేంజీలో మొత్తం 16.98 లక్షల ఈక్విటీలు చేతులు మారాయి.
- రిషిభ్ ఇన్‌స్ట్రుమెంట్ లిస్టింగ్ మెప్పించలేకపోయింది. ఇష్యూ ధర(రూ.441)తో పోలిస్తే 4% స్వల్ప లాభంతో రూ.460 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో స్వల్పంగా 6% పెరిగి రూ.470 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో 0.39% స్వల్ప లాభంతో రూ. 443 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,681 కోట్లుగా నమోదైంది.

ఐటీఐ 'స్మాష్' ల్యాప్‌టాప్స్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెలికమ్యూనికేషన్స్ పరికరాల తయారీలో ఉన్న ప్రభుత్వ రంగ ఐటీఐ లిమిటెడ్ స్మాష్ బ్రాండ్ పేరుతో ల్యాప్‌టాప్‌లు, మైక్రో పర్సనల్ కంప్యూటర్ల విభాగంలోకి ప్రవేశించినట్టు ప్రకటించింది. ఇంటెల్ కార్పొరేషన్‌తో కలిసి అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలతో వీటిని తయారు చేస్తున్నట్లు వెల్లడించింది. ఇంటెల్ ఐ3, ఐ5, ఐ7 తదితర ప్రాసెసర్లతో ఉపకరణాలు రూపుదిద్దుకున్నాయని ఐటీఐ పేర్కొంది. 'స్మాష్ ఉత్పత్తులను ఇప్పటికే మార్కెట్లో ప్రవేశపెట్టాం. ఏసర్, హెచ్‌పీ, డెల్, లెనొవో వంటి ఎంఎన్‌సీ బ్రాండ్స్‌తో పోటీపడి అనేక ఆర్డర్లు దక్కించుకున్నాం. 12,000 పైచిలుకు పీసీలను కస్టమర్లు వినియోగిస్తున్నారు' అని సంస్థ సీఎండీ రాజేశ్ రాయ్ తెలిపారు. కాగా, తాజా ప్రకటన నేపథ్యంలో ఐటీఐ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో సోమవారం 20 శాతం ఎగసి రూ.149.40 వద్ద స్థిరపడింది.

రిలయన్స్ రిటైల్‌లో కేకేఆర్ రూ. 2,069 కోట్ల పెట్టుబడులు

1.42 శాతానికి వాటాలు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం కేకేఆర్ తాజాగా రిలయన్స్ రిటైల్ వెంచర్స్ (ఆర్‌ఆర్‌వీఎల్)లో రూ. 2,069.50 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. తద్వారా సంస్థలో తన వాటాలను 1.17 శాతం నుంచి 1.42 శాతానికి పెంచుకోనుంది. ఆర్‌ఆర్‌వీఎల్ మాతృసంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ ఈ విషయాలు వెల్లడించింది. ఆర్‌ఆర్‌వీఎల్ విలువను రూ. 8.361 లక్షల కోట్లుగా (సుమారు 100 బిలియన్ డాలర్లు) లెక్కగట్టి, కేకేఆర్ ఇన్వెస్ట్ చేస్తున్నట్లు పేర్కొంది. 2020లో ఆర్‌ఆర్‌వీఎల్‌లో కేకేఆర్ రూ. 5,550 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. రిలయన్స్ రిటైల్‌లో 1 శాతం వాటా కోసం ఖతర్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ ఇటీవలే రూ. 8,278 కోట్లు పెట్టుబడులు పెట్టిన సంగతి తెలిసిందే. రిలయన్స్ రిటైల్ వ్యాపార కార్యకలాపాలకు ఆర్‌ఆర్‌వీఎల్ హోల్డింగ్ కంపెనీగా వ్యవహరిస్తోంది.

గ్రీన్‌ప్లై ప్రచారకర్తగా జూనియర్ ఎన్‌టీఆర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హానికారక ఉద్గారాలను తగ్గించే జీరో ఎమిషన్ ప్లైవుడ్ ఉత్పత్తులకు ప్రచారకర్తగా నటుడు జూనియర్ ఎన్‌టీఆర్‌ను నియమించుకున్నట్లు గ్రీన్‌ప్లై ఇండస్ట్రీస్ (జీఐఎల్) సీఈవో మనోజ్ తుల్సియాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనతో కొత్త వాణిజ్య ప్రచార ప్రకటనలను రూపొందించినట్లు చెప్పారు. ప్రస్తుతం దేశీయంగా ప్లైవుడ్ పరిశ్రమ 4.5 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉండగా, అందులో సంఘటిత రంగం వాటా 30 శాతం వరకు ఉంటుందని సోమవారమిక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో తమ ఆదాయం రూ. 1,800 కోట్లుగా ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 2,200 కోట్ల వరకు అంచనా వేస్తున్నట్లు మనోజ్ చెప్పారు. ప్రస్తుతం తమకు గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎండీఎఫ్, ప్లైవుడ్ తయారీ ప్లాంట్లు ఉన్నాయని తెలిపారు. టర్కీకి చెందిన సంస్థతో జాయింట్ వెంచర్‌గా ఏర్పాటు చేస్తున్న ప్లాంటు వచ్చే ఏడాది వ్యవధిలో అందుబాటులోకి రాగలదని మనోజ్ చెప్పారు.

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీ ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2024

న్యూఢిల్లీలోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)–ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ 2024 నోటిఫికేషన్‌ను విడుదలచేసింది. యూపీఎస్సీ దేశవ్యాప్తంగా రైల్వే, టెలికాం, డిఫెన్స్ సర్వీస్ తదితర కేంద్ర ప్రభుత్వ విభాగాలు, శాఖల్లో ఇంజనీరింగ్ ఉద్యోగాలు భర్తీచేయనుంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 167
» **విభాగాలు:** సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్.
» **అర్హత:** పోస్టును అనుసరించి గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి బీఈ/బీటెక్ తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.01.2024 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అభ్యర్థులు ముందుగా పార్ట్–1, పార్ట్–2 అప్లికేషన్ పూర్తిచేయాలి.
» **ఎంపిక విధానం:** స్టేజ్–1(ప్రిలిమినరీ) ఎగ్జామ్, స్టేజ్–2(మెయిన్)ఎగ్జామ్, స్టేజ్–3 (పర్సనాలిటీ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.09.2023
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 27.09.2023 నుంచి 03.10.2023 వరకు
» **ప్రిలిమినరీ/స్టేజ్–1 పరీక్షతేది:** 18.02.2023.
» **వెబ్‌సైట్:** upsc.gov.in

తెలంగాణలో 5089 టీచర్ పోస్టులు

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి సంబంధించి టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ) నోటిఫికేషన్ విడుదలైంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 5089
» **పోస్టుల వివరాలు:** ఎస్‌జీటీ–2575, స్కూల్ అసిస్టెంట్–1739, లాంగ్వేజ్ పండిట్–611, పీఈటీ –164.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, డీఎడ్, బీఈడీ,టెట్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** అభ్యర్థుల గరిష్ట వయోపరిమితిని 44 ఏళ్లుగా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్ల వయో సడలింపు వర్తిస్తుంది. దివ్యాంగులకు పదేళ్ల వయసు సడలింపు ఉంటుంది.
» **పరీక్ష విధానం:** ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(సీబీఆర్‌టీ) పద్ధతిలో జరుగుతుంది.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 20.09.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.10.2023
» **కంప్యూటర్ బేస్డ్ టెస్టులు:** 20.11.2023 నుంచి 30.11.2023 వరకు
» **వెబ్‌సైట్:** https://schooledu.telangana.gov.in

అనంతపురం జిల్లాలో 52 పారా మెడికల్ పోస్టులు

అనంతపురంలోని సెకండరీ హెల్త్ డైరెక్టర్ కార్యాలయం.. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో కాంట్రాక్ట్/అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పారా మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 52
» **పోస్టుల వివరాలు:** ఫార్మసిస్ట్ గ్రేడ్ 2–02, థియేటర్ అసిస్టెంట్–07, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్2–02, ల్యాబ్ అటెండెంట్–01, పోస్ట్ మార్టం అసిస్టెంట్–03, మెడికల్ రికార్డ్ అసిస్టెంట్–02, జనరల్ డ్యూటీ అటెండెంట్లు/జీడీఏ–26, ఆఫీస్ సబార్డినేట్–01, ప్లంబర్–05, రేడియోగ్రాఫర్–01, ఎలక్ట్రీషియన్–01, డెంటల్ టెక్నీషియన్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, సర్టిఫికేట్ కోర్సు, డీఫార్మసీ, బీఫార్మసీ, డీఎంఎల్‌టీ, బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అనంతపురంలోని హాస్పిటల్ సర్వీసెస్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కార్యాలయానికి పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 12.09.2023.
» **వెబ్‌సైట్:** www.ananthapuramu.ap.gov.in

నిర్మల్ జిల్లాలో 15 మెడికల్ ఆఫీసర్ పోస్టులు


నిర్మల్ జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం .. నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 15
» **అర్హత:** ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.52,000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును వ్యక్తిగతంగా/రిజిస్టర్ పోస్టు ద్వారా జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం, ఐడీఓసీ(ఎఫ్25), నిర్మల్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 12.09.2023.
» **వెబ్‌సైట్:** https://nirmal.telangana.gov.in

ఢిల్లీ పోలీస్ కొలువుల పిలుపు

» 7,547 కానిస్టేబుల్ పోస్టలకు ఎస్ఎస్‌సీ ప్రకటన
» ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు
» మూడంచెల్లో ఎంపిక విధానం
» వేతన శ్రేణి రూ.21,700-రూ.69,100

పోలీస్ కొలువుల అభ్యర్థులకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది! ఢిల్లీ పోలీస్ శాఖలో 7,547 కానిస్టేబుల్(ఎగ్జిక్యూటివ్) పోస్టల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంటర్ తత్సమాన అర్హతతో ఈ పోస్టులకు పోటీపడొచ్చు. మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో.. ఢిల్లీ పోలీస్ ఉద్యోగాలు, ఎంపిక విధానం, రాత పరీక్ష వివరాలు, విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్ తదితర వివరాలు..



యూనిఫామ్ వేసుకుని పోలీస్ శాఖలో విధులు నిర్వహించాలని కోరుకునే యువత దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఉంటారు. అలాంటి వారికి ఢిల్లీ పోలీస్ శాఖలో కొలువులు చక్కటి మార్గంగా చెప్పొచ్చు. ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి కొలువులో చేరితే.. చక్కటి వేతనంతోపాటు భవిష్యత్తులో పదోన్నతులు కూడా పొందొచ్చు.

మొత్తం పోస్టులు 7,547

ఢిల్లీ పోలీస్ కానిస్టేబుల్ (ఎగ్జిక్యూటివ్) నోటిఫికేషన్ ద్వారా మొత్తం 7,547 పోస్టులను భర్తీ చేయనున్నారు. మహిళలకు, మాజీ సైనికోద్యోగులకు వేర్వేరుగా ఖాళీల వివరాలను పేర్కొన్నారు. అవి.. కానిస్టేబుల్ ఎగ్జిక్యూటివ్ (పురుషులు)–4,453 పోస్టులు; కానిస్టేబుల్ ఎగ్జిక్యూటివ్(పురుషులు–ఎక్స్ సర్వీస్‌మెన్, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్)–266 పోస్టులు; కానిస్టేబుల్ ఎగ్జిక్యూటివ్(పురుషులు–ఎక్స్‌సర్వీస్‌మెన్ కమెండో)–337 పోస్టులు; కానిస్టేబుల్ ఎగిక్యూటివ్(మహిళలు)–2,491.

అర్హత

- 30.09.2023 నాటికి ఇంటర్మీయెట్, తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత ఉండాలి.
- వయసు: జూలై 1, 2023 నాటికి నాటికి 18–25 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

మొత్తం 7,547 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నాలుగు అంచెల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. రాత పరీక్ష, ఫిజికల్ ఎండ్యూరెన్స్ అండ్ మెజర్‌మెంట్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్.

తొలి దశ రాత పరీక్ష

ఎంపిక ప్రక్రియ తొలి దశలో కంప్యూటర్ బేస్డ్ విధానంలో రాత పరీక్ష నిర్వహిస్తారు. గంటన్నర వ్యవధిలో నాలుగు విభాగాల్లో 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. జనరల్ నాలెడ్జ్/కరెంట్ అఫైర్స్ 50 ప్రశ్నలు–50 మార్కులు; రీజనింగ్ 25 ప్రశ్నలు –25 మార్కులు;న్యూమరికల్ ఎబిలిటీ 15 ప్రశ్నలు –15 మార్కులు; కంప్యూటర్ ఫండమెంటల్స్ ఎంఎస్ ఎక్సెల్,ఎంఎస్ వర్డ్,కమ్యూనికేషన్,ఇంటర్నెట్, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ, వెబ్ బ్రౌజర్స్ నుంచి 10 ప్రశ్నలు–10 మార్కులకు ఉంటాయి.ఆబ్జెక్టివ్ విధానంలో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు తగ్గిస్తారు.

రెండో దశలో పీఈ అండ్ ఎంటీ

- తొలిదశ రాత పరీక్షలో చూపిన ప్రతిభ, పొందిన మార్కుల ఆధారంగా ఒక్కో పోస్టుకు 20 మందిని(1:12 నిష్పత్తిలో) చొప్పున తదుపరి దశ ఫిజికల్ ఎండ్యూరెన్స్ అండ్ మెజర్‌మెంట్ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు.
- ప్రభుత్వ నిబంధనల ప్రకారం–ఆయా వర్గాలకు గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు కల్పించిన నేపథ్యంలో.. ఫిజికల్ ఈవెంట్స్‌లో కూడా వయో వర్గాల వారీగా నిబంధనల్లో సడలింపు ఇచ్చారు.
- పరుగు పందెంలో ఉత్తీర్ణత సాధించిన వారికే లాంగ్ జంప్, హై జంప్ ఈవెంట్లు నిర్వహిస్తారు. ఈ రెండు ఈవెంట్లను గరిష్టంగా మూడు అవకాశాల్లో విజయం సాధించాల్సి ఉంటుంది.

ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్

ఫిజికల్ ఈవెంట్స్ పూర్తి చేసుకున్న వారికి ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్ నిర్వహిస్తారు. పురుష అభ్యర్థులు కనీసం 170 సెంటీ మీటర్ల ఎత్తు కలిగుండాలి. అదే విధంగా ఛాతి విస్తీర్ణం 81 సెంటీ మీటర్లు ఉండాలి. శ్వాస పీల్చినప్పుడు నాలుగు సెంటీ మీటర్లు విస్తరించాలి. మహిళా అభ్యర్థులకు కనీస ఎత్తును 157 సెంటీ మీటర్లుగా నిర్దేశించారు.

తుది ఎంపిక

ఎంపిక ప్రక్రియలో చివరగా మెడికల్ ఎగ్జామినేషన్‌ను నిర్వహిస్తారు. ఈ దశలో అభ్యర్థుల ఆరోగ్య ప్రమాణాలను పరిశీలిస్తారు. మొత్తం నాలుగు దశల్లోనూ అభ్యర్థులు చూపిన ప్రతిభ, పొందిన మార్కులు, రిజర్వేషన్ నిబంధనలను పరిగణనలోకి తీసుకుని తుది విజేతలను ప్రకటిస్తారు.

ప్రారంభ వేతనం

అన్ని దశల్లో విజయం సాధించి నియామకం ఖరారు చేసుకున్న వారికి ప్రారంభ వేతనం రూ.21,700–రూ.69,100 లభిస్తుంది. ఆ తర్వాత డిపార్ట్‌మెంట్ పరీక్షలు, పనితీరు ఆధారంగా.. భవిష్యత్తులో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** సెప్టెంబర్ 30, 2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణకు అవకాశం:** అక్టోబర్ 3,4 తేదీల్లో
- **రాత పరీక్ష తేదీ:** నవంబర్ 14–డిసెంబర్ 5 మధ్యలో ఉంటాయి.
- **వివరాలకు వెబ్‌సైట్:** https://ssc.nic.in

ప్రిపరేషన్ పక్కాగా

జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్

అభ్యర్థుల్లోని సామాజిక అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడిగే విభాగం ఇది. ఇందులో మంచి స్కోర్ సాధించేందుకు భారతదేశ చరిత్ర, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, రాజ్యాంగం, శాస్త్రీయ పరిశోధనలు వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకుంటున్న సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

న్యూమరికల్ ఎబిలిటీ

ఈ విభాగంలో రాణించాలంటే.. ప్యూర్ మ్యాథ్స్‌తోపాటు అర్థ గణిత అంశాలపైనా దృష్టి పెట్టాలి. డెసిమల్స్, ఫ్రాక్షన్స్, నంబర్స్, పర్సంటేజెస్, రేషియోస్, ప్రపోర్షన్స్, స్క్వేర్ రూట్స్, యావరేజస్, ప్రాఫిట్ అండ్ లాస్, అల్జీబ్రా, లీనియర్ ఈక్వేషన్స్, ట్రయాంగిల్స్, సర్కిల్స్, టాంజెంట్స్, ట్రిగ్నోమెట్రీలపై పట్టు సాధించాలి.

రీజనింగ్

ఈ విభాగంలో టాప్ స్కోర్ కోసం వెర్బల్, నాన్–వెర్బల్ రీజనింగ్ అంశాలపై పట్టు సాధించాలి. స్పేస్ విజువలైజేషన్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనాలజీస్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అనాలిసిస్, విజువల్ మెమొరీ, అబ్జర్వేషన్, క్లాసిఫికేషన్స్, నంబర్ సిరీస్, కోడింగ్–డీకోడింగ్, నంబర్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రమ్స్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

కంప్యూటర్ ఫండమెంటల్స్

ఈ విభాగంలో రాణించేందుకు వర్డ్ ప్రాసెసింగ్‌కు సంబంధించి టూల్స్, అదే విధంగా ఎక్సెల్ షీట్స్, ఇంటర్నెట్ కమ్యూనికేషన్ టూల్స్(ఈ–మెయిల్ బేసిక్స్, ఈ–మెయిల్ రైటింగ్, సెండింగ్/రిసీవింగ్ తదితర) అంశాలపై ప్రాక్టీస్ చేయాలి. వెబ్ బ్రౌజింగ్‌కు సంబంధించి యూఆర్‌ఎల్,హెచ్‌టీటీపీ, ఎఫ్‌టీపీ, వెబ్‌సైట్స్, బ్లాగ్స్, బ్రౌజింగ్ సాఫ్ట్‌వేర్స్, సెర్చ్ ఇంజన్స్, చాటింగ్, వీడియో కాన్ఫరెన్స్ తదితర ఆన్‌లైన్ రిసోర్సెస్‌పై అవగాహన పెంచుకోవాలి.

సమాంతర ప్రిపరేషన్

ప్రస్తుతం పలువురు అభ్యర్థులు రాష్ట్ర స్థాయిలోని ఆయా పోలీస్ నియామక పరీక్షలకు సన్నద్ధమవుతున్న సంగతి తెలిసిందే. వీరు వీటితోపాటు ఢిల్లీ పోలీస్ ఎగ్జామినేషన్‌కు కూడా ఉపయుక్తంగా ఉండేలా సమాంతర ప్రణాళిక రూపొందించుకోవాలి. ఫలితంగా ఒకే సమయంలో రెండు పరీక్షలకు పోటీ పడే సన్నద్ధత లభిస్తుంది. సిలబస్‌లోని అంశాలు దాదాపు ఒకే విధంగా ఉండటం కలిసొచ్చే అంశంగా చెప్పొచ్చు.

క్లుప్తంగా...

ఎన్టీపీసీకి సేఫ్టీ ఇన్నోవేషన్ అవార్డు


సేఫ్టీ ఇన్నోవేషన్ అవార్డు అందుకున్న సింహాద్రి హెచ్‌ఆర్ హెడ్ రుమా డీ శర్మ

పరవాడ(అనకాపల్లి జిల్లా): పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీ తీసుకుంటున్న భద్రతా చర్యలను అభినందిస్తూ న్యూఢిల్లీలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా సంస్థ 20వ సేఫ్టీ ఇన్నోవేషన్ అవార్డు–2023 ప్రకటించింది. సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన హెచ్‌ఆర్ హెడ్ రుమా డీ శర్మ సోమవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డు అందుకున్నారు.

14 నుంచి ఏపీ ఈఏపీసెట్ ఫైనల్ కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: ఏపీ ఈఏపీసెట్–2023 ఫైనల్ కౌన్సెలింగ్ ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు ఉన్నత విద్యా మండలి కార్యదర్శి నజీర్ అహ్మద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ స్ట్రీమ్ అభ్యర్థులు https://cets.apsche.ap.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు తిరుపతిలో 'టెక్నాలజీ మిషన్స్'పై జాతీయ సదస్సు


తిరుపతి ఐఐటీ ముఖ చిత్రం

తిరుపతి సిటీ: తిరుపతి ఐఐటీ వేదికగా మంగళవారం 'నేషనల్ సైన్స్ అండ్ టెక్నాలజీ మిషన్స్'పై జాతీయ సదస్సు జరగబోతోంది. యువ శాస్త్రవేత్తలు, పరిశోధన విద్యార్థులకు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఇన్నోవేషన్స్‌కు గల అవకాశాలపై అవగాహన కల్పించనున్నారు. తిరుపతి కేంద్రంగా గతేడాది జూలైలో ఏర్పాటైన ఇన్నోవేషన్, సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్(ఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో విజ్ఞాన భారతి సహకారంతో ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ఇప్పటికే తిరుపతి ఐఎస్ఎఫ్ అధ్యక్షుడు డి.నారాయణరావు, ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, విజ్ఞానభారతి డైరెక్టర్ కొంపెల్ల శాస్త్రి సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. శాస్త్ర, సాంకేతిక రంగానికి సంబంధించిన పలువురు ప్రముఖులు హాజరవుతారని వారు తెలిపారు. నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సారస్వత్, మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ సెక్రెటరీ డాక్టర్ ఎం.రవిచంద్రన్, సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ కలైసెల్వి, డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ డాక్టర్ టీకే దాస్, 'శాంతా బయోటెక్' చైర్మన్ వరప్రసాదరెడ్డి తదితరులు పాల్గొని యువ శాస్త్రవేత్తలకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారు.

చిన్నారుల రక్షణ, హక్కుల పరిరక్షణకు పటిష్ట చర్యలు

- ఎన్ఐడీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్ర రత్నూ


శిక్షణలో పాల్గొన్న అధికారులు

గన్నవరం రూరల్: చిన్నారుల రక్షణ, హక్కుల పరిరక్షణకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్(ఎన్ఐడీఎం) పటిష్ట చర్యలు తీసుకుంటుందని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్ర రత్నూ అన్నారు. కృష్ణాజిల్లా గన్నవరం మండలంలోని కొండపావులూరు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సౌత్ క్యాంపస్‌లో సోమవారం అత్యవసర పరిస్థితులలో పిల్లల రక్షణ, బాలల హక్కులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాజేంద్ర రత్నూ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ విపత్తుల సమయంలో పిల్లల రక్షణ, హక్కులు కాపాడటంలో దేశవ్యాప్తంగా ఎన్ఐడీఎం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కుమార్ రాకా. ఎన్ఐడీఎం అధికారులు ప్రొఫెసర్ సంతోష్‌కుమార్, డాక్టర్ బాలు, డాక్టర్ రంజన్‌కుమార్, నజియా తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల జీతాలపై ట్రెజరీ డైరెక్టర్‌కు వైఎస్సార్ టీఎఫ్ వినతి

సాక్షి, అమరావతి: ఈ ఏడాది ఉపాధ్యాయ బదిలీలు, రిపోర్షన్ ద్వారా స్థానచలనం పొందిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్ కుమార్‌రెడ్డి, విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు చొక్కాకుల సూర్యనారాయణ విజ్ఞప్తి చేశారు. సోమవారం విజయవాడలో ట్రెజరీ డైరెక్టర్ మోహనరావును కలిసి వినతి పత్రం అందించారు. 1998 మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) వారికి మ్యాపింగ్ కేడర్ స్ట్రెంగ్త్ సమస్యతో నాలుగు నెలలుగా జీతాలు అందలేదన్నారు. టీచర్ పోస్టులు విత్‌డ్రా అయినచోట క్యాడర్ స్ట్రెంగ్త్ పూర్తయ్యాక కూడా జీతాలు అందలేదని, సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు.



పుడమికి పునరుజ్జీవం

- పర్యావరణ అనుకూల వ్యవసాయంవైపు ప్రపంచ దేశాల చూపు
- కార్బన్ ఫార్మింగ్ ద్వారా ప్రమాదకర ఉద్గారాల తగ్గింపునకు చర్యలు
- నేలలో సేంద్రియ కర్బనాన్ని పెంచి సారవంతంగా మార్చే ప్రక్రియ
- రైతులకు అదనపు ఆదాయం సమకూర్చేలా కార్బన్ క్రెడిట్స్
- పర్యావరణహిత సాగుకు ఏపీ అనుకూలమన్న ఐఏఆర్ఐ



– శ్రీపాద బాల సుబ్రహ్మణ్యం, ఏపీ సెంట్రల్ డెస్క్

పర్యావరణంలో కర్బన ఉద్గారాలను తగ్గించేలా రైతులు తమ సాగు విధానాలను మార్చుకుంటే అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంది. భారత వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐఏఆర్ఐ) ప్రిన్సిపల్ సెక్రటరీ వినయ్ సెహగల్ బృందం గతేడాది ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించి.. మన రాష్ట్రం కూడా కార్బన్ ఫార్మింగ్‌కు అనుకూలమని అభిప్రాయపడింది. ఆ కార్బన్ ఫార్మింగ్‌ను పంజాబ్, హరియాణ రాష్ట్రాల్లో 10 వేల ఎకరాల్లో గ్రో ఇండియా కంపెనీ పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తోంది. ప్రపంచ దేశాలన్నీ కసరత్తు చేస్తున్న ఈ కార్బన్ ఫార్మింగ్‌కు ఎలా బీజాలు పడ్డాయి అంటే..

పర్యావరణానికి ప్రమాదకరంగా మారుతున్న కార్బన్ వాయువుల కట్టడికి ప్రపంచ దేశాలన్నీ పలు రకాల కసరత్తులు చేస్తున్నాయి. పారిశ్రామికీకరణ, శిలాజ ఇంధనాల వినియోగం, అడవుల నరికివేత కారణంగా గ్రీన్ హౌస్ గ్యాసులు విపరీతంగా పెరిగి పర్యావరణానికి చేటు తెస్తున్నాయి. ఈ నేపథ్యంలో పారిస్‌లో 2015లో జరిగిన కాప్–21 సదస్సులో ఫ్రాన్స్ ప్రభుత్వం '1,000కి 4' అనే ఓ ప్రతిపాదనను తీసుకొచ్చింది. కార్బన్ డై ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ వంటి కర్బన ఉద్గారాలను అదుపులో ఉంచడానికి ఏటా భూమిలో కర్బనాన్ని 0.4 శాతం పెంచాలనే ఆలోచనే 1,000కి 4 అనే ప్రతిపాదన. నిజానికి ఈ ప్రతిపాదన ఆహార భద్రతకు, పర్యావరణ మార్పులను నియంత్రించడంలో వ్యవసాయ క్షేత్రాలు కీలక భూమిక పోషిస్తాయనే భావనతో చేసింది. భూగోళంలో ఉన్న భూ ప్రాంతంలో సగ భాగం కంటే ఎక్కువ వ్యవసాయ క్షేత్రంగా ఉంది. పర్యావరణంలో మూడో వంతు కర్బన ఉద్గారాలు వ్యవసాయం నుంచే ఉత్పత్తి అవుతున్నాయి. భారతదేశంలో వ్యవసాయ ఉద్గారాలు ఎక్కువగా పాడి పరిశ్రమ (54.6 శాతం) నుంచి ఉత్పత్తి అవుతున్నాయి. ఆ తర్వాత ఎక్కువ శాతం (19) నైట్రోజన్ ఎరువులదేనని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే ఇదే వ్యవసాయాన్ని ఆధారంగా చేసుకుని కర్బన ఉద్గారాలను నియంత్రించడానికి 'కార్బన్ ఫార్మింగ్' అనే విధానాన్ని ప్రపంచ దేశాలు అవలంభిస్తున్నాయి. ఈ కార్బన్ ఫార్మింగ్ ద్వారా పర్యావరణానికి మేలు చేసేలా ఉద్యాన, అటవీ జాతుల పంటలను ప్రోత్సహిస్తున్నాయి. కర్బన ఉద్గారాలు తగ్గించడంలో రైతుల పాత్రను పెంచడానికి 'కార్బన్ క్రెడిట్స్' రూపంలో వారికి ఆదాయాన్ని కూడా ఇస్తున్నాయి.



కార్బన్ ఫార్మింగ్ అంటే..

మొక్కలో వేర్ల నుంచి ఆకుల వరకు అంతా కర్బన పదార్థమే. మొక్క కిరణ జన్య సంయోగ క్రియ సమయంలో కార్బన్ డై ఆక్సైడ్ (సీవో2)ను పీల్చుకుని కావాల్సిన కర్బనాన్ని తయారుచేసుకుంటుంది. మొక్కలను ఎక్కువగా పెంచడం వల్ల గాలిలో అధిక మోతాదులో ఉన్న కర్బనాన్ని ఆ మొక్కల ద్వారా భూమిలో నిల్వ చేయడాన్ని కార్బన్ ఫార్మింగ్ అంటారు. మొక్కల తయారు చేసిన కర్బనాన్ని సూక్ష్మజీవులు సేంద్రియ కర్బనంగా మారుస్తాయి. ఈ సేంద్రియ కర్బనం మళ్లీ మొక్కల ఎదుగుదలకు, నేలను సారవంతంగా చేయడానికి, పుడమిని పునరుజ్జీవింప చేయడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఉభయతారకంగా ఉండే ఈ విధానం ద్వారా గాలిలోని కర్బన ఉద్గారాలను తగ్గించవచ్చు.. అలాగే పంటల నాణ్యత, ఉత్పత్తి పెంచవచ్చు.

భూమిలో కర్బనాన్ని ఇలా పెంచవచ్చు

అడవుల నిర్వహణ: వివిధ మార్గాల నుంచి గాలిలో అధికంగా చేరే కర్బన ఉద్గారాలను అడవుల్లోని మొక్కలు గ్రహించి తమలో దాచుకుంటాయి. పర్యావరణంలోని కార్బన్ వాయువులను తగ్గించేందుకు అడవుల నరికివేతను అరికట్టాలి. భూ క్షయాన్ని నివారించాలి. అడవులు, మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలి.

గడ్డిభూముల పరిరక్షణ: గడ్డి భూములను సంప్రదాయ వ్యవసాయం కోసం అలాగే పరిశ్రమల ఏర్పాటు కోసం వినియోగించకుండా వాటిని పరిరక్షించాలి.

మిశ్రమ వ్యవసాయం: పశువులతో కలిసి చేసే వ్యవసాయం పర్యావరణానికి ఎంతో ఉపయోగపడుతుంది. పంట కోసిన తర్వాత వ్యవసాయ క్షేత్రాల్లో పశువులు ఎరువు వేయడం వల్ల నేలలో కర్బనం పెరిగే అవకాశం ఉంది.

పచ్చిరొట్ట పంట: ప్రధాన పంట పూర్తయిన తర్వాత వ్యవసాయ క్షేత్రంలో పచ్చిరొట్ట ఎరువులు పెంచి వాటిని భూమిలో కలియదున్నడం వల్ల భూమిలో కార్బన్ శాతం పెరుగుతుంది. ఈ పంటతో మంచి చేసే సూక్ష్మజీవులు పెరగడం వల్ల కార్బన్‌ను నిల్వ చేసే సామర్థ్యం నేలకు పెరుగుతుంది.

దున్నడం తగ్గించడం: సాధారణంగా పంట పూర్తయిన తర్వాత భూమిని దున్నడం వల్ల కలుపుమొక్కల బెడద తగ్గడంతో పాటు భూమి గుల్లబారి నేల పొరల్లోకి గాలి బాగా వెళుతుందని భావిస్తారు. అయితే దీనివల్ల పొలంలో వాడిన రసాయన ఎరువుల కార్బన్ వాయువులుగా మారి గాలిలో కలుస్తాయి.


చిత్తడి నేలల అభివృద్ధి: చిత్తడి నేలలు ఒక ముఖ్యమైన సహజసిద్ధ కార్బన్ నిల్వ క్షేత్రం. ప్రపంచ వ్యాప్తంగా చిత్తడి నేలలు 14.5 శాతం కర్బనాన్ని సంరక్షిస్తున్నాయి.

కార్బన్ క్రెడిట్స్ ఇలా..

ఐక్యరాజ్యసమితి 1997లో క్యోటో ప్రొటోకాల్‌లో తొలిసారి కార్బన్ క్రెడిట్స్ ప్రతిపాదన తెచ్చింది. గ్రీన్ హౌస్ గ్యాస్ ఉద్గారాలను తగ్గించడం ద్వారా పర్యావరణ సమతుల్యత సాధించడం దీని ముఖ్య ఉద్దేశం. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగంతోనైనా, అడవులు, మొక్కల పెంపకం, సేంద్రియ, సుస్థిర వ్యవసాయ పద్ధతులతోనైనా ఒక టన్ను కర్బన ఉద్గారాలను తగ్గిస్తే ఒక కార్బన్ క్రెడిట్ ఇస్తారు. కర్బన ఉద్గారాలను తగ్గించే పరిశ్రమలు, రైతులు, ప్రకృతిని సంరక్షించే ఇతర సంస్థలకు వీటిని పొందవచ్చు. సర్టిఫికెట్ రూపంలో ఉండే వీటిని అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్ముకోవడం ద్వారా అదనపు ఆదాయం గడించవచ్చు. భారతదేశం వద్ద ఇప్పటికే మూడు కోట్ల కార్బన్ క్రెడిట్స్ ఉన్నాయని, ఇలా ఉన్న దేశాల్లో మన దేశం రెండో అతిపెద్ద దేశమని లెక్కలు చెబుతున్నాయి. ఇక మన దేశంలో దీర్ఘకాలిక పంటలను సాగు చేసే రైతులకు అదనపు ఆదాయం అందించేందుకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఈ కార్బన్ క్రెడిట్స్ రూపంలో నగదు ప్రోత్సాహకాలు అందిస్తోంది. వీటిని క్లెయిమ్ చేసుకోవడానికి దీర్ఘకాలిక పంటలనే ఎక్కువగా సాగు చేయాల్సి ఉంటుంది. మొక్కలు నాటిన నాలుగో సంవత్సరం నుంచి వీటిని లెక్కించి ఏటా ప్రోత్సాహకాలు అందిస్తారు. చెట్టు ఎదుగుదల, కాండం, ఆకులు, ఎంత కర్బనాన్ని శోషిస్తోంది అనేవి లెక్కించి ఆ క్రెడిట్స్ ఇస్తారు. ముఖ్యంగా అడవి జాతి, పండ్ల జాతి మొక్కలు పెంచేవారు ఈ కార్బన్ క్రెడిట్స్‌ను సులువుగా పొందవచ్చు. వ్యవసాయ అభివృద్ధి కోసం పనిచేసే కొన్ని స్వచ్ఛంద సంస్థలు కార్బన్ క్రెడిట్స్ పొందడంలో రైతులకు సహాయం చేస్తున్నాయి.

సాగుకు ఉపయోగాలెన్నో..

- తగినంత కర్బనం ఉంటే నేల గుల్లబారుతుంది. దీంతో మొక్కల వేరు వ్యవస్థకు పుష్కలంగా ఆక్సిజన్ లభిస్తుంది.
- నీటిని కర్బనం పట్టి ఉంచడం వల్ల పైరుకు త్వరగా నీటి ఎద్దడి రాదు. నీటి తడుల అవసరం తగ్గుతుంది.
- భూమిలో ఒక ఫిల్టర్‌లా పనిచేస్తూ మొక్కకు హాని కలిగించే భార మూలకాలను, విషపదార్థాలను దూరంగా ఉంచుతుంది.
- రసాయన ఎరువులు మొక్కలకు పూర్తిగా అందించేందుకు కర్బనం సహాయకారిగా ఉంటుంది.
- సేంద్రియ కర్బనంతో మొక్కలకు మేలు చేసే సూక్ష్మ జీవుల వృద్ధి జరుగుతుంది. వేరు వ్యవస్థ వృద్ధి చెందుతుంది.
- సాధారణంగా నేలలో 2 నుంచి 4 శాతం కర్బనం ఉంటే మంచిది. దీనిని సారవంతమైన నేలగా భావిస్తారు.



పక్కాగా.. పారదర్శకంగా ఈ-క్రాప్

▶ మొదటి పేజీ తరువాయి

సాగయ్యాయి. ప్రధానంగా 38.36 లక్షల ఎకరాల్లో వరి సాగవ్వాల్సి ఉండగా.. ఇప్పటివరకు 29.48 లక్షల ఎకరాల్లో సాగైంది. ఇతర పంటల విషయానికి వస్తే.. 2.56 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 3.30 లక్షల ఎకరాల్లో కందులు, 7.19 లక్షల ఎకరాల్లో వేరుశనగ, సుమారు లక్ష ఎకరాల చొప్పున ఆముదం, చెరకు పంటలు సాగయ్యాయి. ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక కింద 80 శాతం సబ్సిడీపై విత్తన సరఫరాతోపాటు సెప్టెంబర్‌లో ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ సాగు లక్ష్యం దిశగా వెళ్తోంది. ఈ నేపథ్యంలో ఖరీఫ్‌లో సాగైన పంటల నమోదుపై వ్యవసాయ శాఖ దృష్టి సారించింది. వెబ్‌ల్యాండ్, సీసీఆర్సీ డేటా నమోదుతో పాటు తొలిసారి జియో ఫెన్సింగ్ ఆధారంగా జూలైలో ఈ–క్రాప్ నమోదుకు శ్రీకారం చుట్టారు. తొలుత తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో నమోదు చేపట్టగా, ఆ తర్వాత మిగిలిన జిల్లాల్లో శ్రీకారం చుట్టారు.

జియో ఫెన్సింగ్ ద్వారా హద్దులు నిర్ధారించి..

నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసీ) సౌజన్యంతో ప్రత్యేకంగా డిజైన్ చేసిన యాప్‌లో ఆధార్, వన్‌బీ, జాతీయ చెల్లింపుల సహకార సంస్థ (ఎన్‌పీసీఐ), ఆధార్‌తో లింక్ అయిన బ్యాంక్ ఖాతా వివరాలు, ఫోన్ నంబర్, సీసీఆర్సీ కార్డు వివరాలను నమోదు చేస్తున్నారు. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత జియో ఫెన్సింగ్ ద్వారా సరిహద్దులు నిర్ధారించి, రైతు ఫోటోను ఆర్బీకే సిబ్బంది అప్‌లోడ్ చేస్తున్నారు. గిరి భూమి వెబ్‌సైట్‌లో నమోదైన వివరాల ఆధారంగా అటవీ భూముల్లో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాదారులు సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేస్తున్నారు. మరోవైపు పంటసాగు హక్కు పత్రం (సీసీఆర్సీ) కలిగిన రైతులతో పాటు సీసీఆర్సీ కార్డుల్లేని రైతుల వివరాలను నమోదు చేస్తున్నారు. ఖాళీగా ఉంటే నో క్రాప్ జోన్ అని, ఆక్వా సాగవుతుంటే ఆక్వాకల్చర్ అని, వ్యవసాయేతర అవసరాలకు వినియోగిస్తుంటే నాన్ అగ్రిల్యాండ్ యూజ్ అని నమోదు చేసి లాక్ చేస్తున్నారు.

నమోదులో అగ్రస్థానంలో కర్నూలు

ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు 78 లక్షల ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగవగా.. 46.50 లక్షల ఎకరాల్లో సాగైన పంటల వివరాలను నమోదు చేశారు. 84.98 లక్షల ఎకరాల్లో వ్యవసాయ పంటలు లక్ష్యం కాగా.. 55.95 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇప్పటికే 31.50 లక్షల ఎకరాల్లో సాగైన పంటల వివరాలను నమోదు చేశారు. 22 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవ్వాల్సి ఉండగా.. 21 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇప్పటికే 15 లక్షల ఎకరాల్లో పంటల వివరాలను ఈ క్రాప్‌లో నమోదు చేశారు. 17.53 లక్షల ఎకరాల్లో వరి, 5.52 లక్షల ఎకరాల్లో పత్తి, 3.53 లక్షల ఎకరాల్లో మామిడి, 2.86 లక్షల ఎకరాల్లో వేరుశనగ, 2.10 లక్షల ఎకరాల్లో కంది, 2.13 లక్షల ఎకరాల్లో మిరప, 1.60 లక్షల ఎకరాల్లో మొక్క జొన్న, 1.50 లక్షల ఎకరాల్లో జీడిమామిడి, 1.35 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్, 1.29 లక్షల ఎకరాల్లో బత్తాయి, 99 వేల ఎకరాల్లో కొబ్బరి, 75 వేల ఎకరాల్లో ఆముదం, 61 వేల ఎకరాల్లో అరటి, 52 వేల ఎకరాల్లో నిమ్మ, 46 వేల ఎకరాల్లో టమోటా పంటలు నమోదు చేశారు. జిల్లాల వారీగా చూస్తే కర్నూలు, అనంతపురం, శ్రీకాకుళం జిల్లాలు నూరు శాతం నమోదుతో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

30 నాటికి తుది జాబితాలు




ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ సెప్టెంబర్ 25 నాటికి పూర్తి చేసి సామాజిక తనిఖీ కోసం ఆర్బీకేల్లో ఈ–పంట జాబితాలను ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. అభ్యంతరాల పరిశీలన తర్వాత సెప్టెంబర్ 30న ఆర్బీకేల్లో తుది జాబితాలను ప్రదర్శించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం

– చేవూరు హరికిరణ్, స్పెషల్ కమిషనర్, వ్యవసాయ శాఖ

తిరుపతిలో 'స్కిల్ యూనివర్సిటీ'

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి వెల్లడి



సాక్షి, అమరావతి: తిరుపతిలో నైపుణ్య విశ్వవిద్యాలయాన్ని(స్కిల్ యూనివర్సిటీ) ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి వెల్లడించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణపై సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువతకు వివిధ రంగాల్లోని పరిశ్రమలు, సంస్థల ద్వారా నైపుణ్య శిక్షణ అందించి పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ఒకటి చొప్పున 26 నైపుణ్య శిక్షణ కాలేజీలు, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు గిరిజన ప్రాంతాలు సహా మొత్తం 192 చోట్ల ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలు, ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు, న్యాక్ కేంద్రాల అనుసంధానంతో స్కిల్ హబ్‌లు, 55 ప్రాంతాల్లో స్కిల్ స్పోక్స్ ఏర్పాటు ద్వారా ఇప్పటికే వివిధ రకాల నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సీఎస్ తెలిపారు. జర్మన్ భాషలో నైపుణ్య శిక్షణ పొందిన నర్సింగ్ విద్యార్థినులు త్వరలో జర్మనీకి వెళ్లనున్నారని చెప్పారు. నైపుణ్య శిక్షణాభివృద్ధి సంస్థ, సెర్ప్ ఆధ్వర్యంలోని టెక్నికల్ ట్రైనింగ్ డెవలప్‌మెంట్ కేంద్రాల ద్వారా మరిన్ని శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు.

9వ తరగతి నుంచే వృత్తి నైపుణ్యాభివృద్ధి

9వ తరగతి నుంచి పీజీ విద్యార్థుల వరకు ఫార్మల్ ఎడ్యుకేషన్‌తో పాటు వృత్తి నైపుణ్యాన్ని కూడా అభివృద్ధి చేసేందుకు వీలుగా ముసాయిదా విధానాన్ని రూపొందించాలని అధికారులను సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. దీని ద్వారా రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. సోమవారం సచివాలయంలో పాఠశాల, ఉన్నత, కళాశాల విద్యా శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. విద్యార్థులు చదువు పూర్తి చేసుకుని బయటకు రాగానే జీవనోపాధి పొందేలా వారిని తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. స్కూళ్లు, కాలేజీల్లో పెరిగిన విద్యార్థుల శాతాన్ని సీఎస్ సమీక్షించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కరిక్యులం అమలుకు అర్హులైన టీచర్ల భర్తీని డిసెంబర్‌కల్లా పూర్తి చేయాలని సూచించారు. కాగా, రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న రామాయపట్నం, మచిలీపట్నం, కాకినాడ గేట్ వే, మూలపేట ఓడరేవులతో పాటు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనులపై సోమవారం సీఎస్ జవహర్‌రెడ్డి ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. పనుల ప్రగతితో పాటు భూసేకరణ, పలు పెండింగ్ క్లియరెన్స్‌లపై అధికారులకు పలు సూచనలు చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష మార్గదర్శకాలు విడుదల

- ఈ నెల 30 నుంచి నెలరోజులు అమలు

సాక్షి, అమరావతి: వైద్యరంగంలో ఫ్యామిలీ డాక్టర్ వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమం ద్వారా ప్రజలకు గ్రామీణ స్థాయిలోనే వైద్యుల సంరక్షణను అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం ఈ నెల 30వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట మరో కార్యక్రమం ప్రారంభించనుంది. ఈ కార్యక్రమం కింద ప్రజల ఆరోగ్య సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి, వాటిని పరిష్కరించనుంది. నెలరోజులు నిర్వహించనున్న ఈ కార్యక్రమం మార్గదర్శకాలను వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు జారీచేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు, పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్రతి ఒక్కరి ఆరోగ్య అవసరాలను గుర్తించి వాటిని తీర్చడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని రూపొందించినట్టు పేర్కొన్నారు. అదేవిధంగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం సేవలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్యశ్రీ సిటిజన్ యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లో వినియోగించుకునే విధానం.. తదితర అంశాలపై డ్రైవ్ నిర్వహించనున్నారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో), ఏఎన్ఎంలు ఇంటింటి సర్వేలో ప్రజలను స్క్రీనింగ్ చేసి సమస్య ఉన్న వారిని గుర్తిస్తారు. ఇలా గుర్తించినవారికి గ్రామాలు, పట్టణాల్లో నిర్వహించే హెల్త్ క్యాంపుల్లో డాక్టర్ల ద్వారా ఉచిత వైద్యంతో పాటు మందులు అందిస్తారు. మెరుగైన వైద్యం అవసరం ఉన్న వారిని సమీపంలోని ఆస్పత్రులకు తరలిస్తారు. హెల్త్ క్యాంప్ ఏర్పాటుకు 15 రోజుల ముందు నుంచి పట్టణం/గ్రామంలో క్యాంపెయిన్ ప్రారంభిస్తారు. అదేవిధంగా సీహెచ్‌వో, ఏఎన్ఎంలు ఇంటింటి సర్వే నిర్వహిస్తారు.

'మహారాజ'లో మరో 64 మెడికల్ పీజీ సీట్లకు నకిలీ అనుమతులు

సాక్షి, అమరావతి: మెడికల్ పీజీ సీట్ల పెంపుదలలో నకిలీ అనుమతి పత్రాల రూపంలో ప్రైవేట్ వైద్య కళాశాలల్లో అక్రమాలు బయటపడుతూనే ఉన్నాయి. తాజాగా విజయనగరం జిల్లాలోని మహారాజ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో మరో 64 పీజీ సీట్లకు నకిలీ అనుమతులు వచ్చాయని నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) సోమవారం ప్రకటించింది. ఈ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సీట్లు పెంచుతూ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి వచ్చిన ఎల్‌ఓపీలపై స్పష్టత కోసం అధికారులు ఇటీవల ఎన్ఎంసీకి లేఖలు రాశారు. ఈ నేపథ్యంలో 9 స్పెషాలిటీలలో 64 సీట్లకు నకిలీ అనుమతులు వెలువడ్డాయని ఎన్ఎంసీ స్పష్టం చేసింది. అయితే ఈ సీట్లను ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌లో పరిగణనలోకి తీసుకోలేదని రిజిస్ట్రార్ డా. రాధికారెడ్డి తెలిపారు. అందువల్ల విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇదిలా ఉండగా ఇదే కళాశాలలో గతంలో 23 సీట్లకు నకిలీ అనుమతులుండటం గమనార్హం. ఇలా మొత్తంగా 87 సీట్లు నకిలీ అనుమతులతో వచ్చాయి. రాజమండ్రి జీఎస్ఎల్, నంద్యాల శాంతిరామ్ కళాశాలల్లోనూ నకిలీ అనుమతులు పుట్టుకొచ్చాయి. ఈ వ్యవహారంపై విచారణ జరపాలని ఇప్పటికే ఎన్ఎంసీని రాష్ట్ర ప్రభుత్వం కోరిన విషయం తెలిసిందే.

రూ.433 కోట్లతో పారిశ్రామిక పార్కుల ఆధునికీకరణ

ఇప్పటికే 14 పారిశ్రామిక పార్కుల్లో రూ.116 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం

- మరో 22 పార్కుల్లో రూ.317 కోట్లతో మౌలికవసతుల అభివృద్ధికి ప్రణాళిక
- 998.17 ఎకరాల్లో మౌలిక వసతులు అభివృద్ధి
- కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- వెల్లడించిన ఏపీఐఐసీ వీసీ, ఎండీ ప్రవీణ్‌కుమార్



సాక్షి, అమరావతి: మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించుకునే విధంగా రాష్ట్రంలోని పారిశ్రామిక పార్కుల్లో మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం ఆధునికీకరిస్తోంది. తొలిదశలో 14 పారిశ్రామిక పార్కుల్లో మౌలికవసతుల ఆధునికీకరణ పనులను ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం మలిదశలో మరో 22 పార్కుల్లో పనులు చేపట్టడానికి ప్రణాళికలను సిద్ధం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 36 పారిశ్రామిక పార్కులను ఆధునికీకరిస్తున్నామని, ఇందుకోసం సుమారు రూ.433 కోట్లు వ్యయం చేస్తామని ఏపీఐఐసీ వీసీ, ఎండీ ప్రవీణ్‌కుమార్ 'సాక్షి'కి వివరించారు.


ప్రవీణ్‌కుమార్

పారిశ్రామిక పార్కుల్లోని రహదారులు, వర్షపునీరు వెళ్లే కాలువలు, మురుగునీరు, వ్యర్థాలను శుద్ధిచేసే కామన్ ఎఫ్లుయంట్ ట్రీట్‌మెంట్, వీధిదీపాలు, ఉమ్మడి పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి కేంద్రాలు, ఆవిరి–పారిశ్రామిక వాయువుల ఉమ్మడి ఉత్పత్తి కేంద్రాలను ఆధునికీకరించనున్నారు. ఇప్పటికే రూ.116 కోట్లతో 14 పారిశ్రామిక పార్కుల్లో మౌలిక వసతుల కల్పన పనులు ప్రారంభంకాగా, రూ.317 కోట్లతో మరో 22 పార్కులను అభివృద్ధి చేయడానికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

ఇప్పటికే 8 పారిశ్రామిక పార్కుల్లో పనులు పూర్తి

తొలిదశలో రూ.116 కోట్లతో 14 పారిశ్రామిక పార్కుల్లో ఆధునికీకరణ పనులు చేపట్టగా.. రూ.62 కోట్లతో ఎనిమిది పారిశ్రామిక పార్కుల్లో పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఆరు పార్కుల్లో పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. హిందుపురం ఇండస్ట్రియల్ ఎస్టేట్, మచిలీపట్నం జ్యూవెలరీ పార్కు, గుంటూరు ఆటోనగర్ పార్కుల పనులు రూ.22 కోట్లతో జరుగుతున్నాయని, ఇవి సెప్టెంబర్ నాటికి పూర్తవుతాయని అంచనా వేస్తున్నామని చెప్పారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల పారిశ్రామిక పార్కు, తుణుకు, అచ్యుతాపురంలో నాన్ సెజ్ ఏరియాలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడానికి రూ.32 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచామన్నారు. తొలిదశలో వ్యయం చేస్తున్న రూ.116 కోట్లలో కేంద్రం రూ.74 కోట్లు ఇస్తుంటే రాష్ట్రం రూ.42 కోట్లు వ్యయం చేస్తోందన్నారు. రెండోదశలో పనులు చేపడుతున్న 22 పారిశ్రామిక పార్కుల్లో మొత్తం 998.17 ఎకరాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇందులో 15 పారిశ్రామిక పార్కులున్నాయని, ఏడు ఎఫ్ఎఫ్‌సీలను అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రెండోదశ పనులకు వ్యయమయ్యే రూ.317 కోట్లలో కేంద్రం రూ.195 కోట్లు, రాష్ట్ర పభుత్వం రూ.85 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనలను కేంద్రానికి పంపామని, ఆమోదం రాగానే పనులు మొదలు పెడతామని పేర్కొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.